Om

శ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ, సుందరలక్ష్మి

శ్రీ కృష్ణదేవరాయల చరిత్రము

శ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ, బి.ఎ., బి.ఎల్.

ప్రకాశకులు

వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
1960

ఉపోద్ఘాతము

నేను మదరాసు క్రైస్తవకళాశాలయందుఁ జదువుకాలమున నా కళాశాలలోని ఆంధ్రభాషాభివర్ధనసమాజమున శ్రీకృష్ణదేవరాయలవారి చరిత్రమునుగూర్చి యుపన్యసించుటకై చిన్న వ్యాసమును వ్రాసియుంటిని. అది జరిగి యిప్పటికి నలువది రెండు సంవత్సరములైనవి. నాటికి శ్రీకృష్ణదేవరాయలచరిత్రమును గూర్చి తెలిసినవిషయములు చాలకొద్ది, తత్సంబంధగ్రంథములును లేవు. అప్పటికి నిప్పటికి వారిచరిత్రాంశములను వర్ణించుముఖ్యగ్రంథ మాంగ్లభాషలో బళ్లారిజిల్లా కలెక్టరుగ నుండిన రాబర్టు సూయెలుదొర "A Forgotten Empire" "విస్మృతసామ్రాజ్యము" అనుపేర రచించిన గ్రంథ మొకటియే, దానియందు రాయలచరిత్రలోని ముఖ్యఘట్టములన్నియు వర్ణితములు. రాయల సమకాలికులగు పోర్చుగీసుయాత్రికులు కొందఱు తమభాషలో వ్రాసియుంచిన విషయములన్నియు పైగ్రంథమున నాంగ్లీకరింపబడెను. ఇదిగాక శ్రీకృష్ణదేవరాయలు స్వయముగ రచించినకావ్యములందును, తదాస్థానకవులైన అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, మాదయ్యగారి మల్లన, ధూర్జటి మొదలుగాఁగల కవుల ప్రబంధములయందును కొన్ని చరిత్రాంశములు విపులీకరింపఁబడియున్నవి. ఈగ్రంథములయాధారముననే నేనప్పుడు నావ్యాసమును తయారుచేసియుంటిని. ఆయుప

స్వాగతమును మామిత్రులు భాషోద్ధారక శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రిగారు అచ్చొత్తించి ప్రచురపఱిచిరి.

ఇటీవల రెండుమూడుసంవత్సరములుగ మామిత్రులు శ్రీ భాషోద్ధారకులు ఈపుస్తకము పునర్ముద్రణము చేయఁదలఁచితి మనియు, పూర్వముద్రణవిషయముతో చారిత్రక పరిశోధన ఫలితముగ వెలువడిన నూతనాంశములను గలిపి విపులముగ వ్రాయవలసిన దనియు నన్ను హెచ్చరించిరి. పూర్వమునకన్న ననేక గ్రంథములు శ్రీ రాయలవారిచరిత్రను వివరించుటచే వానినన్నిటిని చదివి మరల గ్రంథమును కూర్పుట చేతకానిపని యని యూరకుంటిని గాని శ్రీ శాస్త్రులవారి ప్రోత్సాహమునను వారు పంపినగ్రంథజాలము సాయమునను నే ననేక నూతన విషయములను చేర్చి నాగ్రంథమును విపులీకరింపఁ గల్గితిని. ఈ ద్వితీయముద్రణభాగ్యమునకు శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులవారే కారకులు.

ఈపుస్తకమును రచించుటయందు నాకాధారములుగ నుండిన గ్రంథముల పట్టిని ఈ క్రిందవేర్కొనుచు నాయాగ్రంథ కర్తల కిందుమూలమున నాకృతజ్ఞతను తెల్పుకొనుచు వందన శతము లర్పించుచున్నాఁడను. ఈగ్రంథమునఁ జేర్చియున్న శ్రీ కృష్ణదేవరాయల వారిచిత్రమును ఇందుఁ గూర్పుటకు అడిగి నదే తడవుగ ఫోటోకాపీ నొసఁగి యనుమతించిన గవర్నమెంటు ఎపిగ్రఫిస్టు శ్రీ, యన్. లక్ష్మీనారాయణరావుగారికి కృతజ్ఞతా పూర్వకవందనము లర్పించుచున్నాను.

నాకు గ్రంథరచన మందనుభవ మెంతమాత్రమును లేదు. దీని నామూలాగ్రము చదివి, వలయుచోట్ల సవరణలు చేయు

టలో నాకు మిక్కిలి యుపకరించినవారు శ్రీ విద్వాన్ వేదము లక్ష్మీనారాయణశాస్త్రి, బి. ఒ. యల్ గారు. వారికి నేనెంతయు కృతజ్ఞుఁడను. ఈగ్రంథమందలి గుణదోషవిచారమును గుణ గ్రహణపారీణులగు చదువరులకే వదలుచున్నాఁడను. నాదోష ముల క్షమింతురుగాక యని వారిని ప్రార్థించుచున్నాను. ఈగ్రంథమునకు తృతీయముద్రణప్రాప్తి గలుగుచో నాటివరకు బయల్పడు నూత్నచరిత్రాంశములనుసైత ముందు పొందుపఱుప యత్నింతును.

గుంటూరు
1951-వ సం॥ జూన్ } ఇట్లు తమవిధేయుఁడు,
విష్ణుభొట్ల సూర్యనారాయణ, బి.ఏ బి.ఎల్.

ఈగ్రంథరచనమున నాకు సహాకరించిన గ్రంథముల సూచిక:

1. ఆముక్తమాల్యద.
2. మనుచరిత్రము.
3. వరాహపురాణము.
4. కృష్ణరాయవిజయము.
5. రాయవాచకము.
6. వీరేశలింగముగారి కవులచరిత్ర.
7. గురుజాడ శ్రీరామమూర్తిగారి కవులచరిత్ర.
8. కావలి రామస్వామిగారి Lives of the Deccan Poets.
9. జైమినిభారతము.
10. నిరంకుశోపాఖ్యానము.
11. పారిజాతాపహరణము
12. డాక్టరు యస్. కృష్ణస్వామి అయ్యంగారు
    డాక్టరు నేలటూరి వేంకటరమణయ్యగార్ల రచనలు.

ప్రథమ ముద్రణము

ఏసార్వభౌమునిసత్పరిపాలనమున విజయనగరసామ్రాజ్యము మహోన్నత్యము వహించెనో, ఏచక్రవర్తి తనదిగ్విజయ యాత్రలవలన తనశౌర్యపరాక్రమములను జగత్ప్రసిద్ధముగఁజేసెనో, ఏసమ్రాట్టు ఆంధ్రభాష నాదరించి కవులను సన్మానించుటచే "సాంధ్రభోజుఁ" డని ప్రసిద్ధిగాంచెనో, ఏరాజు విష్ణుచిత్తీయమును నామాంతరముగల "ఆముక్తమాల్యద" యను ప్రబంధరచనచే సంస్కృతాంధ్రభాషలం గల తనయసాధారణ పాండిత్యమును వెలిపుచ్చెనో అట్టి శ్రీ కృష్ణదేవరాయల చరిత్ర మిక్కాలంబున జను లెఱుంగకుండుట యెంతయు శోచనీయంబుగ నున్నది. వారి పవిత్రచరిత్రము నిదివరలో కుమార ధూర్జటి 'కృష్ణరాయ విజయ' మనుపేరను, ఆదివూడి సోమనాథ రావుగారు 'కృష్ణరాయచరిత' మనుపేరను పద్యాత్మకముగ వ్రాసియున్నారు. శ్రీచిలుకూరి వీరభద్రరావుగారు "జీర్ణకర్ణాటక రాజ్య" మనుపేరఁ గృష్ణదేవరాయల యొక్కయు వారిపూర్వుల యొక్కయు, వారి సంతతివారియొక్కయు చరిత్రమును గద్య రూపమున ప్రకటించి యాంధ్రులకు మహోపకారము చేసియున్నారు. ఆంగ్లభాషయందును వీరిచరిత్రమును గూర్చి కొన్నిగ్రంథములు ప్రకటితములై యున్నవి. కాని ప్రస్తుత కాలమువారికి పద్యకావ్యములయం దాదరము లేకుండుటచే నాపద్యకావ్యములు చదువునట్లు కాన్పించదు. విద్యార్థులును స్త్రీలును చదువుకొనుటకుఁ దగినట్లుగా వారిచరిత్రమును సంక్షేపముగ నిట వ్రాయ నుద్యమించితిని. ఇట్లు,

విష్ణుభొట్ల సూర్యనారాయణ.

విషయసూచిక

విషయము.	పుట.	విషయము.	పుట.
1. విజయనగర నిర్మాణము		రాజనీతివిచక్షణ	40
నాటిదేశస్థితి	2	ద్రవ్యవిభాగము	41
2. రాయలవంశము		సైనికదళములను వృద్ధిచేయుట	44
3. కృష్ణదేవరాయలజననము		పోర్చుగీసువారు హిందూదేశమునకు వచ్చుట	46
4. రాయలబాల్యదశ		6. దక్షిణదిగ్విజయయాత్ర	
తిమ్మరుసుకౌటిల్యము	21	శివసముద్రము	51
కృష్ణదేవరాయల విద్యాభ్యాసము	22	దేశవిభజనము	58
నరసరాజుమృతి	28	7. పూర్వదిగ్విజయయాత్ర	
ఒకకథ	25	ఉదయగిరికోట	55
వీరనరసింహరాయని పట్టాభిషేకము	25	కొండవీడు	60
		తిరుపతివేంకటేశ్వరుని సేవించుట	68
దేశమునందలి అందోళన	26	కొండపల్లి ముట్టడి	64
5. కృష్ణదేవరాయలపట్టాభిషేకము		దండయాత్ర ముందుకు సాగించుట-తిమ్మరసు కల దనుట	64
నాటిదేశస్థితి	81	8. రాయచూరుదండయాత్ర	
సింహావలోకనము	33	ఆదిల్షా సన్నాహము	81
కృష్ణరాయవిజయము : రెండవ యాశ్వాసము	85	యుద్ధము	88
రాయవాచకము	,,	9. రాయలవిజయముల లాభనష్టములు	
పారిజాతముల పరీక్ష	89	రాయచూరు ముట్టడి-గుల్బర్గాను	87

విషయము.	పుట.
పోర్చుగీసువారు	88
కోటలో ప్రవేశము	90
రాయల దయాదాక్షిణ్యములు	,,
ఆదిల్షాహు పంపిన రాయబారము	91
రాయలవారి స్నేహయత్నము విఫలమగుట	94
రాయచూరు పతన ఫలము	95
కసిరాజు మరణము	97
దుర్వార్తలు	,,
తత్ఫలితము	98
రాయలవారి అవసానకాలము	99
10. రాయలమృతి	
11. రాయలభార్యలు: సంతతి	
12. రాయలవారి వ్యక్తిత్వము స్వభావము	
13. రాజధానివర్ణన	
నగరద్వారములు	118
నాగలాపురద్వారము	119
క్రీడాగృహము	125
పిటికోటలు	126
మజ్జనశాల	,,
రాజసంతర్పణగృహము	128
హజారరామాలయము	,,
రాణీమందిరము	129
మంత్రాలోచనమందిరము	,,
గజశాల	130
దసరమలకొట్టు	130
పొలిమేర దేవత	,,
మసీదు	131
టంకశాల	,,
నరసింహవిగ్రహము	,,
కంపానగరము: హంపి	,,
విరూపాక్షాలయము	133
తిమ్మరుసుమంత్రి	134
రాయలకాలములోని నాణెములు	138
14. రాజ్యాంగము: కేంద్ర ప్రభుత్వము	
రాజు	140
మంత్రి	142
రాజసభ	144
రాజ్యమునందలి వ్యవహారకర్తలు లేక కార్యనిర్వాహకులు	148
చిన్న, పెద్ద, భాండారములు:— Treasury.	149
ధర్మాదాయములు దేవాదాయములు	151
ఆదవన లేక ఆదాయమును గూర్చిన కార్యాలయము	,,
గూఢచారులు	152
రాయబారులు	154
15. రాష్ట్రీయప్రభుత్వము	
స్థానిక ప్రభుత్వము	155

విషయము.	పుట.
రాజ్యాధిపతి లేక దుర్గదణ్ణాయకుడు	157
సీమ లేక నాడు	159
స్థలము	160
గ్రామము	161
నీటివసతులు	162
16. భూమి ఆదాయము	
బ్రహ్మదాయమాన్యములు	166
దేవాదాయమాన్యములు	,,
మఠపురమాన్యములు	167
ఆదాయము	167
మతసంబంధమైన పన్నులు	176
మతమునకు సంబంధించని పన్నులు	176
ఆదాయము:—వసూలు	177
జకరక్షణ	182
కావలిగారు	183
పాలెగారు	184
నగరసంరక్షణ	186
17. వర్తకవ్యాపారములు	
రేవుపట్టణములు	189
వర్తకమార్గములు	189
18. పరిశ్రమలు	
ఉప్పు	192
19. న్యాయపరిపాలన	
న్యాయాధికారి-రాజు	193
రాజు	194
ప్రాడ్వివాకుడు	195
ప్రతిజ్ఞాపత్రము-ఉత్తరవాదము	196
శిక్షలు	197
సాక్ష్యవిచారణ	201
20. సైనికశిక్షణ	
సైన్యము: సైన్యవిభాగములు	208
21. రాయలవారు: మతము: మతవ్యాప్తి	
మతసహనము	211
శైవులు	213
మధ్వులు	214
శైవమతములు–శంకరమతము	215
లింగాయతమతము	,,
జైనమతములు	216
దేవాలయములు	217
అమ్మవార్లు - జాతర	218
తీర్థయాత్రలు	221
ప్రయాణసౌకర్యములు	,,
చలివేంద్రలు, సత్రములు	223
దొంగలు దారిదోపిడివారు	223
సంఘము:—సంఘ జీవనము	225
మతగురువులు	226
అగ్రహారికులు	,,
మఠములు	227
రాజ్యాధికారులు	228
వ్యాపారస్థులు	,,

విషయము.	పుట.	విషయము.	పుట.
[illegible]	229	శ్రీకృష్ణదేవరాయలు	259
[illegible]	230	అల్లసాని పెద్దన	264
[illegible]	231	నందితిమ్మన	269
[illegible]	231	అయ్యలరాజు రామభద్రుఁడు	272
[illegible]	232	మాదయగారి మల్లన	275
[illegible]	233	ధూర్జటి	276
[illegible]	,,	[illegible] చిన్నన్న	277
[illegible]	235	సంకుసాల నృసింహకవి	278
[illegible]	236	పింగళిసూరన	281
[illegible]	237	తెనాలిరామకృష్ణకవి	282
[illegible]	238	రామరాజభూషణుఁడు	283
[illegible]	,,	23. కృష్ణదేవరాయలకాలపు నాటి యితర కవులు	
[illegible]	239		
[illegible]	240		
[illegible]	241	[illegible]	284
[illegible]	242	[illegible]	285
[illegible]	243	[illegible]	,,
[illegible]	245	[illegible]	286
[illegible]	247	[illegible]	,,
[illegible]	249	[illegible]	,,
22. రాయలవారు: సాహిత్యము		[illegible]	,,
సంస్కృతము	253	24. రాయలు : రా[illegible]	287

శ్రీరస్తు

శ్రీకృష్ణదేవరాయల చరిత్రము

1. విజయనగర నిర్మాణము

అనన్యపరాక్రమునకై అరాతిజనభయంకరుండై మహా రాజ్యతంత్రజ్ఞుఁడగు శ్రీ కృష్ణదేవరాయల సామ్రాజ్యము నకు ముఖ్యపట్టణమగు విజయనగరముయొక్క పుట్టుపూర్వోత్తరము తెలుసుకొనిరా, [illegible] దెవ్వరిచే నిర్మింపఁబడెనో తెలిసికొనుటకు కొంత ప్రయత్నించెదము.

దక్షిణహిందూస్థానమున క్రీ. శ 1336-వ సంవత్సరమున విశేష ప్రాముఖ్యత వహించెను. ఆసంవత్సర మీదేశచరిత్రమునం దొకముఖ్యమైన మార్పు కలిగెను. ఆసంవత్సరమున ఈదేశచరిత్రయందొక నవయుగము ప్రారంభించెనని చెప్పుటకు వీలగుచున్నది.

ఆసంవత్సరమున కర్ణాటక విజయనగరరాజ్య ముఖ్య పట్టణముగ విజయనగరనిర్మాణమై యున్నది. ఈనగరనిర్మాణమునకు పూర్వ మీదక్షిణదేశమందంతయు ప్రత్యేక ప్రత్యేక హిందూరాజ్యముల యాధిపత్యమున నుండెను. ఈరాజ్యము లెట్లెట్లు స్థాపితములైనవో వృత్తాంతముగఁ జెప్పుటకు వీలు లేకున్నది. అప్పటికి దాదాపు నూరుసంవత్సరముల సంవత్సరముల క్రిందటనే నిర్మితమైన ఉత్తరహిందూస్థానములో నిరాఘాట ప్రళయ

కావింపఁబడియున్నది. అట్లు ప్రశంసింపఁబడిన రాజ్యములలో మధురలోని పాండ్యరాజులు, తంజావూరులోని చోళరాజులు, మొదలయినవా రుండిరి. విజయనగరనిర్మాణముతో నీపూర్వచరిత్ర యంతరించి దక్షిణహిందూదేశచరిత్రలో నొకక్రొత్తయుగము ప్రారంభమైనదనియే చెప్పనగును. క్రొత్తగ నిర్మింపఁబడిన విజయనగరరాజులు దక్షిణమున సింహళద్వీపమునుండి యుత్తరమున దక్కనుభూమివరకు నుండెడిదేశమునంతయు నాక్రమించి, విజయనగర సామ్రాజ్యమును స్థాపించి, రెండువందలయేఁబదిసంవత్సరము లతివైభవముతో పరిపాలనచేసి, సామ్రాజ్యముయొక్క కీర్తిని ఖండాంతరములఁగూడ ప్రకాశింపఁజేసిరి. ఆకాలమున ననఁగా పదునైదు పదునాఱవశతాబ్దముల యందు నింత పెద్దసామ్రాజ్యముగాని, యింతటి వైభవముగాని, యింతటి మహోత్కృష్టస్థితి గాని, యేయితరరాజ్యములు హిందూదేశమునందుఁగాని ఖండాంతరములఁగాని, లేదని విదేశమునుండి యిచ్చటికి సంచారులుగవచ్చినవారు వారియుత్తరములయందు వ్రాసియుండిరి. ఇంతటి ప్రఖ్యాతి చెందినదేశ మేపరిస్థితులలో నిర్మింపఁబడినదో కొంత వివరింతము.

నాటిదేశస్థితి

క్రీ. శ. 1001-వ నాటికి హిందూదేశమునకు వాయవ్యమూలలనుండి మహమ్మదీయులు గజినిమహమ్మదు నాధిపత్యమున ప్రవేశించి ప్రథమమున పంచనదులచే నావరింపఁబడిన పంజాబుదేశముమీఁదను ముల్తానునగరముపైనను దండెత్తి యాక్రమించుకొనిరి. తరువాత వరుసగ ప్రతిసంవత్సరమును కొంతదేశముపై దండెత్త నారంభించి తిరిగి వచ్చుచుండిరి. ఇట్లే 1021-వ సంవ

త్సరమున కళింగదేశమును 1023-న కథియావారుదేశముమీఁదను దండెత్తిరిగాని నాయాదేశముల నాక్రమించి యుండలేదు. ఇదేరీతిగ నప్పుడప్పుడు వీలువెంబడిని సైన్యసమేతులై దండయాత్రలు సాగించుచు రెండువందల యేఁబదిసంవత్సరములు గడచునప్పటికి మహమ్మదీయరాజులు ఢిల్లీనగరములో తమరాజధాని నేర్పఱచుకొని పెద్ద మహమ్మదీయసామ్రాజ్యము స్థాపించిరి. అప్పటినుండియు యుద్ధమువెంబడి యుద్ధముఁజేయుచు నుత్తరహిందూస్థానము నంతను కలవరపరచివైచిరి. పదునాల్గవశతాబ్ద ప్రారంభమునకు వారిదృష్టి దక్షిణహిందూస్థానము పైఁబడెను. 1293-వ సంవత్సరమున ఢిల్లీసుల్తాను మేనల్లుఁడగు నల్లాయుద్దీను ఖిల్జీ దేవగిరిని తనవశము చేసికొనెను. నాల్గుసంవత్సరముల తరువాత పశ్చిమముననున్న గుజరాతుదేశముపై దండెత్తిరి. 1303-వ సంవత్సరమున తెలింగానా (వరంగలు) దేశము నాక్రమింప ప్రయత్నించిరి. 1309-వ నాటికి ఢిల్లీసుల్తానుయొక్క ప్రఖ్యాతసేనాని మల్లికాఫరు దక్షిణదేశముపై దండెత్తి వరంగలుదేశమును ముట్టడించెను. అచటనుండి పడమటికిఁ జని హొయిసల రాజ్యములోని ద్వారసముద్రమును ముట్టడించి మలబారు సముద్రతీరమువరకుఁ బోయి అచట మసీదు నొకదానిని కట్టించి చాలద్రవ్యమును పోగుచేసికొని మల్లికాఫరు తిరిగి ఢిల్లీనగరము చేరెను. 1312 లో తిరిగి దండయాత్ర మొదలుపెట్టెను. 1318 నాటికి ముబారక్ అనుసేనాని దేవగిరియందు రాజ్యముచేయుచున్న హరిపాలదేవుని నతిక్రూరముగ సజీవుని మంటలయందు కాల్చి యాతనితలను తననగరద్వారమున కట్టించెను. 1323-న వరంగలు ధ్వంసము గావింపఁబడెను.

పైఁజెప్పినరీతిని దండయాత్రలు జరిపి విజయనగరనిర్మాణ కాలమున నుత్తరహిందూస్థానమునంతను మహమ్మదీయులు తమ వశముగావించుకొనియుండిరి. వారియనుచరులు వీలువెంబడి దక్షిణదేశముపై నిష్టమువచ్చినట్లుదండెత్తి దానినివశముగావించు కొనుటకు ప్రయత్నములు సల్పుచుండిరి. కృష్ణానదికి దక్షిణమున నున్న భూభాగమంతయు నప్పటికి హిందూరాజుల పరిపాలనలోనే యుండెను గాని యీనాటికి రాజ్యబల మడుగంటిపోవుచుండెను. దీనికితోడు 1325-వ సంవత్సరమున మహమ్మదుబిన్‌టోగ్లాకు ఢిల్లీసింహాసన మధిష్ఠించెను. ఈతని కర్కోటకత్వము, మితిలేనియాశ, రక్త, మతవిజృంభణమును గూర్చి ఘోరతరములగు కథలు విపాస వినబడుచువచ్చినది.

ఆనాఁడు మహమ్మదీయులరాపిడికి వెఱచి ప్రజ లొకరి నొకరు చూచి మాటలాడుటకే భయపడుచుండిరి. పురవ్యవహారములన్నియు నున్నవున్నట్లు మహమ్మదీయసాంప్రదాయములకు లోనయ్యెను. జనులు వివిధములైన యుపద్రవములకు లోనైరి. పురదేవతలను మళయాళదేశమునకు తీసికొనిపోయి దాచివైచిరి. శ్రీరంగమునందలి దేవతావిగ్రహములు నుత్సవవిగ్రహములు ముసల్మానుల హస్తగతమాయెను. దేవాలయములందలి పూజలు నిల్పుచేయఁబడెను. దేవళపుగోపురములు దేవాలయ ప్రాకారములు ధ్వంసముచేయఁబడెను. మతము విధ్వంస మాయెను. పురజనులు స్వార్థపరులైరి; వారిలో వారికి స్పర్థలు హెచ్చాయెను. ఐకమత్య మడుగంటి నశించెను. జనులు పిఱికి పందలైరి. ధైర్యోత్సాహములు నశించెను. ఎటు గాంచినను

హిందూరాజ్యవినాశము మతవిధ్వంసనము నగరనాశనము పొడగట్టుచుండెను.

ఆకాలమున బొంబాయిచెన్ననగరములమధ్య నున్న తుంగభద్రానదికి యుత్తరపుటొడ్డున బళ్లారికి సుమారు నలువది మైళ్లదూరమున కొండలమధ్యప్రదేశమున నానెగుంది యను సంస్థాన మొకటి కలదు. ఈసంస్థానమునకు ప్రక్కనున్న కొండలసహాయమువలన శత్రువుల కందుబాటులోనుండని కోట నొకదానిని స్థాపించుకొని ద్వారసముద్రమునుండు హొయిసల బల్లాలరాజులకు సామంతరాజులయి నీయానెగుంది సంస్థానాధీశ్వరు లుండిరి. ఈసంస్థానమునకు దక్షిణమున తుంగభద్రానదిలోనికి పారుచుండెడి పంప యనునుపనది యున్నది. ఆనదియందన్నికాలములయందు నీరు ప్రవహించుచుండును. ఈసంస్థానముయొక్క చరిత్ర మన కంతగ తెలియదుగాని యీసంస్థానమప్పటికె దాదాపు ఏడువందల యేబదిసంవత్సరముల కాలమున నుండియు నున్నట్లుమాత్రము చరిత్రలవలన తెలియుచున్నది.

1336-వ సంవత్సరమునకు కొద్దికాలముక్రిందనే ఢిల్లీ సుల్తానగు తుగ్లకు గుజరాతుదేశముపై దండెత్తి అచటనుండి దక్కనుదేశములోని పడమటికనుమల ప్రదేశమునకు దక్షిణ దిశనున్న బలభూటును చేరెను. అచటనుండి ధార్వారువద్ద మలప్రభ యను నదినిదాటి యచటికి సుమారు యేఁబదిమైళ్లదూరమున నున్న నీ యానెగుందికోటను ముట్టడించెను. ఇచ్చటి సంస్థానాధీశ్వరుఁడు తలవనితలంపుగ నాకస్మికముగ వచ్చిపడిన విరోధిసైన్యముతో పోరాడఁజాలక మానసంరక్షణకై తన పట్టణమునందలి స్త్రీలనందఱ జంపించి తాను యుద్ధమున

మరణించెను. ఎట్టకేలకు శత్రువులు కోటను పట్టుకొని అందు నిలిచి యున్న సర్దారుముఖ్యులను ఖైదీలుగ తీసికొని ఒకనినిమాత్రము తమ ప్రతినిధిగ నుంచి మహమ్మదీయసైన్యమంతయు తిరిగి తమ దేశమునకు పయనమైపోయెను. కొలఁదికాలమున కీసంస్థానము నందలిజను లీప్రతినిధిపై తిరుగుబాటుచేయఁగ నాతఁడిచటికష్ట సుఖములను ఢిల్లీసుల్తానునకు తెలియఁబంపెను. అందుపై సుల్తాను సమగ్రముగ నాలోచించి తాను బందీలుగ తీసికొనివచ్చిన సంస్థానోద్యోగియుల బిల్వనంపి వారిలో ముఖ్యులైన దేవరాయలను నామాంతరముకల్గిన హరిహరదేవరాయలను రాజుగ నేర్పఱచి వీరినందరిని వారిస్వదేశమునకు పంపివైచిరి. హరిహరరాయలు తిరిగి వచ్చినపిదప నానెగుందిసంస్థానమునకు రాజ్యాధికారియై అచటిజనుల యభిప్రాయముల ననుసరించి రాజ్యము చేయుచుండెను.

హరిహరరాయలు ప్రతిదినమును నదినిదాటి దక్షిణమున నున్న అరణ్యప్రదేశములలో వేటకుపోవుచుండెను. మామూలుగ నొకరోజున వేటకై నాయరణ్యమునకుఁ బోవ నీటికనతిదూరమున నొకకుందేలువచ్చి తనవేఁటకుక్కల నడ్డగించి వాటిని కఱచెను. వ్యాఘ్రములనైనను జంకారించి భయపెట్టుశక్తిగల తనకుక్కలు కుందేటిచే కఱవఁబడుటఁ జూచి మిక్కిలి భ్రమఁజెంది తత్ప్రదేశంబున నెద్దియో నద్భుతం బుండనోపు నని తలఁచి తిరిగి స్వస్థానమునకు బయలుదేరెను. ఇట్లు నది దగ్గరకురాగా, నచట నొకమునీశ్వరుఁడు కనఁబడిరి. జరిగిన యుదంతమును రాయలామునీశ్వరునికిఁ జెప్ప నందులకు మునీశ్వరుండును భ్రమజెంది తన కాస్థలమును జూపు మని కోరెను.

అంత నా ప్రదేశమును గాంచి అది మిక్కిలి మహిమలుగలతావు గాఁ నెంచి అదిక్కున నొకపట్టణము నిర్మించుమనియు నట్లు నిర్మింపఁబడిన పట్టణ మెన్నటికిని చలనము లేకుండుననియు చెప్పెను. అంత వాస్తుశాస్త్రజ్ఞుల పిలువనంపి శుభముహూర్తంబున శంఖుస్థాపనముగావించి రాయ లాపట్టణమును నిర్మింపఁజేసెను. రాయలవారిని పురనిర్మాణముఁ జేయవలసినదిగ నాజ్ఞాపించిన మునీశ్వరుఁడు విద్యారణ్యులైనందున నీనగరమునకు విద్యారణ్యనగరమనియు విజయనగరమనియు పేరు పెట్టఁబడెను. ఇది 1336-వ సంవత్సరమున ప్రారంభింపఁబడినట్లు పోర్చుగీసు సంచారియగు "న్యూనిసు" వ్రాసియుండెను.

ఈవిషయమునే కుమారధూర్జటికవి తనకృష్ణరాయ విజయమునందును రాయవాచకమును నిఁకొకగద్యకావ్యము నందును కొద్దిమార్పులతో వ్రాసియుండిరి. ఈరెండు గ్రంథములయందు వ్రాయఁబడిన యంశములలోమాత్ర మెట్టి మార్పును లేదు. విద్యారణ్యులవారు తపస్సుచేయఁగ శ్రీమహాలక్ష్మి ప్రసన్నయై సాక్షాత్కరించెననియు నామె యీమునీశ్వరుని వరముకోరుమని యడుగఁగ

తే. ....నరఁడు
పేదకామింగ నాపేర పెలయునట్టి
పురముగావింపవలయుఁ దత్పురమునందు
జెలఁగి సంతతము నీవు నిలువఁదగును.

అని వరముకోరెను. అంత లక్ష్మీదేవి యాస్థలమును చూపెను. విద్యారణ్యుఁ డాప్రదేశము పూర్వము సుగ్రీవుఁడు తనతలదాఁచికొన్న మతంగపర్వతముగల ప్రదేశమనియు

నదియే కిష్కింధ యనియు తెలిసికొని యచటనే ప్రభవనామ సంవత్సర చైత్రశుద్ధపౌర్ణమి స్థిరవారము శుభయోగ శుభ కరణములు కూడిన శుభముహూర్తమునందు ముహూర్తము నిర్ణయించి కృష్ణపక్షము అమావాస్యనాఁటిరాత్రి నిశాసమయమునందు శంఖుస్థాపన ముహూర్తము నేర్పాటుచేసెను. కాని యాలగ్నము తప్పినవెనుక శంఖుస్థాపన జరిగియుండె ననియు నందువలన నీరాజ్యము మూఁడువందలయిరువదియేండ్లు మాత్రమే యుండుననియు పైవారు వ్రాసియుండిరి. మొత్తము మీఁద పోర్చుగీసుసంచారి యగు "న్యూనిసు" వ్రాసిన విషయములనుబట్టియు పైగ్రంథములయందు వ్రాయఁబడిన యంశములనుబట్టియు నీరాజ్యముదాదాపు క్రీ. శ. 1336-వ సంవత్సరమునందే నిర్మింపఁబడి యుండవచ్చు నని స్థిరపడుచున్నది. అప్పుడు కట్టఁబడిన విజయనగరమే కృష్ణదేవరాయసామ్రాజ్యమునకు ముఖ్యపట్టణముగనుండి దేశమునందు చరిత్రయందును ప్రఖ్యాతిగాంచెను. ఆనిర్మింపఁబడిన పట్టణముయొక్క సౌందర్యమును ధూర్జటి తనకృష్ణదేవరాయవిజయమునం దీవిధముగ వర్ణించెను.

సీ. కోటలా తెలుగంటి పాటలాధరశిల్ల, నాటలాడదలంచి హసాంకుమించ
మేడలా మిన్నెంటి జాడలానిన యుంచ, జోడులాడటఁ గాంచు సొబగుసంగ
శాలలా నవరత్నజాలలాలితకాంతిలీలం దాఁగినవింత మేలుఁజూప
శాలలా మరునిశాశాలలాగునఁ బల్కు- పేల లోఁగొనజాలునితవుమీల
నవుర నిర్మించె వనపేర నళినలోక, పాకపురాధికప్రభాబంధురముగ
గరిమ నరగవిద్యానగరము, సంగ, మేలయుపురరత్నమాధరాతురపరంతు

ఇవ్విధమున దైవప్రేరితమైన విజయనగరరాజ్యము స్వజాత్యభివృద్ధిపకుఁడయ్యు సర్వజాతిసార్వభౌముఁడును, స్వమతసాధనుఁడయ్యు సర్వమతసహిష్ణుఁడును, స్వభాషావ్యాపకుఁడయ్యు సర్వభాషాపోషకుఁడును, హైందవ సామ్రాజ్యరమాధురంధరుఁడు నగు శ్రీకృష్ణదేవరాయల కాలమున నీవిజయనగరసామ్రాజ్యము మిక్కిలి ప్రఖ్యాతిఁ గాంచెను.

2. రాయలవంశము

రాయలవంశముయొక్క పూర్వోత్తరములను గూర్చి నిశ్చయించి వ్రాయుటకు గలయాధారము లెక్కువగా లేవు. రాయలవారు తాము వ్రాసిన ఆముక్తమాల్యద యను ప్రబంధమునందును, అలసానిపెద్దన వ్రాసిన మనుచరిత్రంబను ప్రబంధమునందును మఱియు వారి యాస్థానకవుల ప్రబంధములయందును వ్రాయఁబడిన వంశావళియే గొప్ప ఆధారమై యున్నది. ఈప్రబంధములం దన్నిటియందును కులగౌరవమును బట్టి యేసూర్యునికో లేక చంద్రునికో యీవంశమును కల్పుటకు గ్రంథకర్తల యాచారమై యున్నది. వారియాచారానుక్రమముగా వీరిమూలపురుషుఁడు పాలసముద్రమునందుఁ బుట్టి శివుని జటాజూట మలంకరించి మహోపకారియై గొప్పయాభిజాత్యముఁ గల్గి కాంతిమంతుఁడై లావణ్యసౌందర్యాదిగుణములుగల్గి మిక్కిలి ప్రకాశవంతుఁడైన చంద్రుఁడనియు వీరివంశము చంద్రవంశమనియు రాయలవారు తమప్రబంధమున వ్రాసికొనియున్నారు. ఇట్లే వీరివంశము మనుచరిత్రప్రబంధమునందును వ్రాయఁబడియున్నది. ఆచంద్రునకు సమస్తవేదశాస్త్రములు చక్కఁగా తెలిసినట్టి బుధుఁ డను కుమారుఁ డుండెను.

బుధునకు ప్రజ్ఞానిధియగు పురూరవుఁడును పురూరవునకువాయువును వాయువునకు యయాతియు వరుసగా జన్మించిరి. యయాతికి యదువు దుర్వసులను నిద్దరు తనయులుండిరి. అందు దుర్వసుఁడు గుణనిధియై విశ్రుతకీర్తివహించెను. ఈదుర్వసునివంశమె తుళువవంశమని పేరుగాంచెను. ఆతుళువవంశమున పెక్కండ్రు నృపులుదయంబుఁగొండిరి. ఆవంశమునం దుద్భవించినవారిలో నొకరగు తిమ్మదేవరాయఁడనురాజు తనకీర్తిప్రతాపంబుల భూమ్యాకాశములయందు వ్యాపింపఁజేసి తనరాజ్యమున కధికసౌఖ్యము కలుగఁజేసెను. ఈతిమ్మభూపతికి నీశ్వరదేవరాయలు జన్మించెను. ఆ యీశ్వరరాజునకు బుక్కమాంబ యనుభార్య యుండెను. వా రిరువురియందు ధీమంతులగు నరసింహదేవరాయలు తిమ్మదేవరాయ లను నిరువురుపుత్రులు జన్మిఁచిరి. వా రిద్దరిలో నరసింహదేవరాయలు మిక్కిలి ప్రతాపవంతుఁడై తన వైరిరాజుల నణఁచి కడుఁకీర్తియుతుఁడై రాజ్యము నేలెను. ఆనరసింహదేవరాయనికి నాగాంబ తిప్పాంబ యను నిరువురు భార్య లుండిరి. వారియందు వీరనరసింహరాయలును అచ్యుతాంశసంభవుఁ డగు కృష్ణరాయమహీంద్రుఁడు నుద్భవించిరి. ఇందు వీరనృసింహరాయఁడు తనభుజబలముచేత ధరను నతిమహిమతో నేకచ్ఛత్రాధిపతియై పాలించెను. నరసింహరాయల యనంతరము శ్రీకృష్ణదేవరాయలు రాజ్యాధిరూఢుఁడయ్యెను.

ఈపైనచెప్పఁబడినవంశావళి ఆముక్తమాల్యదయందు మనుచరిత్రమునందు నీయఁబడియున్నది. ఇందలి యంశములన్నియు వరాహపురాణమున వ్రాయఁబడిన యంశములుగాని మరియే

యితర సమకాలికులగు ఆస్థానకవులుగాని వ్రాసిన ప్రబంధముల యందుఁగాని శ్రీకృష్ణదేవరాయని పూర్వవంశపు వివరము లేవియు నీయఁబడియుండలేదు. ఆకాలపుశాసనములలోను నింతకన్న నెక్కువ వివరములు తెలియుటలేదు. ఆకాలమున హిందూదేశమున పర్యటనము చేసిన విదేశరాయబారులును యీవిషయములఁగూర్చి యెక్కువ వివరములను తెల్పియుండ లేదు. ఈకారణములవలన వీరిపూర్వచరిత్రనుగూర్చి యిదమిత్థమని నిర్ధారణచేయుటకు వీలుపడుట లేదు.

పైనచెప్పిన వంశావళిలోని ప్రథమభాగమంతయు చరిత్రాంశము కానేరదు. ఇయ్యది పరంపరానుశ్రుతముగా కవులు తమసంప్రదాయము ననుసరించి వ్రాయువైఖరిని మాత్రమే వ్రాయఁబడినదై యున్నది. వీరు నిరూపించినంతవరకు చరిత్రాత్మకముగ నీశ్వరరాజు తండ్రియగు తిమ్మరాజువరకు కృష్ణదేవరాయని పూర్వీకులవిషయమై మనకు తెలియుచున్నది. అందును వీరందరును తుళువవంశీకులే యైయున్నారు. కొందరు తిమ్మరాజు సాళువనరసింహరాజుకు జ్యేష్ఠభ్రాత యని యందురు గాని అట్లనుట కెట్టియాధారములను కనుపించవు. తిమ్మరాజు సాళువవంశజుఁడే యై అందును రాజ్యాధిపత్యమువహించిన సాళువనరసింహరాజుకు సోదరుఁడేయైనచో కృష్ణదేవరాయలు తాను తుళువవంశమునకుఁ జెందినవాఁడనని ఆముక్తమాల్యదలో వ్రాయుటగాని ఆస్థానకవియగు పెద్దనగాని వరాహపురాణము వ్రాసిన నందిమల్లయ్య ఘంటాసింగయ్యలుగాని వీరి వంశము తుళువవంశమని వ్రాయుటగాని యసంభవము. కాన

నింతవరకు మనకు బయల్పడిన చరిత్రాంశములనుబట్టియు శాసనములఁబట్టియు కృష్ణదేవరాయలు తుళువవంశజులనియు వీరిముత్తాత యీశ్వరరాజనియు నంతకుపూర్వ మీవంశజుల సంగతి మనకు తెలియదనియు విశదమగుచున్నది.

"తిమ్మక్షితీశుఁ డీ భూతలంబును తనభుజమున ధరియించి తనకీర్తిద్యుతులను భూమ్యాకాశంబులవ్యాపింపఁజేసి తీక్ష్ణమగు శౌర్యమును కనఁబఱచె" నని ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు వ్రాసికొనుటతప్ప నిశ్చయముగా నీతిమ్మరాజు ఏమిచేసినదియు చెప్పుట కెట్టి యవకాశములును లేవు. వరాహపురాణమునందు ప్రప్రథమమున నీతిమ్మరాజు కుమారుఁడగు నీశ్వరరాజు సాళువనరసింహరాయుని యొద్ద దండనాయకుఁడుగ నుండె ననియు అటుపిమ్మట నీశ్వరనృపతి కుమారుఁడగు నరసరాజు "సాళువనరసింహనృపాలదండనాయకతిలకుఁ"డుగా నుండి యానృపాలుని "సామ్రాజ్యరమాభరణుఁడుగా" నుండి సమస్తమైనయధికారములను చలాయించినట్లు వ్రాయఁబడియున్నది. కాన సాళువనరసింహరాజు తుదికాలమునకు దండనాయకతిలకుండగు నరసరాజు పేరునకుదండనాయకుఁడయ్యును రాజ్యభారమునంతయు తానే వహించి నిర్వహించవలసియున్నది. సాళువనరసింగరాజు పేరుమాత్రమునకే రాజుగా నుండెను గాని వారికాలములో నీశ్వరరాజును తదనంతరము నరసరాజును రాజ్యభారమునంతను వహించి సాళువనరసింగరాజు రాజ్యమును విస్తరింపఁజేసిరి. ఈశ్వరరాజు విజయములఁగూర్చి వరాహపురాణమునం దీవిధముగ వర్ణింపఁబడియుండెను.

సీ. ఉదయాద్రి భేదించె నొకలు తరనిర్జించెఁ గండికోటపురంబుఁ గదలఁ ద్రవ్వెఁ
పెనుకొండ సాధించె బెగ్గులూరు హరించెఁ గోలాల కెల్లూరు గుంటుపల్లెఁ చెఁ
గుంధాణి విదళించె గొడుగుచింత జయించె బాగూరు పంచమాపాడు చేసె
నరుగొండ కెకలించె నామూరు మర్దించె శ్రీరంగపురమును జాతిసునూర

తే. రాయచాహ త్రుల్ల ధరాతరాహ, హోహ నమురారి బర్బర బాహు సాళ్వ
నారసింహప్రతాపసన్నాహుడగుచు, విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు.

ఈశ్వరునికుమారుఁడగు నరసరాజు దండనాయకుఁడుగ నుండుకాలముననే గుంటూరుజిల్లా కొండవీటిసీమయే స్వస్థానముగఁగల్గి కౌండిన్యసగోత్రుఁడై ఆర్వేలనియోగికుటుంబము నకుఁజెందిన వేమరాజపౌత్రుఁడును రాచరాజపుత్రుఁడునగు మహాధీశాలియగు తిమ్మరసుమంత్రి యుండెను. ఈతిమ్మరసు రాజ్యశాస్త్రనిపుణుఁడై యుండ నరసరాజు తననిరుపమానప్రతిభాశాలలముచే వెలయుచుండ సాళ్వనరసింహరాజు ఆకాలమున కర్ణాటసామ్రాజ్యముపై దండెత్తి విద్యానగరరాజ్యలక్ష్మిని తన వశముచేసికొని 1490-వ సంవత్సరమున నొకశుభముహూర్తమున కర్ణాటసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుండాయెను.

సాళువనరసింహరాయఁడు కొంతకాలమునకు దైవవశమున మరణింపఁబోవుసమయమున తాతని పెద్దకుమారుఁడు తిమ్మరాజు బాలుఁడుగ నుండుటంజేసి రాజ్యాధికారమునంతయు వహింపఁజాలఁడేమోయనిస్వామ్యభక్తుఁడగునరసరాజును కార్యకర్తగ నియమించి తనకుమారుని రాజ్యాభిషిక్తునిగఁజేసెను. సాళువనరసింహరాజు స్వర్గస్థుఁడైనపిదప నాతనికుమారుఁడగు తిమ్మరాయఁడు రాజుగ నుండి తుళువనరసరాజు సమస్తమైన రాజ్యభారమును వహించి తిమ్మరసుమహామంత్రి సహాయసంపత్తు

లతో రాజ్యపాలనము చేయుచుండెను. ఇంతలో బాలరాజు నెవరో చంపఁగా రాజ్యకాంక్షుఁడై తుళువనరసరాజే బాలరాజును చంపించె నని ప్రజలు చెప్పుకొన ప్రారంభించిరి. అంత నీయపవాదము తప్పించుకొనుటకు బాలరాజుతమ్ముడగు ఇమ్మడి నరసింహరాయనికి పట్టాభిషేకము కావించి యీ యపవాదును తప్పించుకొనెను. కాని బాలరాజహంతకుఁడగు దళవాయి యిమ్మడి నరసింహరాజుతో స్నేహము గావించి తుళువనరస రాజుపై ద్వేషము పుట్టించెను. ఈసంగతులు తెలిసికొని తుళువనరసరాజు ఇమ్మడినరసరాజుచే నాదళవాయిని హతము గావించి విద్యానగరమునుండి పెనుగొండకుఁ బంపి యాతనిరక్షణార్థము కొంతసైన్యము నిచ్చి తానే రాజ్యభారమునంతయు వహించి రాజ్యపాలనము చేయుచుండెను. ఇట్లు కొంతకాలము జరుగుచుండ నరసరాజు పెనుగొండదుర్గమున 1505 లో జంపఁబడెను. అతని మరణానంతరమున తుళువవంశీయులే విజయనగరరాజ్యమును పరిపాలింపఁజొచ్చిరి. నరసరాయలును తాను రాజ్యాభిషిక్తుఁడైన పిమ్మట దిగ్విజయముచేసి యనేకరాజ్యములను రాజ్యాధిపతులను వశము గావించుకొనిరి. వీరిదిగ్విజయమునుగూర్చియు కీర్తిప్రతాపములఁ గూర్చియు నానాటికవులు తమప్రబంధములయందు వ్రాసి యుండిరి. ఆముక్తమాల్యదయందును, మనుచరిత్రమునందును వ్రాయఁబడిన యీపద్యములవలన వారియశస్సు తెలియనగును.

సీ. అంభోధిపర్యంత విశ్వంభరావలయంబుఁ దనబాహుపురి మరకతముఁ జేసి
నక్రాంతవిక్రాంతనాపారతుష్టికిఁ గవికదంబముఁ బారకముఁ జేసి

కదనంతనిఖిలరాణ్ణికరంబుఁ జరణమంజీరంబు సాంధంబికముఁ జేసి
మహనీయనిజనిర్గతయశస్సరసికి నగనంబుఁ గలహంసకంబుఁ జేసి

తే. నతికరకృపాణ కృత్తమదారివీర, మండలేశ కపాలకుండల మకుటరత్న
మప్రమాల్యభరంభరామండనార్చి, తేశ్వరుం డగు నారసింహేశ్వరుండు.

నరసింహరాయనికి తిప్పాంబ నాగాంబ ఓబలాంబ యను ముగ్వురుభార్య లుండిరి. ఈవిషయమునుగూర్చియు సమకాలికులు వ్రాసిన విషయములనుబట్టి భేదాభిప్రాయములు కలుగుచున్నవి. ఆస్థానకవులగు అలసానిపెద్దన ముక్కుతిమ్మన తమ గ్రంథరాజము లగు మనుచరిత్ర పారిజాతాపహరణకావ్యము లందు నరసరాయల కిద్దరేభార్య లనియు వారిరువురకును కులకాంత లనియు నీక్రిందిపద్యములవలన విశదమగుచున్నది.

తే. ఆనృసింహప్రభుండు దిప్పాంబవలన
నాగమాంబికవలన నందనులఁ గాంచె
వీరనరసింహరాయభూవిభుని నచ్యు
తాయతాంశజుండైన కృష్ణరాయాఖ్యు నిన్ను.

క. ఆనరసమహీమహిళా, జానికిఁ గుణవతులు పుణ్యచరితలు దిప్పాం
బా నాగాంబిక లిరువుర,

కాని 1537-వ సంవత్సరమునకు సరియగు హేవిళంబి సంవత్సరమున అచ్యుతదేవరాయలు చిమారుమండలములోని నారాయణవరమున నొకబ్రాహ్మణునకు దానమొసంగుచు వ్రాయించియిచ్చిన తామ్రశాసనమునందలి యీక్రింద వ్రాయఁబడినవాక్యమువలన నరసరాజునకు ముగ్వురుభార్య లుండి రని స్పష్టపడుచున్నది.

తిప్పాజీనాగలాదేవ్యో కౌసల్యా శ్రీసుమిత్రయోః
జాతౌవీరనృసింహేంద్ర, కృష్ణరాయమహీపతీ
అస్తాదోబాంబికాదేవ్యామచ్యుతేంద్రోపి భూపతిః.

కృష్ణదేవరాయని మరణానంతరమున కొద్దికాలమునకే వ్రాయఁబడిన తామ్రశాసనమునం దిట్లుండియుండుటచేత నీవిషయ మును నిజముకా దని చెప్పుటకు వీలులేదు.

ఈపై విషయములవలన నరసరాజునకు మువ్వురుభార్య లుండి రనియు వారిలో ప్రథమభార్యయగు నాగాంబవలన వీర నరసింహరాయలనియు, రెండవభార్యవలనఁ గృష్ణదేవరాయలని యు, మూడవభార్యవలన నచ్యుతదేవరాయలనియు మువ్వురు పుత్రులు కల్గిరనియు తెలియుచున్నది. నరసరాజునకు మువ్వురు భార్యలుండిరా లేకయిద్దరుభార్యలేయుండిరా యనువిషయమున కొంతభేదాభిప్రాయమేర్పడినను కృష్ణదేవరాయలు నరసరాజునకు నాగాంబికవలన జన్మించెననువిషయము మాత్రము నిర్వివాదాం శమైయున్నది. కాని వీటినన్నిటినిమించిన విచిత్రమైన యింకొక జనవాడుక వినవచ్చుచున్నది. రెండవభార్యగా పరిగణింపఁ బడెడి నాగమాంబిక నరసరాజుయొక్క భార్యయే కాదనియు, వారియింట నూడిగము చేయుచుండెడి దాసీకన్య యనియు, నచటనుండు స్త్రీలలో నెల్లసౌందర్యవతి యనియు చెప్పుచు రాయలజననమునుగూర్చి యొకకల్పితకథను చెప్పుదురు. ఆకథ నిచ్చట సంగ్రహముగ వ్రాసెదను.

ఒకనాటిరాత్రి నరసరాయలు కాలోచితకృత్యంబుల నిర్వర్తింప బహిర్దేశమునకుం జన నచట నొకరిక్క యాకాశ మునుండి తనపాత్రమునఁబడెననియు నయ్యది మిక్కిలి తేజో

వంతమై కన్నులమిరుమిట్లుగొల్పుచుండ తత్క్షణమే తిమ్మరసు మంత్రి కీవార్త తెలిపెననియు నాతఁడాయుదకమును ద్రావుమనె ననియు, రాయ లట్లు చేసె ననియుఁ బిమ్మట తిమ్మరసు నాజ్ఞాను సారమున స్త్రీయతో రతిసుఖంబునం దేల యత్నింపఁ బట్టమహిషి వచ్చుటకు వీలులేకుండుటంజేసి నీదాసియగు నాగాంబికంగూడి సుఖంబుననున్న నాపె కీరాయలు జనించె ననియు వాడుకగా జెప్పుదురు. ఈకల్పితకథయందు నితరకల్పితకథలయందువలెనే సత్యాసత్యగ్రహణమునకు తగుసాధారము లెవ్వియుఁ గాన్పిం పవు. నాగాంబిక కులకాంత కా దనుటకు తగినయాధారము లెవ్వియును లేవు. తిమ్మనార్యకృత పారిజాతాపహరణమునందు నాగాంబిక కులకాంత యనియె వ్రాయఁబడెను. కొన్ని దాన శాసనములు జర్చించియు నీపె కులకాంతగనె యుండియుండ వచ్చుననియు నూహింపఁబడుచున్నది. ఈపె కులకాంత కాదని నిరూపించుటకుఁ బ్రబలకారణములు చిక్కువఱకును మన మీపె కులకాంత యనియె గ్రహింపవలయు నని నామతము. ఈవిషయమునుగూర్చి వ్రాయుట సంపూర్తిచేయక పూర్వము వాడుకలోనున్న యింకొకకథను నిచ్చట పొందుపఱతును.

నరసరాజుభార్యలగు తిప్పాంబ నాగాంబ లిద్దఱు నొకనాఁ డొకానొక విషయమునుగూర్చి చర్చసాగించి వాదోపవాద ముల పెంచుకొనుచుండిరి. వాదన క్రమక్రమముగా పంతము లోనికి దిగెను. వా రావిషయములో గెల్చినవారు ఓడి పోయినవారి కాలుమూసములు దాసిగా నుండునటుల పేర్ప రచుకొనిరి. అందు నాగాంబయే చివర కోడిపోయెను. అందు వలన నాగాంబ తిప్పాంబ కాలుమూసములు దాసిగా నుండి

యూడిగము చేయవలసివచ్చెను. అట్లు దాసిగా నున్నకాలమునన్ లేక దాసిగా నుండిన నాగాంబికకు జన్మించినందువలననే కృష్ణదేవరాయలు దాసీపుత్రుఁడుగా భావింపఁబడిరనియుఁ జెప్పుదురు. ఈకథయును నిజమని చెప్పుట కేలాటి యాధారములును గానరావు. కాన నిదియు నమ్మఁదగినది కాదనియే చెప్పవలెను.

3. కృష్ణదేవరాయల జననము

కృష్ణదేవరాయల జననముఁగూర్చిన వివరములు నిర్ధారణచేసిచెప్పుట కాధారములు సరియైనవి కాన్పింపవు. రాయలెచట జన్మించెనో వారిజననముయొక్క తిథివారనక్షత్రము లెయ్యవియో చిట్టచివరకు సంవత్సరమైన నెద్దియో తెలిసికొనుట కవసరములైన యాధారములును కన్పించుటలేదు. రాయలతండ్రి తాతలు విజయనగరమునందే నివసించి దండనాయకులుగను రాజ్యకార్యధురంధరులుగను నుండియున్నందున రాయలవారు విజయనగరమునందే జన్మించియుందురని యూహింపనగును. వీరిపుట్టుక తేదీనిగురించి చూతమన్నను సరియైనయాధారములు కాన్పింపవు. అనుశ్రుతముగా వచ్చుచున్న యొకపద్యమునుబట్టి కొందరీరాయలు పుట్టుకతేదీని నిర్ధారణచేయుటకుఁ బ్రయత్నించియుండిరి గాని దానికిని సరియగు సామాగ్రి కుదురలేదు. ఆపద్యము నిందు పొందుపఱచుచున్నాను.

ఉ. అందలి శాలివాహనశకాబ్దము లద్రివసుత్రిసోములన్
బంధితమైన యవ్విక్రుతివత్సరమందలి పుష్యమాసమం

దం బసుకృష్ణపక్షమున సంచితద్వాదశి శుక్రవాసరం
బం దుదయించె కృష్ణుఁడు శుభాన్వితుఁ డానరసింహరాజుకున్.

ఈచాటుధార నాధారముచేసికొని కృష్ణరాయలు శాలివాహనశకము 1387 కు సరియగు విక్రుతినామసంవత్సర పుష్యమాసమునందు బహుళద్వాదశీ శుక్రవారమునాఁడు జన్మించెనని కొంద ఱూహించుచున్నారు. ఇందును గూర్చి యిప్పటికి దాదాపు 42 సంవత్సరములక్రింద పత్రికాముఖమున కొంత చర్చ జరిగియుండెను. ఒకానొక జ్యోతిషశాస్త్రజ్ఞుఁ డిందుండు వివరములు సరిగావనియు అందులో 1387 వ శకము విక్రుతినామసంవత్సరముగ నుండుటకు వీలులేదనియు పార్థివగాని కారణగాని యైయుండవలయు ననియు వాదించెను. వారము కూడ మంగళవారముగాని సోమవారముగాని యుండవలెనట. అద్దాన నీపద్యము సరియైనది కాదనియు పద్యముయొక్క మొదటిపాదము

"అందలి శాలివాహనశకాబ్దములం ద్వినవత్రిసోములన్"

అని యుండినచో కృష్ణదేవరాయలజననము 1392 వ శకమున పుష్యబహుళ శుక్రవారముగా నుండవచ్చుననియు సరియైన తేది 16-1-1471 వ సంవత్సరమగు ననియు వ్రాసియుండిరి.

ఈపైన చెప్పిన రెండుతేదీలును సరియగున వని చెప్పుట కెంతమాత్రమును వీలు లేదు. పోర్చుగీసుదేశమునుండివచ్చిన న్యూనిజ్ అను రాయబారి వ్రాసిన ప్రకారము రాయలు పట్టాభిషేకమునాటికి సుమా రిరువదియేండ్ల వాఁడు. దానిని బట్టి కొంతవయసునందు హెచ్చుతగ్గు లాలోచించినను పైనఁజెప్పఁబడిన 1466 గాని 1471 గాని సరియని తోఁచదు.

అట్లు గాక పోర్చుగీసురాయబారి యగు న్యూనిజు చెప్పినమాట నాధారము చేసికొని రాయలపట్టాభిషేకమునాటికి సుమా రిరువదిసంవత్సరములవాఁడని యెంచినచో రాయలపట్టాభిషేకము 1509 వ సంవత్సరమున జరిగియున్న ట్లిప్పటికి స్పష్టముగా తెలియవచ్చినందున కృష్ణదేవరాయలు 1509 కి పూర్వ మిరువది యిరువదైదేండ్ల క్రింద జన్మించియుండవచ్చునని యూహింప నగును. అనఁగ కృష్ణరాయలజననము 1484 మొదలు 1489 వ సంవత్సరములోపల నయియుండవచ్చు నని తోఁచుచున్నది. అంతేకాని సరియైన జననకాలమును స్థిరపఱచి చెప్పుట కెట్టి యాధారములును కానరావు.

కృష్ణదేవరాయ లేసంవత్సరమునఁ బుట్టినను వారిజన్మముహూర్తము శుభసూచకముగను శుభదాయకముగను నుండె ననుట నిస్సంశయము. తండ్రి యగు నరసరాయశఃకీర్తులు దేశమంతటను విస్తరించెను. బీజాపూరుదేశమంతయు నరసరాయని స్వాధీన మయ్యెను.

4. రాయలబాల్యదశ

రాయలబాల్యదశను గుఱించియు మనము తెలిసికొనుటకు తగునాధారము లేవియు కాన్పింపవు. కాని నరసరాయ లే కారణముననో భార్యలలో తిప్పాంబకంటె నాగాంబికయందును వీరనరసింహరాయనికంటె కృష్ణదేవరాయలయందును నధిక ప్రేమను చూపుచు వచ్చెను. ఇదియునుగాక విద్యాబుద్ధులయందును తెలివితేటలయందును తనప్రథమభార్య కుమారుఁడును వయసునపెద్దవాఁడునైన వీరనరసింహునికంటె చిన్నవాఁడైన

కృష్ణదేవరాయలే మిన్నగా కన్పట్టుచుండెను. కుమారు లిరువురకు నధికమేధాశక్తిసంపన్నుఁడైన తిమ్మరసుమంత్రియే విద్యాబుద్ధుల నేర్పుచుండెను. వీరిద్దరిలో రాయలే అన్నివిధముల మిన్న యని తిమ్మరసు నరసరాజునకు చెప్పుచుండెను. ఇందువలనఁగూడ నరసరాయఁడు కృష్ణదేవరాయని నధికముగఁ బ్రేమించుచుండెను. ఇదియంతయు తిప్పాంబకు కష్టముగాఁదోఁచెను. కష్టముతోఁచుటయే గాక యిదియంతయు నెప్పటికైనను విషమించి వయసునఁ బెద్దయైన వీరసింహునకుఁగాక కృష్ణదేవరాయలకే రాజ్యాభిషేకముగునేమో యను భయము మనసున జనించెను.

తిప్పాంబకౌటిల్యము

తనమనమున కలిగిన భయమువలన తనకు కృష్ణదేవరాయని యందును బ్రాహ్మణమంత్రియగు తిమ్మరసుపైనను అసూయ జనించెను. అసూయ యనునది పెద్దపెనుబామై తన్నావరించినంతనే యెట్లైనను కారణము కల్పించి కృష్ణరాయల జంపింపవలయు ననెడి యూహ యతనికిఁ గల్గెను. ఇందులకు తగిన పన్నాగము పన్నుటకు ప్రయత్నించి తనవద్దనున్న దాసీజనముచేత నీకృష్ణదేవరాయలకు విషప్రయోగముచేయ యత్నించె ననియు తిమ్మరసు దీనినంతను తెలిసికొని రాయల రక్షించె ననియు చిట్టచివరకు తిప్పాంబ గారణాంతరములు కల్పించి నరసరాజునకు చెప్పెననియు సాహసులు విని విసువుజెంది రాయలు కృష్ణదేవరాయలఁ జంపింపుమని తిమ్మరసు కాజ్ఞాపించెననియు తిమ్మర సట్లు చేయక కృష్ణదేవరాయల రక్షించె ననియు కూడ నొక గాథ కలదు. ఇదియు కల్పితకథయే యై యుండవలయు. ఇందలి సత్యమును నిరూపించిచెప్పుట కెట్టితార్కాణములును కనుపింపవు.

ఇట్టి కల్పితకథలను పుట్టించి పుక్కిటిపురాణములుగా దేశమున వ్యాపింపఁజేయుట యొకవిధమైన యలవాటై యున్నది. ఇది యునుంగాక అసహాయశూరుండును బాహుబలపరాక్రముండును రాజ్యభారనిర్వహణసమర్థుండును నగు కృష్ణదేవరాయలుండ నరసరాజు మరణానంతరమున వీరనరసింహరాయ లేల సింహాసనారూఢుఁడయ్యెనో తెలిసికొనఁజాలక దీని కెద్దియేని నపూర్వకారణముండవలయునని యూహించి యిటీవలి వారలిట్టి కట్టుకథలను గల్పించి వ్యాపింపఁజేసియుందురే కాని యిట్టి కల్పితగాథ లుప్పతిల్ల వేఱొండుకారణము లేదు.

కృష్ణదేవరాయల విద్యాభ్యాసము

అన్నివిషయములందువలెనే యీ విషయమునందును ఆధారములు చాల తక్కువగా నున్నవి. మొత్తముమీఁద శత్రువులవలన నేయపాయమును గలుగకుండ సంరక్షించుటకై పితృవాత్సల్యమువూని కృష్ణరాయనికి తిమ్మరసును తనతమ్ముఁడగు గోవిందుఁడును విద్యాబుద్ధులు గఱపుచుండిరి. చిన్నతనముననే కృష్ణరాయఁ డాంధ్రగీర్వాణభాషలయందు సాహిత్యజ్ఞానము సంపాదించి కర్ణాటభాషయు హిందూస్థానీభాషయు కూడ నభ్యసించియుండెను. విద్యాసంపత్తియందు భోజరాజుతో సమానుఁడుగా నుండినట్లు అలసాని పెద్దన

" భోజసమానశతి విద్యాపరిషత్కా "

యని సంబోధించియుండెను. అవయవసంధులు గట్టిపడునట్లు సాముచేసి సాముగరడీలయం దారితేఱుటచేతనే

" వ్యాయామస్థిరసంధిబంధా "

యని సంబోధింపఁబడెను. తెల్లవారకపూర్వమే దేహము

నంతను నూనె రాచుకొని గుఱ్ఱము నెక్కి దేహమునకు రాయఁబడిన నూనెయంతయు నింకిపోవువరకు గుఱ్ఱపుస్వారి చేసెడువాఁడు. ఈతని గుఱ్ఱపుస్వారినిగురించి పేయసును చరిత్రకారుఁడీక్రిందివిధముగ వ్రాసియుండెను. "తెల్లవారకపూర్వమే యొక చటాకునువ్వులనూనెను త్రాగి తన తలకును దేహమునకును పూర్తిగ నూనెరాచుకొని తొడలవరకు నొకకొల్లాయినిగట్టి పెద్ద పెద్ద బరువులతో కసరత్తుచేసి తరువాత నొకకత్తితో మిక్కుటముగ చెమటపట్టువఱకు సాముచేసి అప్పుడు తనయనుచరులతో కుస్తీపట్టెడువాఁడనియు నంత నొకస్వారిగుఱ్ఱము నధిరోహించి తెల్లవారువరకు నిటునటుపరిగెత్తెడువాఁ డనియు తరువాత స్నానముచేసెడివాఁ"డనియు వ్రాసియుండెను. ఇతఁడు ధనుర్విద్యయందును చక్కనిపరిశ్రమచేసియుండెను ఇదియేగాక తిమ్మరసు మంత్రి యనుగ్రహమువలన రాజనీతి దండనీతి మొదలుగాగల రాజ్యతంత్రవిధానములయందును మంచిపాండిత్యమును సంపాదించెను.

నరసరాజు మృతి

ఇది యిట్లుండ నరసింహరాయనికి ఉబ్బురోగము సంప్రాప్తించి క్రమక్రమముగా వృద్ధినొంది తుదకు భయంకరమైనదాయెను. పెనుగొండయం దుంచఁబడిన యిమ్మడి నరసింహరాయ లేమాయెనో యెట్లు చంపఁబడియెనో నాతనికి పిల్లలుండిరో లేదో వారివ్యవహారము లెట్లు అంతరించినవో చెప్పుటకేలాటి చరిత్రాత్మకము లైన యాధారములును లేవు కాని నరసరాజుయొక్క అవసానకాల మాసన్నముకాఁగా నాతనికి

నిమ్మడి నరసింహరాజుయొక్క అనుచరులవలన నేవిధముగ నైనను కష్టములు సంభవించునేమో యనెడిభయముమాత్ర ముండెను. తనకాలమున కృష్ణానదికి నుత్తరముగా నుండిన భాగములనుకూడ జయించి వారల తనయేలుబడిలోనికి తేవలె నని ప్రయత్నించెను గాని అట్లు జరిగియుండలేదు. రాయచూరు ముదిగల్లుదుర్గములు నరసరాజు అవసానకాలమునకు తురుష్కులహస్తగతమై యుండెను. ఈపరిస్థితులలో తనయనంతరము దేశ మెట్లు శాంతియుతముగ నుండునో యను భయము నరసరాజు నావరించుకొనియుండెను. ఇది యట్లుండ తనపుత్రులలో నసూయ కన్పించుచుండెను. తనభార్యలలో నొకరియం దింకొకరికి శత్రుభావ మేర్పడియుండెను. ఈ స్థితిలో నరసరాజునకు నమ్మినబంటగు తిమ్మరసుమంత్రినే కాను నమ్మి రాజ్యభారమునంతను నాతనిసహాయసంపత్తులకే వదలుట యెల్లరకును క్షేమకర మని యెంచి తనయవసానకాలమునకు తిమ్మరసుమంత్రిని తనవద్దకు పిలిపించుకొని తనమువ్వురుపుత్రులను ఆతని కొప్పగించి వారిక్షేమమును సామ్రాజ్యక్షేమమును ఆతనిహస్తగతము చేసియుండెను. అట్లుచేయుచు తనతనయులలో పెద్దవాఁడగు వీరనరసింహరాయుని రాజ్యపాలకునిగా చేయు మనియు చెప్పియుండెను. పుత్రులనందఱిని పిలచి వారికి సకలకార్యసమర్థుఁడైన తిమ్మరసుమంత్రిని చూపి యాతఁడు చెప్పినట్లుచేయు మనియు నట్లు చేసిన తమసౌభాగ్యమును శ్రేయస్సును మిక్కిలి వృద్ధి కాఁగల దనియు చెప్పెను. తదనంతరము 1505-వ సంవత్సరమున కీర్తిశేషుఁడాయెను.

ఒక కథ

నరసరాజు జబ్బుగా నున్నసమయమున తనకుమారులఁ బిల్వనంపి తనవ్రేల నున్నముద్రికాయుంగరమును తీసికొమ్మని పుత్రులకు చెప్పెననియు, వీరనరసింహరాయలు ప్రయత్నించియు చేతకాక సిగ్గుచే నవతలకుఁ బోయె ననియు, నంత కృష్ణదేవరాయలు తత్క్షణమే తనతండ్రియొద్దకుఁబోయి తనచేత నున్నఖడ్గముచే నావ్రేలు నఱికి ముద్రికాయుంగరమును తీసికొనె ననియు నందువలన కృష్ణదేవరాయలే రాజ్యపరిపాలనకర్హుఁ డని నరసరాజు చెప్పె ననియు వాడుకగా కథ నొకదాని చెప్పుదురు గాని యిం దిసుమంతయు నిజములే దని తోఁచుచున్నది. ఇట్లే నరసరాజు చెప్పియుండిన కృష్ణదేవరాయలపక్షపాతి యగు తిమ్మరసుమంత్రి తప్పక కృష్ణదేవరాయలనే రాజ్యాధికారిగా నియమించియుండెడివాఁడు. అట్లుచేయక వీరనరసింహరాయనికే రాజ్యాభిషేకము చేసియున్నందున నీకథయం దెట్టి సత్యమును లే దనియే తోఁచుచున్నది.

వీరనరసింహరాయని పట్టాభిషేకము

నరసరాజు చనిపోవునపుడు వీరనరసింహరాయనికే రాజ్యపరిపాలన మిమ్మని మంత్రితిమ్మరసుతో చెప్పియున్నను వీరనరసింహరాయలకుమాత్రము తిమ్మరసునం దంతగా నమ్మకము జనించియుండలేదు. కాని యెట్టకేలకు తిమ్మరసుమంత్రి కృష్ణదేవరాయలనే రాజ్యపరిపాలకునిగా చేయవలెనని కుతూహలుఁడుగా నుండినను సామ్రాజ్యక్షేమమును తనమనమునం దిడికొని యప్పటిదేశ కాలపరిస్థితుల చక్కఁగా గమనించి తమలో కాము పోరాటములను కల్పించుకొని తమశత్రువులకు కావాసఁ

గక వీరనరసింహరాయలకే 1505-వ సంవత్సరమున జూలై నెలలో పట్టాభిషేకము గావించెను. ఈతఁడు పట్టాభిషిక్తుఁడగునాఁటి కింకను యిమ్మడినరసింహరాజు పెనుగొండయందే యుండియుండె ననుటకు కొన్ని యాధారము లున్నవి. అదియెట్లున్నను సాళువవంశీయులను తోసిరాజని రాజ్యాధికారము వహించి విద్యానగరరాజ్యమున పట్టాభిషేకముకావించుకొన్న తుళువ వంశీయులలో వీరనరసింహరాయలే మొదటివాఁ డని చెప్పవలసియున్నది. ఈతనితండ్రి నరసరాజు తనమరణకాలము వరకును రాజ్యపరిపాలనము చేయుచుండెనేగాని పట్టాభిషేకము కావించికొనియుండలేదు.

దేశమునందలి ఆందోళన

వీరనరసింహరాయఁడు రాజ్యపరిపాలన ప్రారంభింపఁగనే యదివరకుఁ గప్పములు చెల్లించుచున్న ద్రావిడాంధ్ర దేశములలోని రాజులు వీరనరసింహరాయనియధికారము నంగీకరించి కప్పములు కట్టిరిగాని కర్ణాటదేశములోని సామంతరాజులలో కొందఱట్లు చేయుట కిచ్చగింపరైరి. అంత వీరనరసింహరాయని తమ్ములగు నచ్యుతరాయనికి కొంతసేననిచ్చి కొంకణదేశమునకును ఉమ్మత్తూరురాజ్యమునకును పంప నచ్యుతరాయలు కొంకణదేశపురాజు నోడించెను గాని ఉమ్మత్తూరునందు తానే యోడి తిరిగివచ్చెను. అంత తిమ్మరసుమంత్రి వీరనరసింహరాయలను తీర్థయాత్ర లనుపేర దక్షిణదేశమునంతను పర్యటించుటకై పెద్ద సైన్యముతోఁ బంపెను. కృష్ణదేవరాయలను కర్ణాటదేశముపై దిగ్విజయయాత్ర చేయుటకుఁ బంపెను. కృష్ణదేవరాయలును నుమ్మత్తూరుపై దాడివెడలి కోటను ముట్టడించి

మూఁడుమాసములు ఘోరయుద్ధము గావించి దుర్గమును స్వాధీనపరచుకొనియెను. కర్ణాటదేశమునందే పెద్దదైన శివసముద్రదుర్గమును ముట్టడించి దానిచుట్టునుండెడి కొంతమంది పాలెగాండ్రను చేరఁదీసికొని కావేరి కనుమమార్గములలో శత్రువుల నెదుర్కొని శివసముద్రమును ముట్టడించెను. అంత నచట నొకసంవత్సరకాలము ఘోరయుద్ధముజరుగ నాపురాధీశ్వరుఁడీయుద్ధమున నిలువలేక కావేరీనదియందు ప్రాణత్యాగము చేసికొనెను. అంత చుట్టుప్రక్కల నున్న కొన్నికొన్ని గ్రామములను వశపఱచుకొని తుట్టతుదకు కర్ణాటదేశమునంతను తనయాధిపత్యమునకు తెచ్చుకొని కర్ణాటదేశమునకు శ్రీరంగపట్టణమును ముఖ్యపట్టణము గావించి తనధ్వజము నెత్తించి అచటి సామంతరాజులందరును గలసి దాదాపు కోటిరూప్యములను గప్పము కట్టునట్లు రాయలేర్పాటుచేసికొనివచ్చెను.

ఇచట కృష్ణదేవరాయ లిట్లు దిగ్విజయము గాంచుచున్న సమయమున వీరనరసింహరాయలును తీర్థయాత్ర యనుపేర దక్షిణదేశమునంతను పర్యటనము గావించి యవసరమగు చోట్ల కయ్యమునకు దిగి తనశత్రువుల నోడించి తనప్రభుత్వమును స్థిరపఱచుకొని తనరాజ్యమునకు తిరిగివచ్చెను. వీరనరసింహరాయలు వచ్చినకొంతకాలమునకు కృష్ణదేవరాయలును తన పరాక్రమంబును వ్యాపింపఁజేసికొని తానును రాజధానికి తిరిగి వచ్చెను.

ఈయుద్ధము పూర్తియైనపిమ్మట విజయనగరరాజ్యముసరిహద్దున నున్న యూసఫ్ అదిల్ఖాను రాయలమీఁద యుద్ధము ప్రారంభించెను గాని కోవిలకొండవద్ద జరిగినయుద్ధమున హతుఁ

డాయెను. అంతటితో నీతిరుగుబాటు ట్లాగిపోయెను. అదిల్ఖాను చనిపోయినపిదప కమాలుఖానుఁడు రాజ్యము నధిష్ఠించి గుల్బర్గ దేశాధీశుఁడగు నింకొకతురకరాజుపై యుద్ధయాత్ర చేసెను. ఈయుద్ధము పెద్దదై బీదరురాజ్యమే నాశనము చేయఁబడెను. రాజ్యాధిపతియగు మహమ్మదుషా బందీచేయఁబడెను. బీదరువద్దనుండి బిజాపూరువఱకు యుద్ధము ప్రాకెను. అప్పటినుండి బెల్గామునందలి జనులు భయవిభ్రాంతులై రాయలవారి రక్షణఁ వేఁడిరి. రాయలవారును వారికి శరణిచ్చి 1510-వ సంవత్సరము ఆగష్టున బిజాపూరునకు చని అచటనుండి రాచూరును ముట్టడించెను. కమాలుఖానుఁడు తక్షణమే అచటికివచ్చి రాయలవారిని ప్రతిఘటించెను. కాని రాయలవారి నాదేశమునుండి మాత్రము తరిమివేయలేదు. అచటనుండి తన దేశమునకుఁబోయి అచట శత్రువులను దంపి తాను రాజ్యాధిపత్యమును వహింప ప్రయత్నించుచున్న సమయములో నతఁడు హతుఁడాయెను. అంతటితో నీతని యాశాపూరితచరిత్రము తుదముట్టెను. ఇంతలో రాయలవారు రాచూరును ముట్టడించి పట్టుకొనిరి. అచటనుండి గుల్బర్గకుబోయి తురకసైన్యముతో పోరాడి గుల్బర్గను లాగికొనిరి. అంతట బీదరురాజ్యమునకు బోయి అచట బందీగానుండబడిన మహమ్మదుషాను బందీనుండి విముక్తునిఁగావించి బీదరురాజ్యమునకు పట్టాభిషిక్తునిఁ జేసెను. దీనివలననే రాయలవారికి యవనరాజ్యస్థాపనాచార్య యను బిరుదము కలిగెను. రాయలవారు యుద్ధమున జయమునుపొందియు బీదరురాజ్యమునకు తిరిగి మహమ్మదుషాను రాజ్యాభిషిక్తునిఁ జేయుటలో వారు తమయౌదార్యము వెలిబుచ్చుటయే గాక

తమ రాజనీతిశాస్త్రజ్ఞత్వమును ముఖ్యముగఁ బ్రకటించియుండిరి.

ఇట్లు తనతండ్రి సాధింపఁజాలని కార్యములను తాను సాధించినందులకు ప్రసిద్ధబిరుదముల నన్నిటిని తానే వహించి 1509-వ సంవత్సరమధ్యకాలమువరకును వీర నరసింహరాయలు రాజ్యపరిపాలనము చేసెను. నాల్గుసంవత్సరములైనను పూర్తిగాకపూర్వమే వీరనరసింహరాయలు వ్యాధిగ్రస్తుఁడాయెను. అంతకంతకతని వ్యాధియభివృద్ధి కాఁజొచ్చెను. అప్పటికి తనకు అచ్యుతరాయఁడు, సదాశివరాయఁడు తిమ్మరాయఁ డనుమువ్వురు చిన్నపిల్లలుండిరి. ఈమువ్వురు పిల్లలును పసివాండ్రైనందున తనతమ్ముఁడగు కృష్ణదేవరాయలప్రతిమపరాక్రమవంతుఁడై యున్నందున సమర్థుఁడగు తిమ్మరసుమంత్రి కృష్ణదేవరాయని పక్షపాతియైనందునను తనయనంతరము రాజ్యము కృష్ణదేవరాయనికే యర్పితముకాఁగల దని యెంచి యెట్లైనను తనజీవితకాలముననే కృష్ణదేవరాయని రాజ్యానర్హుఁడుగ చేయ నెంచి తిమ్మరసుమంత్రిని పిలువనంపి తనయనంతర మెట్లైనను తనకుమారునికి రాజ్యాభిషేకము చేయక కృష్ణదేవరాయలకే రాజ్యాభిషేకమును తిమ్మరసు చేయించునని పెద్ద భయము తనమనసు నాందోళనపఱచుచున్నదనియు నట్టియుపద్రవము తప్పించుటకు కృష్ణదేవరాయని కన్నుల నూడఁబెరికి తనకుచూపవలెనని కోరెననియు తిమ్మరసుమంత్రి యావిషయమును విని మిక్కిలి యాశ్చర్యమును జెందియు కష్టమని యెంచక తానాకార్యమును జేసెద నని చెప్పిపోయె ననియు,తరువాత తన మందిరమునకుఁబోయి యావిషయమై చక్కఁగనాలోచించి కృష్ణ

దేవరాయనికి కబురంపి యాతనితో నీసంగతినంతయు చెప్పెననియు నంతట రాయలు భ్రమచెంది యొట్టకేలకు తన కీముప్పు వాటిలకుండునట్లు చేయుమని ప్రార్థేయపడె ననియు నందుపై వీరిరువురు నేకీభవించి రాముని తనవద్దనే యుంచుకొని కొనయూపిరితోనున్న వీరనరసింహరాయని కొరకయాడు మేకయొక్క కన్నులు పెఱికించి తీసికొనిపోయి చూపె ననియు నంత వీరనరసింహరాయఁడు తృప్తిచెంది కొద్దికాలమునకే తనజీవితములను వదలిపోయెననియు నొకకథ వాడుకగా చెప్పఁబడుచున్నది. ఇందలి యాథార్థ్యమును తెలిసికొనుటకు తగునాధారము లెక్కువగ లేవు. కాని రాయలకాలపు కథలనన్నిటికిని సమకాలికులగు న్యూనిజు పేయసు అనుచరిత్రకారులే తాము వ్రాసిన చరిత్రలందు వ్రాసియుండిరి. వీటిలోని నిజానిజముల నీనాఁడు వితర్కించుటకు సరియైనయాధారములు కనుపడనందున పాఠకులే యీవిషయనిర్ణయమును చేసికొందురుగాక.

ఇది యిట్లుండ నీసందర్భమున కృష్ణదేవరాయని యాస్థానకవియగు ధూర్జటిమనుమఁడు కుమారధూర్జటితనకృష్ణరాయవిజయమునం దీవిషయమును గూర్చి వ్రాయుచు వీరనరసింహరాయఁడు "సామ్రాజ్యసంపన్నుఁడై యుండి యొక్కనాఁడు" కృష్ణరాయలను పేరి మత్పుత్రరత్నమునకుఁ దనరఁ బట్టంబు గట్టెద ఘనత మీఱ ననుచు నప్పాజితోన మంతనము జేసెననియు నంత "పుత్రా! రమ్ము రమ్మంచు బంగరు డాల్మీఱ మెఱుంగుటుంగరము వేడ్క కృష్ణరాయక్షితీశ్వరు హస్తంబున నుంచె" ననియు వ్రాసియున్నాఁడు. ఇందు కృష్ణరాయఁడు తనకు పుత్రుఁడని వ్రాయఁబడియుండె. ధూర్జటికవి యిట్లు వ్రాయుటలో "పుత్రసముఁడు" అని

యూహించియుండవలెఁగాని మఱియొకటి కాఁజాలదు. కుమారధూర్జటి వ్రాసినయంశము లే నిక్కవము లైనచో మన మిదివరలో వినియున్న కథ నిక్కవము కాఁజాలదు. చరిత్రలో విదేశీయులగు రాయబారులును సమకాలికులునగు వారబద్ధము వ్రాయుటకును కారణము లేదు. అదియునుగాక వారట్టి కేవలమబద్ధములను వ్రాయుటవలన వారి కేమాత్రములాభమును నుండఁజాలదు. ఏదియెట్లున్నను ఇందలి నిజానిజములనుగూర్చి వ్రాయుటకు తగినంతయాధారములు లేవనియే మనము నిర్ధారణచేసికొనవలసియున్నది. కుమారధూర్జటి వ్రాసినయంశములనే బలపఱచుచు కాశీవిశ్వనాథనాయనివారికి వారిస్థానాపతి యీకాలముననే వ్రాసినవిన్నపమునందు నీవిషయమునుగూర్చి వ్రాయుచు, "తాము పెద్దలమైతిమి, తమమర్యాదగా రాజ్యపరిపాలనం జేసేటందుకు పట్టాభిషేకం అధిష్ఠానకర్తలుసేయమని మంచివేళజూచి ముద్దుటుంగర మిచ్చినారు గనుక" అని వ్రాసియుండిరి. దీనినిఁబట్టిచూచినను వీరనరసింహరాయలే కృష్ణరాయనికి బట్టముకట్టుమని తమముద్దుటుంగరము నిచ్చియుండిరని తెలియవచ్చుచున్నది.

5. కృష్ణదేవరాయల పట్టాభిషేకము

సాటిదేశస్థితి

వీరనరసింహరాయలు 1509-వ సంవత్సరమధ్యకాలమున దివంగతుఁడాయెను. ఈనాటికి విజయనగరాజ్యమునందు శాంతి నెలకొల్పఁబడి యుండెను. కాని చుట్టుప్రక్కలనుండెడి రాజ్యములలో నశాంతి హెచ్చుగుచుండెను. ముఖ్యముగ నాఁటికి

భామినీరాజ్యమంతయు విచ్ఛిన్నమై యంతఃకలహము లుద్భవించి బీజపూరు, గోల్కొండ, అహమ్మదునగరము, బీరారు, బీదరు అను నైదుభాగములుగ చీలిపోయెను. అందలి నవాబు లెల్లప్పుడును తమలో తాము ద్వేషించుచు కలహించుచుండిరి. ఇంతకంటె నొత్తరాజులైన గజపతిరాజులవద్దను డీరాజ్యమున కపాయము మెండుగ నుండెను. అప్పటికే గజపతిరాజులు బహమినిరాజ్యములోని తెలింగాణాభాగముద్వారా ముందుకు వచ్చుచుండిరి. అప్పటికప్పుడే సముద్రతీరమున కృష్ణానదినిదాటి కావేరివరకు గజపతిరాజులు సముద్రతీరప్రదేశముల నాక్రమించుకొనిరి. అప్పటికే గజపతిరాజైన పురుషోత్తముఁడు చనిపోయెను. ప్రతాపరుద్రుఁడు రాజ్యమునకు వచ్చెను. ఇంతియే గాక విజయనగరరాజ్యమునందును కొందరు సామంతరాజులలో కలతలుండెను. కంచినగరమువద్దనుండెడి శంబువరాయనుఁడును, ఉమ్మత్తూరునందున్న గంగవంశపురాయాధీశుఁడును సరియైన అదుపులోలేరు. రాయచూరుదుర్గమును గూర్చి కొన్నికలతలు బయలుదేరెను. ఈసందర్భములలో దేశమునం దెల్లెడల నల్లరుల నణఁచి శాంతినెలకొల్పను సరియైన ప్రజ్ఞావంతుఁడును శౌర్యశాలియు రాజనీతిధురీణుఁడును ప్రతిభావంతుఁడునగు రాజ రాజ్యాభిషిక్తుఁడైననేగాని దేశములం దెల్లెడలను శాంతి నెలకొల్పవీలులేదు. అట్టితరుణములో గృహకల్లోలముల కెంతమాత్రమును తావులేదు. వీరనరసింహరాయలకు ముప్వురు కుమారు లుండిరిగాని వారిలో నెవ్వరు నీకార్యభారమును వహింపఁగల్గినవారు కారు. నరసరాజునకు వీరనరసింహరాయఁడు గాక నాగాంబికవలన కృష్ణదేవరాయలును నింకొకభార్యవలన

అచ్యుతరాయలు రంగరాయ లను నిద్దరుపుత్రు లుండిరి. వీరిలో కృష్ణదేవరాయలే పెద్దవాఁడు. అతఁడు తనశౌర్యప్రాక్రమముల నిదివరకే కనుపఱచియుండెను. ఈసమయమున కృష్ణదేవరాయలకన్న రాజ్యభారమును ధరింపఁదగిన వా రెవ్వరును కాన్పింపలేదు. మిక్కిలి ప్రతిభాధుర్యుఁడును రాజనీతిధురంధరుఁడు నగు తిమ్మరసుమంత్రియు కృష్ణరాయపక్షపాతియై యుండెను. ఈ విషయములనన్నిటిని సమాలోచనము జేసి, ప్రత్యక్షముగఁగాని పరోక్షముగఁ గాని యేవిధమైన కష్టమును పోరాటమును లేకుండ వీరనరసింహరాయఁడు మరణించిన కొలఁదికాలమునకే సర్వజ్ఞుండని చెప్పఁదగిన తిమ్మరసుమంత్రి యీవిజయనగర మహాసామ్రాజ్యవైభవమునంతను కృష్ణరాయనిహస్తగతము చేయుటకుద్యుక్తుఁడై తనయభిప్రాయము నెల్లరకుఁ దెలియఁజేసెను. భృత్యపరివారసామంతమంత్రివర్గము తిమ్మరసునభిప్రాయమునం దేకీభవించిరి. సామంతరాజులు నందుల కంగీకరించిరి.

సింహాసనారోహణము

వీరనరసింహరాయలమరణానంతరము 1509 సం॥ ఫిబ్రవరి 4 తేదికి సరియైన శుక్లనామసంవత్సర మాఘశుద్ధచతుర్దశినాఁడు రాయలపట్టాభిషేకమహోత్సవము విజయనగరపట్టణములో జరిగెను. ఈపట్టాభిషేకమహోత్సవమునకు సామంతరాజులందరికి నాహ్వానములు పంపఁబడెను. విజయనగర మెల్లెడల మిక్కిలి హృదయరంజకముగనుండున ట్లలంకరింపఁబడెను. ఈయలంకారమును కుమారధూర్జటి తనగ్రంథమున నీవిధముగ వర్ణించెను.

సీ. ప్రబలింప నతఁడు తోరణగట్టు నరపీఠ
అనురీతి పూర్ణతోరణము లెసఁగ

శిఖల ఖండించి చక్కృవుఁ బత్సలునిల్పి
నట్లు ద్వారములందు నసటు లమర
విలిఖించు నతఁడు దిక్కులజయ స్తంభాళి
ననుమాడ్కి జిత్తర్వహార్వ లలర
వెలయున ట్లతనికీర్తులు దిక్తటులవన్న
నరణి మం త్రైవుమ్రుగ్గ కెగ్గులమర

తే. నభినవాలంకృతిమ్మాత్రి నతిశయింపనప్పురీరత్న మపుడుమహోద్భుతముగ
బ్రకటమహిమల శ్రీకృష్ణరాయనృపతి, శ్రీకరంబై నపట్టాభిషేకవేళ.

పట్టాభిషేకమహోత్సవమునకు మండలాధీశులగు ననేక మహారాజులు కానుకలంపిరి. సామంతరాజు లనేకులు పట్టాభిషేకమును దర్శింప విజయనగరమునకు వచ్చియుండిరి. దళవాయి నాయకులు, కమ్మదొరలు, తుళువదొరలు, నగరవిద్వాంసులు, అవధానులు, పండితులు, జ్యోతిష్కులు మొదలయినవారందరు సభాస్థలి నలంకరించియుండిరి. అట్లు పెద్దలందరు సభనలంకరించియుండ ననేకవిధములగు శంఖకాహళభేరీప్రచండవాద్యతతరవంబులు భూనభోంతరమునిండ శాస్త్రోక్తముగ శుభముహూర్తమునందు కృష్ణరాయలవారికి మంగళస్నానముచేయించి కల్యాణవేదికయందు బంగారుపీఠమున కూర్చుండ నియమించి దశదానములు షోడశమహాదానములును చేయించి చతుస్సముద్రములనుండియు గంగా, యమునా, సరస్వతీ, గోదావరి వగైరా నదులనుండి బంగారుకలశములతో తెప్పించిన సుదకముతో అష్టాదశవాద్యఘోషములు మ్రోయుచుండఁగా సుముహూర్తమందు బ్రాహ్మణులచేత మంత్రోక్తముగ నభిషేకముచేయించి శ్రీరాయలవారికి పట్టాభిషేకమహోత్సవము గావింపఁబడెను.

ఈయుత్సవము నష్టదిగ్గజములలో నొక్కఁడగు కుమారధూర్జటి కవి తనకృష్ణరాయవిజయమునందును స్థానాపతి తనప్రభువగు కాశీవిశ్వనాథనాయనింగారికిపంపిన రాయవాచకమును విన్నపము నందును బహుచక్కఁగ వర్ణించిరి. వారివర్ణనము నీక్రింద పొందుపఱచడమైనది.

కృష్ణరాయవిజయము : రెండవయాశ్వాసము

మ. సరగం దెచ్చిరి భూసురోత్తములు గృష్ణాగోతమీజాహ్నవీ
వరణాపూర్వనుతాకవేరతనయా వారాశిముఖ్యంబువుల్
గరిమం గాంచనరత్నకుంభతతులం గారుణ్యవిశ్వాసత
త్పరులై యంతయు కృష్ణరాయవిభుని ద్రాజ్యాభిషేకార్థమై.

తే. శంఖకాహళభేరీప్రచండవాద్య, తతరవంబులుభూనభోంతరము నిండ
బ్రాహ్మణులుకృష్ణరాయధరావరునకుఁ, జెలఁగిపట్టాభిషేకంబుఁజేసిరెలమి.

సీ. చక్కరవిలుకానిచక్కఁదనముగల్గి చొక్కుమాకార్వటిబుక్కరాజ
పాకల్యముగఁ గీర్తి సర్వదిక్తటులందుఁ బ్రాకటస్థితినిల్పునాతఁడాతఁ
కంటకరాజన్యగౌరవం బణఁగించి లీలచే మించునంతటివాఁడు
ధాటీనిరాఘాటఘోటీహతవిరోధికోటులై వెల్గు వెల్గోటివారు,

తే. చండతరశౌర్యలగుకూరసానివారు
బూదపాటివారు మొదలైనభూమిపతులు
గొలువపట్టాభిషిక్తుఁడై చెలువుమీఱె
రమ్యగుణశాలిఁ శ్రీకృష్ణరాయమౌళి.

రాయవాచకము

"రాము పెద్దలమైతిమి. తమరుమర్యాదగారాజ్యపాలనము చేసేటందుకు పట్టాభిషేకం అధిష్ఠానకర్తలుసేయుమని మంచివేళ

జాచి ముద్గటుంగరం మిచ్చినారుగనుక దండనాయకులు అయ్యమరసు కొండమరసు బాచరసు యెల్లమరసు వీరమరసు అప్పాజి లక్కణదళనాయకులు యెల్లనదళనాయకులు అప్పరశిల్ల మన్నారుపిల్ల రాయసం రామచంద్రయ్య కొక్కసం భాస్కరయ్య అవసరం వెంకయ్య త్రియంబకయ్య లక్ష్మీపతి ప్రధానితిప్పరసు దళవాయిలింగరసు సాళువనారా... కాడు ఆర్వీటిబుక్కరాజు సాళువమేకరాజు శ్రీపతివారు బూదవాల్లివారు నంద్యాలవారు కొటకువారు...తోరగంటివారు రాచూరితిమ్మరాజు సంగరాజు వెలుగొంటివారు... పెదసాని అక్కప్పనాయుడు కమ్మదొరలు కుళువదొరలు మొదలయినవారందరున్ను నగరవిద్వాంసులు చతుర్వేదిరామదీక్షితులు అష్టభాషాకవితకృష్ణావధానులు శాబ్దికం పాండిత్యం వెంకటరామశాస్త్రుల్లు సహస్రావధాని ప్రభాకరశాస్త్రుల్లు జోస్యులు కవీశ్వర్లు మరిన్ని కలిగినపిన్న పెద్దలు అందరున్ను శాస్త్రోక్తముగ శుభముహూర్తమందు కృష్ణరాయలవారికి మంగళస్నానంచేయించి, కళ్యాణవేదికయందు బంగారు పీఠమున కూర్చుండ నియమించి, దశదానములు షోడశమహాదానములున్ను చేయించి స్వర్ణతుల రజితతుల రత్నతులమౌక్తికతుల మెరవులు కోటిగోదానాలు సహస్రకుటుంబప్రతిష్ఠలు మొదలైనదానధర్మములు చేయించి, చతుస్సముద్రములనుంచిన్ని బంగారుకలశములతో వుదకములు తీసికొనిరాగా, గంగా యమునా సరస్వతీ గోదావరి నర్మదా సింధు కావేరి తామ్రపర్ణి మొదలయినమహానదుల వుదకములున్ను అష్టాదశ వాద్యఘోషములున్ను మ్రోయగా, సుముహూర్తమందు బ్రాహ్మలచేత మంత్రోక్తముగ అభిషేకముచేయించి, ఆపిమ్మట కనకాభి

షేకం నవరత్నాభిషేకం చలువలతల్లొత్తి, పీతాంబరం ధరియించి, చందన అగరు కస్తూరి గంధాదులధరియించి, వారలనందరినిన్ని విడిదీలకంపించి, ఆపిమ్మట అల్లుండ్లు కుమాళ్లు బంధుపరిజనులున్ను స్నేహితులను పంక్తిని బెట్టుక ప్రసాపడి, సుగంధజలముల హస్తప్రక్షాళనముచేసి, ఆచమనీయ్యంజేసి గిలుకుపావాలు మెట్టి, సంక్షేపరామాయణము చదువుతాను, శతపదాలు నడిచి, రత్నకంబళిమీద కూర్చుండుకొని, అప్పాజి మొదలైనవార్లనున్ను, దళనాయకులనున్ను ప్రధానులనున్ను పిలువనంపించి వారలతోను కృష్ణరాయలవారు ఆనతిచ్చినది:—

"వీరనరసింహరాయలవారు సింహాసన పరభారకం వహించి నడిపించినదారభ్యం యీవరకుఅచ్యుతరాయలు చంద్రమౌళిన్ని మేమున్ను కూర్చుండక వుంటిమి, యిప్పుడు మమ్మున రాజ్యపరభారకం వహించుచున్నారు గనక సింహాసనస్థులు నడిచేదేరీతు, శత్రువుల జయించేదేరీతు, మిత్రులపోషించేదేరీతు, ఆ ప్రజనులపాలించేదేరీతు, కొలిచినవారిని ఆదరించేదేరీతు, ఆత్మసంరక్షణమున కర్హులయినవారెవ్వరు. అర్ధచింతవుపాయం అర్ధవ్యయం సకలమున్ను తెలిసేదేరీతు, శాశ్వతమైనకీర్తిఖ్యాతులు గలిగేదేరీతు. ఇవి మొదలైన రాజనీతులన్నియు, తాముదెలిసినవారుగదా మాకులెస్సగా తెలియజెప్పవలె నని ఆనతిచ్చినందులకు అప్పాజి అమ్మయరసు కొండమరసు బాచరసు మొదలైనవారు నలుగురున్ను స్వామివారు ఆనతిచ్చినది నీతికార్యమెసరి; సకల నీతులున్ను విచక్షణములున్ను కార్యనిర్వాహములున్ను సామర్థ్యమున్ను మయ్యేది సామాజికులతో ఆలో

చనంజేసి సకలరాజ్యపారములున్న రాయలదేవునితో రాజనీతులు విన్నవింపఁజేసినది."

రాయలవారి పట్టాభిషేకమహోత్సవసందర్భమున హంపీగ్రామమునందలి పంపాపతిదేవాలయమున కొక గోపురమును నొక సభాస్థలియు కట్టించఁబడెను. అచట నొక శాసన మున్నది. ఆశాసనమునందలి తేదీబట్టియే వీరిపట్టాభిషేక మెప్పుడు జరిగినదియు నిర్ధారించుట కాధారమైయున్నది. ఆశాసనమునందు శాలివాహనశకము; 1430 యనియు సంవత్సరము శుక్లనామసంవత్సరమనియు వ్రాయఁబడియున్నవి. శకము, 1430 యైనచో సంవత్సరము విభవయై యుండవలెను. ఈసంవత్సరము శుక్లయైనచో శకము 1431 కావలసియున్నది. ఈ రెండిటియందును కొంతపొరపాటు కాన్పించుచున్నది. మొత్తముమీఁద రాయలపట్టాభిషేకము 1509 లో జరిగియుండె ననుటకే యెక్కువ యాధారములు కనిపించుచున్నవి.

రాయలపట్టాభిషేకమునకు పూర్వము తనతమ్ములవలన నేదియేని భయము కల్గునేమో యను ననుమానముచేత వారి స్వాతంత్ర్యము నాటంకపఱచి తనరాజ్యముననే వారిని బందీలుగా నుంచియుండెను. పట్టాభిషేకానంతరము తిమ్మర సొకనాఁడు రాయలవద్దకుఁజని తమ్ముల నట్టు బంధించి యెల్లకాలము బందీలుగానుంచుట రాజ్యమునకుఁగాని తనకుఁగాని క్షేమకరము గాదనియు వారిని సంరక్షించుటయే రాజధర్మ మనియు వారలను రాజధానియం దుంచకపోయినను రాజ్యములోని కొంతదేశమును వారిపరిపాలనక్రింద నుంచి వారిని జాగ్రత్తగా కనిపెట్టియుండుట మంచి దనియు సలహా నిచ్చినందున రాయలు

నందులకు సమ్మతించి తనసోదరులకు చంద్రగిరివద్ద కొంతదేశము నిచ్చి వారిరక్షణార్థమై కొంతసైన్యమునుంచి వారి నచటికి పంపివేసియుండెను. ఇందులకు రాయలయన్నదమ్ములును జనులును రాయలను మిక్కిలి స్తుతించిరి.

పాతకాగితముల పరీక్ష

రాయలవారు రాజ్యాభిషిక్తులైనప్పటినుండియు అఘటనఘటనాసమర్థుండును, ఘనవాగ్జాలతయు సకలకార్యధురీణత నిరూఢియు నగు తిమ్మరసునే తనప్రధానమంత్రిగా నుంచుకొని అమరేంద్రుఁడు బృహస్పతితో రాజ్యమేలినభంగి, రాజ్యమునందలి ముఖ్యవిషయములన్నిటిని స్వయముగా తెలిసికొనుటకు ప్రయత్నించుచు, రాజ్యపరిపాలన కవసరమగు రాజనీతి నంతను తెలిసికొని రాజ్యముచేయ మొదలుపెట్టెను. ఇట్లు స్వయముగా నన్నివిషయములను కనుఁగొనుటలో తనపూర్వపు రాజులు నిలువయుంచిన కాగితములను పరీక్షింపఁగ విజయనగరాధిపతియగు సాళువనరసింహరాయనిచే నుంచఁబడిన యొక కాగితము తనకు దొరకెను. తాను రాజ్యాధిపతియైనప్పటి నుండియు రాచోలు (రాయచూరు), ముద్గలుకోటలను పట్టుకొనవలెనని ప్రయత్నించెననియు వాటిని పట్టుకొనుటకు తనకు సావకాశము కుదురలేదనియు తన కవసానకాల మాసన్నమైన దనియు నీరాజ్యము నికముందు రాజ్యమేలెడువా రెవరైన నీదేశముల ముట్టడించి వశపఱచుకొనుట మిక్కిలి యవసరమనియు నాకాగితమునందు వ్రాయఁబడియుండెను. అప్పటి నుండియు రాయలకాకోటలనుపట్టుకొనుట ముఖ్యమనితోఁచెను. అందులకై వలయుసామగ్రిని సమకూర్చుట కుద్యుక్తుఁడాయెను.

ప్రథమమున తనరాజ్యమునందు శాంతినెలకొల్పుట యవసరమనియు తదనంతరము తనకు బొక్కసమునందుఁ గలద్రవ్యమును సిబ్బందినిగూర్చి వివరములు తెలిసికొనుటయు ముఖ్యముగ నెంచెను. తనరాష్ట్రమంతయు శాంతియుతముగనున్నదా యనుసందర్భముల సామాదిక్కులనున్న దొరలయొక్కయు మన్నెరికములయొక్కయు నడతలును వారివారికలిమిబలములును పల్లెపట్టణములందు పండితపామరజనులు అనుకొనెడి వార్తలును వారివారిప్రవర్తనలును నడవడికలును కనుగొనుటకుఁగాను కాలివేగముగల్గి బుద్ధివిచక్షణులై బహురూపులుగాను సంచరించి అంతరంగికవార్తలరసివచ్చు చారుల నంపి వార్తలు తెలిసికొనుటకు ప్రయత్నించెను. అట్లు తెచ్చిన వార్తలనుబట్టి తమసామంతదేశములలో సహాంకరించి పరుల త్రోవపోయినవారియొక్కయు పోవనున్నవారియొక్కయు సహాంకారమణఁగించి అట్టివారెల్లరు తమయాజ్ఞానుబద్ధులైయుండునట్లుతగినయేర్పాట్లుచేసి వారినందరను తమ కనువర్తనులఁగ చేసికొనిరి.

రాజనీతివిచక్షణ

ప్రతిదినమును చారులవలన నగరమునందలి సంగతులను తెలిసికొనుచు తాను స్వయముగా రాత్రులయందు నగరమంతయు సంచరించి విషయములతెలిసికొని నగరమునం దవసరములగు కట్టుదిట్టములు చేయుచుండెను.

ఇట్లు తనదేశమునంతను కట్టుదిట్టములుచేయుచు తాను రాజ్యపరిపాలనకై నేర్పుకొనవలసిన సంజయనీతి, విదురనీతి, చాణక్యనీతి, మొదలుగాఁగల గ్రంథములన్నిటిని చదివి తన

బుద్ధికౌశల్యమును వృద్ధిపఱచుకొనుచుండెను. ఇట్లు జరుగుచుండ నొకనాఁడీక్రిందనీతిపద్యమును

క. బలవర్గము సామంతుల, బలమున కగ్గలము గలనృపాలున కొదవుర్
బలిమి పెరనృపతికాజ్ఞా, బలసంపద కంతదవ్వు బద్ద నరేంద్రా.

వీనియందలి యర్థమును మనస్సునకు తెచ్చుకొని యొకనాఁడు సింహాసనారూఢుఁడై యుండ తన కర్నాటరాజ్యమునసుండిన రాజ్యముల యొక్కయు దుర్గములయొక్కయు కోటల యొక్కయు వివరములును భండారమునందు నుండిన ద్రవ్యముయొక్కయు బంగారు మొదలుగాఁగల విలువగలవస్తువులయొక్కయు వివరములను తెల్పులెక్కలను తనకు విశదపఱుపుఁడని తనసంప్రతులకు నాజ్ఞనొసంగెను. అప్పటి యధికారులందరు లెక్కలనుచూపుటకు మర్నాటివరకు కాలవ్యవధినిగోరి మరుసటిరోజున లెక్కలను చూపిరి.

ద్రవ్యవివరము

ఈ లెక్కలనుబట్టి యా రాజ్యమునం దప్పటికుండిన ద్రవ్యముయొక్కయు విలువగలనగలయొక్కయు వివరము లీక్రిందివిధముగ తెలియవచ్చెను. విజయనగరపట్టణముస్థాపించినపుడు విద్యారణ్యులవారు సింహాసనస్థునికి నిక్షేపించినది తొంబదితొమ్మిది కోట్ల యాభైయారులక్షలద్రవ్యమును నాలుగుకోట్లభూషణములును, ఆరుకోట్లనవరత్నములును, నుండెను. ఈద్రవ్యమంతయు పెద్దభాఁడారమం దున్నది. ఇదివరలో నీద్రవ్య మెవ్వరును తాఁకియుండలేదు. ఇదిగాక సింహాసనస్థులు తమ యవసరములకుపోను బొక్కసమునందు నిలువచేసిన పందొమ్మిదికోట్ల యాభైయారులక్షలద్రవ్యమును, కర్ణాటకరాజ్యంబాపతు పది

కోట్లరైన భైనాలుగులక్షలును, దేవాదాయం, బ్రహ్మోదాయం సర్వమాన్యంవగైరాలక్రింద, పదికోట్లును నుండినట్లు లెక్కలు చూపిరి. మరియు అమరనాయకులవద్ద నిరువదినాల్గువేల గుఱ్ఱములున్ను పంద్రెండువందలయేనుగులున్ను రెండులక్షలకాల్బలమున్ను నుండినట్లును తెలిసికొనియుండెను గాని రాయలవారు తనసంస్థానమునందు నగరికై జీతముక్రిందనుండిన యేనుఁగులయొక్కగాని గుఱ్ఱములయొక్కగాని, కాల్బలముయొక్కగాని లెక్కనుజూపనందున నాశ్చర్యపడి ఆ నావిషయమునుగూర్చి ప్రశ్నించినను నెవ్వరును జబాబుచెప్పనందున కోపించినవాఁడై ఆ నారాత్రి నగరుశోధనకు బయలుదేరినట్లు నగరువిడలి పట్నమునకు రెండామడదూరముననున్న యొక్క గుడియందు నిలిచి యచటనే కాల్యకృత్యములను తీర్చుకొని పూజారియిచ్చిననైవేద్య ప్రసాదములు భుజించి యచటనుండెను. తిమ్మరసుమంత్రి యుదయమునలేచివచ్చి రాజును గానక చారుల బంపి రాయలున్న ప్రదేశమును కనుఁగొని రాయలవారు వేఁటకు పోయియుండిరనియు నందుల కవసరముగు గుఱ్ఱములు యేనుఁగులు కాల్బలము మొదలుగాగల యన్నిసోదుములతో తత్క్షణమే రావలయునని యమరనాయకులవద్దకుఁ జనెను. వీరివెంటనే నాయకులు, దొరలు మన్నెరికములు తమతమరౌతులు మవుత్తులు బంట్లుతదితరపరివారములతో సాక్షణమే కదలిపోయిరి. ఈపరివారమునంతను కొంతదూరమున నుంచి తిమ్మరసుమంత్రి యొక్కఁడే రాయలవారివద్దకు ముందుగబోయెను. ఇదియంతయు కనుపెట్టినరాయలవారు పచ్చడముకప్పుకొని నిద్దురబోవువానిరీతిగ పండుకొని యుండెను. కొంతసేపటికి నిద్దురలేచినట్లులేచి చేతులు

కట్టుకొని నిలిచియున్న మంత్రితిమ్మరసును గాంచి యేల వచ్చితిరనిరాయలవారు ప్రశ్నించిరి. అందుపైన జరిగినవృత్తాంతమంతయు రాయలవారికి నివేదించి శ్రీవారు వేఁటకై యాజ్ఞ యిచ్చినట్లు పురమునందెల్లెడల తెలియఁబరచి యమరనాయకులు వగైరాలను తమతమవద్ద నున్నయశ్వములను గజములను బంట్లను సమకూర్చి తీసుకవచ్చితిననియు నాసేనయంతయు బారులుతీరి యనతిదూరముననే యుండెననియుఁ జెప్పెను. తరువాత రాయలవారుచేసినపని రాజ్యాధిపతిచేయవలసినపని కాదనియు వారట్లుచేయుట తగదనియు తమకుఁగాని ఆ మేలుచున్న రాజ్యమునకుఁగాని క్షేమకరము కాదనియు కొంత నచ్చఁజెప్పినపిమ్మట తాము నీతిపద్యములో విన్నట్లు సామంతబలముకన్న నెక్కువయగు స్వంతబలమును సమకూర్చినచో తాను తిరిగి నగరిలోనికివచ్చెదనని చెప్పినంతలో అఘటనఘటనాసమర్థుండగు తిమ్మరసు కైజీతం, గుఱ్ఱములు, యేనుఁగులబంట్లు మొదలైన వాటిని సమకూర్చుట తాక్షణముననే యేర్పాటుచేసి చతురంగబలసమేతులై పట్టణమునకు తిరిగివచ్చిరి. ఇదియే రాయలవారు స్వంతసైనికదళము యుద్ధసన్నాహమునకై గావించిన ప్రథమసంస్కరణ. ఇదివరలో రాజధానియందు రాజులకు స్వంతసైనికదళము లెవ్వియు నుండెడివి కావు. రాజులు యుద్ధమునకు బయల్వెడలవలెనన్న తమసామంతులవద్దనుండి గ్రహింపఁబడినసైనికబలముతో యుద్ధముచేసెడివారు. అందువలననే తమలెక్కలయందు స్వంతబలముయొక్కఖర్చు లెవ్వియును కాన్పించియుండలేదు. ఈసంస్కరణవలన రాయలవారికి కైజీతం, గుఱ్ఱములు, యేనుఁగులు మొదలయిన చతురంగబల

యేర్పడినది. దీనివలన వీరు ముస్ముందు దిగ్విజయయాత్ర లవలీలగ జఱుపుటకు వీలుకలిగెను.

సైనికదళములను వృద్ధి చేయుట

సైనికదళములను వృద్ధిచేయుటకై రాయలవారు చాల యోచనలుచేసియుండిరి. రానున్న యుద్ధములకు గుఱ్ఱపుదళములు ఏనుఁగుదళములు ముఖ్యమని తెలిసికొని గుఱ్ఱములకును యేనుఁగులకును పోట్లాటనేర్పుటకు తగుశ్రద్ధవహించిరి. దీనిక్రింద రాయలవారు ఖజానానుంచి చాలద్రవ్యమును ఖర్చుపెట్టిరి. వారిసభలో నుండెడి ప్రతినాయకునకు నొకగుఱ్ఱమునిచ్చి యాగుఱ్ఱమునకగు నెలసరిఖర్చును నిచ్చి యానాయకునిచేత యుద్ధమున కవసరమగు నన్నియాటల నాగుఱ్ఱమునకు నేర్పుభారము నుంచిరి. ఇట్లుచేయుటవలన గుఱ్ఱములకు మంచికసరతు నేర్పబడెను. ఇట్టిగుఱ్ఱములు యుద్ధములో మిక్కిలి యుపయోగించెడివి. గుఱ్ఱపుదళ మీరీతిగ వృద్ధి చేయఁబడినది. ఇట్లే యేనుఁగులును వృద్ధిచేయఁబడెను. ఆనాఁడు యుద్ధమునకుఁ బోవునపుడు గుఱ్ఱము లెట్లలంకరింపఁబడెడివో తెలుసుకొనవలెనన్న సంస్థానకవులలో నొకఁడగు అల్లసాని పెద్దన తనమనుచరిత్రమునందు స్వారోచి వేఁటకుఁబోవునపుడు సిద్ధముచేయఁబడిన గుఱ్ఱముయొక్క వర్ణనను చదివిన మనము తెలిసికొనవచ్చును. ఆకవి మనుచరిత్రమందు నాల్గవయాశ్వాసమున నీవిధముగ గుఱ్ఱమును వర్ణించియుండెను.

సీ. కచ్చనిఱారుముంజె పనివాగపక్కెరపారసి పల్లంబు పట్టమయము
దాల నొప్పారు పైతాణంబుసింగిణికబుకంబునోరుల కిరకగంబు

మిహిరసింధిపరుంజా మొహరా కెంబులావు గజ్జరిసేత కేవడంబు
డాకెంబునసిరాజికరామరకత్తి కటుంగట గ్రైవ్యాడిగొరకలపాది
కీలితంచెకలాటంబు శేరజంబు, మణుల మొగముట్టుకన్న సాహిణి యొకండు
కర్త యుదుటికిగొనివచ్చె గంధవాహ, బాంధవంబగు నొకమహాసైంధవంబు.

ఈవర్ణనను బట్టి సాయుధంబైన హయం బెట్లుండునో తెలియనగును. ఆగుఱ్ఱమునకు మామూలుగా నుండెడి కళ్లెము (వాగె) దానిని కప్పుటకొకకాంత (పక్కెర) టంగవారు (పట్టెమయము) నుండెను. ఇవిగాక పైతాణమును దేశమునకుఁ జెందిన ధనుస్సు (సింగిణి) క్రూరములైనబాణములుకల అంబులపొది (లకోరులతరకసంబు) బంగారుతోచేసిన పిడిగలయుద్ధకత్తి (పసిండిపరూజు మొహరా) ఆకత్తికి పార్శ్వప్రదేశమున కేవడంబు. దానికి నెడమపార్శ్వమున సిరాజిదేశపుచిన్నకత్తి దానికి సమీపమున యినుపబాణములగల యొకపొది (గొలుకలపొది) మొదలైన నీయాయుధములతో నలంకరింపఁబడినది. మరియు తలకొక్క యాకలతురాయి రాళ్లతోచెక్కిన ముఖపటము నా గుఱ్ఱమున కలంకారములు. ఇట్టిగుఱ్ఱములు అనేకములు తన గుఱ్ఱపుదళమునందు రాయలు తయారుచేసి పెట్టుకొనెను. ఇట్లు వృద్ధిచేసికొనఁగ రాయలవారికి మొత్తముసైన్యబలము ఈవిధముగ నుండియుండెను.

కైజీతంసైన్యము :—

గుఱ్ఱములు	12000
ఏనుగులు	500
కాల్బలము	300000

అమరనాయకులసైన్యము :—

గుఱ్ఱములు	24000
ఏనుగులు	1200
కాల్బలము	500000

మొత్తము :—

గుఱ్ఱములు	36000
ఏనుగులు	1700
కాల్బలము	800000

ఈప్రకారముగ వృద్ధిచేయఁబడినకాల్బల మాకాలమున భామినీరాజ్యములందలి మహమ్మదీయరాష్ట్రముల కాల్బలమంతటికన్న హెచ్చుగనుండెను. మహమ్మదీయులకు మాత్రము గుఱ్ఱపుబలము కర్నాటరాజ్యమునందుకన్న హెచ్చుగ నుండెను. కాల్బలము హెచ్చుగనున్న రాజ్యాధీశులను నరపతులనియు, గుఱ్ఱపుబలము హెచ్చుగనున్న రాజ్యాధీశులనశ్వపతులనియు, ఏనుఁగుబలము హెచ్చుగనున్న రాజ్యాధీశులను గజపతులనియు, పిలిచెడిమామూలు కలదు. ఆప్రకారము కర్నాటరాజ్యాధీశులు నరపతులనియు మహమ్మదీయరాజ్యస్థు లశ్వపతులనియు వోరిస్సారాజ్యాధిపతులు గజపతులనియు పిలువఁబడెడివారు. కర్ణాటకరాజగు రాయలు యుద్ధమున కశ్వములను మిక్కిలి యవసరమని తెలుసుకొని తానును యశ్వబలమును హెచ్చుచేయుటకు ప్రయత్నించుచుండెను.

పోర్చుగీసువారు హిందూదేశమునకు వచ్చుట

దాదాపుగ నీకాలముననే పోర్చుగీసువారికి హిందూదేశమునుగురించి చూచాయగ కొన్నిసంగతులు తెలియవచ్చి,

యీదేశము మిక్కిలి ధనవంతమైనదనియు, నాదేశముతో వ్యాపారముచేయుటవలన చాలలాభముండుననియు తెలిసికొని తమదేశస్థుల నీహిందూదేశమునకు పంపవలయుననెడియూహ వారికిఁగల్గెను. అప్పుడు రాజ్యమేలుచున్న పోర్చుగల్లునధిపతి యగు జానురాజుహిందూదేశముయొక్క సౌభాగ్యస్థితినిగూర్చి నిజమైనసంగతులను తెలిసికొనివచ్చుటకు మూఁడుపెద్దనావలను కోరియుండెను. అయితే జానురాజుకు మరణము సంభవించెను. వారియనంతరము రాజ్యాధిపత్యమువహించిన డాన్మానూయలను రాజు వాస్కోడిగామాయను గొప్పనావికుని యాధిపత్యమున మూఁడుపెద్దయోడలను హిందూదేశపు స్థితిగతులు కనుగొనివచ్చుటకై 1497-వ సంవత్సరమునఁ బంపెను. వారుకొంతకాలము దారితెలియక దక్షిణాఫ్రికా చివరనున్న గుడ్‌హోపు అగ్రమునుచుట్టి 1498-వ సంవత్సరము ఆగష్టునెలకు హిందూదేశమునందలి పశ్చిమభాగముననున్న కల్లికోటరేవును చేరుకొనిరి. ప్రథమములో కల్లికోటరాజుకును డిగామాగారికిని కొంత స్నేహముపొడమెను గాని వ్యాపారసంబంధములు వృద్ధిచేసుకొనునంత వీలుకలిగియుండలేదు. ఇంతలో డిగామా తనదేశమునకు తిరిగివచ్చెను. వెన్స్యేంటసే కబాలు అను నింకొకపోర్చుగీసునాయకుఁ డీప్రాంతమునకే వచ్చెనుగాని కొందరు పోర్చుగీసు వారిపశ్చిమ హిందూదేశమున నివాసముగానుండుటకు నేర్పాట్లు కలుగఁజేసుకొనుటకు వీలుకలిగెనేగాని వ్యాపారము వృద్ధిపొందలేదు. మీఁదు మిక్కిలి కొన్నివిరోధములు జనియించెను. వీరితరువాత తిరిగి డిగామాగారు 1504-వ సంవత్సరమున నిండియాకు వచ్చి యీభాగమునందున్నవారితో

లేనిపోనికయ్యములు పెట్టుకొని కొంతజననాశనము గావించిరి. అయితే కొచ్చిన్దేశమునమాత్రము తమఫ్యాక్టరీ నొకదానిని స్థాపింపగల్గిరి. ఈతనియకృత్యములవలన కొచ్చిదేశస్థులకును కల్లికోటవారికిని కొంతమనస్పర్థ లేర్పడినవి. డిగామాతరువాత 1506-న లోపోసాలెసను వారు పెద్దసైన్యముతో వచ్చి కొచ్చికోటను ముట్టడించిరి. ఇంతలో పోర్చుగల్ రాజు యాల్మిడాయనువారిని ఈపశ్చిమ హిందూదేశమునకు వైస్రాయిగా నేర్పాటుచేసిపంపెను. అల్మిడాగారు వచ్చినంతనే యీదేశస్థులతో లేనిపోని కయ్యములఁబెట్టుకొనుట తమవ్యాపారవృద్ధిదేశములకు నష్టమని తెలుసుకొని యిచటివారితో తగవులుమానివేసిరి. అప్పుడే విజయనగరసంస్థానము బాల్యవృద్ధిలోనున్నదని తెలిసికొని నచటి నరసరాజుతో సంప్రతించి భట్కలువద్ద నొకకోటను కట్టుకొనుట కనుజ్ఞనీయుమని కోరియుండెను. కాని నరసరా జందుల కంగీకరించియుండలేదు. ఆనాటికి గోవారేవు బీజపూరుసుల్తానగు నదిల్షాహయాధిపత్యమున నబేయేయను వారిపరిపాలనక్రింద నుండియుండెను. నబేయేకును విజయనగరరాజులకునుసారోజులలో తకరారు లుండెను. ఇట్లెచ్చట చూచినను దేశమంతట నొకరితోనొకరు తగవులాడుకొనుచుండిరి. ఆల్మిడా యీతగవులలో తాను జోక్యము కలుగచేసుకొన తలచుకొనకున్నను తాను కాలికట్టురాజుతో పోరాడవలసివచ్చెను. ఇందుకు ఫలితముగ మరుసంవత్సరమున తాము కన్ననూరునగరమున కట్టుకొనినకోట ముట్టడింపఁబడెను. కాని తమదేశమునుండివచ్చిన సైనికబలముచేత తమకోటను పోర్చుగీసువారు నిలుపుకొనిరి.

ఈస్థితిలో పోర్చుగలుదేశమునుండి అల్ఫాన్సో డి అల్బుకర్కును వారిభాగమునకు గవర్నరులుగా నియమింపఁబడి యిచటికివచ్చియుండిరి. ఈసమయమునకే రాయలును రాజ్యమునకు వచ్చెను.

అల్బుకర్కు గవర్నరుపదవి స్వీకరించునాటికి కల్లికోటరాజుతో పోర్చుగీసువారు కయ్యమున నోడియుండిరి. అంతనీయాల్బుకర్కు విజయనగరాధీశ్వరుఁడగుకృష్ణరాయలకు సహాయముకొఱకు రాయబారిని పంపెను. అట్లు పంపుచు తమరాజువద్దనుండి హిందూరాజులకు సహాయముచేయు మనియు తనకు ముగ్గురు (తురక) రాజులతో యుద్ధముచేయు మని యుత్తర్వులున్న వనియు అందువలన కల్లికోటరాజుతో యుద్ధముచేయుటకు తనకు సహాయముచేయుమనియు కబురుపంపెను. మరియు కల్లికోటలోను తురకలు నశించినచో దక్కనునెడి దేశములోనున్న తురకరాజ్యములతో విజయనగరరాజులు పోరాడుటకు తాము సహాయముచేయుదుమనియు అరేబియాపర్షియా దేశములనుండి గుఱ్ఱములను తాము పంపుదు మనియుకూడ హెచ్చరించిరి. ఇందుకు కృష్ణరాయ లేవిధమైనజబాబును పంపియుండలేదు. ఇంతలో అల్బుకర్కు గోవారేవుపై దండెత్తిపోయి యచటితురకల నోడఁగొట్టి యారేవును తాను 1570 డిసెంబరునాటి కాక్రమించుకొనెను. ఇందుపైన కృష్ణరాయ లాల్బుకర్కును మిక్కిలి పొగడుచు తాను పోర్చుగీసువారికి సహాయముచేయుదునని రాయబారిని పంపెను. ఇట్లె బిజాపురాధీశుడును పోర్చుగీసువారి మైత్రిని కోరుచు రాయబారిని పంపెను. రాయ లాల్బుకర్కునకు సహాయముచేసెనో లేదో మనము చెప్పఁజాలముగాని యాల్బుకర్కుమాత్రము అరబ్బీదేశమునుండియు పర్షియాదేశము

నుండియు మంచియశ్వముల సంభృత కంగీకరించి యట్లే పంపించి యుండెను. రాయలవారికిని పోర్చుగీసువారికిని జరిగినరాయబారములవలన రాయలవారియశ్వదళము మిక్కిలి వృద్ధిచేయఁబడెను. ఈయశ్వములను తుళువరౌతులయొక్కయు కబ్బలిరౌతులయొక్కయు సాధీనముచేసి తనయశ్వబలములు వృద్ధిచేసికొనెను.

6. ద క్షి ణ దిగ్వి జ య యా త్ర

రాయలవారు సింహాసనమునకు వచ్చిన శీఘ్రకాలముననే తమబాహాబలపరాక్రమమువీరారివర్గమునకుతీవ్రదావానలంబుచేసి గొప్పప్రసిద్ధిఁగాంచిరి. తాము రాజ్యాధిరూఢులైన నాలుగేండ్లకే తగినసైన్యమునుగూర్చుకొని దక్షిణదేశమునందలి ప్రబలినకొన్నికొన్నియల్లరుల నణచుటకు బయలు వెడలవలసి వచ్చెను.

పూర్వము తొండమండలరాజ్యము సాంబువరాయనుల వద్దనుండి కుమారకంపన్న చేత లాగుకొనఁబడెను. అప్పటినుండి నీసాంబువరాయనులు కంచియను కాంచీపురమువద్దనే యుండిరి. రాయలురాజ్యమునకు వచ్చినపిదప వీరలలో కొందరు కాంచీపురప్రాంతములనుండి కొంతయల్లరిని బైలుదీసిరి. దీని నణంచుట రాయలవారి ముఖ్యకర్తవ్యమై యుండెను. అందువలన దక్షిణదేశమునందు బయలుదేరిన యల్లరుల నణంచుటలో నీ కార్యమే రాయలవారి ప్రథమకార్యముగా పరిగణింపనగును. రాయలవారు విజయనగరమునుండి బయలువెడలి యీకాంచీపురమునకు వచ్చి యచటియల్లరి నణంచి కాంచీపురప్రాంతముల నన్నిటిని తమయాజ్ఞయందుండునట్లేర్పరచిరి.

— శివసముద్రము —

కర్ణాటకరాజ్యములోని కావేరీతీరమున శివసముద్రమను కోట యొకటి యుండెను. ఈరాజ్యమున గంగరాజు రాజ్యమేలుచుండెను. ఈదేశపురాజులు విజయనగరరాజులకు కప్పము కట్టెడు నాచారము కలవారు. గంగరాజు శివసముద్రకోటను సురక్షితముగ చేసికొని, విజయనగరసంస్థానమునకుఁ గప్పముకట్టుటకు నిష్టములేక పరిసరరాజుల కొందరిసహాయసానుభూతుల సంపాదించి సన్మార్గము నతిక్రమించి క్రొత్తగా రాజ్యాభిషిక్తులైన కృష్ణరాయలకు వ్యతిరేకముగ ప్రవర్తించుచుండెను. రాయలవా రీవిషయమునుగూర్చి తమచారులవలన తెలిసికొని గంగరాజును దుర్మార్గపథమునుండి తొలగించి సన్మార్గమునకుఁ ద్రిప్పఁగోరి యొకదూతను వారివద్దకు బంపిరికాని గంగరాజు మదోన్మత్తుఁడై యాదూత చెప్పినవిషయముల నంగీకరింపక వానిని పరిభవించి యాతఁడు వచ్చినదారినే పొమ్మనెను. అందుపైన రాయలవారు కోపోద్దీపితులై యీగంగరాజు మదమడంప చతురంగబలసమేతులై యచటికి బయల్వెడలిరి. అతనిపై యుద్ధమునకుఁబోవుచు గంగరాజువైరియగు శ్రీరంగపట్టణపురాజైన చిక్కరాజు సహాయముగొని శివసముద్రపుకోటను ముట్టడించి యాకోటను తమవశముచేసికొనిరి. ఈకోట రాయలవశమైనంత గంగరాజు తనయోటమిని సహింపఁజాలక కావేరీనదీప్రవాహమునఁబడి తనజీవితము నంతము చేసికొనెను. ఇచటనుండి రాయలవారు ఉమ్మత్తూరునకుం జని యచటి వ్యవహారముల చక్కఁబెట్టుకొని యాచుట్టుపట్లనుండు చిన్న చిన్న నాయకులతో సంప్రతించి తమయాధిపత్యము నాయాదేశములస్థిరముగా స్థాపిం

చుకొనిరి. చిక్కరాజును, రాయలను చక్రవర్తిగా నంగీకరించి తననగరమున రాయలప్రతాప మెల్లరకు విశదము కాఁగలందులకై కృష్ణదేవరాయలధ్వజము నాతనిపట్టణమగు శ్రీరంగపట్టణమందు నెత్తించెను. శ్రీరంగపట్టణముననుండి రాయలవారు రంగనాయకులదేవాలయమునకుం జని యచటిస్వామిని సేవించియుండిరి. అటుతరువాత యిక్కేరియరంగానకు వచ్చి యచటి పక్కలనాయకుణ్ణి నాయుడుమూకలను గాంచి వారిలో నవిశ్వాసులైన మూకలను పారదోలి మిగిలినవారి ప్రభుభక్తి సరియైనదిగా నుండుటను చూచుకొని అచటి దేశమంతటను శాంతి నెలకొల్పిరి.

ఇచటినుండి దక్షిణముననున్న కూర్గు మళయాళము మొదలుగాగలదేశములకుం జని యచటను తమవిజయభేరిని మ్రోగించి తమయాధిపత్యమును స్థాపించుకొనిరి. అటుపిమ్మట విజయప్ప వెంకటప్ప యనుసేనాధిపతులకు నపారసైన్య మిచ్చి పాండ్య, చోళ, చేరదేశపురాజులను స్వాధీనపఱచుకొనుటకు వారిని పంపిరి విజయప్పనాయఁడు చిత్తూరుతొండమండలము జింజిచోళమండలపుపాలెగాండ్రను వశముచేసికొని వారు వారియవలసినకప్పములను నిర్ధారణచేసికొని వేలూరు ముఖ్యస్థానముగ నేర్పరచుకొని రాయలవారికై పన్నుల రాబట్టుచుండెను. ఈప్రకారముగనే యితరపాళెములును వారు వారీయవలసిన కప్పములను సక్రమముగ నిచ్చునట్లొడంబడికలనేర్పాటు చేసికొనిరి. ఈప్రాంతదేశములయం దంతటను జనులు కృష్ణదేవరాయలయందు భక్తివిశ్వాసములు గల్గినవారే యెక్కువగా నుండి యెక్కడనో యొక్కచోట కొన్నిరహస్యపుటాలో

చన లుండుటచేత రాయలవారికి హెచ్చుగ యుద్ధముచేయవలసిన యవసరము గాన్పించియుండలేదు. వీరిసన్నాహమును జూచినంతనే రహస్యపుటాలోచనలుచేయుచున్నవారును నిస్సహాయులై తొందరగనే లొంగిపోయి తమతమభక్తివిశ్వాసములను సహృదయులై నిష్కాపట్యముతో బయలుపర్చియుండిరి.

దేశవిభజనము

ఈప్రకారము విజయయాత్ర జరిపి రాయలవారియాధీనము కాఁబడిన దక్షిణదేశమునంతను మూఁడుభాగములుగ విభజించి నెల్లూరు మొదలు కొల్లడంవరకు నుండు దేశమునకు కృష్ణప్పనాయకుఁ డనువానిని కొల్లడం మొదలు తంజావూరు వరకును విజయరాఘవనాయకుఁ డనువానిని తంజావూరునకు దక్షిణముందుండు దేశమునకు వెంకప్పనాయకుఁ డనువానిని పాలకులనుగా నియమించెను. దక్షిణమున కన్యాకుమారివఱకు నుండు దేశమంతయు నీప్రకారము రాయలస్వాధీనమునం దుండెను. దక్షిణమున నీకృష్ణదేవరాయలు జయించి స్వాధీనము చేసికొనని దేశ మేదియు నున్నట్లు కనుపించదు.

పైనచెప్పినరీతిని దక్షిణదేశమునంతను విజయభేరిని మ్రోగించి, కొద్దికాలమునకే తిరిగి తమరాజధానియగు విజయనగరమునకు కృష్ణరాయలు ద్విగుణీకృతయశస్సుతో మిక్కిలి వైభవముతోఁ జేరుకొనిరి.

7. పూర్వదిగ్విజయయాత్ర 1513_1517

దక్షిణదేశదిగ్విజయయాత్ర ముగిసినంతనే రాయలవారు ఒరిస్సాదేశపు గజపతి రాజులపై కన్నువేసెను. ఆనాటికి గజపతి

రాజు మహాబలవంతుఁడుగా నుండెను. గజపతి దేశము గొప్పదై యుండెను. వారిరాజ్యము నెల్లూరునందలి యుదయగిరివరకు వ్యాపించియుండెను. గజపతిరాజులసంపద సామాన్యమైనది కాదు. అట్టిమహారాజు కర్ణాటరాజ్యపరిసరప్రాంతమున నుండుట కర్ణాటరాజ్యమునకు క్షేమకరము కాఁజాలదు. కాన నట్టిస్థితిలో రాజనీతిని చక్కఁగ తెలిసికొనిన రాయల కారాజ్యముపైన కన్నుపడుటలో నాశ్చర్య మేమియును లేదు. అప్పటికి తనరాజ్యమునం దెల్లెడలను శాంతినెలకొల్పఁబడెను. తనదేశమునందలి జనసామాన్యమంతయు కొరతలులేక సంతుష్టులై యుండిరి. సామంతరాజు లెల్లరును భక్తివిశ్వాసపూరితులై యుండిరి. ఈసమయము దిగ్విజయయాత్రకు మిక్కిలి శుభసూచకపూరితమై యుండెను. అట్టిసమయమున శ్రీకృష్ణరాయ లీవిషయమునుగూర్చి తనమంత్రిపుంగవుండగు తిమ్మరసుమంత్రితో సంప్రతింప నతఁడు నందుల కియ్యకొనెను. వీరుభయులును తదితరమంత్రివర్గముతో నాలోచించి తిమ్మరసునే యాదండయాత్రకు సేనాధ్యక్షునిగా చేసి నగరాధ్యక్షత్వమును తిమ్మరసుమంత్రి సోదరుఁడగు గోవిందామాత్యునియం దుంచి మంచిముహూర్తమున చతురంగబలసమేతులై సైనికుల శంఖారావముతో గజఘంటానాదముతో వందిమాగధులకైవారముతో రాజపురోహితుల వేదఘోషముతో స్వస్తివాచనములతో యుద్రేకపూరితములగు నుత్సాహవాక్యములతో దిగ్విజయయాత్రకు బయల్వెడలిరి. రాయల వెంట వారిరాణులును వారియాస్థానకవులు పండితులు, రాజపురోహితులు, వైష్ణవస్వామియగు తాతాచార్యాది గురువులు ననేక బ్రాహ్మణులును అనుగమించి పోయిరి.

ఉదయగిరికోట

ఇట్లు 1513 వ సంవత్సరమున రాయలు దండయాత్రకు బయల్వెడలెనని యుదయగిరిని పరిపాలించుచున్న ప్రతాపరుద్రగజపతియొక్క పినతండ్రియగు తిరుమలకాంతారాయఁడు తెలిసికొన్నవాఁడై దుర్గములో సైన్యమును చేర్చుకొని, వలయు తినుబండారములనుసమకూర్చుకొని, కోటనుసంరక్షించుకొనుచు నుండెను. ఆనాటికోటలలో నీయుదయగిరికోట మిక్కిలి దుర్భేద్యమైనదై యుండెను. ఈకోటలోనికి పోవుటకు మార్గము దుర్గమమైనది. లోనికిఁ బోవుట కొకచిన్న త్రోవదక్క మరియొక మార్గము లేదు. ఇది నెల్లూరుమండలములో నున్నది. ఈకోట శత్రురాజుల కభేద్యమై సురక్షితముగనుండెను. ఈకోటలోని వారి నోడింపవలయు నన్న లోనుండువారికి వలయు నాహార పదార్థముల నందకుండునట్లుచేయుటయే ముఖ్యపద్ధతియై యున్నది. ఈకోటను ముట్టడించి కృష్ణదేవరాయలును రాయసం కొండమరుసయ్యయు సేనాధ్యక్షులుగనుండి యనేకమార్గముల పదునెనిమిదిమాసము లహోరాత్రములు కోటను పరిపరివిధముల పోరాటము గావించియు కోటలోనికి ప్రవేశింపఁజాలరైరి. ఈకోట కొండలమధ్యనుండుటచే చుట్టునుండుకొండలను బగులఁగొట్టించినను లాభము లేకుండెను. ఇట్లెన్నియుపాయములను దీని భేదించుమార్గము గానమి విసువుచెందియున్నతరి దైవవశమున రాయలవారిచేఁ గనుఁగొనఁబడి కొండవెనుకనుండిన యొకమార్గమున కోటలోనికి సునాయాసముగఁ జనిరి. అట్లు చని లోననుండు శత్రుభటుల నెదుర్కొని వారలను సంహరించి దుర్గమును వశపఱచుకొని యచటనున్న దుర్గాధీశుని పినతండ్రిని

మేనత్తను చెఱఁబెట్టి వారిని బందీలుగ విజయనగరమునకుఁ బంపిరి. వీరవిజయమును పురస్కరించుకొని ఉదయగిరియందు స్థానికముగ నున్న కోనవల్లభరాయఁడను దేవునకు అచటికిఖల్లను గ్రామమును బహూకరించి శ్రీరాయలవారు ఏకశాసనమును వ్రాయించిరి. ఈశాసనమునుబట్టి శాలివాహనశకము 1436-వ భావనామ సంవత్సర జ్యేష్ఠబహుళవిదియనాఁ డీదాన మీయఁబడినట్లు కనఁబడుచున్నది. ఇది సరియగు 1514-వ సంవత్సరమగును. దీనినిబట్టి ఉదయగిరికోట ముట్టడి 1513-వ సంవత్సర ప్రారంభములో మొదలుపెట్టఁబడియుండవచ్చునని తోఁచుచున్నది. ఈయుదయగిరిదుర్గమును వశపఱచుకొన్న తరువాత నీగజపతిసైన్యము మెల్ల మెల్లగనుత్తరమునకు పోసాగెను. ఒరిస్సా దేశమునకు నీయుదయగిరికోట ముట్టడింపఁబడి రాయలవశమయ్యెనని తెలిసిన పిదప నచట నుండి కొంతసైన్యమును తగినసైన్యాధిపతులయాధిపత్యమున రాయలసైన్యమునడ్డుకొనుటకు పంపఁబడెను. ఈయుభయసైన్యములును ప్రప్రథమమున కందుకూరువద్ద ఢీకొనఁగా కోటముట్టడింపఁబడెను. ఇచటనుండి తనరాజధానికిమరలుచు తిరుపతివేంకటేశ్వరదేవాలయమునకు తమభార్యలతో జని వేంకటేశ్వరుని పూజించి రాయలవారు ముప్పదివేలవరహాలు ఖర్చుచేసి కనకాభిషేకముగావించిరి. దేవునిగుడిలో ప్రతిదినము దేవునికి నైవేద్యము పెట్టుటకు తాళ్లపాకయనుగ్రామమును దానముగనిచ్చినటుల నొక శాసనము కలదు. ఈశాసనము 6-7-1514 తేదీగలదియైయున్నది. రాజ్యాభిషిక్తుడైన తరువాత శ్రీరాయలు తిరుపతివేంకటేశ్వరస్వామిని దర్శించుట యిదినాల్గవమారు. రాయలభార్యలగు చిన్నమాదేవి తిరుమలాదేవియును ప్రత్యేకప్రత్యేకముగ బంగారు

కాసులపేరుల నిచ్చి తమపేర నిత్యనివేదనము జరుగుటకై గుడియారను గ్రామము నొకరును పిరాటికలత్తూరను గ్రామము నింకొకరును దానముగా నిచ్చియుండిరి.

ఉదయగిరికోటను ముట్టడించి స్వాధీనపఱచుకొన్నపుడే యచట తన కాకోటలోదొరకిన బాలకృష్ణుని విగ్రహము నొకదానిని తనవెంట తీసికొనివచ్చి యావిగ్రహమును భావనామసంవత్సర ఫాల్గుణమాసమున హంపీగ్రామమున నొక పెద్దదేవాలయమును కట్టించి యచట నాబాలకృష్ణుని విగ్రహమును ప్రతిష్ఠింపించెను. దీని కాధారముగా నచట నొకశాసనము చెక్కఁబడియున్నది. ఈదేవాలయ మిపుడు శిథిలమై యున్నను నచటనుండు దేవాలయములలో మిక్కిలి గొప్పదేవాలయముగ నూహించుటకు తగినయాధారము లిప్పటికిని కనుఁగొననగును. ఆకాలముననే రాయలవారచటి కనతిదూరములో హజారరామస్వామిదేవాలయము నొకదానినికట్టించిరి.

ఉదయగిరివిజయము దేశమునం దెల్లెడల నల్లుకొనియెనో లేదో దీనికి వెనువెంటనే కృష్ణరాయలు తిరిగి పయనమై తనయుత్తరదిగ్విజయయాత్రను పూర్తిచేసికొనుటకై చతురంగబలసమేతుఁడై జనుచుఁ ద్రోవలో నున్న కనిగిరికోటపై దండువిడిసెను. ఇచటికోటను ముట్టడించి స్వాధీనపఱచుకొనినపిదప గజపతిరాజ్యాధిపత్యమున పరిపాలించుచున్న వీరరుద్రగజపతిని జయించి యాతని సకుటుంబపరివారముగ వింధ్యపర్వతము వరకు పారఁద్రోలెను. ఈకోటను ముట్టడించుటకు కారణముగ జను లొకకథను చెప్పుదురు. ఆకథ నిజమనుట కెట్టియాధారములును కనుపింపవు. అయిన నాకథ నిందు పొందుపఱచు

చున్నాను. వీరరుద్రగజపతికి యొకముద్దులకుమారికె చిన్నాదేవి యను నామె యుండె ననియు నామెను రాయలువివాహమాడఁదలఁచి వీరరుద్రగజపతిని కోరియుండెననియు వీరరుద్రగజపతి యందుల కంగీకరించియుండలే దనియు నాకసిచేత నీకోటను ముట్టడించి గజపతికుమార్తెను బలవంతముగ వివాహమాడె ననియు చెప్పుదురు. ఇందు కాధారము లెవ్వియును లేవు. ఆనాటిచరిత్రకారులు కాని కవులు గాని యెవరును నీవిషయమును గూర్చి వ్రాసియుండలేదు. అప్పటికే అనఁగా నీముట్టడి జరుగునాటికే చిన్నాదేవి కృష్ణదేవరాయలకు పట్టపుదేవిగా నున్నట్లు గట్టియాధారము లున్నవి. రాయలవారు పట్టాభిషిక్తులైన కొలఁదిదినములకే తాము తమపట్టపుమహిషులతోపాటు తిరుపతివెంకటేశ్వరదేవాలయమునకు జని దేవునిసందర్శించినట్లును నచట రాయలవారు దేవుని కొకనవరత్నఖచితమైన కిరీటమును బహూకరించినట్లును అందుతోపాటు కర్పూరహారతి నిచ్చుటకు నిరువదియైదు వెండిపళ్లెరములనుకూడ నిచ్చినట్లును రాయలభార్యలగు చిన్నాదేవియు తిరుమలాదేవియు కూడ దేవునికి పాలుత్రాఁగుటకు బంగారుగిన్నెలబహూకరించినట్లును నొకశాసనము 1513 వ సంవత్సరమున అనఁగా ఆంగీరస నామసంవత్సరమున తెనుగుకన్నడము మొదలయిన యనేక భాషలందు వ్రాయఁబడియుండెను. దీనినిబట్టిచూడ పైకథ కెంతమాత్రమును ఆధారములేదనియే చెప్పనగును.

కందుకూరు దుర్గమువశమైనంతనే రాయలసేన ముందుకు జనుచుండ గజపతిసైన్యములు మెల్లమెల్లగ వెనుకకు తగ్గుచుండెను.

ఆనాటికి అద్దంకి దుర్గము వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడు కేతవరము, కొండవీడు దుర్గములు గజపతి రాజ్యమునకు చెందినవై యున్నవి. ఈదుర్గములన్నిటికి కొండవీడు ముఖ్యస్థానమై యుండెను, ఈకొండవీడు 1454-వ సంవత్సరమున నొరిస్సా గజపతిరాజుల క్రిందకువచ్చెను. అప్పటినుండి గజపతిరాజులస్వాధీనమునందే యుండెను. కందుకూరిదుర్గమున నుండి పారఁద్రోలఁబడిన గజపతిసైన్యమునకు నుత్తరమునుండి కొందఱు సామంతరాజులు సహాయమురాగా రాయలసైన్యమునకును గజపతిసైన్యమునకు కొంతకాల మచ్చటచ్చట పోరాటములు జరుగుచుండ గజపతిసైన్యములను దఱుముకొనుచు రాయలసైన్యము వరుసగ అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, తంగేడు, కేతవరము మొదలైనదుర్గములను వశపఱచుకొనెను, ఇట్లు తరుమఁబడిన గజపతిసైన్యము కొండవీడుదుర్గమునకుపోయి యచట కొంత విశ్రాంతితీసికొనెను. శ్రీరాయలవారు మంత్రితో సంప్రతించి జయించినప్రాంతములకు తగినంతరక్షణ కట్టుదిట్టముల నేర్పాటుచేసి విశ్వాసపాత్రులగు నధికారుల స్వాధీనమునం దాయాప్రాంతములరక్షణనుంచి రాయలవారు తమరాజధానికి తిరిగివచ్చిరి.

తమరాజధానియందు కొన్నాళ్లుండి యచటనుండి తిరిగి రాయలవారు కొండవీటిని ముట్టడించి గజపతిరాజ్యమును తుద ముట్టింప నుద్యుక్తులై దండువెడలిరి. ఈకొండవీడుదుర్గ మిదివరలో వ్రాయఁబడినట్లు గుంటూరుజిల్లాలోనున్నది. ఈదుర్గము చుట్టుప్రక్కలనుండు అనేకచిన్నదుర్గములకు ముఖ్యస్థానమై యుండెను. ఇచటి దుర్గములలో నీదుర్గమునకుఁగల బలమసాధా

కొండవీడు

రణమైనది. ఈదుర్గముచుట్టు ననేకసేనానులు తమసేనలతో పరసేనలకుఁ జొరనీయక కాపుండిరి. అందువలన కొండవీటిదుర్గము భేద్యమై యుండెను. రాయలవారు కొండవీటిపై దండువెడలిరనెడువార్త చెవిసోఁకఁగానే ఓఢ్రదేశపురాజగు ప్రతాపరుద్రమహారాజు రుద్రప్రతాపుఁడై యరిభీకరంబులగు చతురంగబలములతో కొండవీటిరక్షణకై సరభసంబున బయలువెడలి వచ్చెను. అటువచ్చుటలో పదమూడువందల యేనుంగులదళమును నిరువదివేలగుఱ్ఱపుదళము నైదులక్షలకాల్బలము తన వెంటతీసికొని రాచూరుమల్లాఖానుఁడు, ఉద్దండఖానుఁడు, పూసపాటిరాచిరాజు, శ్రీనాథరాజు, జన్యాములకనవాపాత్రుఁడు, పశ్చిమబాలచంద్రమహాపాత్రుఁడు మొదలైన యనేకనాయకులతో కలసివచ్చి కృష్ణానదియుత్తరపువైపున దిగియుండెను. ఈ వార్తవినినంతనె రాయలవారు ప్రధానమంత్రియగు తిమ్మరసుతో సంప్రతించి వారిసలహా ననుసరించి కొండవీటిముట్టడిని సాలువ తిమ్మరసుమంత్రికే వదలివైచి తాము భార్యాసహితులై యావంతయు భీతిచెందక తమసైన్యముతో శత్రురాజులతోను వారి సైన్యముతోను తాము స్వంతముగ యుద్ధముచేయ నుంకించి బయలుదేరి కృష్ణవేణీతటమున దండువిడిసిరి. ఇద్దరి తమస్థలముల నేర్పాటుచేసికొని యద్దరినుండియున్న గజపతిరాజగు ప్రతాపరుద్రగజపతితో తాము స్వంతముగా యుద్ధముచేయుట కుద్యుక్తులైయున్నట్లు గజపతిరాజుకూడ నియ్యకొన్నచో వారు నియమించినస్థలమున వారికిచ్చవచ్చినసమయమున యుద్ధము చేయఁగలమనియు వార్తను గజపతిరాజునకుఁ బంపిరి. అందులకు గజ

పతిరా జేలాటిజవాబునుపంపక యుద్ధసన్నద్ధుఁడాయెను. శత్రురాజుయొక్క నిర్ధారణను గమనించినవాఁడై రాయలుఏనుఁగుల గుఱ్ఱములతోకూడుకొన్న తనసైన్యముతో కృష్ణవేణీనదిని దాఁట నారంభించెను. వీరు కృష్ణానదిదాఁటకపూర్వమే శత్రురాజులతో యుద్ధము ప్రారంభింపఁబడి కృష్ణవేణీనదియందే ఘోరయుద్ధము సాగెను. ఈయుద్ధమునం దిరుపార్శ్వముల వారికిని నష్టముకల్గి యనేకులుహతులైరి. ఎట్టకేలకు రాయలవారతిఘోరముగను గొప్పయుక్తితోను సాధించి కృష్ణను దాఁటి యవతలియొడ్డుననున్న శత్రురాజులసైన్యమును కదనంబున నతిభీకరంబుగ నెదుర్కొని యుద్ధమున నోడించి ప్రతాపరుద్రునిసైన్యముల నచటినుండి తరిమివైచి జయలక్ష్మిని చేపట్టెను. ఈయుద్ధమునందు శత్రురాజులచే వదలిపెట్టఁబడిన యనేకములైన యేనుఁగులును గుఱ్ఱములును వీరిచేతికిచిక్కెను. మఱియు లెక్కకుమీఱినధనమును రాయలవారివశమాయెను.

ఇచట యుద్ధములో జయలక్ష్మిని చేపట్టినవెనుక తిరిగి రాయలవారు కొండవీడువద్దకువచ్చి యిదివరకే సాలువతిమ్మరుసు మంత్రిచే ముట్టడిచేయఁబడిన కొండవీటిదుర్గమును సాధించుటకై తిమ్మరసునకు సహాయముగవచ్చెను. ఇచట యుద్ధమున తిమ్మరసు సేనానాయకుఁడై యద్వితీయశౌర్యమును ప్రకటించెను. కొండవీటియందుండు దుర్గనాయకులును దుర్గాధ్యక్షులు నతిశౌర్యముతో యుద్ధముచేయసాగిరి. ఇట్లిరుకక్షలవారును దాదాపు రెండుమాసములు హోరాహోరిగా యుద్ధముచేసిరి. చిట్టచివరకు కోటనురక్షించుటకై చుట్టుకట్టబడిన యెత్తైనగోడలను దాటుటకు రాతితోను నొకపెద్దచట్టమును కట్టి యాచ

ట్టము వలన నాగోడలనుదాటి కోటలోనికి రాయలసైన్యము పోవుటకు మార్గ మేర్పరచుకొనెను. ఈమార్గ మేర్పడినం తనే సైన్యము కోటలోనికి సులభముగ పోఁజాలెను. అంత కొండవీటికోట సాలువతిమ్మర సధిపతిగనున్న సైన్యము నకు శాలివాహనశకము 1437-వ సంవత్సరమున ఆషాఢ శుద్ధయేకాదశికి సరియైన 1615-వ సంవత్సరమున జూనునెల 23-వ తేదీన స్వాధీనమయినట్లు కొండవీటివద్దనున్న యొకశాస నమువలన తెలియుచున్నది. ఆశాసనమం దీవిధముగ వ్రాయఁబడి యుండెను.

సాళువాంకశకవత్సరగణ్యాషాఢశుద్ధహరి వాసరవారా,
సాళువతిమ్మసచివేనగృహీతం కొండవీటినగరంనగరాజమ్.

ఇట్లాదుర్గమునుస్వాధీనపరచుకొని ఆకోటలోనుండెడి వీర భద్రగజపతిని తదితరనాయకులను చెఱఁగొని బందీలుగఁజేయఁ బడిన వారినందరను విజయనగరమునకు పంపివైచెను. ఇంత టితో కృష్ణానదికి దక్షిణభాగమున గజపతిరాజుల ప్రభుత్వము తుదముట్టెను కొండవీడుదుర్గరక్షణమునకై యప్పటికి తిమ్మరసు మంత్రినే నియమించి రాయలవా రా తరువాతభార్యలతో మహాపుణ్యక్షేత్రములసేవించుటకు కృష్ణానదీతీరముననున్న ధరణి కోట యమరావతిగ్రామములకుం జని యచట కానుబంగా రముతో తులాభారముతూఁగి కొండవీటియుద్ధములో తన సేనానులుచూపిన ధైర్యసాహసములకు తగినపారితోషికముల నిచ్చి వారినందరను సంతోషపెట్టి యా తులాభారబంగా రమును తగుఁరీతిని పంచిపెట్టి తనభార్యలగు చిన్నాదేవి తిరు మలాదేవులచేత ననేకధర్మములు చేయించిరి.

ఇచటనుండి 1551-వ సంవత్సరమున అక్టోబరు 25-వ తేదీన తిరిగి తిరుపతి వేంకటేశ్వరస్వామినిసందర్శించి యచట దేవునికి తగురీతిని కానుకల నిచ్చి యచట తనదండ యాత్రనుగూర్చిన వివరములను విశదీకరించుచు కొన్ని శాసన ములు వ్రాయించెను. ఇచట నాసమయమున వ్రాయింపఁబడిన శాసనములలో రాయలు "పూర్వదక్షిణపశ్చిమసముద్రా ధీశ్వరుఁ"డనియు "యవనరాయస్థాపనాచార్యుఁ" డనియు మొదలుగాఁగల బిరుదాంకితుఁడుగ సంబోధింపఁబడెను. పైన వ్రాయఁబడినబిరుదులలో మొదటిబిరుద మిప్పటికిన్ని మైసూరు మహారాజునకు దర్బారులలో వాడఁబడుచున్నది.

తిరుపతి వేంకటేశ్వరుని సేవించుట

తిరుపతినుండి తమస్వస్థానమునకుఁబోయి యచటినుండి తిరిగి కొండవీడున కుత్తరమున నున్న యితరగజపతిరాజులదుర్గ ములను స్థానములనుబట్టుకొనునుద్దేశముతో పోవుచుఁద్రోవలో కర్నూలుజిల్లాలోని యహోబలక్షేత్రమును యువసంవత్సర పుష్యమాసమున సందర్శించి యచటిదేవాలయములోని విగ్ర హముల కనేకబంగారునగలను బహూకరించి యిచటినుండి కృష్ణానదీతీరమునకుఁ బోయి యచట బెజవాడలో కొలదికాల ముండెను. ఆసమయమున శివాలయమునకు దానములిచ్చి యచటకొన్ని శాసనముల నుంచెను. ఇచట నున్న సమయముననే చుట్టుపట్టుగ్రామము లనేకములకు భాగ్యవంతుఁడై పోయి యుండెను. ఇచటనుండి కటకరాజులగు గజపతిరాజుల దేశము నకుపోవుటకు ముందు కొండపల్లిదుర్గ ముండెను.

కొండపల్లి ముట్టడి

ఈకొండపల్లిదుర్గము రెడ్డిరాజులకాలములో మిక్కిలి దృఢతరముగఁ గట్టియుండిరి. రెడ్డిరాజు లంతరించినపిదప నీ దుర్గము గజపతిరాజులచేతఁ బడియెను. ఈకొండపల్లిదుర్గ మును బట్టుకొనుటకై రాయలు ముందంజవేయుచుండెను. ఆకాలమున వీరభద్రగజపతి యీకొండపల్లిని పాలించు చుండెను; ఈదుర్గము గజపతిరాజులకు మిక్కిలి ముఖ్యస్థానమై యుండెను. అచట గజపతిరాజుల ముఖ్యసేనాను లందరును కూడియుండిరి. ఈదుర్గమును స్వాధీనపరచుకొనుటకు కృష్ణదేవ రాయలు ముట్టడించి దాదాపు మూఁడునెలలు హోరాహోరిగ యుద్ధముగావించియుండిరి. చివరకు రాయలవారు తమసైన్య బలముచే నీదుర్గమును స్వాధీనపరచుకొనిరి. ఈదుర్గమునగజపతి రాజులముఖ్యసైన్యాధిపతులు, రాజకుటుంబమువారు, రాజు గారిభార్య వారికుమారుఁడు నుండిరి. వీరినందరను యుద్ధానంతర మున బందీలుగపట్టుకొని విజయనగరమునకు తీసికొని పోయిరి.

దండయాత్ర ముందుకుసాగించుట – తిమ్మరసు వల పన్నుట

కొండపల్లిదుర్గము నాక్రమించి యచటివారిని బందీలు చేసి వారిని విజయనగరమునకుఁ బంపినపిదప మిక్కిలి యుత్సా హపూరితులై తాము ప్రారంభించిన దండయాత్రల జయపరం పరలచే మిక్కిలి గర్వించినవారై, తిమ్మరసుమంత్రి వల దని చెప్పినను వినక గజపతిరాజులనివాసపట్టణ మైనకటకమును పట్టుకొనవలెనని సంకల్పించెను. ఈయూహ సరియైనది కాదనియు తాము తమరాజధానినగరమునువదలి యదివరకే చాలకాల మైనదనియు గజపతిరాజులసైన్యము వారి రాజధానియందు

చాలహెచ్చుగనుండుననియు, తమరు విజయనగరమునుండి తమసైన్యమును సమకూర్చితెచ్చుకొనుట మిక్కిలి కష్టమనియు నెన్నివిధముల చెప్పినను తిమ్మరసు విన్నవించినను రాయలవారు వినరైరి. అంత తిమ్మరసు భయసంశయాన్వితుండయ్యు చేయునది లేక తనకెంతమాత్రమిష్టములేనివాఁడయ్యు రాయలయాజ్ఞను శిరసావహించి యుద్ధభేరి మ్రోయించి గజపతిం గెలుచుటకై ముం దుకు నడువవలసివచ్చెను. త్రోవయంతటను గజపతిసైన్యముతో యుద్ధముచేయవలసివచ్చెను. ఇట్లు యుద్ధము చేయుచు గజపతి సైన్యములను దఱుముచు జమ్మిలోయ కొటాము మొదలగు కృష్ణాగోదావరి మధ్యస్థములైనప్రదేశముల జయించి వేగిదేశపు రాజధానియగు రాజమహేంద్రవరమునురాయలవారిసైన్యము ముట్టడించెను. రాజమహేంద్రవరమున నున్న గజపతిసైన్య ముల నోడించి యానగరమునుకూడ రాయలవారు వశపరచు కొని యచ్చటనుండి గజపతిసైన్యమును వెనుకకుఁ బారఁద్రోలుచు నచటనుండి బయలుదేరి రహితాపురము మొదలగుకొన్ని మన్యస్థానముల లోఁబరచుకొని యటనుండి కొంతదూరముచని బాహుబలేంద్రుని వంశస్థులకు కొంతకాలము ముఖ్యపట్టణ ముగనుండిన పొట్నూరు గ్రామమును జయించి తమయప్రతి మమైనశౌర్యమును విక్రమమును ప్రకటించుటకై నా పొట్నూరు గ్రామమున నొకజయస్తంభమును స్థాపించి యచట నుండి విశాఖపట్టణమునందలి మధ్యస్థానమయిన మాడు గోలును వశపఱచుకొని మత్స్యవంశస్థుల ముఖ్యపట్టణ మగు ఒడ్డాదిని మసిచేసిరి. అంతట సింహాచలమునకుఁ జని యచట భార్యాసమేతులై రాయలవారు నరసింహస్వామిని

దర్శించి యాగ్రామమున నొకజయ స్తంభమును స్థాపించిరి. అచటి నరసింహస్వామి కనకాభరణములును మాన్యములును సమర్పించి కొన్ని దినము లచటనే చతురంగబలసమేతుఁడై పరభయంకర వైభవమును ప్రకటించుచు సింహాచలక్షేత్రమున నుండెను.

విజయనగరపార్థివుని శౌర్యానిలములను తప్పించుకొని పాఱిపోయిన గజపతిరాజులసైన్యములు తమప్రభువునకు రాయలబలంబునుగూర్చియు యేనుంగులగుంపును గూర్చియు, సుందరమైన తురంగసంగములఁగూర్చియు విపులముగా చెప్పియుండిరి. అంతట గజపతిరాజును తనమంత్రులను ప్రతాపవంతులగు పదునార్గురుపాత్రసామంతులనుకూడి దండువిడిసిన రాయలబలమునుగూర్చియు దా మెదుర్కొనవలసిన విధమును గూర్చియు మంతనముచేసియుండిరి. ఈసమావేశమునకు వచ్చిన బలభద్రపాత్రుఁడు, దుర్గాపాత్రుఁడు, భీమపాత్రుఁడు, ముకుందపాత్రుఁడు, భీకరపాత్రుఁడు, భైరవపాత్రుఁడు, రణరంగపాత్రుఁడు, ఖడ్గాపాత్రుఁడు, ఆఖండలపాత్రుఁడు, మురారిపాత్రుఁడు, వజ్రముష్టిపాత్రుఁడు, తురగరేవంతపాత్రుఁడు, గజాంకుశపాత్రుఁడు, అసహాయపాత్రుఁడు, మృగేంద్రపాత్రుఁడు, అశనీపాత్రుఁడు అను పదనార్గురుపాత్రసామంతులున్ను రణరంగోత్సాహ విభవరంజితమతులై గంభీరఫణితిని సభవారలెల్ల సెబాసన శత్రునృపాలసంఘములను తొలంగఁజేతు మనియు, తగవచ్చిన కర్ణాటులబారదోలి వారికొక్కస భాండారములను యేనుగుగుఱ్ఱాలను పెండటిదొరలను హస్తగతముచేసుకొని వచ్చి రాజుగారిముందుంచెద మనియు, యుద్ధరంగమందు

కేటారుతునకలుగా నరికెద మనియు మదహస్తుల తొండములతో కూడ కొమ్ములఖండించెద మనియు చెరుకుల నరికినట్లు కాల్బలమును వారి చేతులఖడ్గములను ఖండించెద మనియు మొదలుగాఁగల సాహసపరాక్రమములను గడు వేడుకతోఁ బల్కినందున జగన్నాథస్వామిపై భారముపేసి గజపతిరాజు రణసముత్సాహమనస్కుఁడై కృష్ణరాయునితో యుద్ధముచేయుటకు సన్నాహం దయ్యెను. ఈవిషయమును ఆద్యంతములు రాయలవారి స్థానాపతియగు కమలనాథయ్య వ్రాసి వేగర్లచేత లేఖపంపినందున విషయములన్నిటిని సమగ్రముగ విన్నవారై వైరిబలమును గూర్చి తెలిసికొన్నవారై తనమంత్రియగు యప్పాజిపల్కులు వినక వచ్చినందునగదా నిట్టిచిక్కులు వచ్చెనని తలంచి యెట్టకేలకు నీచిక్కునుండి బయల్పడు యుక్తికొఱకు తిరిగి తిమ్మరసు మంత్రితో రహస్యముగా నాలోచనచేయుటకై వారిగుడారమున కారాత్రివెళ్లి వారిమాట చెవినిపెట్టక యింతదూరము వచ్చినందులకుఁ గలుగఁబోవునపాయమునకు తగ్గయుపాయమాలోచించవలసినదని రాయలవారు తిమ్మరసుమంత్రిని కోరియుండిరి. మంత్రియు కమలానాథయ్యవద్దనుండి వచ్చినలేఖను పరికించి గజపతివారుచేసిన యాలోచనవలన తమకు ప్రాణహానిన్ని మానభంగమున్ను సంభవించు నని గట్టిగా తెలుసుకొన్నవాఁడై రాయలతో సామదానభేద దండోపాయములలో నిట్టియుపాయములను తప్పించుకొనుటకు భేదదానములు కర్తవ్యములనియు దండసాధనకృతులసాధ్యములు కానిశత్రువులు దానము వలన సాత్త్వికులగుదురనియు, దానము శత్రువుల మిత్రుల జేయుననియు మిత్రుల భృత్యులను జేయుననియు అయాసదుర్గ

ధంబగు కార్యము భేదోపాయమున ననాయాసముగ ఘటించ వచ్చుననియు చెప్పి యుపాయమున భేదోపాయముచేత తమ యత్నమును జయింపగల్గుదుమనియు నందులకు ననర్ఘ్యములైన భూషణములను బహుళము వెచ్చపెట్టి కార్యమును సాధించవలయు ననియు చెప్పిరి. అందులకు రాయలవారు సమ్మతించి వారి కొక్క సభాండారములను తిమ్మరసుమంత్రి యాధీనముచేసి రాము తిరిగి తమ గుడారమునకుపోయిరి. తరువాత తమ కాప్తులగు అయ్యమరసు కొండమరసు రాయసంపీరమరసు అవసర లక్ష్మీపతులతో నాలోచనచేసి గజపతిరాజుకును వారి పదునార్గురు సామంతపాత్రులకును భేదము కల్పించుట కొకఘనతరయుక్తి పన్ని యా పదునార్గురపాత్రుల పేరిట పదునారుత్తరములు వ్రాయించి యుత్తరములతో పదునారు పెట్టెలలో సాభరణములను, వస్త్రముల నుంచి వీటిని భటులకిచ్చి పదునారుత్తరములను పెట్టెలతోసహా పదునారుపాత్రులకును బంపియుండిరి. ఈయుత్తరమున వ్రాయబడినయంశము లిట్లుండెనని ధూర్జటికవి తన కృష్ణరాయవిజయమున నీక్రిందిపద్యమున పొందుపరచి యుండెను.

సీ. శ్రీమత్కర్ణాటసింహాసనాధ్యక్షుండగు కృష్ణరాయధరాధినాథు
డలవదారుపురపాత్రులకు సంప్రీతిబంపిన సులేఖంబులు, మిమ్మునమ్మి
గజపతిరాష్ట్రదుర్గ విశేషములనుండి మెలపుగా బలికిన వలుకుబడుల
తీరు వ్రాసితిరి మీకోరినట్లనె ధనా భరణదుకూలముల్ బంపినార
మట్లనె రేపు జగడాని కరుగుదెంచి
నట్లు చనుదెంచి మాచేతి కతని మీరు
పట్టియిచ్చిన యపుడె మీవట్ల నేము
కొదువపడకుండ నడిపించుకొనెద మెపుడు.

ఇట్టిజాబులను పదునారింటిని వ్రాసి పదునారు పెట్టెలలోనుంచి యా పెట్టెల పదునార్గురు పరిచారకులశిరస్సులపై నుంచి శత్రుసైన్యములలోనికిబోయి పాత్రసామంతుల కప్పగించి ప్రత్యుత్తరముల తెండని యాజ్ఞాపించెను. ఈపరిచారకులు శత్రుసైన్యమధ్యమునుండి పోవుచుండుట చూచి గజపతిరాజా వారలనుబట్టి తెప్పించి యా పెట్టెలను తెరచి యందుండు నుత్తరములను జూచుకొని సామంతపాత్రులందరును పెద్దకుట్ర చేసిరనియు, తమ్మును రాయల కొప్పగింతురనియు తలంచి రాజద్రోహము జరిగెనని గ్రహించి విభ్రమునొంది భయోత్పాదితుండై నమ్మినవారిచే మోసముజరిగెనని వేసరిల్లి రాయలధాటికి నిల్వనేరనని నిశ్చయించుకొని గజపతి త్వరితగతి స్వాదేశమునువదలి యతిదూరముగ నారాత్రియె వెడలిపోయెను. మఱునాడుదయముననే పదునార్గురు పాత్రసామంతరాజులు తమసైన్యములతో నచటికివచ్చి జరిగినవిషయములను తెలిసికొని యాశ్చర్యనిమగ్నులై విభ్రాంతినొంది చేయునదిలేక నిరుత్సాహులై రాజాజ్ఞ లేనిదే యుద్ధముచేయుట కిచ్చగించక వచ్చినదారినే తమతమ స్వస్థలములను చేరుకొనిరి. ఇదియంతయు కనిపెట్టిన రాయనృపేంద్రుడు త్రైలోక్యసామ్రాజ్య మబ్బినట్లు చతురంగబలసమేతుండై తత్పురంబు ప్రవేశించి యచట నొకజయస్తంభమును స్థాపించి ముందుకు జనక యచటనే తనసైన్యముతో నిలిచెను. తాము తమప్రతాపమును ప్రకటించుటకుమాత్రమే వచ్చితిమనియు రాజ్యకాంక్షచేత వచ్చియుండలేదనియు, తాము వచ్చినపని పూర్తియైనందున ముందుకు సాగిరామనియు గజపతి వారిరాజ్యమునంతయు వారికే వదలి వెళ్లెద మనియు చెంద

లయినవిషయములను తెలియఁజేయుచు కృష్ణదేవరాయలవారు గజపతిరాజు కొకయుత్తరము వ్రాసి వారికి నమ్మకమైనబంటుచే నంపియుండిరి. అందుపైన, గజపతిరాజును మొదట కొంత యనుమానించియు తుదకు సంశయమువదలి కొన్నికానుకలు గైకొని రాయలవద్దకు వచ్చెను. అట్లువచ్చినగజపతికి రాయ లెదురేగి గౌరవముగ కౌఁగిలించుచు నెనరున గారవించి యుచితరీతిని సన్మానించి గజపతివారికి ననేకబహుమానసన్మానములను గావించిరి. అందులకు గజపతిరాజును తమకుమార్తె యగు జగన్మోహినిని పత్నిగాగైకొమ్మనివేడగా రాయలవా రందుల కంగీకరించి యామెనువివాహమాడిరి. వివాహసమయమున తనకుమార్తెకు కృష్ణానదికి దక్షిణభాగముననుండెడి తమ దేశమునంతయు ప్రతాపరుద్రగజపతి కానుకగా నొసంగెను. అప్పాజిమంత్రికిని తదితరమంత్రిసముదాయమునకును తగిన సత్కారము చేయబడెను. అచటనుండి తిరిగి ముగ్గురుభార్యలతో కూడుకొన్నవాఁడై రాజమహేంద్రవరమునకు వచ్చి యచట గోదావరిపవిత్రక్షేత్రమున కొన్ని మహాదానములనుగావించి యచటనుండి విజయనగరము చేరుకొని వెంటనే యలమేలుమంగాసహా తిరుపతివెంకటేశ్వరస్వామిని సందర్శించుటకై భార్యాసమేతుఁడై తిరుపతికిపోయెను. అచట వెంకటేశ్వరస్వామికి నవరత్నఖచితమగు నొకబంగారుగొలుసు నిచ్చి దేవునిపైనుండి యున్న యానందనిలయ మను విమానమునకు బంగారుపూత పూయించుటకు ముప్పదివేలవరహాలను దానమిచ్చినట్లును మరి యనేక ఇతరదానములను చేసినట్లును నాదేవస్థానమందున్న దానపత్రములవలన తెలియుచున్నది. ఈదానపత్రములయందు

ఈపైనవ్రాయబడిన కళింగదేశదిగ్విజయయాత్రలోనిముఖ్యాంశములు వివరింపబడియున్నవి. దానపత్రములనుబట్టి యీదిగ్విజయయాత్ర 1517-వ సంవత్సరము 2-వ జనవరికి పూర్తియై యుండవచ్చు నని తెలియనగును. ఈసమయముననే కొండపైన స్వామివారియాలయము లోపలికివెళ్లు కవాటమార్గము వద్ద కృష్ణదేవరాయలయొక్క రాతివిగ్రహమును నావిగ్రహమున కిరువైపుల తిరుమలాదేవి చిన్నాదేవివిగ్రహములను చెక్కించి స్థాపించియుండిరి. ఈవిగ్రహము లిప్పటికిని చూడనగును. ఇచటనుండి దక్షిణదేశమునందలి పుణ్యక్షేత్రముల నన్నిటిని సందర్శించుచు కన్యాకుమారియగ్రమువరకునుపోయి యచటనుండి రామేశ్వరయాత్ర పూర్తిచేసికొని తిరిగి గోకర్ణపర్వతమును జుట్టి యచట బృహదంబాసమేతముగ, గోకర్ణేశ్వరునిసేవించి సుముహూర్తమున విద్యానగరప్రవేశమై విఠల విరూపాక్షులకు కానుకలనిచ్చి సుఖంబుగ తమరాజధానియందు విద్యావ్యాసంగమున కాలముపుచ్చుచు లోకపూజ్యముగ రాజ్యమేలెను.

ఉత్తరదిగ్విజయయాత్ర ముగించినపిదప కొంతకాలమునకు రాయలవారు దక్షిణఆర్కాటుజిల్లాలో నుండియున్న కాటూరుగ్రామాధిపతిపైన యుద్ధముచేయుటకు సన్నాహము జరిగెను. ఈకాటూరధిపతికిని విజయనగరరాజులకును సుమా రప్పటికినేబదిసంవత్సరముల క్రిందనుండియు తగవులుగ నుండెను. వారిగర్వము నడంచుట కిదియే తరుణ మని రాయలవారు సైన్యమును తయారుచేసికొని యుద్ధమునకై బయలు వెడలిరి. ఈకాటూరునగరముచుట్టు నొక పెద్దకాలువ

యుండెను. ఈయుద్ధము వర్షాకాలమునం దారంభించియుండుటచే నాకాలువలో చాలలోతుగ నీరుండెను. అందువలన సరాసరి కోటనుముట్టడించుటకు రాయలసేనలకు వీలు కల్గియుండలేదు. అద్దాన నీటిని కాలువనుండి బయటికి వెళ్లగొట్టుటకై కాలువనుండి కొన్నిపిల్లకాల్వలను త్రవ్వించి యానీటిని వెలికి పార్చి కోటను ముట్టడించి కోటను సంరక్షించుచున్న లక్ష కాల్బలముతోను మూడువేలయశ్వబలముతోను మిక్కిలి పరాక్రమముతో బోరాడి కోటను పట్టుకొనిరి. ఆకోటయందున్న వారిని చాలమందిసైనికులను చంపివైచిరి. కోటయందు ద్రవ్యము, బంగారము, నగలు మొదలైన విలువగలసామానంతయు తాము సంగ్రహించిరి. అచట దొరకినగుఱ్ఱములను యేన్గులను తమసైన్యమున చేర్చుకొనిరి. ఇచట సంగ్రహింపఁబడిన ద్రవ్యమునంతను తమసైన్యాధిపతులకు పంచి వారిని బహూకరించిరి. కాటూరునగరాధిపతిని బందీగా విజయనగరమునకు కొనిపోఁగా నాతఁడు కారాగృహమునందే చనిపోయెను.

ఈకాటూరుముట్టడి పూర్తికాఁగానే తిమ్మరసుమంత్రిని కొండవీటికంపి యచట చెలరేగియున్న కొన్నిచిన్నచిన్నకలతలను సర్దుబాటుచేయించెను. ఆకలతల నణచుటలో దొరకిన యపారమైనద్రవ్యము నశ్వములు నేనుగులువిజయనగరమునకుఁ బంపబడెను. కొండవీడును సర్దుబాటుజేసినపిమ్మట తిమ్మరసుమంత్రియు విజయనగరము చేరుకొనగా రాయలవారు మంత్రిని మహాసభలో సన్మానముచేసి తగురీతిని వారికి మర్యాదచేసిరి.

8. రాయచూరుదండయాత్ర

రాయలవారు తమయద్భుతబలపరాక్రమములచేఁ బ్రతాపరుద్రుని గర్వభంగముగావించి నాలుగైదేండ్లవరకును చిల్లరకలతలను సర్దుకొనుచు విద్యావ్యాసంగములతో కాలము బుచ్చుచుండిరి. కాని వీరిమనసునందుమాత్రము సాలువ నరసింహరాజు కాగితములలో దొరకినదానియందు వ్రాయబడిన రాయచూరును జయింపవలె ననెడి యభిలాషమాత్రము బాధించుచునే యుండెను. అట్టికాల మిప్పు డాసన్నమైన దని గ్రహించి తమయభిలాషను నెఱవేర్చుకొనవలె నని యిప్పుడు పట్టుపట్టిరి. ఈకాలమున దక్షిణదేశములోకెల్ల బలాఢ్యములగు దుర్గములలో రాయచూరుదుర్గ మొకటియై యున్నది. ఈరాయచూరుగ్రామమున కిరువైపుల రెండునదు లుండెను. ఇచటి కోట కొండపైన సురక్షితముగ కట్టబడియుండెను. ఈకోటను పట్టుకొనవలె నని తనకు పూర్వు లెందరో ప్రయత్నించియుండిరి గాని వా రెల్లరును పోరాటమునందు విజయమును పొందరైరి. ఈకోటను పట్టుకొని జయింపవలె ననెడికుతూహలము తనకు మెండుగనుండియు నాదుర్గమునకు రాజైన బీజపురసుల్తానదిల్ షాహా తనకు స్నేహబృందములోనివాఁడగుటవలన కారణము లేకయే కయ్యము గల్గించుకొనుట యుక్తముకాదని తెలిసికొని యేదేని యొకకారణమును సృష్టింపయత్నించుచుండెను. చిరకాలముక్రిందట విజయనగరమువారికిని బీజపూరుసుల్తానునకును జరిగినసంధిషరతులను వితర్కించిచూడ నొకరాజ్యమునుండి యింకొకరాజ్యమునకు కుట్రపన్నెడివారుగాని సొమ్ము నపహ

రించినవారుగాని దుష్టులుగాని పోయినచో నట్టివారికి రెండవ రాజ్యమువారు ఆశ్రయమివ్వఁగూడదని యొకషరతుదొరకెను. ఆషరతు ననుసరించి యిప్పుడు కొంత కయ్యమును కల్పించుకొనుటకు రాయలవారికి సందుదొరకెను. సయ్యదు మార్కా రని యొకగుఱ్ఱపువర్తకుఁడు విజయనగరరాజులవద్ద నశ్వములసరఫరాచేయుటకు నలువదివేలబంగారు నాణెములు పుచ్చుకొనియుండెను. ఇదివరలో నీమర్కా రనేకపర్యాయము లిట్లు పైకమును తీసికొనుటయు గుఱ్ఱముల నాథరకు నప్పగించుటయు నాచారముగ నుండెను. అట్లే యిప్పుడును తీసికొని చెప్పిన ప్రకారము గోవాలో గుఱ్ఱములను కొనక వారిదేశస్థులగు మూర్లుండెడి పొమూడా యనెడిగ్రామమునకుఁ బోయి యచట నుండి గోవానగరమునకుఁ బోవుటకు బదులుగా నీద్రవ్యము నంతను తీసికొని అదిలశాహా యున్నగ్రామమునకుఁబోయెను. ఈ పని యదిల్షాహాప్రేరణమీద జరిగెనని కొందరు చెప్పుదురుగాని యిది నిజమైనను కాకున్ననునట్టివానికి అదిల్షాహా యాశ్రయమిచ్చుటమాత్రము సరియైనదికాదు. ఈవిషయము సాకారపరచుకొని రాయలవారీసయ్యదుమర్కారును తమస్వాధీనముచేయుమని యదిల్షాహాగారిని కోరుటకు నవకాశము దొరికెను. అందుపైన తమకును యదిల్షాహాకును చిరకాలమునుండి యుండిన స్నేహమును సైదుమర్కారుచేసినద్రోహమును హెచ్చరించుచు నాస్వామిద్రోహముచేసిన టక్కరితనము క్షమింపతగినది కాదనియు నట్టివానికి యదిల్షాహా యాశ్రయమిచ్చుట తగదనియు చిరకాలగతమైన స్నేహ మొకద్రోహముచే భంగపడునుగాన పూర్వస్నేహమును దలచి యాస్వామి ద్రోహిని డబ్బుతోసహా

తిరిగిపంపవలె ననియు కోరుచు నొకయుత్తరమును రాయలవారదిల్షాహాకుఁ బంపిరి. ఈయుత్తరము వచ్చినంతనే తమవద్దనున్న కాజీలను సమకూర్చి యొకసభగావించి యీవిషయమై వారితో యదిల్షాహా సంప్రతించగా వారందరు నీసైదు మిక్కిలి విద్వాంసుడనియు పవిత్రమహమ్మదీయుఁడనియు వానిని రాయలవారి కప్పగింత పెట్టుట శ్రేయస్కరముకాదని సలహానిచ్చినందున సైదుమర్కారును తనవద్దనుండి డాబూలుగ్రామమునకుఁ బంపి సైదుమర్కారు తనవద్ద లేఁడని ప్రత్యుత్తరము బంపెను. సైదుమర్కారున్ను డాబూలునుం డెచటికో పలాయనమాయెను.

అదిల్షాహా వ్రాసినయుత్తరము చేరినంతనే రాయలవారు రోషపూరితులై తమయాలోచనసభను సమావేశపరచి స్వామిద్రోహికాశ్రయమిచ్చుటచే తమకును బీజపూరుసుల్తానుకును జరిగిన సంధిషరతులు భగ్నమయినట్లుగ నెంచ తగియున్నదనియు నింక నెట్టి యాలస్యముగాని యాలోచనగాని చేయకయే యుద్ధసన్నద్ధులగుటయే యిట్టిసందర్భములలో సరియైనపరిహారమనియు నొక్కివక్కాణించెను. కాని సమావేశమైన సభికులుమాత్ర మట్లు చేయుట యాక్షేపణీయ మనియు నింత చిన్నకారణమును పురస్కరించుకొని యుద్ధముచేయుట తగదనియు లోకము మెచ్చదనియు, ప్రపంచమునందందరు పరిహసింతు రనియు ననేకవిధముల రాయలవారికి నచ్చజెప్ప ప్రయత్నించిరికాని వారిప్రయత్నములన్నియు విఫలములాయెను. రాయలవారు తమపట్టుదలను వదలరైరి. వారికి రాచూరును ముట్టడించి తిరిగి రాచూరును తమరాజ్యములోనికిఁ జేర్చుకొనవలెనను కాంక్షను ప్రతిఘటింపజాలక యెవరెంత చెప్పినను విన

నైరి. దానింబట్టి సభికులెల్లరును రాయలవారిని సరాసరి రాచూరువద్దకే చని రాచూరునే ముట్టడించుటకు పురికొల్పిరి. అంత రాయలవారును నీసలహా నంగీకరించి రాచూరు యుద్ధమునకు సంసిద్ధులైరి. అంతటి బలాఢ్యముగుకోటను వశపరుచుకొనుటవలనఁ దనకుఁ గలుగులాభమును యశస్సును, తేజమును దలచుకొని యుద్ధమునకై తనమనస్సును బురికొలిపి తన నిర్దోషిత్వమును వెల్లడింప రాయచూరుపై దండువెడల నిశ్చయించుకొనిరి.

అప్పటికి బీజాపూరుసుల్తానుకును మిగతమహమ్మదీయ రాజులగు బీదరుసుల్తానుకు, బీరారుసుల్తానుకును నిజాముషాకును కొంత మనస్పర్థలు కలిగియుండెను. ఆసంగతిని తెలిసియున్న రాయలవారు తాము బీజాపూరుసుల్తానుతో యుద్ధము చేయబోవుచుంటిమని తెలియజేసిరి. బీదరు, బీరారుసుల్తానులు వీరి నాశీర్వదించిరి. నిజాముషామాత్రము తనచెల్లెలిని అదిల్షాకి వివాహముచేసినందున మాత్రము రాయల కేమియు జవాబివ్వలేదు.

ఈయుద్ధమునకు బయలుదేరకపూర్వము దేవబ్రాహ్మణులపిలిపించి తమయధిష్ఠానదేవతలపూజలుగావించి బ్రాహ్మణుల సన్మానించి మ్రొక్కుబడులు పూర్తిగావించి శుభముహూర్తమునునిశ్చయించుకొని శకునములజూచి చతురంగబలోపేతుఁడై యుద్ధమునకు రాయలవారు బయలుదేరిరి. ఇట్లు బయలు దేరుటకు పూర్వమె యచటిసంగతులను ముమ్ముందు కనుగొనుటకై పదివేలకాల్బలముతో నొకదండనాయకుఁడు రాయచూరు ప్రాంతమునకుఁ బంపబడెను. తరువాత మరునా డుదయమున

బ్రాహ్మణులచే నిర్ణయింపఁబడిన శుభముహూర్తము నాయకులయాజమాన్యమున నొకరివెనుక నొకరు చతురంగబలసమేతులై చూపరులకు నద్భుతంబు జనింపమహావైభవముతో బయల్వెడలిరి. కామానాయకుఁడను దండనాయకుని యాధిపత్యమున ముప్పదివేలకాల్బలముతోను తుపాకులతోను విండ్లతోను వేయిగుఱ్ఱములతోను పదునారుమదపుటేనుఁగులతోను గూడి ముందు నడచుచుండెను. వీరివెంటనే యేబదివేలకాల్బలముతోడను రెండువేలగుఱ్ఱములతోను ఇరువదియేనుంగులతోను తిరుమలనాయకుఁడు వెళ్లుచుండెను. వారివెంబడియిరువదివేల కాల్బలములతోను మూఁడువేల అయిదువందల గుఱ్ఱములతో ముప్పదిగజములతో తిమ్మానాయకుఁడును వారివెంట జనుచుండెను. ఇట్లే ఒకదళము ననుసరించి యింకొకదళముపోవుచుండ రాయలవారిసైన్యమంతయు యుద్ధమునకు బయలుదేరెను. అట్లు బయలువెడలిన సైన్యమునకు భూవరకోటిలోని వాఁడును ఘనదోర్వీర్యప్రభావుఁడును యుద్ధములయందును స్వామికార్యనిర్వాహణమునందును విజ్ఞుండును పెమ్మసానికుల చంద్రుండునగు రామలింగనాయకుఁడు సేనాధిపత్యము వహించెను. ఇట్లు బయల్వెడలిన రాయలసైన్యము సమకాలికులలెక్కలనుబట్టి అసంఖ్యాకములై యుండెను.

న్యూనిజుచరిత్రకారుఁడు వ్రాసినలెక్కప్రకార మీ యుద్ధమునందు రాయలవారివెంట నేడులక్షలమూఁడువేలకాల్బలమును ముప్పదిరెండువేల ఆరువందలగుఱ్ఱములును అయిదువందలయేబదియొక్కయేనుఁగులు నుండెను. వీరుగాక సైన్యసేవకు లెందరోయుండిరి. ఇంత పెద్దసైన్యబల ముండెనా యని

మన కెంతమాత్ర మద్భుతపడనక్కరలేదు. మనదేశమున నింతపెద్దసైన్యముండుట అన్నికాలములలోను సహజమేనని మనకు చరిత్రవలన తెలియుచునేయున్నది.

ఈవిజయనగరసైన్యమునుగూర్చి వ్రాయుచు బారాసు శోకచరిత్రకారుఁ డీరాజులసైన్యమునకు ధనమునకును మితిలే దని వ్రాసియుండిరి. స్కాటను నింకొకచరిత్రకారుఁడు దక్కను దేశపుచరిత్రను వ్రాయుచు ఔరంగజేబునవాబు రాజ్యము చేయుకాలమున దల్పతురాయను నధికారివద్ద పనిచేసిన జొందెలయధికారి దినచర్యనుగూర్చి వ్రాయుచు విజయనగర రాజులు తమమహోన్నతదశయందు ముప్పదివేలగుఱ్ఱములను పదిలక్షలకాల్బలమును కలిగియుండిరనియు వారిసంపద అనిర్వచనీయమనియు వ్రాసియుండెను. కాంటి యను నింకొకచరిత్ర కారుఁడు విజయనగరరాజులసైన్యమును గూర్చి వ్రాయుచు "పదిలక్షలకు" పైననే వీరికాల్బలముండెనని వ్రాసియుండెను. అబ్దుర్రజాకను నింకొకచరిత్రకారుఁడు వీరికాల్బలము పదు నొకండులక్షలనియు, 1400 యేనుంగులనియు వ్రాసియుండెను. ఇట్టివే చరిత్రలో యనేకదృష్టాంతరములు కలవు. గ్రీసుదేశము నుండి క్రైస్తుకు పూర్వము 320 సంవత్సరములకంటె అలె గ్జాండరనురాజు హిందూదేశముపై దండువెడలినపుడు మగధ రాజ్యపుసేనయందు 16 లక్షలకాల్బలమును ముప్పదివేల గుఱ్ఱములును తొమ్మిదివేలయేనుఁగులును ఉన్న ట్లూహింపఁ బడినది.

1192-వ సంవత్సరమున మహమ్మదీయు లుత్తరహిందూ స్థానముపై దండయాత్రకు వెడలినసందర్భములో ఉత్తర

హిందూస్థానమునందలి రాజ్యములు మూఁడులక్షలగుఱ్ఱము లను మూఁడువేలయేనుఁగులును వీటికి తగినకాల్బలమును దేశ రక్షణకై సమకూర్చబడినవని Hand Book of Indian Army అనుపుస్తకములో లార్డెగర్టినను వారు వ్రాసియుండిరి. ఇట్లే అనేకయుదాహరణ లివ్వవచ్చును.

ఇట్లు బయలుదేరి వచ్చిన రాయలసైన్యమునందలి మూరు వంశీయులను కమ్మనాయకునియాధిపత్యమున రాచూరుచుట్టు నుండు కందకములవద్దకు రాచూరునుముట్టడించుటకై రాయల వారు పయనముచేసిరి. రాచూరికోటలో సురక్షితముగనున్న సైనికులందరును రాయలవారిసైన్యముపైన ఫిరంగులను కాల్చిరి. వారిఫిరంగిదెబ్బలకు తట్టుకొనలేక నీరాయలసైన్య ములో చాలమందిహతులైరి మిగిలినవారు వెనుకదిరిగి పారి పోవయత్నించిరి కాని రాయలవా రట్లుచేయుట కంగీకరించక వారిని పోరాటమునకై పురిగొల్పిరి. ఈసేన యెంతగంభీరము గను ధైర్యముగను పోరాడినను లాభము కనుబడలేదు. వీరు చురుకుగ పనిచేయుటకై రాచూరుకోటగోడలోని రాళ్లనూడ పెరుకుటకై సైన్యమునకు బహుమానము లిచ్చెదమనిరి ఒక్కొక్క రాతికి ముప్పదియు నలుబదియు యేబదియు పణమిచ్చెదమనిరి, ఈ రీతిగ నీసైనికులకు ప్రోత్సాహముకలిగించి కోటగోడనుండి రాళ్లనూడపెరికించిరి. అట్లు చేయుటవలన కోటబలహీనమై గ్రామమును ముట్టడించుటకు సులభసాధ్యమాయెను, కాని కోటలోనివారు సురక్షితములైన స్థలములలోనుండి పోరాడు చున్నందున రాయలసైన్యముపై నవలీలగ పోరాడుటకు మొరలుపెట్టిరి. ఇరుపక్షములవారు నీరీతిగ ధైర్యముతో

పోరాడుటవలన నీముట్టడి మూఁడుమాసములవరకు జరుగుచూ వచ్చెను.

రాచూరుగ్రామమున కిరుప్రక్కల నుత్తరదక్షిణములుగ రెండునదులు కృష్ణయు తుంగభద్రయునుండెను. ఈనదులమధ్య రాయచూరుగ్రామముకోటయు తూర్పుపడమరల పెద్దమైదానమును నుండెను. కోటకు ఉత్తరదక్షిణముల కొండ లుండెను. కోటచుట్టు దట్టమైనరాతిగోడ లుండెను. రాతిగోడలు మట్టితో పూరించఁబడియుండెను. గ్రామమంతయు నీకోటగోడలమధ్య నుండెను. కోటలో నీరు సమృద్ధిగనుండెను. తినుబండారములు దాదా పయిదుసంవత్సరములకు సరిపోవునట్లు ప్రోగుచేసియుంచబడెను. తుంగభద్రానదీతీరముననుండియు దక్షిణమున నున్న దేశమంతయు రాయలవారిరాజ్యములోనిది. కృష్ణానదికి ఉత్తరముననున్న దేశమంతయు ఆదిల్షాహదేశములోనిది. రాయలవారిసైన్యము రాయచూరుముట్టడికి బయలుదేరిన వెంటనే ఆదిల్షాహవద్దనుండి కొంతసైన్యమునున్న సేనానియు రాయచూరునకు పంపబడెను. వారుకోటలోనికి ప్రవేశించిన పిమ్మట కోటద్వారము లన్నియు మూసివేయఁబడెను. రాయలవారిసైన్యము కోటకు నుత్తరభాగమున తమస్థావర మేర్పరచుకొని కోటను ముట్టడించిరి. పెద్దమైదాన మొకగొప్పప్రసిద్ధ పట్టణమువలెనుండెను. రాయచూరుకోట కొంతదూరములో రాజుగారు విడిదిసేయుగుడారము వేయబడెను. ఈగుడారమునకు వెనుకప్రక్కన మనుష్యులు చొరరాని దిట్టమయిన ముళ్లకంప స్థాపింపఁబడెను. ఈగుడారములో రాజుగారి యధిష్ఠానదేవతయు నాదేవతను పూజచేయుటకు బ్రాహ్మణులును రాజు

గారిముఖ్యమంత్రులును, రాజుగారి ముఖ్యస్నేహితులు నుండిరి. గుడారమునకుబయట ననేకులు రక్షకభటులుండిరి. అచటి కవతి దూరముననే సేనాధిపతులు వారిసైన్యము బారులుతీర్చి చిన్నచిన్నగ్రామములుగ నేర్పాటుచేయబడెను. ఆమైదానమునందు పెద్దపెద్దబాట లేర్పాటుచేయబడి బాటలకిరుప్రక్కల వర్తకులు తమతమసరకులు విక్రయించుట కేర్పాటుచేయబడెను. అచట విక్రయింపఁబడువస్తువులకు మితిలేదు. ఈజనమున కవసరమగు ముఖ్యపదార్థములు బియ్యము, పప్పులు, కూరలు, పాలు పెరుగు మొదలయినవియు, సామాన్యమైనబట్టలు, పట్టుదుకూలములు, చీరెలు విక్రయింపఁబడుచుండెను. ఇంకొకచోట, నగలు, సామ్మెములు, బంగారువెండివస్తువులు విక్రయింపఁబడుచుండెను. ఇచటనే రవ్వలు, కెంపులు, కూడ దొరికెడివి. పశువులు గుఱ్ఱములు మొదలయినవారి కవసరమగుగడ్డి యితర వస్తువు లింకొకచోట నేర్పాటుచేయబడెను. ఆటలాడువారు పాటపాడువారు వినోదముచేయువారు వారివారిపనుల చాతుర్యముతో చూపుచుండిరి. పైనుండివచ్చినవారు చూచిన నీస్థావరము యుద్ధసన్నాహమునకై చేయబడినస్థావరముగ ఊహించుట కెంతమాత్రమును వీలులేదు. చూపరుల కిది యొక ప్రసిద్ధనగరముగఁ గాన్పించుచుండెను. యుద్ధము ప్రారంభించుటకు పూర్వము శంఖములు, బాజాలు వాద్యములు మోగింపబడెను.

ఆదిల్షాహ సన్నాహము

ఈమైదానమునందు రాయలవారు తమకును తమసైన్యమునకును ఆశ్రయ మేర్పరచుకొని రాచూరుకోటను తమము

క్షమునసే మట్టడించిన యేర్పాటుచేత తమసైన్యము లతిధైర్యముతో నత్యుత్సాహముతో పోరాడుచుండ తాము వెంటనే యుండి తమసైన్యము నుత్సహించుచు ప్రోత్సహించుచుండ దాదాపు మూఁడునెలలు గడచెను. అప్పటికి యుద్ధ మింకను ప్రారంభదశయందే యుండెను. అప్పటికి ఆదిల్షాహ తనసైన్యముతో ఫిరంగులతో తుపాకులతో వచ్చి యుత్తరమున కృష్ణానదితీరమున విడిసెను. ఇట్లువచ్చిన ఆదిల్షాహసైన్యమునుగూర్చి వారినడవడులగూర్చియు కనిపెట్టుటకు రాయలవారు తమ వేగరివాండ్రను బంపి సంగతులను రహస్యముగ తెలిసికొనుచుండిరి. ఆదిల్షాహసేన నదీతీరమున కొన్నిరోజు లుండెను. తాను వచ్చినవెంటనే రాయలవారు తమసైన్యముతో పోరాడతలపడుదురని సుల్తానూహించెను. కాని రాయలవారట్లుచేయకుండుటవలన కొంతయాశ్చర్యముచెంది తనరహస్య ఆలోచనసభను సమావేశపరచెను. సభికులతో నీవిషయమై సలహానుపొందెను. సమావేశమైనసభికులలో కొందరు రాయల ప్రవర్తన తమ్మలక్ష్యముచేసినట్లును, తమ్ము పరిభవించునట్లును తలచిరి. అట్లు తలచినవారిలో పాహూదాసేనానాయకుఁడగు అంగుష్ఖాను ముఖ్యుఁడు. వీరితో నేకీభవించినవారు హెచ్చుగ నున్నందున వీరందరు కృష్ణానదినిదాఁటి రాయలవారిసైన్యముతో పోరాడుటయే మంచి దని ప్రకటించిరి. ఈయభిప్రాయము నందరు సరియైన దని ప్రకటించిరి. అందుపైన ఆదిల్షాహ తన సైన్యమునంత నొకచోటికి రప్పించెను. అట్లు రప్పించినవారిలో కాల్బలము, తుపాకులవారు, ఫిరంగులవారు, యీటెలవారు, కత్తులవారు మొత్తముమీఁద లక్షయిరువదివేలమంది యుండిరి.

వీరు గాక పదునెనిమిదివేలగుఱ్ఱపుదళమును నూటయేబదియేనుగులు నుండియుండెను. ఈసమావేశమయిన సైన్యమునంతను చూచి సంతోషాంతరంగికుఁడై ఈసైన్యబలమువలనను తమ వద్దనున్నతుపాకులబలమునను రాయలవారిని గెల్వవచ్చు నని ధైర్యముకల్గియుండెను. అందువలన తనసైన్యమునంతను నదిని దాటి అద్దరినున్న రాయలసైన్యముతో యుద్ధముచేయుట కాజ్ఞాపించెను. అట్లు యుద్ధముచేయుటవలన రాయలసైన్యము నోడింపగల మని రాచూరును రక్షింపగల్గుదుమనియు ఆదిల్షాహ తలచియుండెను.

ఇట్లాశాపూరితుఁడై తానును తనసైన్యముతో కృష్ణానదిని దాటి రాయలవారిసైన్యమున కారుమైళ్లదూరమున కృష్ణానదీతీరముననే తనసైన్యస్థానము నేర్పరచుకొని కందకములు మొదలయినరక్షణకార్యముల తయారుచేయుచు ప్రతినిమిషము యుద్ధారంభమును ఆదిల్షాహ నిరీక్షించుచుండెను.

— యుద్ధము —

ఈవిషయముల నన్నిటిని వేగరులవలన తెలిసికొనినవాఁడై రాయలు తనసైన్యమును యుద్ధమునకు సిద్ధముగ నుండునట్లేర్పాటులు గావించి శత్రువులుచేయు పనులను గమనించుచు తయారుగ నుండున ట్లాజ్ఞాపించెను. శత్రుసైన్యము తమస్థానమును బలపరచుకొన్న సంగతి తెలిసినంతనే తమసైన్యమును ముందుకునడువవలె నని రాయలవారుత్తరువిచ్చిరి. తమ సైన్యము నేడుభాగములు విభజించిరి. శ్రీరాయలవారి మామగారును శ్రీరంగపట్టణాధీశుఁడు నగు కుమారవీరయ్యగారు తాము ముందుండుట కనుజ్ఞ వేడిరి. వీరితోపాటు తమ

పుత్రులను ముప్పదిమందిని యుద్ధమునకు తయారుచేసి తమ వెంట తీసికొనివచ్చిరి. రాయలవారును వీరయ్యగారిని తమసైన్యమును ఆదిల్షాహాకు రెండు మైళ్లదూరమున తమ స్థావర మేర్పరచుకొని యుద్ధమునకు సిద్ధముగనుండుడనిరి. రాయలవారు తామే శత్రుసైన్యముతో యుద్ధముచేయుటకు సిద్ధపడిరి. కాని ఆనాడు శుక్రవారమగుటచేత రాయలసలహాదారులు యుద్ధముచేయుట కానాడుశుభసూచకముగా దనియు మఱునాటివరకు యుద్ధము నాపుదలచేయవలయుననియు కోరిరి. ఉభయపక్షములవారును నొకరినొకరు కావలాకాయుచు యుద్ధసన్నద్ధులై సాయుధహస్తులై యేక్షణమున కేమి సంభవించునో యని కాచుకొని యతిజాగరూకులై వేచియుండిరే కాని యెవరును ముందంజవేయలేదు. అట్లే శుక్రవారమంతయు గడచిపోయెను. శనివారము ఉషఃకాలము సమీపింపగానే ఢంకాదెబ్బలు, మృదంగవాద్యము, జనులకోలాహలము, గుఱ్ఱముల సకిలింపులు, ఏనుగుల ఘీంకారములు, శంఖారావములు మొదలగునశబ్దజాలము వలన భయంకరమైనస్థితి యేర్పడినట్లు తెలియవచ్చెను. ఈశబ్దముయొక్క గభీరతవలన మిన్నుమన్ను ముట్టుసా యనుభీతి యచటివారికిఁ గల్గెను. ఇంతలో తెల్లవారెను. రాయలవారు తమబలమునంతను ముందుకు నడిపించుకొని తీసికొనివెళ్లునప్పటికి సూర్యోదయముపైన నాల్గు గడియలు దాటెను. అంత నిరుపక్షములవారు యుద్ధమునకు సంఘటిల్లిరి. ముందరనున్న రాయల సైన్యము పురోగమించి తురుష్కసైన్యమును ఢీకొని వారిలో ననేకుల జంపిరి. అంతవరకు రాయలవారువత్తు రని తనసైన్యముతో కనిపెట్టుకొని

యున్న ఆదిల్షాహా తన ముందున్న సైన్యము పడిపోవుటజూచి తనసైన్యమునంతను ముందుకు జని దొరికినవారిని దొరికినట్లుగ నరుకుట కాజ్ఞనిచ్చెను. శత్రుసైన్యముయొక్క ధాటితీవ్రతకు తాళజాలక రాయలవారిసైన్యములో ననేకులు యుద్ధరంగము ననే మడిసిరి. మిగిలినవారు వెనుదిరిగి పారిపోవఁజూచిరి. వీరిని వెన్నంటి తురుష్కసైన్యము ముందుకు రాజొచ్చెను. ఇట్టి దుస్థితిని జూచి నివ్వెరపడి ధైర్యమువహించి పారిపోవువారల కట్టుజనుట వీరులకు తగదనియు నట్లుచేసినచో తానే వారల జంపింతు నని భయపెట్టి తానుసైన్యాధిపత్యము స్వయముగ వహించి తురంగమును నెక్కెను. అట్లశ్వారూఢుఁడగునప్పుడు తన వ్రేలియుంగరమునుదీసి తనబంటులలో నొకనికిచ్చి తాను యుద్ధమున జనిపోవుట తటస్థించినచో నీయుంగరమును తనభార్యలకు చూపి వారును సంప్రదాయానుసారముగ చితినెక్కవలసినదనియుఁ జెప్పిరి. ఆసమయమున ధైర్యమువహించి తన వెంటనున్న సైన్యమునంతకును ధైర్యముచెప్పి శత్రురాజు యుద్ధమున రాయలు చచ్చినట్లు చెప్పుకొనవలసినదేగాని లొంగిపోయినవార్త చెప్పుకొనుటకు వీలుకల్గనీయనని చెప్పి తన సైన్యముంతటితో ముందు కుఱికెను. ఇట్లు రాయలవారు సాహసించి ముందుకుఁ జనుచుండ వెనుదిరిగి పారిపోవ నుంకించి యున్న వారందరు లజ్జాభీతులై యుద్ధమునఁ జచ్చిన వీరస్వర్గము జేరగల మని ధైర్యమువహించి తామును ముందడుగిడి శౌర్యధైర్యములతో యుద్ధముచేయుటకు ప్రారంభించి శత్రుసైన్యమును తుదముట్టింప యత్నించిరి. వీరెల్లరు

నొక్కుమడి శత్రుసైన్యముపై బడి తునుమాడి వారికి పరాభవముగావించిరి. వీరిప్రతాపాగ్ని కోర్వజాలక తురుష్క సైన్యము భయవిభ్రాంతులై చేయునదిలేక సంక్షుభితులైరి. వీరిలో కొందరు పారిపోవలయు నని వెనుదిరిగి కృష్ణనీటిలోఁబడి చనిపోయిరి. శత్రుసైన్యము వెనుదిరిగినంతనే రాయలసైన్యము గజములతో ముందుకుజని పారిపోయెడి తురుష్కుల వెన్నంటిరి. వీరియేనుగులు తురష్కసైనికులను తమతొండములతోఁబట్టుకొనిచుట్టచుట్టి నేలకొట్టెను. మరికొన్ని వారిని చీల్చివైచెను. ఇట్లే తురుష్కసైన్యమంతయు చెల్లాచెదరాయెను. యుద్ధమునందు పోరాడుచున్నసైనికులేగాక యనేకులు స్త్రీలు పిల్లలు మడిసిరి. అనేకు లార్తనాదములఁ జేయుచుండిరి. ఇది యంతయుఁజూచుచున్న రాయలవారు దాక్షిణ్యము వహించి తమసైనికుల నాగు డని యనుజ్ఞనిచ్చిరి. ఆదిల్షాహ యేనుగునెక్కి పారిపోయెను. రాయలవారు కృష్ణదాటి అదిల్షాహ తనకై యేర్పరచుకొన్న సురక్షితమైన గుడారమున కొంచెము విశ్రాంతిదీసికొన ప్రారంభించెను. రాయల అనుయాయులుమాత్ర మిందుల కంగీకరింపక తురుష్కసైన్యమును వెంటాడి ఒకరైనను లేకుండునట్లు చంపవలె ననిరి. అందులకు రాయ లియ్యకొనక పురోగమన మాపవలయు ననియు ఆదిల్షాహకు తగినపరాభవమును తమకు దిగ్విజయమును కలిగెననియు, వెనుదిరిగి రాచూరుకోటను పట్టుకొనవలయునన్న యాశయము నెరవేర్పవలయుఁ ననియు చెప్పిరి.

9. రాయలవిజయములలాభనష్టములు

ఆదిల్షాహ యేర్పాటుచేసికొనియున్న శిబిరమున కృష్ణరాయల కనంతమైన ద్రవ్యము తినుబండారములు గుఱ్ఱములు ఏనుగులు దొరికెను. వీరి కచట అశ్వజాగుఱ్ఱములు నాల్గువేలు నూరేన్గులు నాల్గువందలఫిరంగులు యీఫిరంగులనడిపించుటకు తొమ్మిదివందలబండ్లు, గుడారములు మొదలుగాగలవి దొరకెను. ఇవిగాక పశువులు ఎద్దులు అనేకములు దొరికెను. పిల్లలు ఆడువాండ్రు అనేకు లచట పట్టుకొనఁ బడిరి. అయితే యుద్ధానంతర మా స్త్రీలును పిల్లలును వదిలివేయబడిరి.

ఈయుద్ధమున చనిపోయినరాయలసైనికుల మొత్తము పదునారువేలు. వీరికందరికిని తగుమర్యాదలతో దహనసంస్కారములుచేసి వారియాత్మలకు ప్రీతికలుగుటకు తగినధర్మములు గావించి యచటనుండి తిరిగి రాచూరుముట్టడికై వెళ్లిరి.

రాచూరు ముట్టడి - సలబత్ఖాను

ఈరంగమును పూర్తిగావింపక పూర్వ మొకతురుష్కసేనానియొక్క శౌర్యప్రతాపములనుగూర్చి కొంచెము ముచ్చటింప వలసియున్నది. ఆదిల్షాహయొక్క ముఖ్యరక్షకుఁడుగ సలబత్ఖా నను సరదా రుండెను. అతఁడు సుల్తానురక్షణకై అయిదువందలపోర్చుగీసుసైనికలతో వారివద్దనుండెను. సుల్తాను పారిపోయినంతనే సైనికులెల్లరు వెనుదిరిగి పారిపోవుచుండ నీసైన్యాధ్యక్షుఁడు వారినందరిని పోగుచేసి రాయలవారితో పోరాడ నుంకించెను. కాని సైనికులెల్లరు తమ్మురక్షించుకొనుమార్గమును చూచికొనిరి గాని యుద్ధముఁ జేయుట కిష్టపడ

రైరి. ఇట్టిస్థితిలో ఖానును తనవెంటనున్న పోర్చుగీసుసైనికులును రాయలచే బందీలుగ పట్టుబడగలమని యధైర్యముతోఁచి ఖానును తనవద్దనున్న పోర్చుగీసువారును రాయలసైన్యము లోనికి దుమికి రాయలసైనికుల ననేకులచంపి కొద్దికాలము తాండవమాడెను. వీరట్లు త్రోసికొనివచ్చుటలో దాదాపు రాయలవారుండు స్థలమువరకు వచ్చియుండిరి. ఈబీభత్స మంతయు నొకత్రుటికాలములో జరిగెను. ఆసమయమున రాయలవారి అంగరక్షకులలో నెవ్వరో నీవీరుని గుఱ్ఱమును జంపివేసిరి. గుఱ్ఱము చచ్చినంతనే తురుష్కసైన్యాధ్యక్షుని వెంటనున్న పోర్చుగీసువారు వీరావేశులై అచటిరాయలసైనికుల విచక్షణలేకయే యనేకుల వధించి మిగిలినవారిని చెల్లాచెదరు చేసి పెద్దమార్గము నేర్పాటుచేసికొని సైన్యాధ్యక్షుని కింకొకగుఱ్ఱమును తెచ్చియిచ్చిరి. అయితే అప్పటికి వీరును వీరియనుచరులును చాలవరకు అలసియుండుటచేత రాయలసైన్యము వీరినందరను చుట్టుముట్టి వీరితో పోరాడిరి. ఈపోరాటమునందు పోర్చుగీసువారందరును, ఒక్కరైనను మిగులకయే చచ్చిరి. సలాబత్ఖానుమాత్రము బాగుగ దెబ్బలు తిన్నవాఁడై రాయల బందియాయెను.

పోర్చుగీసువారు

కృష్ణానదీతీరమున పైవిధముగ దిగ్విజయముగాంచిన శ్రీరాయలప్రభువు తిరిగి రాచూరువద్దకు వచ్చుచుండ త్రోవలో పోర్చుగీసునాయకుఁడగు క్రిస్తొవిడి ఫిగరీడో యను నాతఁడు తనతోటిపాటు కొంతమంది ఫిరంగిసైనికులతో రాయలవద్దకు వచ్చెను. వారికి రాయలవారు కొన్నిగుడార

ములు వేయించి తనవద్దనేయుండి జరుగుచున్న రాయచూరు ముట్టడిని జూడుమని కోరియుండెను. అచటనున్న సమయములో నాతఁడచట జరుగుచున్న ముట్టడిని జూచుచుండెను. కోటలోని తురుష్కులు కోటగోడలపైనుండి మనుష్యులు కోటగోడల వద్దకు రానీయక తుపాకులుగాల్చుటయు, దగ్గర కెట్లో తప్పించుకొనివచ్చి వారిపై కోటగోడలమీదనుండి రాళ్లువిసరివేయుటయు క్రిందనున్నసైనికుల నీవిధమునకొట్టి వారినలసటఁజెందించుటయు కోటగోడవద్దకు పోయినసైనికులా కోటగోడనేమియు చేయలేకపోవుటయు నీపోర్చుగీసునాయకుఁడు చూచియుండెను. ఇట్లు చూచిచూచి యొకనాఁడు రాయలవారివద్దకు జని తనకును తనతోవచ్చిన పోర్చుగీసుసైనికులకును గోడవద్దకుపోవుట కనుమతినీయవలసినదిగ కోరియుండెను. మున్ముందు రాయలవారందుల కంగీకరించకున్నను తరువాత నియ్యకొనిరి. వీరివెంట కొంతసైన్యమునుకూడ నిచ్చిపంపిరి. ఈనాయకుఁ డిదివరలో కోటగోడమీదనున్న వారల దినచర్యలను చక్కగఁ గనిపెట్టినవాఁడగుటచే తనవద్దనున్న ఫిరంగులతో కోటగోడలమీదనున్న వారల నచటనుండుటకు వీలులేకుండున ట్లగ్నివర్షము కురిపించి మెల్లమెల్లగ రాయలసైనికులను గోడవద్దకుతీసికొనిపోయి యచటి గోడను గొడ్డళ్లతో పగులగొట్టింప నారంభించెను. పైనున్న తురుష్కులచటనుండజాలక వారేమి చేయఁజాలక పైనుండి కోటలోనికి పారిపోయిరి. వారినాయకుఁడు వీరికి ధైర్యముచెప్పి వారిని తిరిగి వెంటబెట్టుకొని కోటగోడలపైకి తీసికొనివచ్చెను. తా నచటికివచ్చినంతనే ఫిగరీడో యను ఫిరంగి నాయకుఁడు తనవద్దనున్న ఫిరంగిని గురిపెట్టి కోటలోనినాయకుని

పడగొట్టెను. ఈనాయకుఁడు పడినసంతనే కోటలోపల పెద్ద అల్లకల్లోలము జరిగి కోటపైనున్న వారందరును కోటలోనికి పారిపోయి సురక్షితములైనస్థలములలో తమతలలు దాచుకొనిరి. ఇచట కోటగోడలు రాయలసైన్యములధాటి కాగలేక బలహీనములై క్రిందకూల నారంభించెను. ఇట్టిస్థితిలో నాఁటి యుద్ధమాగెను.

కోటలో ప్రవేశము

ఇప్పటికి ముట్టడియారంభమై యిరువదిదినము లాయెను. కోటద్వారములు తెరువబడెను. ఆద్వారమున కోటలోనివారనేకులు దీనాలాపములతో నార్తస్వరములతో తెల్లజెండాలతో చేతులను పైకెత్తుకొని రక్షణవేడుచు రాయలవారున్నస్థలమునకు రాసాగిరి. ఆవిషయమును తెలిసికొన్నవారై రాయలవారు తమమంత్రిని వారి కెదురుగఁ బంపి వారిని లోనికి బిల్పించెను. అంత వారెల్లరు రాయలవారికి సాష్టాంగపడి శరణువేడిరి. రాయలవారు శరణాగతుల కభయమిచ్చి వారికిగాని వారి ఆస్తికిగాని యేలాటిభయము నుండజాలదని ధైర్యముచెప్పి తాము మరుదినము కోటలోనికి ప్రవేశింతుమనియు కోటలోని వారెల్లరు కోటలోనికి నిర్భయముగఁ బోవచ్చుననియు చెప్పిరి. అప్పు డచట నున్నవారందరును ఫిరంగీడోపై దృష్టిని ప్రసరించి వారే యీప్రబలకార్యమును సాధించినవారని పొగడిరి.

రాయల దయాదాక్షిణ్యములు

మరునాడుదయమున మామూలుగ తాము ప్రతిదినము చేయు దైవప్రార్థన పూర్తిచేసికొని విజయానంతరము సంప్ర

దాయానుసారముగ తాము చేసెడిపూజలు దేవబ్రాహ్మణసన్మానములు నయినపిదప రాచూరుకోటలోనికి సైన్యసమేతులై ప్రవేశించిరి. రాయలవారు ప్రవేశించునప్పటికే కోటలోని జనమంతయు వచ్చి రాయలవారికి స్వాగతమిచ్చి కోటను స్వాధీనపరచిరి. రాయలవా రందులకు సంతసించినవారై కోటలోనివారి కభయమిచ్చి యిష్టమున్నవార లచటనుండుటకును అచటినుండి తమసొత్తులతో కూడ వెళ్ల నుద్దేశించినవారలు వెళ్లుటకును సెలవిచ్చిరి. అచట తాముండగనె తమసైనికులుగావించిరని చెప్పిన అకృత్యములకు తమసైనికుల దండించి తమన్యాయబుద్ధిని దయను దాక్షిణ్యమును వెలిపుచ్చిరి. ఆగ్రామమునుండి వెళ్లదలచుకొన్న వారికి కావలసినసహాయము చేయించి ఆగ్రామములో నేమియు లేనివారికి వలసినసామగ్రి నిచ్చి రాచూరునందే కొద్దిరోజులుండి రాచూరునగరపరిపాలన కవసరమగు నేర్పాటుల నన్నిటిని చక్కగ నేర్పరచి నాపట్టణసంరక్షణకై తగినంతమంది సైనికులను విశ్వాసపాత్రులగు సైనాధ్యక్షుల యాధిపత్యమున నుంచి తరువాత తనరాజధానికి సేనాసమేతుఁడై విజయధ్వనులతో చేరుకొనెను. వీరికి రాజధానియందు జనులందరు గొప్పస్వాగతమిచ్చి నగరంతయు నలంకరించి విజయోత్సవములు చేసిరి.

ఆదిల్షాహు పంపినరాయబారము

రాయలవారు రాజధానినగరము చేరునప్పటికె ఆదిల్షాహవద్దనుండి రాయబారి వచ్చియుండెను. ఆరాయబారియు రాయలవారికి తావచ్చినవిషయముగూర్చి కబురుపంపుచు తనకు తొందరగ దర్శనమీయవలె ననియు సుల్తానుగారిసందేశము

సాకర్ణించి అందులకు తగుసమాధానము నిప్పించుమనియు కోరి యుండెను. తాము వీలుచూచుకొని రాయబారికి దర్శనమిత్తు మనియు నంతవరకు రాయబారి యచటనే యుండవలెననియు తెల్పిన సందేశము సాకర్ణించి దానికి తగుసమాధానము నిత్తు మనియు రాయలవారి రాయబారికి కబురుచేసెను. రాయబారి మాత్రమందు కియ్యకొని ప్రతిదినము రాజసభకుఁ బోవుచున్నంతలో వారికి చేయదగినసపర్యలు మర్యాదలుచేయఁబడుచునే యుండెను. ఒకనెలదినములు గడచినపిదప రాయబారిని మరునాడు కోటికి రమ్మని రాయలవా రాజ్ఞాపించిరి. ఆప్రకారమే రాయబారి రాయలవారివద్దకుపోగా వారును రాయబారి కర్హములగు మర్యాదలుచేసి వారిసందేశమును వినుపింప నాజ్ఞాపించిరి. ప్రప్రథమమునసుండి సుల్తానువారికి రాయలవారి న్యాయమునందును ధర్మప్రవర్తనయందును నమ్మక ముండియుండెననియు కారణములేకయే రాయలవారు సుల్తానువారిపై వైమనస్యమువహించి యుద్ధమునకు సన్నాహులైరనియు, వారికిని రాయలవారికిని అనేకసంవత్సరములనుండియు సంధి యుండగా షరతులకు భిన్నముగా రాయలవారు యుద్ధసన్నాహులై రాచూరువద్దకువచ్చిరని మొదట నమ్మజాలరైరనియు, రాచూరువద్దకు వచ్చుటయేగాక వారిసైనికులు రాచూరు జనులదోపిడి గావించి రని విని సుల్తానువారు ప్రత్యక్షముగ జూచుటకు వచ్చిరనియు, వచ్చినపిదప రాయలవారి సైన్యము తమసైన్యముతో పోరాడి అనేకులనుజంపి వారియాస్తినంతయు నాశనము కావించి యుద్ధపరికరముల నపహరించిరనియు నిందులకు పరిహారముగ రాయలవారిహస్తగతమైన గుడారములను,

ఫిరంగులను, గుఱ్ఱములను, ఏనుగులను మిగత యన్నివస్తువులను రాచూరుపట్టణమును తిరిగి యిచ్చివేయవలెననియు అట్లుచేసినచో రాయలవారికిని సుల్తానుకును నెల్లప్పుడు స్నేహముండగలదనియు రాయలవారికి సుల్తానుకు విశ్వాసపాత్రుఁడుగ నుండగల్గుననియు అట్లుచేయనియెడల రాయలవారి ప్రవర్తన దుష్టవర్తనగ నెంచబడు ననియు సుల్తానువారు సందేశముబంపినట్లు రాయబారి విశదీకరించెను. రాయబారిసందేశమును సంపూర్ణముగ విని రాయబారికి సాంప్రదాయానుసారము చేయవలసినమర్యాదల నన్నిటిని గావించి వారిని నూతనవస్త్రధారణులుగజేసి వారు మరునాడు వెళ్లవచ్చుననియు వారి కీయదగుజబాబు నిత్తుమనియుఁ జెప్పిరి. సుల్తాను వారు కోరినప్రకారము తాము సంగ్రహించిన వస్తువులను రాచూరును తిరిగి యిచ్చివేయుదుమనియు అయితే సుల్తానువారు స్వయముగ రాయలవారిపాదములనుస్పృశించి ముద్దుపెట్టుకొనవలయుననియు కోరియుండిరి. ఈజబాబు విన్నంతనే రాయబారి ఆదిల్షాహాకు వారిజబాబును వ్రాసిపంపిరి. అందుకు సుల్తానంగీకరించి విజయనగరమునకు మాత్రము తాము రాజాలమనిరి. దానిపైన రాయలవారే తమరాజ్యముసరిహద్దున నున్న ముద్గల్లుకు వచ్చెదమనియు సుల్తానువారు నచటికి రావలయునని చెప్పిరి. ఆదిల్షాహాగారిని కలసికొనుటకై రాయలవారు బయలుదేరి ముద్గల్లుగ్రామమునకుపోయి ఆదిల్షాహారాకకై వీక్షించుచుండిరి. వారు వచ్చుచున్నారని చెప్పియుండిరేకాని వారు రానందున రాయలవారు తమసరిహద్దునువదలి ఆదిల్షాహారాజ్యములోని బీజపూరుపట్టణమునకు పోయియుండిరి.

రాయలవారి ప్రయత్నము విఫలమగుట

బీజాపూరు మిక్కిలి రమ్యమైనపట్టణము. అచటి నివాస గృహములు తోటలు మిక్కిలి రామణీయకముగ నుండెను. రాయలవారెట్లైనను సుల్తానువారిని రప్పించి వారిని బందిగ పట్టుకొనవలెనని యుద్యుక్తులైరి. కాని లాభము లేకపోయెను. సుల్తాను ధైర్యముచేసి రాయలవారివద్దకు రాజాలకుండెను. ఆ పట్టణమున నీటివసతియు వంటచెఱకును లేనికారణమువలన రాయలవా రచట నుండజాలరైరి. వారున్నసమయముననే వారిసేనలు వంటచెఱకునకుబదు లనేకగృహములను పాడుచేసి గృహముల కుపయోగింపబడిన కలపను వంటచెఱకుగా వాడిరి. అందువల్ల నాపట్టణమున మంచిమంచిగృహములును రామణీయకమైన తోటలున్ను నాశనము గావింపబడెను. రాయలవారీకారణమువలన తిరిగి ముద్గలునకు బోయిరి. ఆదిల్షాహా తాను రానందుకు క్షమింపు డని వేడుచు తిరిగి తనసేనానియగు అసద్ఖానును బంపెను.

అసద్ఖానునకును ఇదివరలో బందీగనుంచబడిన సలబత్ఖానునకును చిరకాలవిరోధ ముండియుండెను. సుల్తానునకు రాయలవారికిని రాజీకుదిరినయెడల సలబత్ఖాను వదలి పెట్టబడుననియు వదలిపెట్టబడిన తనస్థాన ముండ దనియు యూహించి యెట్లైనను సలబత్ఖానును చంపింపవలెనని యూహ కలిగినవాడై అసద్ఖాను రాయలవారివద్దకువెళ్లి సలబత్ఖానుడు సుల్తానును రాయలవారివద్దకు రాకుండ కబురుచేసెననియు నట్టి ద్రోహిని వధించిననేగాని వీరిద్దరికి రాజీకుదుర దనియు చెప్పెను. అంతట రాయలవారు నిజానిజముల కనుగొనకయే సలబత్ఖానును

చంపించిరి. అసద్ఖాను సంతుష్టాంతరంగుడై తాను సుల్తానును తీసికొని వచ్చెద నని చెప్పి పారిపోయెను. అసద్ఖానునికుట్రయు సలబత్ఖానువధయు తెలిసికొని రాయలవారి అసద్ఖానును పట్టుకొన ప్రయత్నించిరిగాని అప్పటికే యతడు పరారి అయెను. అసద్ఖానున్ను సుల్తానువారియొద్దకుపోయి రాయలవారు సలబత్ఖానును జంపించిరనియు అందువలన పోకూడదనియు సలహా నిచ్చెను. సుల్తానును భయపడి రాయలవద్దకు పోయియుండ లేదు.

సుల్తాను తనవద్దకు రానందునకును అసద్ఖానుచేసిన కుట్రవల్లను రాయలవారు కోపోద్దీపితులై సుల్తానురాజ్యము లోనికి చొరబడి భామినీరాజ్యమున కిదివరలో రాజధానిగానైన గుల్బర్గపట్టణమును ముట్టడించి కోటనుపట్టుకొని నాశనము గావించిరి. ఆకోటలో సుల్తానుచే బందీలుగ నుంచబడిన దక్కను రాజకుమారులను విడుదలచేసి వారిలో పెద్దవాని కారాజ్యము నిచ్చి మిగిలినయిద్దరిని తనతో విజయనగరము తీసికొనిపోయి వారిద్దరికిని తగినరీతిని పెద్దపదవుల నిచ్చి తనవద్దనే నిలుపుకొనియెను. ఇంతటితో నీ ఘట్టము ముగిసెను.

రాయచూరు పతన ఫలము

అయితే రాయచూరుపతనమువలన మహమ్మదీయరాజులలో కొంతయు చలనము కలుగకపోలేదు. ప్రథమమున రాయల బలపరాక్రమముల కద్భుతపడి అభేద్యమగురాయచూరుకోటయే వీరిచే పట్టుకొనబడి నాశనముగావింపబడగ తమతమరాజ్యము లన్నియు కూడ రాయలవారిచే ముట్టడింపబడగలవని భయపడి

మహమ్మదీయులలో నున్నవైషమ్యములు సర్దుబాటుచేసికొని కొందరు నైక్యులై యున్నగాని రాయలవారి రాజ్యకాంక్ష నాపజాల మని తెలిసికొని రాయలవారితో కయ్యమునకు ప్రయత్నించిరిగాని కాల మప్పటిలో సరిగ నుండనందున తమ ప్రయత్నముల నుపసంహరించుకొనిరి. రానున్న చరిత్రలో విజయనగరసామ్రాజ్యక్షయమున కిదియే ప్రాథమికకారణ మాయెను.

రాయచూరుయుద్ధఘట్టము పూర్తియైనంతనే యుద్ధము సమాప్తికాలేదు. పైకి కనుపడు పెద్దపెద్దమంటలు చల్లారెనే కాని అచటనచట రాలిననిప్పురవ్వలు రాజి చుట్టునున్న స్థలముల నంటుకొనుచునే యుండెను.

గోవావద్ద కొన్నిభూములను పోర్చుగీసువా రాక్రమింపగ పాలువ తిమ్మరసు కొంతసైన్యముతో నచటికి 1523-వ సంవత్సరమునపోయి కొంత యుద్ధముసల్పెను. కాని తిమ్మరసు గెల్పొందియుండలేదు. తిమ్మరసు తరువాత నీభాగములను తిరిగి రాబట్టుకొనుటకు అసద్ఖానుఁడు తనవద్దనున్నసైన్యములను పంపి తమవద్దనుండి పోర్చుగీసువారు లాగికొన్నస్థలములను తిరిగి ఆక్రమించుకొనియుండెను.

10. రాయలకుమారునిరాజ్యాభిషేకము

ఈచిన్న తిరుగుబాట్లు జరుగుచున్నను రాయలవారు తాముమాత్ర మెచటికిని చనక తమకును వయసువృద్ధియగుచున్న కారణమున తమముద్దుగులికెడు నారేండ్లవయసుగల కుమారుని రాజ్యపట్టాభిషేకముగావించి తాము జీవించియుండగనే తమకుమారుడు రాజ్యము చేయుచుండగ తాము తగినసలహాలనిచ్చుచు రాజ్యవైభవమును దేశాభివృద్ధియుఁ జూడగోరిక కలిగియుండిరి. ఈయుద్దేశమును మనసునం దుంచుకొని తాను రాజ్యభారమును వదలివైచి పసిబాలుఁడగు కుమారునికి 1524-వ సంవత్సరమున రాజ్యపట్టాభిషేకము గావించిరి. తాము తమ కుమారునికి ప్రధానామాత్యులుగనుండి రాజ్యభారము నంతయు తిరిగి తామే భరించుచుండిరి. ఇదివరలో ప్రధానమంత్రిగ నుండిన పాలువతిమ్మరసును తమవద్దసలహాదారుగ నియమించుకొనియే యుండిరి. తిమ్మరసు మంత్రియొక్క కుమారుని విజయనగరసంస్థానమునం దొకగొప్పయధికారిగ నియమించెను. తాను రాజ్యభారమును వదలుకొనుటయేగాక తానే పసిపిల్లవాఁడైన రాజునకు తగిన మర్యాదలుచేయుచు నవసరమగునపుడు ప్రణామముగూడ జేయ మొదలుపెట్టెను. ఈపట్టాభిషేక సందర్భమున నెనిమిదినెలలవరకు నుత్సవములు చేయుచునే యుండిరి.

పసిరాజు మరణము

పట్టాభిషేకమునకై నిరంతరముగ చేయబడుచున్న యుత్సవములు జరుగుచునేయుండ పసిరాజు రోగగ్రస్తుఁడాయెను. రోగగ్రస్తుఁడగుటయేగాక ఆపసితనముననే కళ్లుమూసి దివంగతుఁడాయెను. వృద్ధరాజైన కృష్ణదేవరాయనిశోక మపారమై యనంతమాయెను.

దుర్వార్తలు

ఇది యిట్లుండ పసిరాజు విషముచే తిమ్మరసుకుమారునిచేఁ జంపబడె ననెడి దుర్వార్త దేశమునందు ప్రబలి

యుండెను. ఈదుర్వార్త తనకు తెలిసినంతనే కోపమును పట్టఁజాలక తిమ్మరసును తిమ్మరసుకుమారుని తిమ్మరసుసోదరుఁడైన గొండజుని వారియితరబంధువులను రాజసభకు బిల్వనంపి సభలో పెద్దలు పిన్నలందరిసముఖమున తిమ్మరసు నుద్దేశించి యీరీతిగ పల్కెను.

[illegible]

"నిన్నింతకాలము ప్రియమిత్రునిగ నెంచితిని. ఈరాజ్యమున కిప్పటికి నలువదిసంవత్సరములుగ ప్రభువుగ నుంటివి. ఈరాజ్యమును నీవు నాకే యిచ్చియుంటివి. అట్లుచేయుటలో నీవు నీవిధికి వ్యతిరేకముగ ప్రవర్తించియుంటివి. అందువలన నేను నీకు విశ్వాసపాత్రుఁడనై యుండ నవసరములేదు. నీవు నీతివర్తనుఁడవే యైనచో మాసోదరుఁడు నాకళ్లుతీయించుమని నీకు విధించినపుడు, నీవట్లు గావింపక అందుకు భిన్నముగ ప్రవర్తించి వారిని మీాదు మిక్కిలి మోసము గావించి మేక యొక్క కళ్లు నూడదీయించితివి. ఇట్లుచేయుటలో నీవు ద్రోహము నుబూని రాజద్రోహివయితివి. నీతోబాటు నీకుమారులును ద్రోహులే అయి యున్నారు. ఇప్పుడు నీవును నీపుత్రులును నాకుమారునికి విషప్రయోగము చేసినట్లు తెలియవచ్చినది. గనుక మిమ్ముల నందరిని ఖైదీలుగ బంధించడమయినది."

అని చెప్పుచు తానే స్వయముగ లేచి వారివద్దకువచ్చి వారిని తనచేతితో తాకి పట్టుకొని అట్టుచేయుచు నచటనున్న పోర్చుగీసువారిని తనసహాయమునకై బిల్వనంపి వారిసహాయమును కోరియుండిరి. సాలువతిమ్మరసుమంత్రియు వారితమ్ముఁడును పుత్రుఁడును బందీలు చేయఁబడి మూఁడుసంవత్సరములు

ఖయిదీలుగ నుండిరి. ఇది జరిగినపిదప నరసనాయకునికుమారుని బలవంతముగ పెనుగొండి తోటలలో మోసకృత్యము జరిపిన కొదమరేనికుమారుని తనమంత్రిగా నియమించుకొనెను.

సాలువతిమ్మరసు కుమారుఁడైన దమ్మానాయకుడు ఖైదీ నుండి పరారి ఆయెను. పరారియై దొంగలు బందిపోటువారు నివసించెడు రమణదుర్గమును కొండగుహాలలో దాగికొనెను. ఆగుహాలలో దమ్మానాయకునిబంధువు డొకడు ముఠాకు నాయకుడుగ నుండెను. ఆనాయకునిసహాయము కొంత సిబ్బంది నేర్పాటుచేసికొని రాయలవారిపై యుద్ధమునకు దమ్మానాయకుడు బయలుదేరెను. వీరి నెదుర్కొనుటకై రాయలవారు కొంతసైన్యమును బంపగ దమ్మానాయకుడాసైన్యముతో పోరివోడిపోగా తిరిగి బందీగా రాయలవారివద్దకు తేబడెను. అంతట రాయలవారీదమ్మానాయకుని బందీలుగనున్న సాలువ తిమ్మరసును, వారితమ్ముఁడైన గొండారాజును పిలిపించి వీరందరును బ్రాహ్మలుగ నున్నందున ధర్మశాస్త్రానుసారముగఁ జంపించుటకు వీలు లేనందున వారి కంటిగ్రుడ్లుపీకించి వారిని తిరిగి బందీలుఁగజేసి ఖయిదునం దుంచిరి.

రాయలవారి అవసానకాలము

పైనవ్రాయబడిన విషయములు జరిగిన కొద్దికాలము నకే బీజపూరుసుల్తానగు ఆదిల్షా అశ్వగజసమేతకాల్బలమును సిద్ధముచేసికొని తమవద్దనుండి యాక్రమించుకొనబడిన రాయచూరు కోటను తిరిగి పట్టుకొనునుద్దేశముతో బయలుదేరెను. ఈసంగతి తనకు తెలిసినంతనే తా నెవ్వరికిచెప్పకయే యుద్ధపుగుఱ్ఱము నొకదానిని తయారుజేసి తాను దాని నవరోహించి

తన సైన్యమే రాయచూరునగరప్రాంతమునకుఁ జనెను. అప్పటికపుడే ఆదిల్షాహా రాయచూరు చేరెను. రాయలవా రశ్వారూఢులై వచ్చిరన్న సంగతి తనచెవిసోకినంతనే తిరుగ నాలోచింపక ఆదిల్షాహా యచటినుండి వెనుదిరిగి పారిపోయెను. రాయచూరుకువచ్చుచు రాయలవారు పోర్చుగీసువారివద్దనుండి ఆరువందలగుఱ్ఱములు గల అశ్వదళమును విక్రయమునకుపుచ్చుకొని రాయచూరు వచ్చినంతనే యిదివరలో రెండుసార్లు ఆదిల్షాహామాట దప్పెననియు తాను ప్రమాణము మీద చెప్పినపని నింతవరకు చెప్పిన రీతిని ఆచరించియుండలేదనియు నిమారైన నట్లు చేయవలెననియు నట్లుచేయనియెడల యుద్ధముచేసి తనను బందీగావించి జన్మఖైదిగ నుంచెద ననియు మొదలయినవిషయముల తెలియజేయుటయే గాక బెల్గాము నగరమును స్వాధీనపరచుకొనువరకు యుద్ధము గావింతుననియు నొకసందేశమును రాయలవా రదిల్షాహాంకుఁ బంపిరి.

ఇంతలో చలికాల మాసన్నమైనందున రాయలవారు ముందుకు వెళ్లక తిరిగి విజయనగరముచేరుకొని యుద్ధసన్నాహముచేయ నారంభించిరి. ఈయుద్ధమునకై పోర్చుగీసువారి సహాయమును గోరుచు గోవాయందున్న ప్రభుత్వాధికారి కొక సందేశమును రాయబారిద్వార బంపిరి. బెల్గామును యుద్ధమునగెల్చినంతనే గోవాకు పదునైదుమైళ్లదూరమున నున్న నీబెల్గాంగ్రామమును పోర్చుగీసువారి కిత్తు ననియుకూడ వాగ్దానముచేసియుండెను.

ఇట్లు గొప్పయెత్తున యుద్ధసన్నాహములుచేయుచుండ విధివశమున తనపూర్వీకులగురాజులనెల్లర తనపొట్టనుపెట్టు

కొన్న వ్యాధియొకటి రాయలవారి నావేశించెను. ఈవ్యాధి వలననే తానును తనప్రఖ్యాతచరిత్ర నంతమొందించుచు దివంగతుడాయెను. ఇంతటితో రాయలవారివైభవమును, విజయనగరసామ్రాజ్యవైభవము నంతరించెను. హిందూ సామ్రాజ్యచరిత్రలో నొకప్రకరణ మింతటితో ముగిసెను.

10. రాయలమృతి

రాయలవారి జననకాలనిర్ణయ మెంతకష్టమో వీరి మరణకాలము నిర్ణయించుటయు నంతకష్టముగనే కనబడుచున్నది. వీరిసమకాలికు లెంతచరిత్ర వ్రాసియున్న నీసందర్భమునుగూర్చి వ్రాసినవారొక్కరును గాన్పించుటలేదు. శాసనముల నాధారముచేసికొందమన్న నవియు నీవిషయనిర్ణయమున కంతమాత్రము నాధారభూతములు కావు. కావలి వెంకటరామస్వామిగారు The Deccan Poets అను పుస్తకమును వ్రాయుచు కృష్ణదేవరాయలవారు 1524-వ సంవత్సరమున కాలగతినొందె నని వ్రాసియుండిరి. ఇందుల కనుగుణముగ దేశమునందు చాటువుగఁ జెప్పబడుచున్న నీక్రిందిపద్యమువలన శ్రీకృష్ణదేవరాయలవారు శాలివాహనశకము 144. కు సరియగు 1525-వ సంవత్సరమున చనిపోయినట్లు తెలియవచ్చుచున్నది.

> కోరున యాచకప్రతతిభూరివిషద్దశనొందుచుండఁగా
> నారయశాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోమలం
> దారణవత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధష
> ష్ఠీరవివాసరంబున నృసింహునికృష్ణుఁడు చేరె స్వర్గమున్
> ద్వారక నున్న కృష్ణుఁ డవతారసమాప్తము నొందనై వడిన్.

ఈపద్యమునుబట్టి తారణనామసంవత్సర జ్యేష్ఠశుద్ధషష్ఠీ ఆదివారమునాడు (1525) రాయలవారు చనిపోయినట్లు తెలియుచున్నది. ఇది యిట్లుండ నింకొక శాసనమునుబట్టి కృష్ణదేవరాయలవారికి చాలజబ్బుచేసినట్లును వారు జీవింపరని నిశ్చయముచేసికొని కోనప్పనాయకుఁడనునతడు రాయలవారికి తారణనామసంవత్సర మార్గశిర శుద్ధ విదియ శనివారమునాడు గంగోదకము సేవింపజేసిననియు నప్పటికి రాయలవారిపుత్రులగు తిరుమలదేవరాయలవారు రాజ్యముచేయుచుండిరనియు తెలియుచున్నది. మనిషి జీవించరని నిశ్చయింపబడినపిదప నాచరమావస్థయందు గంగోదకము నిప్పించునాచారము మన దేశమునం దుండియేయున్నది. మరియొకకవులనుబట్టి రాయలవారి అల్లుఁడగు రామరాజుగారు విజయనగరమున వ్యయనామ సంవత్సర వైశాఖశుద్ధ పౌర్ణమినాటికి రాజ్యముచేయుచుండినట్లు వ్రాయబడియున్నది. దీనినిబట్టిచూడ రాయలవారు 1526-వ సంవత్సరమున స్వర్గస్థులైరియని కొంతయనుమానము గలుగుచున్నది.

అయితే కృష్ణదేవరాయలవారు 1529-30 వరకు జీవించియున్నట్లు శాసనము లనేకము లుండియున్నవి. వాటినిబట్టియే చరిత్రకారులు రాయలవారు 1530 వరకు జీవించియున్నట్లును వారిమరణము 1529-30 సంవత్సరములలో జరిగియుండవలయు ననియు వారు చనిపోయినపిదప వారిసోదరు లగు అచ్యుత రాయలవారు 1530-వ సంవత్సరమున పట్టాభిషిక్తులైరనియు నిర్ధారణచేసియుండిరి. అచ్యుతదేవరాయల పట్టాభిషేక మెచట నెప్పుడు జరిగినదనునంశమునుగూర్చియు భిన్నాభిప్రాయ

ములు మెండుగ నున్నవి. ఈ అచ్యుతదేవరాయల వారును వారియిద్దరిసోదరులును కృష్ణదేవరాయలవారిచే బంధింపబడి వారు రాజ్యముచేసినంత కాలము బందీలుగా చంద్రగిరిలో నుంచబడి రని న్యూనిసుచరిత్రకారునివలన తెలియుచున్నది. కృష్ణదేవరాయలవారు చనిపోవకపూర్వము మరణశాసనము నొకదానిని వ్రాసియుండి రనియు నాశాసనమునందు తన కొక పదునెనిమిదిమాసముల వయసుగల చిన్నకుమారుఁ డుండె ననియు, అట్లయ్యును తనకుమారుఁడు చిన్నతనమువలన రాజ్యార్హుఁడు కాఁడనియు. రాజ్యమునకు రాజగుటకు అచ్యుతదేవరాయలే అర్హుఁడనియు వ్రాసియుండె నని న్యూనిసుచరిత్రకారుఁడు వ్రాసియుండెను. కాళహస్తియందు దొరకిన యొకశాసనమునుబట్టి అచ్యుతదేవరాయలవారు కాళహస్తిగ్రామమున విరోధిసంవత్సర కార్తికమాస బహుళపంచమినాడు రాజ్యాభిషిక్తుఁ డాయె నని తెలియవచ్చుచున్నది. మరియొక సమకాలికుఁడైన రాజనాథడిండిముఁ డనునతనివలన అచ్యుతదేవరాయలవారు తిరుపతిలో తిరుపతివేంకటేశ్వరస్వామివారి యెదుట విజయనగర రాజ్యమునకు రాజుగ పట్టాభిషిక్తులు గావింపబడిరని వ్రాయబడియుండెను.

ఈసందర్భముననే మరికొన్ని శాసనములవలన రాయలవారి అల్లుఁడగు అళియరామరాజు విజయనగరసామ్రాట్టుగ 1526-వ సంవత్సరముననే రాజ్యముచేయుచున్నట్లు తెలియుచున్నది.

ఇన్ని భిన్నభిన్నములుగ నున్న విషయములు శాసనములయందుఁ గన్పించుటకు నెద్దియేని గొప్పకారణ మొకటి యుండ

వలయును. అది యుద్ధియని మన మాలోచించి వీటినన్నిటిని సమన్వయము చేయుట శక్యమా యని చూడవలయును.

రాయలవారు జీవించియుండగనే తమకుమారుఁడైన తిరుమలరాయలు రాజ్యాభిషిక్తుఁడాయె ననుటయు నాతఁడు కొద్దికాలమునకె మృతినొందె ననుటయు నిస్సందేహములైన విషయములే యైయున్నవి. తిరుమలరాయలు చనిపోయిన పిదప కృష్ణదేవరాయలవారికి ప్రమాదమైనజబ్బుచేసి మరణావస్థయందుండిరనియు కూడ నూహింపవచ్చును. ఆసమయముననే వారు జీవించుట దుర్లభమని శాసనమునందు వ్రాయబడినట్లు గంగోదకసేవనము జరిగియుండును. అయితే దైవవశమున వా రాస్థితినుండి బయల్పడి సజీవులై యుండి రనుట కెంతమాత్రము ననుమాన ముండఁ జాలదు. వారికి తిరిగి స్వస్థతచేకూరినపిదప రాజ్య మెవరికి సంక్రమింపఁజేయవలయునా యనెడి విషయము రాయలవారిని హెచ్చుగ నాందోళనపఱచియుండవలెను. ఆసందర్భమున రాజ్యార్హులైనవారి గుణగణముల నాలోచించుటలో కొంతకాలయాపనము జరిగియుండవలెను. ఒకప్రక్క తన కొకపసిపాపఁడు తల్లిపాలు కుడిచెడు పుత్రుఁ డొకఁడుండెను. రాజ్యమున కర్హుఁడై యనేకయుద్ధములందు గెల్పొంది మంచిశూరుఁ డనియు ధీరుఁ డనియు పేరుపడిన యల్లుఁడు రామరా జొకఁ డుండియుండెను. సమర్థుఁడును రాజ్యము చేయఁదగినవాఁడునై యిదివరలో తనచే బంధింపఁబడి బందీగా చంద్రగిరియందుంపఁబడిన అచ్యుతదేవరాయ లింకొక డుండియుండెను. వీరిలో నెవరు రాజ్యార్హులాయని రాజ్యకర్తయగు కృష్ణదేవరాయలవా రాలోచించుటలో

నెట్టియాశ్చర్యము నుండఁజాలదు. రాయలవా రీవిషయము లన్నిటిని సమగ్రముగ నాలోచించి ముఖ్యముగ నాసమయమున దేశక్షేమమును మనసునం దిడికొని పసిపాపఁడైన తన పుత్రునివాక్కులను మఱచిపోక సమర్థుఁడైన తనకుమార్తె భర్తయగు రామరాజుయొక్క అర్హతలను గమనించి ప్రథమమున తమసోదరుఁ డగు నచ్యుతరాయనికి తానొనర్చిన యక్రమమునకుఁ దగినపశ్చాత్తాపమును చూపి దానికి పరిహారముగ నాతనికి కొంత యుపకారము చేయ నెంచి తనపసిపాపకు సంరక్షకుఁడుగ నల్లుఁడగు రామరాజును యువరాజుగ నియమించి తనసోదరుఁడగు నచ్యుతరాయనియందు రాజ్యాధికారము నిల్పియుండిన నుండవచ్చునని తోచుచున్నది. వీరిలో వీరిద్దరు, రామరాజు అచ్యుతరాయలు వారివారియిష్టప్రకారము ఎవరిమట్టుకు వారే రాజ్యాధిపతులుగ వ్యవహరించుచు శాసనములను తమయిచ్చవచ్చినట్లు ప్రకటించి యుండవచ్చు నని యూహింపనగును. ఈయూహయు కేవలము నిరాధారమై నిరంకుశమైనదిగ నెంచ నవసరము లేదు. పెనుగొండ కైఫీయతునుబట్టి రాయలు తనయవసానకాలమున రామరాజును యువరాజుగనుండి తనసోదరుఁడైన అచ్యుతరాయనికి రాజ్యనిర్వహణమునందు సహాయము చేయవలసినదిగ కోరినట్లు తెలియవచ్చుచున్నది. ఈయంశములనే కొందరు ఇతర హిందు మహమ్మదీయచరిత్రకారులును వ్రాసియుండిరి. అచ్యుతరాయలును తనసోదరుని అంత్యసందేశమును గౌరవించి రామరాజును రాజ్యనిర్వహణమునం దుంచుట కంగీకరించియుండెను. అయితే చరిత్రయందు రాయలయనంతరము విజయనగర

సామ్రాజ్యమును పరిపాలించినది అచ్యుతరాయలా లేక కృష్ణదేవరాయలపసిపాపయైన కుమారుఁడా యనునంశము విచారణీయమే.

శాసనములన్నియు కృష్ణదేవరాయలతరువాత రాజ్యము చేసిన దచ్యుతరాయలే యని స్పష్టీకరించుచున్నవి. ఈవిషయమునే కొందరు హిందూ పోర్చుగీసుచరిత్రకారులును స్పష్టముగ వ్రాసియుండిరి. కాని మహమ్మదీయచరిత్రకారులు మాత్ర మీయచ్యుతదేవరాయలపేరుకూడ బయటికిరానీయక రామరాజే రాజ్యము చేసియుండెనని వ్రాసియుండిరి. మొత్తముమీద దీర్ఘముగ నాలోచించి తనకుమారునిహక్కులను నాశనముగావింపక నాతనిని రామరాజు హస్తమునందుంచి వానిపేర రామరాజును యువరాజుగ నియమించియుండవలెను. అయితే రాజ్యావసరములను గమనించి రాజ్యాధికారమంతయు నచ్యుతరాయలవశము చేసియుండవలెను. ఈక్లిష్టపరిస్థితియందిమిడియున్న స్వారస్యమును గమనించి అచ్యుతరాజు తత్క్షణమే విజయనగరమునకు రాక చంద్రగిరియందేయుండి రాయలవారి మరణానంతరము ప్రథమమున శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామివారి సముఖమునను తరువాత కాళహస్తియందును తిరిగి విజయనగరమునందును ముమ్మారు ముచ్చటగ పట్టాభిషేకమహోత్సవములను గావించికొనియుండెను. అప్పటినుండియు నెవరి సామర్థ్యమును బట్టి వారు సామ్రాజ్యనిర్వహణమునకై ప్రయత్నములుగావింపఁగా, చిట్టచివరకు అచ్యుతరాయలే రాజ్యాధిపత్యమును వహించియుండ వచ్చునని తోచుచున్నది. రాజ్యాధిపత్యము వహించియు నచ్యుతరాయలు రామరాజుతో

సఖ్యతచేసికొని తామిద్దరును రాజ్యనిర్వహణమునందు సమానముగ బాధ్యతను వహించియుండిరని 1535-వ సంవత్సరమున ఫిబ్రవరి 7 వ తేదీగల శాసనమునుబట్టి తెలియవచ్చుచున్నది.

ఈపై యంశములనన్నిటిని సమన్వయము చేసికొన్నచో మూఁడుసంగతులు స్పష్టపడగలవు. తిరుమలరాయఁడు చనిపోయినపిదప రాయలవారు తనతరువాత రాజ్యమేలవలసినవిధమును 1526-వ సంవత్సరముననే యేర్పరచియుండెననియుఁ, వారు జీవించియుండగనే రామరాజు అచ్యుతదేవరాజు తమంతట తామ రాజ్యాధిపతులుగ వ్యవహరించుచుండిరనియు రాయలవారు 1529-30 సంవత్సరమున చనిపోయియుందురనియు వారి యనంతరము అచ్యుతరాయలే పట్టాభిషిక్తుఁడై రామరాజుతో పాటు రాజ్యనిర్వహణబాధ్యతనుఁ వహించియుండెననియు మనము గ్రహింపవలసియున్నది.

11. రాయలభార్యలు: సంతతి.

చరిత్రకారులవలననేమి, రాయలసమకాలికులగుపోర్చుగీసువారివలననేమి, యితరగ్రంథములవలననేమి, రాయలకు మువ్వురుభార్య లున్నట్లు తెలియుచున్నది. వారిపేరులు చిన్నాదేవి, తిరుమలదేవి, అన్నపూర్ణాదేవియు, రాయలజననవృత్తాంతములోవలెనే యాతనివివాహవిషయమునగూడ ననేకచిత్రచరిత్రములు వాడుకలో నున్నవి. వానిలో సత్యాసత్యగ్రహణము చేయుట కడుగష్టము. మొదటి యిద్దఱు భార్యలును రాయలుందాసీపుత్రుఁడని మొదటవివాహమాడనొల్లక వానిం

జంప యత్నించి రనియు నది కొనసాగక యాతని భర్తగ నంగీకరించి రని చెప్పుగాథలలో కొంచెమైనను సత్యమున్నట్లు తోఁచదు. పోర్చుగీసుచరిత్రకారుఁడగు న్యూనిసు వ్రాసిన యుత్తరములవలన రాయలకు చిన్నతనమునందే వేశ్యాసంపర్కములవడినట్లు తెలియుచున్నది. ఈమెయే చిన్నమదేవి.

రాయలవారిపట్టాభిషేకానంతరము యామెకై యొరుల కంటబడకుండ నర్ధరాత్రమున మారువేషమున నామెయింటికేఁగి యామెవద్ద కొంతకాలము ప్రతిరాత్రియుఁగడిపి కోడికూతకు పూర్వమే కోటచేరుచుండెడివారు. ఒకనాడు రాయలు చిన్నమదేవి సమీపముననుండఁగ తిమ్మరసు వీక్షించి యాశ్చర్యనిమగ్నుఁడై యాతనివెంటనంటి వేశ్యయింట ప్రవేశింపఁ బోవుచుండ నాతని గలసుకొని యాతనిని మందలించి రాజ్యాధిపతియగు రాయల కిట్టిది తగ దనియు, శత్రువులకిట్టివిషయము తెలిసిన వారు తుదముట్టింతు రనియు, పరరాజుల కీవిషయము తెలిసిన తమపుత్రికలకువివాహముచేయుట కిచ్చగింప రనియు రాజ్యమునందు పరువుమర్యాదలునశించుననియు ననేకవిధములఁగ రాయలవారికి బోధించియుండెను. రాయలవారు నందులకు లజ్జావనతవదనులై తాముచేయుకార్యము సరియైనదని చెప్పజాలకయు తమలోపమును గప్పిపుచ్చుటకు యత్నించకయు తమకామెపైనున్న గాఢానురాగమే తమప్రచ్ఛన్నప్రవర్తనకు కారణమనియు తాము చిన్నాదేవికి సంపూర్ణముఁగ వశులైతిమనియు నామెను వదలి తానుండజాలననియు రాజ్యభిక్ష నిచ్చి రాజుగాచేసిన యౌదార్యమును మనసునందిడికొని ప్రేమభిక్షనుకూడ పెట్టుమనియు రాయలవారు తిమ్మరసును వేడికొనియుండిరి. ఇట్లు

కోరుచున్న రాయలమనోభావమును గ్రహించినవాఁడై యాతనిప్రేమ నామెనుండి మరలింపజాలనని తెలిసికొన్నవాఁడై రాయలకోరిక కనుమతింపక పోయినచో గొప్పసంచలనము రాజ్యమున బయలుదేరక తప్పదని కనుగొన్నవాఁడై రాయల కోర్కె కొలదికాలమునకె నెరవేర్చెదనని వాగ్దానముచేసెను. కొంతకాలమునకు రాయలకు స్వజాతికన్యయగు తిరుమలాదేవిని వివాహముగావించి పిదప నీచిన్నమదేవినిగూడ వివాహము గావించి యామెను పట్టమహిషినిగాఁ జేసెను.

రెండవభార్యయగు తిరుమలాదేవి రాయలు ప్రథమమున వివాహమైనభార్య. ఈమె వివాహానంతరమే చిన్నాదేవిని వివాహముచేసికొన్నది. తిరుమలాదేవి గజపతిరాజుకూతురని కొందరు చెప్పుదురుగాని అది సరికాదు. గజపతిరాజ్యమును జయించుటకుఁ బోవునప్పటికే వీరిద్దరు భార్య లుండిరిగాన నీమె గజపతిరాజుకుమార్తె యనుట కెట్టియాధారమును లేదు. ఈమె శ్రీరంగపట్టణపు రాజుకుమార్తె యని తోఁచుచున్నది.

మూడవభార్య అన్నపూర్ణాదేవి. ఈమెగజపతి రాజపుత్రిక. గజపతిరాజుతో యుద్ధముచేసి వారిని జయించినపిమ్మట నారాజు తనకుమార్తెయగు జగన్మోహినీదేవినిచ్చి వివాహముగావించెను. ఈజగన్మోహినిదేవియే యన్నపూర్ణాదేవి. ఈమెనే తుక్కాంబ యనికూడ పిలుతురు. ఈమె నేసందర్భములో వివాహమైనదియు నిదివరలో తెలిపియుంటిమి.

ఈముగ్గురుభార్యలుగాక రాయలకు నింక తొమ్మండుగురుభార్యలుండి రని న్యూనిసుచరిత్రకారుఁడు తనచరిత్రలో వ్రాసియుండెను. వారెవ్వరో మాత్రము మనకు తెలియరాదు.

రాయలవారు ఈముగ్గురుభార్యలయందును గొంచెమించుమించుగ సమానప్రేమగలవారై యుండిరి. రాయలవారెచటికేగినను తనభార్యలను వెంటబెట్టుకొనియే పోవుచుండిరి. యుద్ధమునకుఁ జనినపుడు తీర్థయాత్రలు గావించినపుడు మరియెచటికి వెళ్లినను భార్యాసమేతులై వెళ్లుచుండిరి. శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుటకు పోయినపుడెల్ల నీభార్యలు వారివెంటనే యుండిరి. వేంకటేశ్వరస్వామివారి ఆలయమున చిన్నాదేవి తిరుమలాదేవితోసహా రాయలవారి కంచు విగ్రహములు ప్రతిష్ఠింపబడియున్నవి. వీటిని మనమిప్పటికిని చూడనగును. అప్పటికి అన్నపూర్ణాదేవి వివాహముకాలేదనియే మన మూహింపవలెను. అమరావతి శ్రీకాకుళము మొదలయిన క్షేత్రములను రాయలవారు సందర్శించినపుడు వారి భార్యలు వారివద్ద నున్నట్లు మనకు దృష్టాంతములు కలవు. ఈభార్యలు ముగ్గురున్ను వారిలో వారు మిక్కిలి సఖ్యతగలిగియుండిరి.

ఈముగ్గురుభార్యలకు వేర్వేరుగృహము లుండెడివి. వారివారికి ప్రత్యేకముగ చెలికత్తెలు దాసీజన ముండెడివారు. వారిజనానాలోని కితరపురుషు లెవరును రాజాలరు. అచట నుండువారందరును స్త్రీలుగాని నపుంసకులుగాని యైయుండిరి. ఇచటిస్త్రీలు పరాయికంటి కగపడరు. రాజుగారియాజ్ఞలేనిదే పరాయివా రెవ్వరును వీరిని సందర్శించకూడదు. ఈదేవేరుల వద్ద దాదాపు పండ్రెండువందలకు తక్కువగాని స్త్రీజనముండెడి వారు. ఈభార్యలవద్దచెప్పనలవికాని బంగారువెండినవరత్నభరితములు భూషణములుండెడివి. ఇవిగాక హెచ్చుగ ధనమును వీరికి ప్రత్యేకప్రత్యేకముగ నుండెడిది.

మొత్తముమీద నీభార్యలుముగ్గురిలో చిన్నాదేవి యందు రాయలవారికి కొంత హెచ్చుప్రేమయుండెననుటకు సందేహములేదు. ఆమెపైగలప్రేమను బహిర్గతముచేయుటకై యామెపేర నొకపట్టణమును నిర్మించె నని న్యూనిసుచరిత్రకారుఁడు వ్రాయుచు నాపట్టణముపేరు నాగలాపురమని చెప్పియుండెను. ఈపేరునుబట్టి రాయలవారు తమతల్లిపేర నీగ్రామమును కట్టించిరేమోయనుట యెక్కువసమంజసముగ నున్నది. అది యెట్లున్న నీపుర మిప్పటి హాస్పేట అయియున్నది. ఈపురముచుట్టు నొకముచ్చటైన రాతికోటను కట్టించిరి. తమ రాజ్యమునందలి ప్రముఖనాయకుల నందరి నీగ్రామమున తమకు వసతిగృహములను బాగుగ కట్టవలసినదిగ నుత్తరవు నిచ్చిరి. అంత నాపురమున నాయకులందరును పెద్దపెద్దభవనముల నిర్మాణముచేసియుండిరి. ఇట్లు నిర్మాణముచేయబడిన నాగలాపురమునకు వచ్చెడి ప్రతివస్తువుపైన సుంకము నిర్మాణము చేసి యాగ్రామమునకు గొప్ప ఆదాయమును కల్పించెను.

ఈపురమున కిరుప్రక్కల రెండుపర్వతపంక్తులుండెను. ఆపర్వతపంక్తులమధ్య నొకపెద్దచెరువును నిర్మాణము చేయించెను. ఈచెరువునిర్మాణమునకై పోర్చుగీసుదేశమునుండి మంచి కట్టడపుపనివారల పిలిపించి వారిచే నీచెరువును కట్టించెను. ఈచెరువును కట్టించునపుడు కొంతకాలమువరకు పగలుకట్టిన భాగము రాత్రివేళల పడిపోవుచుండెను. అప్పుడు శాస్త్రవేత్తల విచారించినంతలో చెరువు బలికోరుచున్నదని వారు చెప్పి

యుండిరి. అందుపైన బందీలుగనుండి నురిదీయబడవలసిన వారినందరి నాచెరువువద్ద చంపి వారినెత్తుటి నీచెరువుకు బలిగా నిచ్చియుండిరి. తరువాత చెరువుకట్టడము చక్కగ నిలిచి యుండెను. ఈచెరువుకు నీరువచ్చుటకును వచ్చిన నీటి నుప యోగించుటకును రాతిగొట్టములను పెట్టించిరి. ఈచెరువు నందలి నీటివలన భూములను బాగుచేసి మంచితోటలను పైర్లను వేయించి దేశసౌభాగ్యమును వృద్ధిగావించిరి. ఈచెరువుక్రింద వరి గోధుమపంటలు హెచ్చుగ పండుచుండెడివి.

రాయలవారి కిభార్యలవలన మగశిశువు లిద్దఱుజన్మించి యుండిరి. వారిలో నొకరు తిరుమలదేవరాయఁడు. ఈతఁడు ఆరుసంవత్సరముల వయసుగలవాఁడుగ నున్నపుడే రాయల వారు వానిని పట్టాభిషిక్తునిగ జేసెను. కాని విధివశము నీతఁడు మరణించెను. ఈతడు మరణించినపిదప రాయలవారి కింకొక పిల్లఁడు జన్మించెననియు వానినే రాజ్యాభిషిక్తునిగాఁజేయుట కిచ్చగింపక వానిస్థానే రామరాజును యువరాజుగను రక్షణ కర్తగనుంచెనని మహమ్మదీయచరిత్రకారులు వ్రాసియుండిరిగాని పోర్చుగీసువారుగాని యితరసమకాలికులు గాని యీవిషయ మునుగూర్చి వ్రాసియుండలేదు. ఈయిద్దరుతప్ప రాయలవారి కింకెవ్వరును మగసంతతిలేదు. రాయలవారికి మగసంతతి నిల్వకుండుట కొకగాథ చెప్పబడుచున్నది. ఆగాథయందలి సత్యాసత్యముల నిర్ణయింపజాలము. అయిన నీగాథ నీక్రింద వ్రాయుచున్నాను.

రాయలు నర్మదానదికి దక్షిణమునసుండు దేశమును జయించెను. అతనికి లక్షసైన్యముండెను. కృష్ణరాయని గజ

బలముంతయు నొకసామంతునివద్ద నానెగుందివద్దనుండెను. ఆసామంతు నానెగుంది విడిచి మరియొకచోటికిఁ బోవలెనని రాయలవా రాజ్ఞాపించిరి. ఇది వినిన యిద్దరుగోసాయీ లా సామంతుని బంపవలదని రాయలవారి ననేకవిధముల ప్రార్థించిరి. గోసాయి లెంత ప్రాధేయఁబడినను రాయలవారు లక్ష్యముచేయక నాసామంతుని దేశాంతరమునకుఁ బంపివైచిరి. గోసాయి లెంతచెప్పినను వినక వారినవమానించినందులకు నాగోసాయీలు కోపించి సంతానవిహీనుఁడ వగుదు వని రాయలవారిని శపించిరి. అందువలన నీతనికి గల్గిన మగశిశువు లెవ్వరును నిలిచియుండలేదనియు నానెగుందికైఫీయతున వ్రాయ బడియున్నది. ఇందలి నిజానిజములను పాఠకులే వితర్కింప నర్హులు. మొత్తముమీఁద రాయలవారియనంతర మీసామ్రా జ్యమును పరిపాలించుటకు వారిసుతు లెవ్వరును లేరు.

రాయలవారికి తిరుమలాంబ వెంగళాంబ యని యిద్దఱు కూతులుమాత్ర ముండిరి. వీరిద్దఱికిని తగురీతిని విద్యాబుద్ధులు గఱపి వారిని రామరాయ తిరుమలరాయ లను నిద్దరన్నదమ్ముల కిచ్చి మహావైభవముతో వివాహముగావించిరి. ఈరామరాయలే రాయలవారి అవసానకాలమున వారిపసిపాపకు రక్షణకర్తగా నుండి యువరాజుగ నున్నట్లును కొంతకాలము రాజ్య భారము నాపిల్లవానికి రక్షణకర్తగా జరిపినట్లు నిదివరకే వ్రాసి యుంటిమి. రాయలయనంతర మచ్యుతదేవరాయలు రాజై పట్టాభిషిక్తుఁడై రాజ్యముచేసెను. అచ్యుతరాయల,,కాలము నందే తురుష్కులు విజృంభించి రాయచూరును లాగికొనిరి. అచ్యుతదేవరాయలతరువాత నాతనికుమారుఁడు వెంకట్రాయలు

రాజ్యము పాలించెను. అటుపిమ్మట రాయలవారి అల్లుఁడైన రామరాయలు రాజ్యాధిరూఢుఁడై రాజ్యమేలెను. వీరిద్దరును విశేషవిక్రమవంతులుగారు. రామరాయలు తురుష్కులచే 1565-వ సంవత్సరమున తల్లికోటయొద్ద జరిగినయుద్ధమున నోడింపఁబడెను.

తల్లికోటయుద్ధానంతర మీదేశమున నున్న జనులు దిక్కులేనివారై ధనధాన్యములువిడిచి విజయనగరమును వదలి వెళ్లిపోయిరి. ఇంతటితో విజయనగరసామ్రాజ్య మంతరించెను.

రామరాయలయొక్క సోదరుఁడును కృష్ణదేవరాయని రెండవఅల్లుఁడునైన తిరుమలరాయనివంశీయులు చంద్రగిరికివచ్చి దానిని తమరాజధానిగఁ జేసికొని దక్షిణదేశమును పాలించుచుండిరి. 1639-వ సంవత్సరమున చెన్నపురి నింగ్లీషువారి కిచ్చిన శ్రీరంగదేవరాయ లీతిరుమలదేవరాయని ఆరవపురుషుఁడు. వీరివంశీయు లిప్పటికి నానెగొంది సంస్థానాధిపతులుగ నున్నారు.

వీరిద్దరుగాక రాయలవారి కింకొకకుమార్తె మోహనాంగి యను నామె యుండెననియు నామె మరీచీపరిణయమను గ్రంథమును వ్రాసెననియు జెప్పుదురుగాని దీనికెట్టి దృష్టాంతరమును గాన్పింపదు. ఆపుస్తక మిప్పుడు దొరకదు.

12. శ్రీకృష్ణదేవరాయలవారి వ్యక్తిత్వము స్వభావము

ఈభారతదేశమేలినచక్రవర్తులలో చరిత్రకు తెలిసినంత వరకు నశోకుఁడు సముద్రగుప్తుఁడు చంద్రగుప్తుఁడు తప్ప కృష్ణదేవరాయసార్వభౌమునితో పోల్పఁదగిన రాజు వేరొకఁడు లేఁడని నిక్కముగఁ జెప్పనగును. సామర్థ్యమునగాని దూరదృష్టియందుగాని రాజకార్యనిర్వహణమునగాని దేహబలమునగాని

నీతని కెనగుచక్రవర్తి యింకొకఁడు గానరాఁడు. ఈతనియుద్ధములే యితని బలపరాక్రమములను శౌర్యధైర్యములను వేనోళ్ల జాటుచున్నవి. ఈతనిరాజ్యము ఓఢ్రదేశముననున్న పోట్నూరు గ్రామమునుండి కన్యాకుమారి అగ్రమువరకును బంగాళాఖాతమునుండి అరేబియాసముద్రమువరకును విస్తరించియుండెను. ఈదేశమందలి భద్రకారణములే నీతనిరాజ్యకార్యనిర్వహణాచాతుర్యమును సహస్రముఖముల నుద్ఘోషించుచున్నది.

ఈరాజు మిక్కిలి పొడగరిగాని మిక్కిలి పొట్టివాఁడుగాని గాక సమానశరీరముగలవాఁడుగ నుండెను. మంచిరూపము గలిగి కమనీయమైనకాంతిగల్గి ముఖమునందు గొప్పవర్చస్సుతో గూడుకొనియుండెను. కాయము కొంచెము స్థూల మనియే చెప్పవచ్చును. ఈతనికి చిన్నతనమునందె స్ఫోటకవ్యాధివచ్చినందున మొగమంతయు మచ్చలతో నిండియుండెను. ఈతని విస్మితవదనమున ఎల్లప్పుడు సానందము తాండవమాడుచుండెను. రాయలవారు కోపిష్ఠియనియే పేయసుచరిత్రకారుడు వ్రాసియుండెను. కోపమువచ్చినపుడు పిచ్చికోప ముండెడిది. అయినను శాంతస్వభావుఁడనియు మొత్తముమీఁద చెప్పవగును. రాజగుటవలన కీర్తితోపాటు అహంకారము నుండియుండెను. ప్రజలకష్టనిష్ఠురములను తెలిసికొనుటకు రేయి యనక పవలనక యెల్లసమయములయందు సిద్ధముగ నుండెను. విదేశీయుల సన్మానించి వారిని గౌరవించుటయందు గొప్పశ్రద్ధపూని వారికి తనదేశక్షేమసమాచారములఁ దెల్పుచు వారిదేశస్థితిగతుల నారయుచు విదేశములతో వర్తకవ్యాపారము వృద్ధిచెం

బంది దేశభాగ్యము నభివృద్ధిచేసెను. మిక్కిలి ధనపుగనున్నట్లె గనబడుచుండెను. స్నేహితులు విరోధులను విచక్షణలేక యెల్లరు రాయలవారియందు భయభక్తులతో మెలగుచుండెడివారు. ఆతఁడెల్లజనులయందు బరిపూర్ణసామర్థ్యమునుగలిగి సమస్త జనులయందును సమానభావమును జూపుచు నెల్లరచేఁ గొనియాడఁబడుచుండెను.

రాయలు చిన్నప్పటినుండి వ్యాయామములయందు మిగుల కాంక్ష కల్గినవాఁ డగుటచే నెక్కువగ కృషిచేసి దృఢకాయమును సంపాదించెను. ఆతఁ డశ్వారోహణమునందు పాండవసోదరులగు నకులసహదేవుల నైపుణ్యము చాతుర్యము గలిగియుండెనని పారిజాతాపహరణమున వ్రాయఁబడియున్నది. ఆతనివిద్యాచర్యనుగురించి యిదివరకే వ్రాసియుంటిని.

ఆతఁడు గర్విష్ఠుఁడనుటకు సందేహము లేదు. ఆదిల్షాహ తనతో యుద్ధమునం దపజయముగాంచి రాయవారిని సంధి నడుగ రాయవారి కతఁడు చూపిన అలక్ష్యభావము ఆదిల్షాహ తనపాదములస్పృశించి ముద్దిడవలయు నని పెట్టినషరతు నందులకై కానుపడినశ్రమ తనగర్వమును అహంకారమును నిరంకుశత్వమును చాటుచున్నది. ఇంతమాత్రము చేత రాయలు ఉదారహృదయుఁడు కాఁడని గాని దయాపాత్రుఁడు కాఁడనిగాని చెప్పుట కింతమాత్రమును వీలులేదు. ఆతని దివ్యచరిత్రమునందు ఉదారస్వభావము నుదహరించెడిఘట్టము లనేకములు గలవు. అయితే యీవిషయమున మాత్రము రాయలవారి కేలకో నెచ్చుపట్టుదల కల్గి

యుండెను. కొండవీటియుద్ధమునం దపజయము గాంచిన ప్రతాపరుద్రగజపతికుమారుఁడైన వీరభద్రగజపతిని పారిజాతాపహరణ మనుగ్రంథమున చెప్పినట్లు "కరుణామతిఁ గాచె జగత్ప్రసిద్ధిగన్". రాయచూరుయుద్ధమునం దోడిపోయి తురుష్కసైన్యము నదిని దాటి పారిపోవుసమయమున తన సైనికులు నఱుకుచుండ జూచి రాయలవారు తమసైన్యము నట్లు చేయవల దనిచెప్పి వారిజీవముల రక్షించియుండుటలో రాయలవారు తమయౌదార్యమును జూపియుండిరి. ఇట్టివే వీరిచరిత్రయందనేకములైన విశేషఘట్టములను జూపవచ్చును.

రాయలు ధార్మికుఁ డనియు న్యాయపథము ననుసరించెడివాఁ డనియుఁ జెప్పుటకు తా వ్రాసిన ఆముక్తమాల్యద యందు వ్రాసినధర్మనీతియే తార్కాణము. అందు వ్రాయఁబడినధర్మములన్నియు నిదివరలో పెద్దలు వ్రాసినధర్మములే తిరిగి భాషాచాతుర్యముచూపి వ్రాయఁబడినవి. ధర్మములను వ్రాసియున్నందున వానిని వా రనుసరించిరా లేదా యను సంశయము వేరుమాట. వారిమనోగతాభిప్రాయములు వారిచే వ్రాయబడిన ధర్మనియమములవలన తేటపడగలవు.

13. రాజధాని వర్ణన

రాయలవారి మహోన్నత్యమునుగూర్చియు వారికీర్తి ప్రతాపమహిమములగూర్చియు వారిరాజ్యవిస్తీర్ణతను గూర్చి వారిసామ్రాజ్యవైభవమును గూర్చియు వ్రాసినవారు వారి సమకాలికులైన పోర్చుగీసుచరిత్రకారులే. పోర్చుగీసువారు మనదేశమునకు రానిచో మనదేశములోని రాజులలో నెల్లమేటి యని ప్రఖ్యాతివడసి తురకలపాలికి కద్దుపడి యప్రతిమాన

ప్రతాపముచే వారల నోడించి తా నపజయ మనునది యెట్టిదో యెఱుఁగక యిరువదియేండ్లు మహావైభవముతో రాజ్యముచేసి 1530-వ సంవత్సరమునఁ గీర్తిశేషుఁడైన యీమహారాజచరిత్ర మనచెవిని బడెడిది కాదు. సమకాలికులైన పోర్చుగీసువారిలో రాయమూరువద్ద రాయలవారికి తోడ్పడిన "ఫిగరీడో" యను రాయబారి వెంటవచ్చిరి పేయసనునాతఁడు రాయలరాజ్యమును చక్కఁగ వర్ణించెను. దానిని విపులముగ నెఱుంగఁగోరువారు తెనుఁగున "వీరభద్రరావు"గారు రచించిన "జీర్ణకర్ణాటకరాజ్య" మను గ్రంథమును, నాంగ్లేయభాషయందు "సూయెల్" లనువారు వ్రాసిన "విస్మృత సామ్రాజ్య"మను (The Forgotten Empire) గ్రంథమును జదువవలెను. ఆ పుస్తకములలోని యంశములు కొన్నిటి నిందు వ్రాయుచున్నాను.

నగరద్వారములు

"పట్టణమున కాఱుమైళ్లయావలినుండి యడ్డముగ డెబ్బదిమైళ్లపొడవున వ్యాపించి నగరమునుజుట్టియున్న పర్వతమాలికనుండియే పట్టణములోని కందందు మార్గము లున్నవి. ఇవియే నగరద్వారములు. ఇవితప్ప నగరప్రదేశమునకు మార్గాంతరములు లేవు. బలిష్ఠములైన ప్రహారు లీపర్వతశ్రేణులనడుమ నున్న సమతలముల నావరించి కొండల నొండొంటితో బంధించి యున్నవి. ప్రజలు నడుచుటకు మంచి బాటలు కలవు. అవి యీప్రాకారద్వారముల మూలముననే పోవుచున్నవి. ఆద్వారములు వీరభటసంరక్షితములై యుండును. పర్వతమాలికలలో నందందుగల సరోవరములు నగరములోని తోటలకును వరిపొలములకును జీవనాధారములై యున్నవి.

నాగలాపురద్వారము

పశ్చిమదిశనుగల ద్వారములలో నాగలాపురము (Hospet) ద్వారముదగ్గఱ నున్నది. గోవానుండి వచ్చెడి బాట యొక్కటి యీద్వారముననే విద్యానగరమును బ్రవేశించుచున్నది. కనుక నిది బలాఢ్యములగు ప్రహారులతోడను దుర్గములతోడను సుభద్రమై యున్నది. కోటగోడకుఁ బార్శ్వభాగమున జలప్రపూర్ణములైన యగడ్తలుగలవు. రాజసదనమునగరమధ్యప్రదేశమున నున్నది ఆప్రదేశభాగమున రాజ్యభవనము వఱకుఁగల వీథులు - దండనాథులయు - సామంతప్రభువులయు-మనోజ్ఞములైనసౌధములచే నొప్పుచుండును. గృహములు నానావిధచిత్రములచే నలంకృతములై రామణీయకములై విరాజిల్లుచున్నవి. రాజాంతఃపురభవనమునకు ముందుభాగమున సువిశాల సమతల మొండు గలదు. నగరమధ్యమున నుండుటచే నీసమతలము మిగుల ప్రయోజనసార్థముగ నున్నది. రాజనగరము పోర్చుగల్ దేశపురాజధానియైన లిస్బను (Lisbon) నగరదుర్గమున కంటె నధికస్థల మాక్రమించుకొని దుర్భేద్యమును సురక్షితమునునగు ప్రహారిచే నొప్పియున్నది. మఱికొంతదూరము పోవునెడల సుందరతరములగు సౌధవాటికలచేఁ జెలువొందెడు నింకొకవీథి వచ్చును. అది ధనాఢ్యుల కావాసభూమి. అందు నవరత్నములును నానావిధవస్త్రములును ప్రపంచమునంగల ప్రతివస్తువును వెలకు లభించును.

"ఈనగరమున ననర్ఘములైన మణులయు వజ్రములయు వ్యాపార మత్యధికము. ఇందుచే నిం దన్ని తెగలవారును జేరుట కవకాశ మేర్పడుచున్నది. ఈనగరవైశాల్య మొక

వైపునుండి నిర్ణయించుట యసాధ్యము. నే నొకపర్వత మెక్కి కొంతవరకు విస్తారభాగము చూచినాఁడను. నగరమంతయు ననేకపర్వతశ్రేణులనడుమ నుండుటచేఁ గొంత ప్రదేశము మాత్రమే నాకు గోచరమయ్యెను. నేను చూడఁగల్గినభాగము రోము (Rome) నగరమంత యుండి కడుమనోజ్ఞముగనున్నది. దానిలో వనములు తటాకములు నీటికాలువలు నున్నవి. తురకవీథికిఁ దరువాత నొక కాలువ ప్రవహించుచు జాము నారింజ నిమ్మ పనస పోఁక మామిడి మున్నగుతోటలకు సమృద్ధిగ జీవనము నొసఁగుచు వానిని చక్కగ బెంచి యాభాగము నొక మహారామసదృశముగ నొనర్చినది. అసంఖ్యాకముగను నగణితముగను నున్న యీమహానగరసంఖ్యను గూర్చి నే నిం దుదాహరింపను. అది యతిశయోక్తిగ నగపడునేమో యని భయము.

"విజయనగరము లోకమునందలి సమస్తవస్తుసముదాయమునకు నాకరమగు పట్టణము. పలుదెఱఁగులైన ధాన్యము లిందు సమృద్ధముగ ఫలించి మిక్కిలి చౌకగ లభించును. గోదుమపంట తక్కువ. ముఖ్యములైన పండుగదినములలో రాయలు విద్యానగరమున నుండి సనాతన సంప్రదాయానుసారము విందులు వినోదములలోఁ బాల్గొనును. ఈయుత్సవసందర్భములందుఁ బ్రభుత్వమువారు సామ్రాజ్యమునఁగల మహారాజులు రాజులు దండనాయకులు మొదలగు వారిని కుటుంబపరివారసహితముగ నాహ్వానింతురు. రాష్ట్రమునందలి యాటకత్తియల నందఱను బిలిపింతురు. కాని యుద్ధ

మునకు వెళ్లియున్నట్టియు సామ్రాజ్యపుమేరలను గావలియున్నట్టియు సేనలనుమాత్రము రప్పించుట లేదు."

ఈవిషయమునుగూర్చి వ్రాయుచు "డాక్టరుబార్బోసా" యనుపోర్చుగలుదేశస్థుఁ డీనగరము నైశ్వర్యమును నౌచిత్యమును ఉత్కృష్టతనుగూర్చి నీవిధముగ వ్రాసియుండెను.

"వీథులను చౌకులును మిగుల విశాలములైనవి. అన్ని దేశములయు అన్నిమతములయు జనులు తఱచుగ నీ నగరమునందుగూడి మిక్కిలి క్రిక్కిరిసి లెక్కకుమీరి యుందురు. ఈపట్టణమున వ్యాపార మపారముగ జరుగును. పెగు (Pegu) నుండియు లంకనుండియు దిగుమతియైనసొమ్ము లనేకము లిందు గలవు. నరసింగ (విద్యానగర) రాజ్యమున నొక వజ్రపుగనియు దక్కనురాజ్యమున మఱియొక్కటియు నున్నందున నీదేశములోనే వజ్రము లనేకములు గోచరించుచున్నవి. ఆర్మజు (Ormuz) కీలం (Coel) దేశములనుండి దిగుమతియగు ముత్యములును చిన్నముత్యములును జరిగబుట్టాలపట్టును రక్తాంబరములును పగడములును విశేషముగ నిందుఁ గన్పట్టును. రాజకీయోద్యోగులతోడను గవర్నర్లతోడను రాజ్యాంగ వ్యవహారములనుగూర్చి మాటలాడుగృహ మొకటి రాజున కున్నది. వారందరును బోయీలు మోసికొనితెచ్చు వెలగల పల్లకీలలో వచ్చుచుండిరి. పల్లకులను గుఱ్ఱపురౌతుసమూహములును, రాజనగరద్వారముకడ నెల్లప్పుడు పడిగాపులుండును. సొంతపైకముతో కొన్న గజాశ్వములలో నీరాజునకు వలయు 900 యేనుగులును 20,000 కంటె నెక్కువైనగుఱ్ఱములును నిలువయుండును."

విజయనగరము కొండలచేఁ జుట్టఁబడియున్నది. ఈ కొండలలోఁ బట్టణము లోపలికి వచ్చుటకును వెలుపలికిఁ బోవుటకును వీలైన మార్గము లున్నవి. ఇవి తప్ప నీ పట్టణమునకు వేఱుమార్గములు లేవు. ప్రతిమార్గము మొదటను నొకగుహ యున్నది. అచ్చట మార్గరక్షణార్థమై నియమింపబడిన కొందఱుభటు లుందురు. ఈకొండలనడుమ ననేకజలాశయములును సారవంతములైన పెక్కుభూములును గలవు. పశ్చిమమున నాగలాపుర మను నొకగొప్పపట్టణము కట్టఁబడియున్నది. అది కొండలచేతను బురుజులచేతను సురక్షితమై యున్నది. ఇచ్చటనే రా ణెప్పుడును నివాసముచేయుచుందును. ఇందుచే నచ్చట వర్తకము వృద్ధియై యాస్థానము పెక్కురు వర్తకులు నివసించు చోటయ్యెను.

ఆయూరినడుమ నొకపెద్దచెఱువు త్రవ్వఁబడియుండెను. ఇప్పుడు మన మినుపగొట్టములగుండ నీరు దెప్పించుకొనునట్లప్పు డచ్చటివారు రాతిగొట్టములగుండ నీరు దెప్పించుకొనుచుండిరి. ఇచ్చట నొకదేవాలయము గట్టింపఁబడినది. ఈనాగలాపురమునుండి విజయనగరమునకుఁ బోవుమార్గమున నిరుప్రక్కలను బాటసారుల సుఖముకొఱకు ననేకవృక్షములు నాటఁబడియుండెను. విజయనగరముచుట్టును బలాఢ్యమైన గోడ యొకటి గలదు. ఈగోడను జుట్టుకొని యనేకములైన తోఁటలును వరిపొలములు నున్నవి. ఈగోడకు కొంచెము దూరముగా నింకొకప్రాకారము గలదు. విజయనగరము సందంతటను చెక్కుచక్కనిగృహములును ఉన్నతములైన మేడలును నేత్రానందకరములయిన మందిరములు నున్నవి.

ఈపట్టణమున రాయల కొక విశాలభవనము గలదు. ఇది పోర్చుగీసువారి రాజధానియైన "లిస్బన్" అనుపట్టణముకంటె నెక్కువచోటు నాక్రమించుకొనియుండెను. ఇది మిగుల బలాఢ్యమై దుర్భేద్యముగా నుండెను. ఈమందిరమును దాఁటినవెంటనే రెండు గొప్పదేవాలయములు గనఁబడును. అందొకదానిలోఁ బ్రతిదినమును గొఱ్ఱెలను మేఁకలను బలి యిచ్చునాచారము గలదు. సంవత్సరమున కొకసారి యాదేవునకుత్సవము గావించి యనేకవిగ్రహములతో నీదేవుని రథ మెక్కించి యూరేఁగింతురు.

కొన్నివీథులలో ననేకవిధములరత్నములను విలువగల వస్త్రములను విక్రయించెదరు. ప్రతిదినము సాయంకాలము జరుగుసంతలో నశ్వాదిజంతువులను ఫలములను శాకములను నింకను ననేకవిధవస్తువులను విక్రయించెదరు. అచ్చటవలయు వస్తువులన్నియు దొరకును.

ఈనగరములో నొకమూలను "మూరు"లను తురుష్కులు నివసింతురు. వీరు రాయలవద్ద వేతనములు గొని సైనికులుగా నుండిరి, ఇచ్చట వజ్రములు మొదలగు నమూల్యమణుల వర్తకము విరివిగా జరుగుచుండెను. ఇచ్చట దొరకని వస్తువే లేదు. గువ్వలు పావురములు మొదలగు పక్షులను విక్రయించెదరు. అచట నదులనుదాఁటుటకై గుండ్రముగా తోలు చుట్టబడిన "పుట్టి" యని పిలువఁబడు నొకరకము పడవలు కలవు. ఇవి గుండ్రముగనుండి ప్రవాహమున గిరగిరఁదిరుగుచుఁ బోవును. ఈపుట్టినిఁబట్టియే "నీపుట్టిమునుఁగ" యనుసామెత పుట్టినది. ఈనగరమున విట్ఠలాలయము, విరూపా

తాలయము నను రెండుగొప్ప దేవళములు గలవు. ఇవి యాత్రికులచే దొడ్డమహిమగలవిగా నెన్నబడుచుండెడివి. ఈదేవాలయములకు పెద్దపెద్దగోపురములు గలవు. గోపురములపైఁ జిత్రములైన యనేకవిగ్రహములు చెక్కఁబడినవి. మూలవిరాట్టుండు గర్భాలయములోనికి బ్రాహ్మణులు దప్ప తక్కినవారు పోఁగూడదనునియమము గలదు. ఏఁటేఁటను జరుగునుత్సవములకు రాజు విజయనగరమునకు వచ్చియుండును. ఆయుత్సవదినములందు స్త్రీలు తమనృత్యములను, మల్లురు మల్లయుద్ధములను, నటులు నాటకములను, మాంత్రికులు (గారడీవాండ్రు) తమ వినోదములను జూపి రాజుచే తమతమయోగ్యతకుఁ దగురీతి సమ్మానింపఁబడుచుందురు. రాత్రులయందు బాణసంచును గాల్చెదరు.

యుద్ధముచేయుటకు పదిలక్షలసైన్య ముంచబడినది. ఇంకను గావలసిన నెక్కువగా రప్పించుసామర్థ్య మీరాజునకుఁ గలదు. అప్పుడు సేనాను లద్భుతపరాక్రమముగలవారును మిగుల ధనికులు నై యున్నారు. సేనాధిపతులే సైన్యములకు జీతము లిచ్చెదరు.

నాగలాపురమునుండి యీశాన్యదిశగా విశాలమైన మార్గ మొకటి కమలాపురముద్వారా విద్యానగరరాజమందిర ప్రాంగణమువరకు వెళ్లుచుండెను. ఈమార్గమున నాగలాపురమున కొకటిన్నరమైలుదూరమున శ్రీకృష్ణదేవరాయనిచే నిర్మింపఁబడిన యనంతశయనాలయము కలదు. ఈయాలయమునకు సింహద్వార ముత్తరాభిముఖమై యున్నది. ఇందలి గర్భాలయము చతుష్కోణాకృతిగల పెద్దమండపము. ఈదేవా

లయమునందు విష్ణువిగ్రహమును ప్రతిష్ఠించుట కుద్దేశింపఁబడెను. కాని యేకారణముననో యీవిగ్రహ మిప్పుడు పాలెల్లిలో నున్నది. ఈయాలయముయొక్క గోడ లిప్పుడు శిథిలావస్థయందున్నవి.

నాగలాపురమునకు రెండున్నర మైళ్ల దూరమున మల్పవగుడి యను గ్రామ మున్నది. ఈగ్రామమునకు కొంత దూరమున చేనిలో వలయాకారముగల్గి షట్కోణాగారరూపమున నెనిమిదికమానులతో నిర్మింపఁబడిన వసారా యను వసారావరకువచ్చుటకు రాతిసోపానములనుగల్గి చూపఱకు నయనోత్సవదాయకముగ నుండెడిబావి యొకటి కలదు. ఆబావి నొక వారకాంత త్రవ్వించెను. దీనిపేరు సూళెయబావి. ఇచ్చటికి సమీపముననే మహమ్మదీయనాయకులసమాధులు కొన్ని గలవు.

ఈవీథి మిక్కిలి విశాలవంతమై నిరుపార్శ్వముల నిండ్లవరుసలు కడుచక్కగ నిర్మింపబడియుండెను. బాటసారులకు నీడ నొసగు పెద్దపెద్దవృక్షము లీబాటవెంబడి పెంచబడెను. ఈవీథియందు వరుసగ ననేక వస్తుసామగ్రులను విక్రయించెడి యంగడు లుండెడివి. ఈమార్గమునవచ్చెడివర్తకులపై సుంకములను వసూలుచేయుట కొకసుంకగృహ ముండెడిది. ఈవీథి జనాకీర్ణమై కిటకిటలాడుచుండెడిది. ఇప్పు డీచిహ్నము లేవియు నచటఁ గనబడవు.

క్రీడాగృహము

కమలాపురమునుండి కంప్లిమీఁదుగ వాయవ్యమూలగ వెళ్లినచో అంతఃపురావరణమును అంతఃపురస్నానగృహము

నున్నవి. ఈగృహము మిక్కిలి రామణీయకముగ నున్నది. పాలరాతితో తయారుచేయఁబడియున్నది. పైనకములము చిత్రింపఁబడియున్నది. మహమ్మదీయపద్ధతిలో నీగృహము తయారుచేయఁబడియున్నది. దీనికిచుట్టు నొకగోడ కలదు. అందు నాల్గువైపుల ద్వారము లున్నవి. ఈమందిరమధ్యమున ముప్పదియడుగుల చదరమై యేడడుగుల లోఁతుగలట్టియు స్నానగృహమునుండి దిగుటకు సోపానములుగలట్టియు రాతి గొట్టములతో తుంగభద్రానదినుండి తేఁబడిన నీటితో నింప బడినట్టియు రాజును వారియంతఃపురకామినులును వినోదార్థ మేతెంచి జలక్రీడలగావించునట్టియు క్రీడాగృహ మొకటి కలదు.

నీటికొలను

ఈస్నానగృహమునకుఁ బశ్చిమమునను నచటికి సమీపమునను ఎనిమిదడుగులలోఁతు గలిగి ముప్పదిగజముల వెడల్పు గల్గి దాదాపు నూరుగజములపొడవుగల నీటికొల నొకటి కలదు. దీనికిని రాతిగొట్టముల మార్గమున తుంగభద్రానదినుండి నీరు వచ్చును. రాజాంతఃపురమున నివసించెడిపరివార జనమునకును రాజదర్శనార్థమైవచ్చిన నితర ప్రముఖవర్గమువారికి నిది స్నానార్థమై యుపయోగింపఁబడెడిది. ఇచటనే యీఁత పందెములుకూడ జరుగుచుండెడివి.

మజ్జనశాల

ఈస్నానగృహమున కనతిదూరమున నొక మజ్జనశాలయు చంద్రశేఖరునిదేవాలయము నున్నవి. మజ్జనశాలయం దొక చిన్నకొలను కలదు. మజ్జనశాలలో నేకశిలామయమగు నొక

కల్లనిరాతి తొట్టె యుండెను. ఈతొట్టెలో పండుగదినములలో పాలుపోసియుండెడివారు. ఈక్షీరము నచటికి యుత్సవ సందర్భమున వచ్చెడి బీదజను లుపయోగించుచుండెడివారు. అచ్చటనే యింకొక రాతితొట్టెయు దానిచుట్టు ననేకరాతి ఫలకము లుండెడివి. ఈరాతిఫలకములయందు భోజనము చేయుటకు వీలుగనుండునట్లు పల్లములు చేయబడెను. ఈ పల్లములైన రాతిపలకలయందు బీదలు భోజనము చేయుటయు రాతితొట్టెలోని నీటిని త్రాగుటయు సాధారణముగ నుండెడిది.

కృష్ణదేవరాయలు ప్రథమమున గజపతిరాయలతో యుద్ధముగావించి జయించినపుడు తనయంతఃపురస్నానగృహమునకు వాయవ్యమూలను తనవిజయమును సూచించు విజయమందిరము నొకదానిని కట్టించెను. దీనినే "దసరాదిబ్బ" యనియు పిలిచెడువారు. ఇదియే సింహాసనవేదిక. ఈవేదికయం దిముడ్పఁబడిన శిల్పకళ యద్భుతమైనది. వేదికకు క్రింద భాగమున నైదువిగ్రహములు చిత్రింపఁబడినవి. వీటిని జను లందరు పంచపాండవులవిగ్రహము లని తలంతురు. ఈవేదికకు చుట్టుఁగల రాతియం దసంఖ్యాకములగువిగ్రహములు చిత్రింప బడియుండెను. ఆనాటివేషములు వస్త్రవాహనాదికములు చరిత్రవిశేషము లావిగ్రహముల రూపమున ప్రకటింపఁబడెను. యశ్వారోహణము వీరులయూరేగింపులు వేశ్యాంగనలనృత్యములు మృదంగవాయిద్యములు వేఁటకాండ్ర మృగయావినోదము లీరాతిఫలకములయందు మిక్కిలి మనోహరముగ చెక్కఁబడినవి. ఆకాలమున దసరామహోత్సవమున జరిగెడి వినోదములన్నియు నచట చిత్రింపఁబడెను. ఈవిగ్రహము

లన్నియు బహురామణీయకములై మనోహరములై హృదయ రంజకములై యొప్పారుచుండెను. ఈదేశమునం దింతటి యపూర్వమగుచిత్రములు మరియెందు కేచటను గానరావు. తెల్లని రాతియందీవిగ్రహములు విస్పష్టముగను స్ఫుటముగను కనబడుచున్నవి.

రాజసందర్శన గృహము

ఇచటికి సమీపముననే రాజసందర్శనగృహ మొకటి కలదు. ఇచట మహార్నవమి యుత్సవసందర్భమున రాజు వేదికపైఁ గూర్చుండ రాజును సందర్శింపవచ్చిన సామంతనృపులు, దండనాయకులు, నాయకులు శ్రీమంతులు విదేశరాయబారులు, సంచారులు, చరిత్రకారులు, కవులు, గాయకులు మొదలయినవా రొక్కరొక్కరుగవచ్చి వారివారి కానుకలను రాజుగారి కొసంగెదరు. ఇచటనే రాయలభార్యలు నవరత్నఖచితసర్వాభరణాలంకృతలై బంగారుకలశముల చేతబూని కరదీపికాసహస్రములు వెలుంగ రాజచంద్రునకు నీరాజన మర్పింతురు. ఇచటనే లలితకళాప్రదర్శనములకు నవకాశ మొసంగఁబడుచుండెను.

హజారరామాలయము

రాజగృహమునకు ముందర నీరామాలయ మున్నది. రాయలవారు సూర్యోదయకాలముననే స్నానమాచరించి యంతఃపురావరణమున నున్న దేవాలయమున కరిగి కులాచారానుష్ఠానవిధులఁ దీర్చుకొనెడివారని "పేయసు" చరిత్రకారుఁడు వ్రాసియుండెను. ఆయాలయమే రామాలయమై యున్నది. ఈయాలయము రాజనగరునకును రాజగృహమునకును ముందుగ నున్నందున "హజారరామాలయము" అని

పిలువఁబడెను. ఈగుడిలో నొకద్వారముయొక్క కుడిపార్శ్వమున నున్న గోడమీఁద వ్రాయఁబడిన శాసనమువలన నీదేవాలయము కృష్ణదేవరాయనిచే క్రీ. శ. 1513-వ సంవత్సరమున చైత్రశుద్ధపంచమినాఁడు నిర్మింపఁబడినట్లు తెలియుచున్నది. రాయ లాసమయముననే యీ దేవాలయ కైంకర్యమునకై నైదూళ్లు మాన్యముగ నిచ్చియొక చెఱువును త్రవ్వించి ధారాపూర్వకముగ సమర్పించియుండెను.

ఈదేవాలయముయొక్క నడుమటిభాగమున రామచంద్రవిగ్రహ మున్నది. కొంతభాగము నల్లటిరాతిచేతను మరికొంతభాగము పసుపులనీలములు చేరి యాకుపచ్చవర్ణముగల రాలచేతను కట్టఁబడియున్నది. ఈదేవాలయమునందలి గోడల మీదను పైకప్పులమీదను ననేకచిత్రములను చిత్రించి వాటి కిప్పటికిని వన్నెమాయనిరంగులు వేసియుండిరి. పైభాగమంతయు యుద్ధసంబంధములైన చిత్రములతో నింపఁబడెను.

రాణీమందిరము

ఈదేవాలయమున కుత్తరభాగమున పెద్దప్రాకారము గల్గిన పెద్దయావరణ గలదు. ఆయావరణమున మధ్యభాగమున విశాలమైన రాణిమందిర ముండెడిది. అంతఃపురస్త్రీలు తమ్ము తరులు చూడకుండ నిందు వసించుచు బయటనుండు చిత్రములు గమనించుటకు వీలుగనుండున ట్లీమందిరము తయారుచేయఁబడెను. ఇప్పు డిదియంతయు శిథిలమంది యున్నది.

మంత్రాలోచనమందిరము

ఈ యావరణమున నిప్పటికిని నిగ్గులుగుల్కుచు నిన్న నేఁడు కట్టినట్లు చూపరుల కానందజనకమైయున్న రెండంతస్తుల

సుందరతర మగు పాలరాతి మేడయొకటి కలదు. ఇదియే మంత్రాలోచనమందిరము. ఇందు స్తంభములు హెచ్చుగ నున్నవి. ఈభవననిర్మాణమునందు హిందూమహమ్మదీయశిల్ప నైపుణ్యములు సమ్మేళనము నొందినవి.

గజశాల

ఒక్కొక్క గజమునకు వేఱువేఱుగా నొక్కొక్కగది చొప్పున మిగుల బలమైన గోడలతో నున్నతములై విశాలములగు నంతరములు గల్గి సుమనోజ్ఞము లయిన గోపురములతోఁ గూడిన యొకగజశాల యేర్పాటుచేయఁబడియున్నది. ఈగజశాలయందు పదునొకండేనుగు లుండుటకు పదునొకండుగదులున్నవి. ఇందులో మధ్యగదికి పైన నొకచదరపుబురుజు కలదు. బహుశః ఇది పట్టపుటేనుగశాలయై యుండవచ్చును.

దస్తరముకొట్టు

ఇచటికి సమీపముననే రాజకీయపత్రములు నితరములగు కాగితములను దస్తరములయందు కట్టగట్టియుంచుటకై యొక కొట్టు కట్టఁబడియుండెను. ఈకట్టడపువసారాలో కరణములు తమలెక్కలను తయారుచేయుచు కూర్చొనియుందురు.

పొలిమేరదేవత

ప్రాకారమునకు వెలుపలిద్వారమున కావలివైపున రెండుదేవాలయము లుండె ననియు నందొకదేవాలయమున నొకదేవత కనేకములైన గొఱ్ఱెలను బలియిచ్చుచుండిరనియు "పేయసు" చరిత్రకారుడు వ్రాసియుండెను. ఆదేవాలయములలో||నొకటిమాత్రమే యిపుడు కనబడుచున్నది. అదియే పొలిమేరదేవత.

మసీదు

రాజనగరమున మహమ్మదీయులు నివసించుట కొక ప్రత్యేకవీధియు వారుతమదేవుని ప్రార్థనచేయుట కొకమసీదును నిర్మింపఁబడియుండెను. విజయనగరాధీశులు పరాయి మహమ్మదీయరాజ్యములతో కయ్యమునకు కాలుఁ ద్రవ్వియున్నను తమరాజ్యమున నివసించెడి మహమ్మదీయులతో సామరస్యభావముతో నుండియున్నట్లే నిదర్శనములు చాటుచున్నవి.

టంకశాల

రాజసందర్శనశాలకు నైరృతిదిశను ప్రభుత్వపు టంకశాల యుండెడిది. ఇది యిప్పుడు నాశనముచేయఁ బడినది. గోడలు మాత్ర మిపుడు చూడనగును.

నరసింహవిగ్రహము

పంపాపురమార్గమధ్యమున నొక పొలమున నరసింహవిగ్రహ మున్నది. శ్రీకృష్ణదేవరాయలవారు 1525 వ సంవత్సరమున నీవిగ్రహము నేకశిలలోఁ జెక్కించినట్లును తదీయారాధనకై కొంతమాన్య మిచ్చినట్లును నొకశాసనమువలన తెలియవచ్చుచున్నది. ఈవిగ్రహమునందలి కొన్ని ముఖ్యభాగములు పగులఁగొట్టఁబడినవి. నరసింహస్వామి ముక్కు లేకుండుటచే నిపుడు చూచుటకు భయంకరముగ నుండును. ఈవిగ్రహభాగములు కొన్ని కుప్పలుగ నిప్పటికిని చూడనగును.

పంపానగరము: హంపి

ఈపంపాపురము పూర్వపు విద్యానగరరాజుల ప్రధాన పట్టణము. విరూపాక్షుని దేవాలయ మిచట నుండుటవలన నిది

దక్షిణకాశి యని ప్రఖ్యాతి వడసినది. ఈపట్టణము కొండల మధ్యభాగమున నొక చదును పీఠభూమిపై నిర్మింపఁబడిన పట్టణము. అది రాయలవారు రాజ్యముచేసిన కాలమున జనాకీర్ణమై కిటకిటలాడుచుండెడిది. ఈపట్టణముయొక్క జనసంఖ్య దాదాపు ముప్పదిలక్షలు. ఈపట్టణముయొక్క యుత్తరభాగమున తుంగభద్రానది యతివేగముతో నిరుకైనకొండల మధ్య గొప్పప్రవాహముతో పారుచుండును. ఇచటి కొండప్రదేశమున మిక్కిలి నునుపైనరాళ్లు దొరికెడివి. ఈరాళ్లవలన నాకాలమున శిల్పకళ మిక్కిలి వ్యాప్తిచెందియుండెను. ఈమెత్తనికాంతులతో విలసిల్లు రాతితో నీపట్టణమున నాకాలమున ననేకభవనములు నిర్మింపఁబడెను.

"పంప"యనునామము పురాణప్రసిద్ధము. తుంగభద్రకిది వేఱొక నామము. పంపాదేవినిగూర్చి యొక గాథ కలదు. పంపాదేవి బ్రహ్మకుమార్తె యనియు నామె యీ మాల్యవంత పర్వతప్రాంతములోఁ జరించుచు నచటనచట పూచినపుష్పముల సేకరించి యచటి ఋషిపుంగవులకు మిక్కిలి భక్తితో సమర్పించుచుండెననియు నామెభక్తికి మెచ్చి ఋషిపుంగవులు వరమిచ్చిరనియు నావరప్రసాదమున మహాదేవుఁడగు విరూపాక్షదేవుఁ డీమెకు భర్త యాయె ననియు పంపావిరూపాక్షు లిద్దరును భార్యాభర్తలుగ నీ పంపానగరమున నుండిరనియు వారికి విరూపాక్షదేవాలయ మిచట నిర్మింపఁబడెననియుఁ జెప్పుదురు. విరూపాక్షునికి రెండవభార్య భువనేశ్వరి. ఇద్దరుభార్యలతో విరూపాక్షుఁడును నీయాలయమునఁ బ్రతిష్ఠింపఁబడిరి. ఈపంప యను నామమే కన్నడభాషయందు హంప యనియు లోకుల

నోటబడి హంప "హంపి" యాయెననియు, దీని నిపుడు హంపీ నగరముని వాడుచున్నారని తెలియుచున్నది. ఈహంపీ నగర సామ్రాజ్య శిథిలములన్నియుఁ జూడనగును.

విరూపాక్షాలయము

విరూపాక్షునికి నిర్మింపఁబడిన దేవాలయము మిక్కిలి పురాతనమైనది. శ్రీకృష్ణదేవరాయలవారు తమపట్టాభిషేక మహోత్సవసందర్భమున నీదేవాలయమున రంగమండపమును నిర్మించి పూర్వోత్తరద్వారగోపురములను కట్టించిరి. తూర్వాన శ్రీకృష్ణదేవరాయల యాజ్ఞానుసారముగ నత్యున్నతమైన గాలిగోపురము నొకదానిని విట్టప్పయనుశిల్పి కట్టెను. ఈదేవాలయమునకు దగ్గఱనే భువనేశ్వరాలయమును కలదు.

విరూపాక్షాలయపు గాలిగోపురమున కెదురుగనున్న వీథి మిక్కిలి పెద్దదై యున్నది. ఇది ముప్పదియైదడుగులవెడల్పు గలిగి దాదాపు పెనిమిదివందల గజములపొడవు గలదియై యున్నది. ఈవీథి కిరుప్రక్కల ముఖ్యులైన రాజ్యాధికారుల భవనము లుండెడివి. ఇచటనే రాజమందిరము నుండెను. ఉత్సవసమయములలో రాయలవారిమందిరప్రాంగణమున నుండి కూడ వినోదముల వీక్షించుచుండి రని "పేయసు" చరిత్రకారుఁడు వ్రాసియుండెను.

ఈపురవైభవమునుగూర్చి వ్రాయవలయునన్న నెంతైనను వ్రాయవచ్చును. ఆకాలమున నీవైభవమును జూచినచరిత్రకారు లీవిషయమునుగూర్చి వ్రాసి తమతమదేశపురాజులకుఁ బంపి ప్రకటించియుండిరి. ఆచరిత్రలన్నియు నిప్పటికి ప్రకటింపఁబడియే యున్నవి. ఈవిషయములనుగూర్చి యెక్కువగా

తెలిసికొనఁగోరు వారాయాచరిత్రలను జదివి యానందింతురు గాక. ఈచిన్నిపొత్తమునం దింతకంటె విపులముగ వ్రాయుట కవకాశము లేదు.

తిమ్మరసు మంత్రి

ఈతఁ డఖండ ప్రతిభాశాలి, అనుపమధీవిశాలుఁడు, ప్రచండ రాజకార్యధురంధరుఁడు. అప్రతిమానరాజనీతి శాస్త్రజ్ఞుడు. నిరుపమానప్రతిభాధుర్యుఁడు.

ఇతనిపేరు తిమ్మరసు. ఇంటిపేరు సాళువవారు. ఇతని గోత్రము కౌండిన్యసగోత్రము. ఇతఁడు వేమరాజునకు పౌత్రుఁడు; రాచిరాజునకు పుత్రుఁడు; నాదెండ్లవారిదౌహిత్రుఁడు.

పేరునుబట్టియు, నింటిపేరునుబట్టియు, నీతఁడు క్షత్రియ వంశీయుఁడని కొంద ఱూహించుచున్నారు. తిమ్మరసులోని "అరసు" శబ్దము కర్ణాటభాషలో రాజశబ్దమునకుఁ బర్యాయ పదము. తిమ్మరాజును తిమ్మరసని పిల్చెడివారు. వీరిపూర్వికులు మొదటినుండియు సాళువవంశజులైన రాజులవద్ద మంత్రులుగ నుండెడివారు. సాళువవంశజులు క్షత్రియులైనందునను తిమ్మరసుపేరులోని "అరసు"రాజపదముయొక్క పర్యాయపదమైనందునను నీ తిమ్మరసు క్షత్రియుఁడని వ్రాసియుందురే కాని మఱి వేరు కాదు. వీరు బ్రాహ్మణులనియు నారువేలనియోగులనియు ప్రబలనిదర్శనము లున్నవి. మంగళగిరిలోని దేవాలయ స్తంభముమీఁద శాసనమున నీతిమ్మరసు నియోగిబ్రాహ్మణుఁడని వ్రాయఁబడియున్నది సింహాచలములోని దేవాలయమున నున్న శాసనమున

"సాళ్వతిమ్మనృపతిః ద్విజన్మాగ్రణీః"

యని వ్రాయఁబడియుండుటచేత నీతఁడు బ్రాహ్మణుఁ డనుటయే సత్యము. తిమ్మరసు మేనల్లుఁడైన నాదెండ్ల అప్పయామాత్యునికి, మాదయ్యగారిమల్లన తాను వ్రాసిన రాజశేఖర చరిత్రము నంకితముఁ జేయుచు నాగ్రంథమున మల్లన అప్పయామాత్యునిఁ గూర్చి "ఆరువేలవంశవార్ధిపూర్ణచంద్రమా!" యని వ్రాసియున్నందున అప్పయామాత్యుఁ డారువేలనియోగి బ్రాహ్మణుఁ డని స్పష్టపడుచున్నది. వీరి మేనమామయగు తిమ్మరసును నారువేలనియోగిబ్రాహ్మణుఁడే యనుట నిర్వివాదాంశము.

తిమ్మరసు, గోవిందరాజు లిద్దరన్నదమ్ములు. వీరు చిన్నతనమున చాలబీదవారై యుండిరి. వీరితల్లిదండ్రులు నాసమయమునసే మరణించినందున వీరు మేనమామయగు నాదెండ్ల చిట్టిగంగనవద్ద విద్యనభ్యసించుచుండిరి. చిట్టిగంగన చంద్రగిరియందు రాజవద్ద మంత్రిగ నుండెను. ఈగంగనయే తిమ్మరసుకు విద్యాబుద్ధులు చెప్పించి అర్థశాస్త్రమును రాజనీతిశాస్త్రమును నేర్పించెను. తనవద్దనే ప్రథమమున దివాణములో లేఖరిగ నుద్యోగమున ప్రవేశపెట్టెను. తిమ్మరసు తనప్రతిభ వలన కొద్దికాలమునకే పెద్దపదవినిపొంది గంగనామాత్యుని మరణకాలమునకు తుళువనరసరాజువద్ద గౌరవములు పొంది ముఖ్యమంత్రిపదవిని సంపాదించెను తిమ్మరసు తన ప్రజ్ఞావిశేషములవలన బహుజనశ్లాఘాపాత్రుఁడై తనయశోవైభవమును నలుదిక్కుల వ్యాపింపఁజేసెను.

తన కార్యనిర్వహణ ప్రతిభచేతను తన ప్రజ్ఞావిశేషముల చేతను రాజ్యమునం దెట్టియుపద్రవములు కలుగకుండ కాపాడెను. ప్రతివిషయమునుగూర్చియు బాధ్యతగల్గిన ప్రతిమనుష్యునిఁగూర్చియు తాను తెలిసికొని, వారిబుద్ధిని, వారిస్వభావమును, వారినైసర్గికగుణములను, వారితలంపులను, గుణశీలవృత్తములను కనుగొని వారితో మెలఁగుచుండెడివాఁడు. అధికారవిషయములనేగాక రాజాంతఃపురమునందు ప్రతిదినమును జరుగుచుండెడి సకలవిషయములను కుట్రలను తగవులను తెలిసికొని యెవరి నేరీతి మర్యాదచే యాదరింపవలెనో వారి కాప్రకారము మర్యాదచేసెడువాఁడు. రాజ్యమునందుగాని, నగరమునందుగాని, పట్టణములయందుగాని, పల్లెలయందుగాని, రాజాంతఃపురమునందుగాని యెంతరహస్యముగనైనను ఎట్టికార్యము జరిగినను తిమ్మరసు ఆవిషయమునుగూర్చి తత్క్షణమే తెలిసికొని రాజును, రాజబంధువులను, పట్టపురాణులను, అధికారులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, దాసదాసీజనమును మించి వినయవిధేయతలంగల్గి వర్తించునట్లు ప్రతివారి నదుపాజ్ఞలయం దుంచెడివాఁడు. ఇట్లు చెప్పినంతమాత్రమున నీతనికి విరోధులు గాని ప్రతికక్షులుగాని లే రని తలంచుటకు వీలులేదు. అయితే వీరికిఁ గల "అత్యధికమైన ప్రతిభయు, అప్రతిమానమైన ప్రజ్ఞయు అత్యద్భుతమై మేధాశక్తియు అకళంకమైన సామ్రాజ్యభక్తియు అత్యనుమానమైనసమర్థతయు అప్రతిబద్ధమైనయాజ్ఞయు, వీటినన్నిటిని మించి యౌదార్యమును సౌత్రమును కరుణయు కటాక్షమును బ్రహ్మతేజస్సును ప్రతిపక్షుల

భయకంపితులనుజేయఁగా వారెల్లరును తిమ్మరసు ననువర్తించువారైరి."

"పేయస"ను పోర్చుగీసుచరిత్రకారుఁడు తిమ్మరసును గూర్చి యీ క్రిందివిధముగ వ్రాసియుండెను.

"Salvatinica who is the principal person that enters the building, supervises the whole, for he brought up the king and made him king and so the king looks on him like father. Whenever the king calls to him he addresses him as Lord (Sentor) Salvatinica and all the captains and nobles of the realm make salaam to him."

"రాజమందిరమును ప్రవేశించువారిలో ముఖ్యుఁడగు సాల్వతిమ్మరసు అచటివిషయములనన్నిటిని సరిచూచును. అతఁడే రాజును పెంచి పెద్దవానినిగఁజేసి రాజుగఁజేసెను. అందువలన రాజాతనిని తండ్రివలె గౌరవించును. రాజు వారిని పిలిచినపుడెల్ల "అప్పాజీ" యని పిలుచును. రాజ్యమునందలి యమరనాయకులు పెద్దలు వారికి సలాములుచేయుదురు." అని పేయసు వ్రాసియుండెను.

కృష్ణదేవరాయని పెంచినవాఁడు తిమ్మరసు. పెద్దవానిని జేసినది తిమ్మరసు. విద్యాబుద్ధులు నేర్పినవాఁడు తిమ్మరసు. రక్షించినవాఁడు తిమ్మరసు. పోషించినవాఁడు తిమ్మరసు. రాజ్యాభిషిక్తునిగఁజేసినవాఁడు తిమ్మరసు. దిగంతవిశ్రాంతయశస్కునిగఁజేసినవాఁడు తిమ్మరసు. ఇది యది యన నేల? తిమ్మరసులేనిదే కృష్ణదేవరాయఁడు లేఁడనియే చెప్పవలసియున్నది. అట్టితిమ్మరసుయొక్క అంత్యదశ చిత్రవిచిత్రమైనది. అట్టిమహామహునికి జరుగవలసినదికాదు. అది దైవప్రేరితము విధికృతము.

రాయలకాలములోని నాణెములు

కృష్ణదేవరాయనికాలమున వాడుకలో నుండిన నాణెములలో బంగారువి రాగివి మాత్ర మిపుడు కొన్ని మద్రాసు మైసూరు ప్రదర్శనశాలలయం (Museum) దున్నట్లు తెలియ వచ్చుచున్నవి. ఇప్పుడున్న నాణెములపైన నీ విగ్రహములు జూడనగును.

1. శ్రీ వేంకటేశ్వరస్వామి
2. బాలకృష్ణుఁడు
3. గరుడుఁడు
4. శివుఁడు-పార్వతి
5. నంది.

పైవిగ్రహములలో మొదటిమూఁడు విగ్రహములు విష్ణునంశముగల విగ్రహములు. మిగిలినవి రెండు శివచిహ్నములుగలవియై యున్నవి. ఈ నాణెముల రెండవవైపున సంస్కృతాక్షరములు లిఖింపఁబడియున్నవి. ఈసంస్కృతాక్షరము లాయారాజుల నామధేయములై యున్నవి. నాణెములు సామాన్యముగ గుండ్రముగనున్నట్లు బార్బోజా వ్రాసియుండెను.

బంగారునాణెములు మూఁడు విధములైనవి.

1. వరహా.
2. అర్ధవరహా
3. వరహాలో పదవవంతు పణము.

వరహానే "హరదా" యనియు "గద్యాణ"మనియు చెప్పెవారు. "వరహా" యను పేరునుబట్టి యొకప్పు డీనాణెము పైన "వరాహావతారవు" బొమ్మ చిత్రింపఁబడియుండెనని చెప్ప

వచ్చును. వరాహమును చిత్రించిన నాణెములు చాళుక్యుల కాలమున నుండెడివి. వరహాలలో కొన్ని గట్టివరహాలు కొన్ని దొడ్డవరహాలు మరికొన్ని శుద్ధవరహాలని మూఁడువిధములు. వీటిలో నొకదానికి నింకొకదానికి భేదము తెలిసికొనుటకాధారములులేవు. "వార్తిమ" యను పాశ్చాత్యచరిత్రకారుఁ డిరువది పణములు వరహాయనియు అబ్దుల్‌రజాకను మహమ్మదీయ చరిత్రకారుఁడు పదిపణములే వరహా యనియు వ్రాసియుండిరి. ఈభేద మెట్లువచ్చెనో తెలియదు. ఒకటి గట్టివరహా రెండవది శుద్ధవరహా అయియుండవచ్చును. ఇవికాక చక్రవరహా యని యింకొక నాణె ముండెడిది. ఆనాణెముపైన చక్రముండెడిది. ఈనాణెములు గాక మాడయనునాణె మింకొకటి కలదు.

ఈపైన వ్రాసిననాణెములు బంగారునాణెములు. ఇవి గాక వెండినాణెము లుండెడివి గాని అవి యెవ్వియో మనకు తెలియుటలేదు.

పణము కాసు రాగినాణెములు. వాటివిలువను గూర్చి మన కంత స్పష్టముగ తెలియదు.

విజయనగరరాజ్యములోని నాణెములు విజయ నగర సామ్రాజ్యమునందే గాక హిందూదేశమందంతటను చెలామణి యగుచుండినట్లు మనకాధారములు గలవు. బార్బోజా చరిత్రకారుఁ డీవిషయమును గూర్చి క్రీ. శ. 1516-వ సంవత్సరమున వ్రాయుచు "పెగోడా నరసింహరాజు రాజ్యమునందలి కొన్ని నగరముల యందు ముద్రింపఁబడి హిందూదేశమునందంతట నుపయోగింపఁబడుచుండెను" అని వ్రాసియుండెను.

14. రాజ్యాంగము : కేంద్రప్రభుత్వము

రా జా

మహారాజు తనరాజ్యమున సర్వస్వతంత్రుఁడు. అతని నడ్డుపెట్టఁగల వా రెవ్వరును లేరు. ఇట్లు చెప్పినంత మాత్రమున నాతఁడు విచ్చలవిడిగ నిచ్చవచ్చినరీతిని జనుల బాధల పెట్టునని చెప్పుటకు వీలులేదు రాజు కెంత స్వాతంత్ర్యమున్నను ధర్మానుబద్ధుఁడై యుండెడివాఁడు. ధర్మప్రకార మాచరింపనిచో పెక్కుచిక్కులు సంభవించును. హిందూధర్మశాస్త్రము ననుసరించి బ్రాహ్మణుఁ డెట్టి నేరముఁ గావించినను వానిఁ జంపుటకు వీలులేదు. ఈధర్మము న్యాయమైనను కాకున్నను దీనిని ధర్మశాస్త్రజ్ఞులు మార్చినచోతప్ప ఇతరత్ర యీన్యాయ మనుసరింపవలసినదే.

కృష్ణరాయ లెంతస్వతంత్రుఁడైనను యీధర్మమున కొకానొక సందర్భమున బద్ధుఁడు కావలసివచ్చెను. తాను రాజ్యముచేయు కాలముననే క్రీ. శ. 1524-వ సంవత్సరమున తనకుమారునికి రాజ్యపట్టాభిషేకముఁ గావించి తానే ప్రధానమంత్రిగనుండి తనకు సాళువతిమ్మరసుమంత్రిని సలహాదారునిగ నియమించుకొనియుండెను. ఇట్లు జరిగిన యెనిమిదిమాసములకు తన కుమారుఁడైన పసిరాజు తిరుమలదేవుఁడు జబ్బుపడి చనిపోయెను. కాని పసిరాజు చనిపోయిన కొద్దికాలమునకే సాళువ తిమ్మరసు యొక్క కుమారుఁడైన తిమ్మదన్నాయకుఁడు చంపెనని వార్త రాజ్యమున ప్రబలెను. ఇది తనకుఁ దెలియవచ్చినంతనే కృష్ణదేవరాయ లాగ్రహపరవశుఁడై పిల్లవాఁడైన తిమ్మదన్నాయకుని వాని తండ్రియగు తిమ్మరసును వారి వాండ్రనందరిని

కారాగృహము నం దుంచెను. బందీగనుండగ తిమ్మదన్నాయకుఁడు ఖైదునుండి పారిపోయి కొంతసైన్యముఁ జేర్చుకొని కృష్ణరాయనికే యెదురుతిరిగెను. ఈతిరుగుబాటు నతిశీఘ్రకాలముననే యణచివైచి తిమ్మదన్నాయకుని తిరిగి బంధించి చెఱయందుంచి యాతనికండ్లను మాత్ర మూడదీయించి వైచి యాతనిని గ్రుడ్డివానిగఁ జేసెను. దీనినిగూర్చి వ్రాయుచు "న్యూనిస్"ను చరిత్రకారుఁడు బ్రాహ్మణుఁడుచేసిననేరమున కాతఁడు వధార్హుఁడేయైన నప్పటి ధర్మశాస్త్రమునకు బద్ధుఁడై కృష్ణరాయల ట్లాతనినివధించుట కంగీకరించక గ్రుడ్లు పీకించెనని విమర్శించి యుండెను. గనుక నేరమెంతపెద్దదైనను, అపరాధి వధార్హుఁడైనను ధర్మానుసరణముగ రాజు అతనిని వధింపను త్తరువీయఁజాలకపోయెను.

మరియు రాజు తనయిచ్చవచ్చినరీతి నాచరించి జనుల బాధపెట్టుట కేలాటి యాటంకము లేకున్నను ప్రజాభిప్రాయమునకు భిన్నముగఁ బ్రవర్తించినయెడల జనులు తమయిండ్లను దేశమును వదలి పరదేశములకుఁ బోవుటయు నట్లు వారువెళ్లుటవలన నాదేశము జనవిహీనమై రాజునకు రాఁదగిన రాఁబడి రాకుండుటయు నందువలన రాజునకు నష్టముకల్గుటయు జరుగును. ఇది యెట్లున్నను కృష్ణరాయలు తాను రాజ్యము చేసినంతకాల మిట్టినిరంకుశ చర్యల నెన్నఁడును జరిపినట్లు కనఁబడదు. అయితే కృష్ణరాయల తరువాత రాజ్యముచేసిన వారికాలమున నిరంకుశత్వము ప్రబలినట్లును జను లా నిరంకుశచర్యలను భరింపఁజాలక తమదేశమును విడనాడివెళ్లుటయు నందువలన రాజ్యసౌభాగ్యసంపదలకు హానికల్గుటయు తదనంతర మారాజు

తన నిరంకుశ ప్రభుత్వమునకుఁ బశ్చాత్తాపమునుఁ దెలిపి సక్రమ ప్రభుత్వమున రాజ్యమేలినట్లును వలసఁబోయిన జనము తిరిగి తమ దేశమునకు వచ్చినట్లును క్రీ. శ. 1563-వ సంవత్సరపు శాసనమువలన విదితమగుచున్నది.

— మంత్రి —

రాజనీతి ప్రకారము సప్తాంగములలో నొకటి మంత్రి బలము. మంత్రిలేని రాజ్యము తొండములేని యేనుఁగును బోలియుండును. దీనిని యొకకవి యిట్లు వ్రాసియుండెను.

క. మండలపతి సముఖమ్మున, మెండైన ప్రధానిలేక మెలఁగుటయెల్లన్
గొండంత మదపుటేనుఁగు, తొండము లేకుండినట్లు దోఁచుర సుమతీ.

రాజెల్లపుడు తనరాజ్యమున నున్న సచివప్రముఖుల సలహా ననుసరించి రాజ్యపరిపాలనము జేయవలసి యున్నందున తనవద్ద ప్రఖ్యాతపురుషుల నట్టిమంత్రులుగ నేర్పరచుకొన వలయును. అవసరమైనపుడు సరియైనవారి కొఱకు వెదకికొనుట సరికాదు. అందువలన మంచివారిని మంత్రులుగ తనవద్ద రాజు నియమించుకొనవలెను. కృష్ణరాయ లెల్లపుడు బ్రాహ్మణులనే యేర్పాటు చేసికొనెడివాఁడు. కృష్ణదేవరాయలు మంత్రుల నేర్పాటు చేసికొనుటలో మంచికట్టుదిట్టముల చేసికొనెడివాఁడు. రాయలవారు బ్రాహ్మణులనే నమ్మి వారికే మంత్రిపదవుల నొసగెడివారు. బ్రాహ్మణులయందు వారి కుండు విశ్వాసము మెండు. వారివిశ్వాసమును తమ మంత్రు లెన్నఁడు చెఱుపలేదు. అందువలన వారివిశ్వాసమును సరియైన దనియే చెప్పనగును. నిజము చెప్పినచో వారిరాజ్య సంపదయు వారిరాజ్యసౌభాగ్యమును చాలవరకు మంత్రియగు

పాలువతిమ్మరసుయొక్క యుక్తియుక్తమైన పరిపాలనవలననే పెంపొందినది. రాయలవారివద్ద పాలువతిమ్మరసు మాత్రమే గాక రాయసము తిమ్మరసు, కొండమరసు, అయ్యపరసు, రాముభట్లయ్య మొదలుగా గల యనేక బ్రాహ్మణులు వారికి సహాయులుగ నుండిరి.

"నూ్యనిసు" చరిత్రకారుఁడు వ్రాయుచు బ్రాహ్మణులు చాల నమ్మదగినవారనియు ప్రచండమైన తెలివితేటలు గలవారనియు లెక్కలు వ్రాయుటలో నేర్పరులనియు సన్ననిమనుష్యులైనను రూపవంతులే యనియు బలిష్ఠులే యనియు వ్రాసి చాకిరిచేయుటకుఁ బనికిరారనియు వ్రాసియుండెను.

రాయలవారి వద్ద లెక్క కెందఱు మంత్రులుండిరో తెలియదు. గాని యున్నవారుమాత్రము రాయలవారియిష్టమున్నంతవరకు వారివద్ద మంత్రిత్వము చేసియుండిరి. వారికి పాలువ తిమ్మరసు ప్రధానమంత్రి. రాజునకుఁ దరువాత రాజంతటివాఁడు. సమస్తజనులు సామంతులు నాయకులు, ప్రభువులు మొదలయినవారందరు తిమ్మరసుమంత్రి యున్నతలయం దుండెడివారు. రాజకీయవిషయములం దన్నింటియందును నీ తిమ్మరసు మంత్రికే అగ్రతాంబూలము. వీరుగాక యింకొక యుపప్రధానియు భాండాగారికుఁడు నుండువారుగాని యుపప్రధాని చేయుపను లెవ్వియో తెలియుటలేదు. రాయవాచకమునుబట్టి ధర్మాసనాధికారి యని యింకొకమంత్రి యుండినట్లు తెలియుచున్నది. భాండాగారికుఁ డనఁగా కోశాధికారి. ధర్మాసనాధికారికి ధర్మము న్యాయనిర్వహణముపై నధికార ముండెడిది. ఇంక నితరమంత్రు లుండిన నుండవచ్చునుగాని వా రెవ్వరో

వారేయేపనుల నిర్వర్తించుచుండెడివారో యిప్పుడు తెలియుట లేదు.

—రాజసభ—

మంత్రులతోపాటు రాచకార్యములను చక్కఁబెట్టుట కొకరాజసభ యుండెడిది. ఇదియే కార్యనిర్వాహకసభ. రాజు చేయవలసిన పనులనుగూర్చియు, చక్కబెట్టవలసిన కార్యములనుఁ గూర్చియు రాజసభలో సమాలోచించుట సామాన్యముగ నుండెడిది. ఒక్కొక్కప్పు డీసభవారు రాజుమాట సటు పెట్టి తమతమయిష్టము వచ్చినట్లు చేయుటయు కలదు. అట్లు మంత్రు లేకీభవించి చేసినపుడు రాజుగారి యధికారము నిరర్థక మగుచున్నది. రాయలవారు ప్రథమమున పట్టాభిషిక్తుఁడై నప్పు డొకసారి వారు కోరినవిషయమున సంజాయిషీ నీయకుండుటచే వారు నిష్ప్రయోజనమైంది రాత్రి వేళ నగరమునకు మాయముగా గ స్తీకిపోయి తిరిగి నగరికిరాకుండుటయు తిమ్మరసుమంత్రి విషయ మును కనుగొని తాను సైన్యమునంతను బయలుదేరదీసి రాయల వారున్న దేవాలయమువద్దకు పేటయనుమిషమీఁద బయలు దేరుటయు నిదివరలో వ్రాసియుంటిమి. ఆసమయమున రాయల వారు తమలో తా మిట్లనుకొన్నట్లు రాయవాచకమునం దీవిధ ముగ వ్రాయబడియున్నది.

"రాయలవారు తమచిత్తాన సింహాసనభారమునకు కర్తలేనిమాత్రం ఇంతేగాని సకల ప్రపంచమున్న సామాజికుల మాఖాంతరముగానే నడుస్తావున్నది తమమాట కలుకలు రెవ్వరు విసేరు అధికారతరుణ మందు స్వాతంత్ర్యముగా నడిపిస్తే మంత్రభిన్నమై కార్యములు కానసాగదు. కాబట్టి వాకిటి చిన్నపెద్దలు తమరయ్యే తెలుసుకొని వొఖకార్యం నడిపిస్తే అప్పుడు తమకు స్వతంత్రముగా నడుచును.

ఈపైన వ్రాసినదానినిబట్టి వ్యవహారమంతయు రాజు ఇష్టము లేకనే సామాజికుల యిష్టమువచ్చినట్లు జరుగుచుండెనని స్పష్టపడుచున్నది.

కృష్ణదేవరాయలవారి కాలమున నీరాజసభ యెట్లుండునో మనుచరిత్రమునం దీవిధముగ వర్ణింపఁబడియెను.

సీ. ఇందీవరంబుల నీనుఁ గ్రాల్గన్నుల, శరదిందుముఖులు చామరము లిడఁగ
బలిసమానకణాదబాదరాయణమాత్ర,ఫక్కి విద్యాంసు లవసరింపఁ
జార్వాకభూమివభీరుభటకదంబకరాశి, హేతిచ్ఛటచ్ఛాయ నిరులు కొనఁగ
సామంతమండనోద్దామమాణిక్యాంశు,మండలం బొలసి యీరెండఁ గాయ
మూరురాయరగండపెండారమణిమరీ,చిరింఛోళిఁ గలయ సాకృతముఁగాచు
నంకపాళికటద్ధూమాలాంచములు, చిత్ర మాంజిష్ఠ విభ్రమశ్రీ వహింప

క. భువనవిజయాఖ్యసంసద్భవనస్థితసింహపీఠిఁ బ్రాజ్ఞులగోష్ఠిం
గవితామధురిమ డెందము,దవులం గొలువుండి సదయతన్ననుఁ బల్కెన్.

చక్కనిస్త్రీలు వింజామరలు వీచుచుండ, వైయాకరణులు తార్కికులు శాస్త్రజ్ఞులు తమతమశాస్త్రములను గూర్చి యుపన్య సించుచుండ నిరుప్రక్కలభటులు తమచేతులలోని కత్తులను ఝళిపించుచుండ, రత్నాభరణములుదాల్చిన రాజులు కొలిచి యుండ, కవులయొక్కయు పండితులయొక్కయు తియ్యని వాక్కులు తనమనంబు నానందపఱచుచుండ తనకాలధరించిన పెండారములయందలి మణులకాంతులు ప్రసరించుచుండ తెల్లని పట్టువస్త్రములధరించి భువనవిజయ మను సభాభవనమున మూరు రాయరగండఁడని ప్రసిద్ధిగాంచిన శ్రీకృష్ణరాయలు సింహాసనా ధిష్ఠుఁడై యుండెను.

ఈసభ "భువనవిజయము" అను నామము కల్గియుండెను. ఈసభ కమరనాయకులు, వారి ప్రతినిధులు, ఉద్యోగస్థులు, సామంతులు, ప్రభువులు, దళవాయులు, వర్తకులు, రాయబారులు, పండితులు, కవులు, తత్త్వజ్ఞులు, మతస్థులు మొదలయినవారందరు వచ్చుచుండెడివారు. ఈసభలలో వల్లభాచారి, చైతన్యుఁడు, వ్యాసతీర్థులు, తాతాచారి మొదలయినపండితులు తమతమ ప్రాశస్త్యమునుగూర్చి దీర్ఘోపన్యాసములనిచ్చి చర్చలజరపుచుండిరి. ఇట్టిసభలలోనె అలసాని పెద్దన, తిమ్మన, ధూర్జటి, రాధామాధవుఁడు మొదలయినకవిశేఖరులు వారివారిపాండిత్యప్రకర్షకై బహూకరింపఁబడిరి. ఇంతగ వర్ణింపఁబడిన సభాభవనము మిక్కిలి పెద్దదై యుండవలెను. ఇంతపెద్ద సభాభవనము రాచకార్యముల నిర్వహించుటకు పనికిరాదు. అందువలననే రాయలవారు రాచకార్యములనుగూర్చి యాలోచించునపుడు తానును తనమంత్రులను కలసి కార్యాలోచనసభను వేఱుగ జరుపుచుండెడివారు. ఈరాచకార్యాలోచన సభనుగూర్చి "పేయసు" చరిత్రకారుఁ డిట్లు వ్రాసియుండెను.

"(అచటినుండి) రాయలవారు ముందొకవడకగా చేయబడి పైనుండి క్రిందవరకు చక్కగ నద్దబడిన బట్టలతో పరివేష్టింపఁబడియున్న యొక యింటిభాగమునచేరి...అచట తనరాజ్యములోని యధికారులతో ముచ్చటించి నగరపాలనము చేయుచుండెను...ఇట్లు వీరితో సంప్రతించినపిదప తనకై బయటవేచియున్న యితర పెద్దలను వ్యవహర్తలను లోనికి పిలిపించును."

దీనినిబట్టి రాచకార్యనిర్వహణకైఁ జేయబడెడి కార్యాలోచనసభ వేరనియు రెండవది పెద్దరాజసభ వేరనియు తెలిసి

కొనవలసియున్నది. ఈకార్యాలోచనసభ యిప్పటి Working Committee, Privy Council, Executive Council మొదలయిన సభలను పోలియుండెడిది.

ఆముక్తమాల్యదయం దీసభలను గూర్చి వ్రాయుచు నీ సభ్యులు వీలగునంతవఱకు బ్రాహ్మణులుగ నుండవలయు ననియు అందును వయసు ముదిరి దాదాపు ఏఁబదిసంవత్సరములకు పైఁబడి డెబ్బదిసంవత్సరములకు లోపలనుండువారుగ నుండవలయు ననియు రాజనీతిశాస్త్రము తెలిసినవారై యుండవలె ననియు వ్రాయఁబడియున్నది. అట్టివారు లభించినపుడు ధర్మమును తనదృష్టిపథమున నుంచుకొని తుదిపర్యవసానమును తానే నిర్ణయించుకొనుచు నితరుల నీపనికి నియమించి వ్యవహారము కొనసాగింపవచ్చుననియుకూడ నీపద్యములయందు వ్రాయఁబడియుండెను

ఈరాజసభ కందఱుసభ్యులు రావలయునన్న విధి లేదు. ఈసభలు బహిరంగములైనవియు కావు. కృష్ణరాయలవారీ సభల నెక్కువతఱచుగ జరుపుచుండెడివారు. ఈసభానిర్ణయములను రాజు పాటింపవలసిన విధియు లేదు. రాయలవారాదిల్షాహాపై యుద్ధముచేయక పూర్వము ఆయుద్ధమును నిశ్చయించుకొని తిమ్మరసు మొదలయిన మంత్రులతోకూడిన నీసభను సమావేశపఱచి వారితో నీవిషయమును గూర్చి సంప్రతించియుండెను. ఈసమావేశమయిన సభలో ప్రథమమున తిమ్మరసుమంత్రి చెప్పినసలహాను రాజుగాని యితరసభ్యులుగాని అంగీకరించి యుండలేదనియు, సభికులెల్లరును యుద్ధమువలదని రాయలవారితో వాదోపవాదములు జరిపినను వా రందుల

కంగీకరింపలేదనియు రా జొక్కరుఁడే బాధ్యత వహించి యుద్ధముచేయుటకు నిశ్చయించె ననియు, చివరకు యుద్ధముచటనుండి ప్రారంభించవలయుననెడి విషయమున సభ్యుల యభిప్రాయముతోఁ నతఁ డంగీకరించెననియు వేయుచరిత్రకారుఁడు వ్రాసియుండెను. దీనినిఁబట్టిచూడ కొన్ని విషయములలో రాజు సభ్యులయభిప్రాయముల ననుసరించుటయు మరి కొన్ని విషయములలో వారియభిప్రాయమును నిరాకరించుటయుఁ గన్పించుచున్నది. గనుక సభ్యులయభిప్రాయము ప్రాముఖ్యముగాదని తేలినను ప్రతివిషయమునందును రాయల వారీసభ్యులతో సంప్రదించియే వారిచ్చువచ్చినరీతినే వ్యవహరించుచుండెనని స్పష్టపడుచున్నది. ఏదియెట్లున్నను రాయల వారికి తిమ్మరసుపై మిక్కిలి విశ్వాసముండెననియు వారిసలహాసహాయమువలననే తనరాజ్యము నంత నైపుణ్యమున పరిపాలించి ప్రఖ్యాతిపొందెననియు చెప్పుటలో నెట్టి యతిశయోక్తియు లేదు.

రాజ్యమునందలి వ్యవహారకర్తలు లేక కార్యనిర్వాహకులు

ఈవిజయనగరసామ్రాజ్యమున ద్రవ్యసంబంధపు లెక్కలను వ్రాసి జాగ్రత్తగ నుంచెడివారిని సంప్రతు లని యనఁగా కరణము లని యందురు. ఇట్టివారు తొమ్మండుగు రుండిరని రాయవాచకమువలన తెలియుచున్నది. వీరనరసింహరాయలకాలమున "తొమ్మిదిసంప్రతులనున్ను పిలువనంపగా కరణాలువచ్చి పదునెనిమిదిరేవులలెక్కలున్ను వినిపించి" రని యొకచోటను "ఒకనాఁడు కొలువులోపలను కరణీకుల పిలువనంపి వారలతోను కర్ణాటకరాజ్యానకు నెన్ని లక్షలరాజ్యములు? ఆరాజ్యములో గిరిదుర్గ, స్థలదుర్గ, వనదుర్గ, జలదుర్గములు ఎన్ని? కోటలు ఎన్ని? నగరములు గ్రామభూములు ఎన్ని? ఏయేదుర్గాలకు నెంతనగరికొక్కపానవుండె? రొక్కరూపాయలకున్ను నవరత్నభూషణములకున్ను స్థాపించివుంచిన నిక్షేపములకున్ను శీరుణియగార్లమీఁద చెల్లునిలువకున్ను, వివరముగా లెక్కవ్రాసి తెచ్చి చదువుమని తొమ్మిదిసంప్రతులకును విన్నపంజేసినది" యని వ్రాయుటచేత సంప్రతులనఁగ కరణా లనియు వీరిప్పటి గ్రామకరణాలవలెగాక రాజ్యమంతకు కరణము లనియు అనఁగా రాజ్యమునందలి యంశముల నన్నిటినిఁగూర్చి వ్రాయఁబడు లెక్కలన్నియు వీరే తయారుచేయుచుందురనియు అట్టివారు రాజ్యమునందు తొమ్మిదిమందిమాత్రమే యుండిరనియు తెలియుచున్నది. ఈతొమ్మండుగురు కరణములయొక్క ప్రత్యేకవిధు లెట్టివియో తెలిసికొనుట కాధారములు లేవు గాని వీరు మాత్రము రాజ్యములోని అన్నివిధములైన లెక్కలను తయారుచేయుచుండెడివారని మాత్రము తెలియుచున్నది. ఈ కరణము ప్రస్తుతప్రభుత్వములలోని సెక్రటరీలు నిర్వర్తించెడు కార్యములనే నిర్వర్తించియుండు రని మన మూహింపనగును. వీరిలో నల్లాలనాథుఁడు చిన్నభాండారమున కధిపతియని రాయవాచకగ్రంథమునుబట్టియే తెలియుచున్నది.

చిన్న, పెద్ద, భాండారములు :—Treasury.

రాయలవారి రాజ్యమున రెండుభాండాగారము లున్నట్లు మనకు రాయవాచకమువలననేమి వేయుసూచరిత్రకారుని వ్రాతలవలననేమి తెలియుచున్నది. శాసనములను బట్టి బంగారుభాండాగారమనియు రవ్వలభాండాగారమనియు రెండు

భాండాగారము లున్నట్లు కనబడుచున్నది. రాయవాచకములోని చిన్న పెద్దభాండాగారములును శాసనములలోని బంగారు రవ్వలభాండాగారములు నొకటియే యైనయెడల చిన్న భాండాగారము బంగారు భాండాగార మనియు పెద్దభాండాగారము రవ్వలభాండాగార మనియు మన మూహింపనగును." ఇది యెట్లున్నను రెండు భాండాగారము లుండెననుట నిస్సంశయము. "విద్యారణ్యులవారు యీపట్నం గావించేటప్పుడు సింహాసనస్తునికి నిక్షేపించినది తొంభయి తొమ్మిదికోట్ల యాభై యారులక్షల ద్రవ్యంగాక భూషణములు నాల్గుకోట్లున్ను,నవరత్నములు ఆరుకోట్లున్ను వున్నవి. అదిగాక యీవరకున్ను సింహాసనస్తులు సింహాసనమున్ను నడుపుకొని శెలవుశిద్దాయలుబోగా నొక్కసానవుంచినది పందొమ్మిదికోట్ల యాభయారులక్షల ద్రవ్యం." అని రాయవాచకమునందును "పూర్వపురాజులు అనాదినుండియు భాండాగారమునుంచెడి యాచారముకలదనియు ఆయారాజు చనిపోయినపిదప నాభాండాగారమును జాగ్రత్తగా తాళమువైచి సీలుచేసి యితరులకు కనపడకుండ దాచెడివారనియు, అందలి ద్రవ్యమును రాజ్యమునందు ప్రత్యేకావసరముగల్గిననే కాని వాడుకొనెడి వారుకారనియు" పేయసుచరిత్రకారుఁడును వ్రాసియుండిరి. మరియు రాజ్యముచేసెడి ప్రభువు పూర్వీకుల భాండాగారమునుంచి తన భాండాగారమును ప్రత్యేకించెడు "వారనియు"కూడ పేయసు వ్రాసియుండెను. వీటినిబట్టిచూడ, పూర్వపురాజులభాండారము పెద్దభాండార మనియు రాజ్యము చేయుచున్న రాజుల భాండాగారము చిన్నభాండాగారమనియు గూడ నూహించవచ్చును.

ఈరెండుభాండాగారములలెక్కలను అల్లాలనాథుఁడే చూచుచుండె నని రాయవాచకమువలన బోధపడుచున్నది. క్రీ. శ. 1527-వ సంవత్సరమున రాయసం తిమ్మరసు బంగారుభాండాగారముయొక్క వ్యవహారమును చక్కబెట్టుచున్న అధికారియని శాసనమువలన తెలియుచున్నది.

ధర్మాదాయములు దేవాదాయములు

ధర్మాదాయదేవాదాయములనుగూర్చి విచారణఁజేసెడు కార్యాలయ మొకటి యుండినట్లు ఆముక్తమాల్యదలో వ్రాయఁబడిన విషయములవలన తెలియనగును. రాజ్యమందలి దానశాసనముల నన్నిటిని ప్రభుత్వోద్యోగి యొకడు సముకూర్చి జాగ్రత్తచేసెడివాడని శాసనములవలన తెలియవచ్చుచున్నది. రాయవాచకగ్రంథమువలన బ్రాహ్మణుల కియ్యఁబడిన సర్వాగ్రహారములనుగూర్చి విచారించుటకు ధర్మాసనంధర్మయ్య యను ప్రభుత్వోద్యోగి యొకరుండినట్లును వారిని పిలువనంపగా ధర్మయ్యవచ్చి "ద్రావిడరాజ్యములో గల అగ్రహారములను ఆంధ్రదేశం, హొయిసలదేశం, మొరసునాడు, మొల్నాడు, కర్నాటకం, ఘట్టశిరు, చేర, చోళ, పాండ్య మగధ మళయ ఆదిగాగల అగ్రహారములను" గూర్చి రాయలవారికి వివరించి విన్నపంచేసినట్లున్ను వ్రాయఁబడియున్నది. వీటినన్నిటినిచూడ ధర్మాదాయములను గూర్చి యొక ప్రత్యేక కార్యాలయ ముండెడిదని యూహింపవచ్చును.

అవతన లేక ఆదాయమును గూర్చిన కార్యాలయము

గ్రామ, స్థల, సీమ, నాడు, రాజ్యముల సరిహద్దులు తెలియఁజేయునట్టియు, గ్రామమునందలి భూస్వాములయొక్కయు

వారివారికి గలభూములయొక్కయు వారు పండించు పంటల యొక్కయు వారు రాజ్యాధిపతికి ప్రతిసంవత్సరం అచ్చవలసిన శిస్తుమొత్తములను తెలియఁజేయునట్టియు లెక్కలు ప్రత్యేక ప్రత్యేకముగ నుంచినట్లు స్థలచరిత్రలను బట్టి కొంతవరకు తెలియుచున్నది. ఇదియే ముఖ్యమైన కార్యాలయము. దీనికే "అదవన" యనియు దీనివివరములను తెల్పునది "అదవన తంత్ర" మనియు తెలియవచ్చుచున్నది. "అదవన" యను పేరు 1515-వ సంవత్సరపు శాసనమునందు వ్రాయఁబడి యున్నది. ఈ ఆదాయపులెక్కలను జాగ్రత్తచేయువారగు అమరనాయకులఁగూర్చియు వారు సిద్ధము చేయవలసిన గుఱ్ఱములు ఏనుఁగులు కాల్బలము వగైరాలనుగూర్చియు కూడ లెక్కలనుంచియున్నట్లు తెలియనగును.

గూఢచారులు

ఈకాలమున నొకరాజ్యముపై నింకొక పరిసరరాజ్యము వారికి విరోధము, అసూయ, అసహిష్ణుత హెచ్చుగనుండెను. అప్పటి కీప్రాంతమున హిందూరాజ్యములు తురకరాజ్యము లుండెడివి హిందూరాజ్యములయం దొకరాజ్యమువారికి నింకొకరాజ్యమువారికి మనస్పర్థలు హెచ్చుగ నుండెడివి. రాయలవారు రాజ్యమునకు వచ్చినకాలమునకు కొండవీడులో రెడ్డి రాజ్య మంతరించి గజపతిరాజుల వశమయ్యెను. అంతటితో తృప్తిజెందక గజపతిరాజులు విజయనగర రాజ్యములోని కొన్నిభాగముల నాక్రమించిరి. రాయలపూర్వికు లీగజపతిరాజులను కృష్ణానది కుత్తరమువరకు పారఁద్రోలఁ బ్రయత్నించిరి గాని అట్లు చేయఁజాలరైరి. ఇది యిట్లుండ రాయలవారికిని

తురకలరాజ్యమునకును విరోధములు హెచ్చుగ నుండెను. హిందూమహమ్మదీయుల మధ్యకన్న మహమ్మదీయులలో వారిలోవారికి హెచ్చువైషమ్యము లుండెను. ఈకారణముల వలన పరిసరరాజ్యములస్థితిగతు లెప్పటికప్పటికి తెలిసికొనుటకు రహస్యముగ తెలివిగలట్టియు విశ్వాసపాత్రులైనట్టియు చారుల నేర్పాటుచేయవలసియుండెను. అందువలన రాయలవారు ప్రతిదిన మాచరింపవలసిన విధ్యుక్తధర్మములలో నీ గూఢచారులతో సంప్రతించుట యొకవిధియై యున్నది. ఈ చారులనుగూర్చి వ్రాయుచు రాజధానియందు నివాసగృహము లుండువారుగను నానాభాషావిదులుగను ఇతరులెవరుల నెఱుఁగనివారుగను తమ్ము నితరులు గుర్తింపకుండునట్లుగ నుండవలెను. వీరికి కోరినదానికన్న కొంచెము హెచ్చుజీతమును ఇవ్వవలె నని ఆముక్తమాల్యదలో వ్రాయఁబడినది. రాయవాచకమున నీవిషయమును గూర్చి యిట్లు వ్రాయఁబడి యుండెను.

"గనుక కృష్ణరాయలవారు ఆనందము పొంది భూవిస్తారమున్న, రాజ్యమున్న, జాడకలెను అని నిశ్చయించి మనసులగా చారుల కలన అయాదేశములున్న ఆయాదిక్కులనుండే కొరలు మన్నెరికములు నడతలున్న వారివారికి తిమిలములున్న, గ్రామాదులున్న, పల్లె, పట్టణములున్న, పండితపామరజనులు అదుకొనేవార్తలున్న, కోటకొత్తకములయుండలి నడవడికలు తెలిసి నానాటి ప్రవర్తనములున్న గోప్యముగాతెచ్చి వంకరించేటట్లుగ కాలుకేగంగతిగిబుద్ధి విచక్షణులై బహుభాషాంతరములుతెలిసి బహురూపములుగానున్న సంచరించి అంతరంగ భార్తలరసివచ్చేటట్లు గాబిజయాపురం, అరంగం, చెన్నపట్నం, శ్రీరంగ

పట్ణం, చదరంగపట్ణం, శ్రీరంగం, మధుర, రామేశ్వరం, తుమ్మత్తూరు, శివసముద్రం, పెనుగొండ, గోలకొండ, గుర్రంకొండ, వేల్నాడు, కొంగనాడు, ఘట్టంశిము, అరశరాజ్యం, మళయాళం, కొచ్చి, కోంకణం, కేరళం, విరాటపురం, కరాటదేశం, మగధదేశం, మత్స్యదేశం, విదర్భదేశం, కాంభోజనగరం, కాశ్మీరఖండం, ఢిల్లినగరం, ఇవిమొద లయినతావులందున్ను, తులుకహైమొదలైనదక్షిణరాజ్యములందున్ను, చంద్రగిరి, గండికోట, కడప, నంద్యాల, కొల్లంకొండ, రాచూరు, ముదు గల్లు, నిడిగల్లు, మైసూరు మొదలయినస్థలములందున్ను, వేగర్లను నియ మించి అంపించి పట్టణములసంచరించంగా అహంకరించినవారానిన్ని, వరులతో గిశపోయినారని వినినామన్ను వారిని ఆజ్ఞ చేయుమని కట్టడ చేసినారమని మీరందరున్ను నగరిఆజ్ఞమీరక నడచుకొమ్మని ఆన తిచ్చినారు."

ఈచారులు తమదేశమునకు సంబంధించిన విషయము లనేగాక పరిసర రాజ్యవిషయములను గూడ శోధించి కనుగొన వలసియున్నందున వీరిపని మిక్కిలి కష్టముతో కూడుకొన్నదై యున్నది.

రాయబారులు

ఈచారులుగాక రాయబారులు కూడనుండెడివారు. ఈరాజ్యమునుండి పరిసరరాజ్యములకుఁ బోయెడువారు పర రాజ్యములనుండి యీరాజ్యమునకు వచ్చెడురాయబారులు నుండెడివారు. రాయబారులను మిక్కిలి గౌరవించి మర్యాద చేసెడివారు. ఈరాయబారుల నాకాలమున స్థానాపతులనియుఁ బిలిచెడివారు. తాము రాయబారులుగ నున్నపుడు పరరాజ్య ములలోని విశేషములను తమరాజ్యమునకు తెలియఁజేయ

వలెను. గజపతిరాజుతో రాయలవారు యుద్ధము చేయుచున్న సమయమున రాయలవారి రాయబారి గజపతిరాజువద్ద నుం డుటవలననే రాయలవారికి గజపతిరాజువద్దనున్న పదునార్గురు పాత్రులేకమై రాయలవారిని నాశనముచేయ ప్రయత్నములు జరుగుచున్నట్లు రాయలవారికి తెలియఁజేయఁబడెను. ఆముక్త మాల్యదలోఁ జెప్పినట్లు పరిసరరాజ్యముల రాయబారులతో "సరససల్లాపంబులు" సలుపవలయును. పరరాజుల అపకృతులను కూడ గోరంతలుగ జేసి యుక్తియుక్తమైన మాటలతో దాటించి వారిమనసు నొప్పించక తమయుద్దేశమును బయలు పరుప వలయును.

15. రాష్ట్రీయప్రభుత్వము

స్థానిక ప్రభుత్వము

రాయలకాలమున నిప్పటివలెనే గ్రామమే రాజ్యాంగ మునందు ప్రాథమికభాగము. మూఁడు నాల్గుగ్రామములను కలపి "స్థలము" అని పిలిచెడువారు. అనఁగా నీస్థల మిప్పటి ఫిర్కాతో సమానముగ నుండెడిది. కొన్నిస్థలములను కలిపి సీమయని పిల్చెడువారు. కొన్నిచోట్ల సీమనే "నాడు" అని వాడెడువారు. ఈనాడుశబ్దము దక్షిణహిందూస్థానమున మొదటినుండియు వాడుకలో నున్నది. కన్నడదేశములో నాడు అన నాల్గైదుసీమలయొక్క సమ్మేళనము. తెనుగుదేశమున నీనాడుకు సీమకు పెద్దభేదము కనుపించదు. ఒక్కొకచోట సీమకన్న నాడు ఇంకొకచోట నాడుకన్న సీమ పెద్ద గ్రామములను కల్గియుండెడిది. ఇంకొకపుడు సీమనాడులమధ్య

భేద ముండెడిదికాదు. కాడకు పైని "రాజ్యము"ండెడిది. రాజ్యాంగమునం దీరాజ్యమే ప్రధానము. ఈరాజ్య మిప్పటి రాష్ట్రమునకు సరిపోవును. ఈరాజ్యము లన్నియు కలిసి సామ్రాజ్యమైనది. సామ్రాజ్యమునందలి అంగములనన్నిటిని సులభముగ తెలియగలందుల కీక్రింద నుదాహరించుచున్నాను.

గ్రామము	ప్రాథమికము
స్థలము	కొన్ని గ్రామములు
నాడు-కోట-సీమ	కొన్ని స్థలములు
రాజ్యము	కొన్ని నాడులు-కోట-సీమలు
సామ్రాజ్యము	కొన్ని రాజ్యములు

రాయలకాలమున విజయనగరసామ్రాజ్యమునం దెన్ని రాజ్యము లుండెనో తెలియుటలేదు. ఈరాజ్యములు దేశావసరములఁబట్టి మారుచుండెడివి. రాయలకాలమున ప్రతినిత్యము హిందూమహమ్మదీయుల పోరాటములు జరుగుచుండెడివి. హిందువులపైకి మహమ్మదీయులును మహమ్మదీయులపైకి హిందువులును పోరాటమునకు సిద్ధముగ నుండెడివారు. అందువలన వీలునుబట్టియు యుద్ధములయొక్కయవసరములఁబట్టియు నీరాజ్యములు మారుచుండెడివి. మొత్తముమీఁద రాజ్యమునకు ముఖ్యపట్టణమును స్థిరపరచుటలో నొకకొండయున్న స్థలముగాని మంచి కోటను నిర్మించుటకు వీలయిన ప్రదేశముగాని యేర్పాటు చేయఁబడుచుండెడిది. ఆముఖ్యపట్టణమునుబట్టి రాజ్యమును మారుచుండెడిది. రాయలవారివివాహకాలమున కీరాజ్యము లున్నట్లు శాసనమున వ్రాయఁబడియుండెను. (1) ఘనగిరి (ప్రస్తుతపుపెనుగొండ) (2) గుత్తి (3) కందనవోలు (కర్నూలు) (4)

చంద్రగిరి (5) ముల్బాగల్ (6) రాయదుర్గం, ఇవిగాక కండికోట స్థలం, సిద్ధవట్టం, పొట్టాపి, నాగవట్టం లేమలుకూడ శాసనమునందే పేర్కొనఁబడియుండెను. రాయలవారు రాజ్యమునకు వచ్చినంతనే కావేరినద్దనుండెడి భాగమును యుద్ధముగావించి ఆక్రమించుకొని కొత్తరాజ్యము నొకదాని నేర్పాటుగావించి దానికి శ్రీరంగపట్టణమును ముఖ్యపట్టణముగ జేసిరి. గజపతి రాయనిపై యుద్ధముగావించి ఉదయగిరికోటను ముట్టడించి గజపతిరాజు నోడించినపిదప కొండవీటిరాజ్యము నేర్పాటు గావించెను. అదిల్షాహాలతో పోరాడి కృష్ణానది తుంగభద్రానదులకు మధ్యస్థమై యున్న భూభాగమును స్వాధీనపరచుకొని రాయచూరురాజ్యమును రాయలవారే యేర్పాటు గావించిరి. ఇవిగాక బారకూరురాజ్యము, శ్రీశైలరాజ్యము, నల్లూరి రాజ్యము, హంపి, హస్తినావతిరాజ్యములును కూడ రాయలవారు ఏర్పాటు కావించిరి.

రాజ్యాధిపతి లేక దుర్గదన్నాయకుఁడు

రాజ్యములను పరిపాలించుటకు దుర్గదన్నాయకులు యేర్పరచఁబడిరి. దుర్గదన్నాయకులే అమరనాయకులుగ నుండిరి. వీరు రాజ్యపరిపాలనముఁజేయుచు కొంతసేనను సామ్రాజ్యమునకు నప్పగించవలెను. అందుకు ప్రతిఫలముగ వీరి కమరమాగాణీలు తమదేశమున నిచ్చుచుండిరి. వీరు రాజ్యపరిపాలకులే గ్రామమును సామాన్యముగ విజయనగరరాజధాని యందే యుండవలసి వచ్చెడిది సామ్రాజ్యపుసరిహద్దున నుండెడి దుర్గదన్నాయకులు తప్ప మిగతా వారందరును సామ్రాజ్య రాజధాని యగు విజయనగరమునందే నుండెడివారని పేయసుచరిత్రకారుఁడు

వ్రాసియుండెను. అయితే సరిహద్దున నుండెడి దన్నాయకులు మాత్రము సరిహద్దులలోనికి పరాయివారు వచ్చి యల్లరిచేయ కుండ న ట్లెల్లప్పుడును తమరాజ్యములలో నుండెడివార నియు వారు దసరామహోత్సవములకు కూడ రాజధానియగు విజయనగరమునకు వచ్చెడివారు కారనియు పేయసుచరిత్ర కారుఁడు వ్రాసియుండెను. మిగతా దన్నాయకులందరు విజయ నగరమునందే యుండి తమస్థానే రాజ్యమును బరిపాలించుట కొకకార్యకర్త నేర్పాటుచేసికొనెడివారు. ఆకార్యకర్తయే ఆయారాజ్యములలోని న్యాయపరిపాలనయు రాజ్యపరిపాల నయు చేయుచుండెడివాఁడు. ఈదన్నాయకులు సంవత్సరమునకు కొంతమొత్తమును తమరాజధానితరపున విజయనగరసామ్రాజ్య కోశభాండాగారమునకు జమకట్టించు నాచార ముండెడిది. కొండవీటిదుర్గమును రాయలవారు 1514-వ సంవత్సరమున స్వాధీనపరచుకొన్నపుడు కొండవీటిరాజ్యమునకు సాలువతిమ్మ రసును దళనాయకునిగ నేర్పరచినను తిమ్మరసు తనకుగాను నాదెండ్లగోపన్నను కొండవీటిపరిపాలనకై యుంచి తాను రాయలవారితోనుండి గజపతిరాజుపై జరుపఁబడిన యుద్ధము నందు తాను నధికారము వహించియుండెను.

తనరాజ్యమునందు రాజ్యాధిపతికి రావలసిన ద్రవ్య మును వసూలుపరచుట, రాజ్యమునందు శాంతి, భద్రతలు ఏర్పాటుచేయుట, ప్రజానీకమున కవసరములగు పనులను జక్కఁబెట్టుట, రాజ్యమునందలి జనుల మధ్యనున్న తగాయి దాలను విచారించి వారిమధ్య సామరస్యము నేర్పరచుట మొదలుగాగల విధులన్నియు నీదుర్గదళనాయకులు నిర్వర్తించ

వలసినవై యున్నవి. ఈవిధుల నన్నిటిని తాము సొంతముగఁ గాని తమ పక్షమున నింకొకకార్యకర్తను నియమించిగాని నెర వేర్చుచుండెడివారు.

రాయలవారీదళనాయకులందరిని బ్రాహ్మణజాతినుండియే యేర్పాటు చేసికొనెడివారు. అట్లు చేయుటకు రాయలవారికి బ్రాహ్మణుల యందుండు విశ్వాసమే కారణము. ఆముక్త మాల్యదలో నీవిషయమై యిట్లు వ్రాసియుండిరి.

క. దుర్గములాప్తద్విజవర, వర్గమునకె యిమ్ము దుర్గవత్తతిక
త్యర్గళధరాధిరాజ్యవి, నిర్గతసాధ్వసతపాదమై నిలుకడకొఁదన్.

ఇందులకు గారణమును రాయలవారే ఆముక్తమాల్యద యం దిట్లు వ్రాసియుండిరి.

తే. శాస్త్రశస్త్రజ్ఞు మూలవిదంబనకనయునఁ
గొలిచి విషమవిప్రధర్మంబు చెలిమిసేయన,
బూని సంకటమున నిల్పఁ గానఁ దలఁచు
బ్రాహ్మణుని ప్రభుఁజేయుట పతికి హితము.

ఈ బ్రాహ్మణులు విశ్వాసముతో పనిఁజేయుదురనియు కష్టసమయములలో చిక్కులను విడదీయఁగల శక్తిసామర్థ్య ములు గలవారనియు రాయలవారి అభిప్రాయమై యుండెను.

— సీమ లేక నాడు —

సీమ లేక నాడు లందే యధికారు లుండి పాలనచేయు చుండిరో మనము కనుఁగొనుటకు తగిన సాధనసంపత్తు లేమియు నగుపడదు. ప్రతిసీమయందు పారుపత్యదారుఁడనిగాని మణే గాడని గాని యొకరుండినట్లును వారికాగితములు లెక్క పుస్తకము లుంచుట కొక సావిడియున్నట్లును తెలియవచ్చు

చున్నది. సీమయందు రాయసంవారు అవసరంవారు రాచకరణములుగ నుండెడివారని యొకశాసనము వలన తెలియుచున్నది. వారే యే విధులకు నియోగింపఁబడిరో మాత్రము మనకు తెలియదు. ఇట్టి యుద్యోగు లుండినట్లు రాయవాచకము నందుకూడ వ్రాయఁబడియున్నది. అయితే ఈయుద్యోగులు రాయలవారిసముఖముననుండి వారివెంట వెళ్లుచున్నట్లు వ్రాయఁబడియున్నది. రాయసం వారనఁగా వ్రాసెడువారు. అనగా లెక్కలు వ్రాసెడువారు. అవసరంవారనఁగా అవసరములను తెల్పెడివారు వీరినే అవసారికలని పిలిచెడివారు. ఇట్టివారు సామాన్యముగ రాజుగారి జనానాలో హెచ్చుగ నుండెడివారు. ఈరాయసంవారుగాని అవసరంవారుగాని సీమలలో నేయేవిధులను నిర్వర్తించుచుండిరో తెలియుటలేదు. నాడుకు సంబంధించినంతవరకు తలవరి యొక్కఁడున్నట్లు మాత్రము 1530-వ సంవత్సరపు శాసనమువలన మనకు తెలియుచున్నది. తలవరి యేపనిచేయుచుండెనో తెలియుటలేదు.

స్థలము

స్థలమున కొక కరణము లెక్కలను వ్రాయుచుండినట్లును తన పుస్తకముల జాగ్రత్త పఱచుట కొక సావిడియుండినట్లును తెలియవచ్చెడిని. ఇంతకన్న స్థలపరిపాలనను గూర్చి తెలియుటలేదు. ఈస్థలమునందలి జనుల మధ్యనుండెడి తగాయిదాలను కరణములు పరిష్కరించుచుండినట్లు చుక్కాయపల్లి కైఫియతు వలన తెలియుచున్నది.

గ్రామము

గ్రామపరిపాలన యిప్పటివలెనే కరణము రెడ్డి (మునసబు) యొక్క హస్తగతమై యుండెడిది. ఇప్పటికరణములు రెడ్లు నిర్వర్తించెడి విధులనే వీ రప్పుడును చేయుచుండెడివారు. గ్రామములోని భూములు వాటిగుడికట్టు, వాటిలోనిపంటలు, వాటివలన రావలసినట్టియు వచ్చినట్టియు నాదాయము మొదలయిన లెక్కల నీగ్రామాధికారులు తయారుచేయుచుండెడి వారు. గ్రామస్థులకును రాజోద్యోగస్థులకును మధ్యగనుండి గ్రామస్థుల కష్టసుఖములను పైయధికారులకు తెలియచెప్పి వానిని చక్కపెట్టుచుండెడివారు. వీరుగాక గ్రామములో తలారి యింకొకడుండెడివాఁడు. ఈతలారి గ్రామకావలి. ఈగ్రామాధికారులకు ప్రత్యేకముగ జీత ముండెడిదికాదు. వారలకు వంశపరంపరముగ ననుభవించుటకు కొంతపొల మిచ్చెడివారు. ఆ పొలమువలన నీగ్రామోద్యోగులు తమతమ జీవనము జరుపుకొనెడివారు. ఈభూముల ననుభవించుటయేగాక గ్రామమున కొన్నిమిరాసీలను మామూళ్లను వసూలు పరచుకొని అనుభవించెడివారు.

ఈపైనచెప్పిన గ్రామాధికారులు గాక గ్రామమున పురోహితులు, చాకలి, మంగలి, కంసాలి, నీటివాడు, కుమ్మరి, మొదలయిన యితర గ్రామోద్యోగులును నుండెడివారు. వీరికి వంశపారంపర్యముగ ననుభవించెడి భూము లుండెడివి.

నీటివసతులు

రాయలకాలమున నీటివసతులకు ప్రత్యేకముగ ప్రభుత్వపు టేర్పాటు లేమియు లేవు. కాని దేశమంతయు సస్యశ్యామలముగ

నుండినందున వ్యవసాయమునకు ముఖ్యావసరమగు నీటివసతులు చక్కగనుండెడివని యూహింప వలసియున్నది. ప్రత్యేక ప్రభుత్వపు టేర్పాటులు లేకున్నను రాజ్యమునందంతయు వ్యవసాయమే ముఖ్యమైన జీవనోపాధియయినందునను, నీటివసతుల నేర్పాటుచేయుట సప్తసంతానములలో నొకటియైనందునను, రాజులు, ప్రభువులు, అమరనాయకులు, ధనికులు మొదలయిన వారెల్లరును, చెరువులను నూతులను, కాల్వలను, త్రవ్వించుట సాధారణముగ నుండెడిది. రాయలకాలమున పేయసు చరిత్రకారుడు వ్రాయుచు తాను నాగలాపురమున పెద్దచెరువును త్రవ్వించుట ప్రత్యక్షముగ చూచిన ట్లీవిధమున వర్ణించియుండెను.

"ఈ చెరువును త్రవ్వించుట కీ ప్రదేశమును చుట్టియున్న పెద్దకొండ బద్దలుకొట్టబడెను. ఈ చెరువును త్రవ్వుటకు దాదాపు 15 వేలు లేక 20 వేలమందిజనులు పనిచేయుచుండిరి. వీరు పనిచేయునపు డీపని చేయువారందరు చీమలవలె భూమిపైన కనబడుచుండిరి. ఈపని చేసెడువారిని నాయకుల కప్పగించి వారు సరిగ పనిచేయుచున్నట్లు జవాబు చేయుటకును, పనితొందరగ ముగించుటకు నేర్పాటుచేసిరి."

బీజపూరుచరిత్రకారుడగు "ఇబ్రహింషిరాజి" అను నాతడు రాయలు విజయనగరమువద్ద నొక కాలువను త్రవ్వింప మొదలుపెట్టెనని వ్రాసియుండెను. రాయలమంత్రులలో నొకరగు రాయసము కొండమరసు కొండవీడుసీమలోని కొండసముద్రము తిమ్మసముద్రమను రెండుచెరువులను త్రవ్వించినట్లు శాసనములవలన తెలియుచున్నది. రాయ లుదయగిరి దుర్గమున రెండుచెరువులు త్రవ్వించియుండెను. ఇట్లే మంత్రులు, నాయ

కులు, వర్తకులు, ద్రవ్యవంతులు మొదలయినవా రనేకులు చెరువులు, కాలువలు, నూతులు, త్రవ్వించి భూములకు పశువులకు మనుజులకు నీటివసతులు కలుగజేసి దేశసౌభాగ్యమును హెచ్చుచేసియుండిరి. ఇట్లు చెరువులు వగైరాలను త్రవ్వించుటయే గాక యిదివరకుండిన చెరువులను బాగుచేయించుచుండిరి. చెరువుపోషణకై రాయలు బాలిరెడ్డి యనునధికారికి దశబంధయినాము నిచ్చినట్లు తెలియుచున్నది.

భూములను వ్యవసాయముచేయు రహితులలో నీటిని పంపకము చేసికొనునపుడు తగువులాడకుండ నీటిని సకాలమున నుపయోగించుకొనుటను గూర్చి రాయలవారు తామురాజ్యము చేసినకాలములో కొన్ని శాసనములు చేసినట్లు రాతిశాసనముల వలన తెలియవచ్చుచున్నది.

16. భూమి : ఆదాయము

గ్రామములలో నుండెడి భూములను గ్రామకరణములు కొల్చి సరియైన లెక్కలను కాటియాకులలో వ్రాసి నిల్వచేసెడివారు. వీటిని కాటియాకుకవిలె లనియెడు వారు. వీటిని గ్రామసావిడి యందు జాగ్రత్త పఱచెడువారు. వీటినిబట్టి గ్రామసరిహద్దులు, ఆసామిసరిహద్దులు, భూమిలోనిపంటవగైరాలు తెలియనగును. అప్పుడప్పు డవసరములను బట్టి భూములను కొలత చేయుటయు కద్దు. కొన్ని తెనుగుజిల్లాలలో తిమ్మరసు మంత్రి భూములను కొలతవేయించినట్లు కనబడుచున్నది. కన్నడదేశమునందలి భూములన్నిటిని రాయలవారే కొలత వేయించి లెక్కలను తయారుచేయించిరి.

ఈభూములలో కొన్ని భూములు పల్లపుభూములు, కొన్ని మెట్టభూములు. ఇప్పటివలెనే పల్లపుభూములయందు మాగాని పైర్లును, మెట్టభూములయందు మెట్టపైర్లును వేయఁబడి పెంచఁబడుచుండెడివి. నీటివసతి యవసరమగు వరి, చెఱకు, అరటి, తమలపాకులు, కూరలు, తోఁటలు, పల్లపుభూములలో పైర్లు, వీటినే నీరారంబ భూములని పిలిచెడివారు. మెట్టపైర్లు అనగా, రాగి, సజ్జ, చోళం, పప్పుధాన్యములు, మొదలయిన పంటలు తయారుచేయఁబడెడి భూములన్నియు కాడారంబ భూములు. వీటికి వర్షమే యాధారమై యుండెను.

ఆకాలమున భూ ఆదాయము సంబంధించినంతవరకు గ్రామములు మూఁడువిధములుగ విభజించఁబడెను.

1. భాండారవాడగ్రామములు. 2. అమరగ్రామములు. 3. మాన్య గ్రామములు.

1. భాండారవాడగ్రామములు: ఈగ్రామములు ప్రత్యేకముగ రాష్ట్రీయప్రభుత్వము క్రిందనుండి కేంద్రప్రభుత్వాధికారులచే పరిశీలింపఁబడుచుండెడి రాజ్యమాన్యములు. ఈగ్రామములనుండి వచ్చెడి ఆదాయమంతయు రాజుగారి భాండాగారమునకు చేర్పఁబడును.

2. అమరగ్రామములు : సామ్రాజ్యావసరములకు సరియగు చతురంగబలమును సమకూర్చికొనుటకు రాయలవారు తనదేశమునంతను నాయకులకు పంచిపెట్టి వారలవద్దనుండి కొంత సేనను కొంతద్రవ్యమును పుచ్చుకొనుచుండెడివారు. ఈపద్ధతినే అమరమనియు నీనాయకులను అమరనాయకులనియు పిలిచెడివారు. ఇట్టి అమరగ్రామములు విజయనగరరాజ్యమునం

దనేకము లుండెడివి. ఈనాయకులు కాము అమరముచేయు పద్ధతిని నాయంకరపద్ధతి యని పిలిచెడివారు. ఈపద్ధతిని నాయకులందు రాజుగారి యిష్టమున్నంతకాలము గ్రామములను అమరముజేసెడివారు. రాజుగారికి యిష్టము లేకున్నగాని, కోపము వచ్చినగాని నీయమరగ్రామములను నాయకులవద్ద నుండి లాగికొని యితరుల కిచ్చెడివారు. 1526-వ సంవత్సరమున తరిగొండ రామానాయఁడు రాజుగారిపై తిరుగుబాటు చేసినపుడు చింతరాజుపాలెం, అమరనాయకుఁడగు సాములనేని కుమార పెద్దబుచ్చినాయఁడు రామానాయునికి సహాయముచేసెనసెడి యనుమానముపైన చింతరాజుపాలెం గ్రామమును వారివద్దనుండి రాయలవారు లాగికొనిరి. దువ్వూరుసీమలోని అవుకు గ్రామమును తన కార్యకర్తయగు బుక్కరాజు తిమ్మరాజు కిచ్చెను. తిమ్మరాజీ గ్రామమును తనవద్ద కొంతకాల ముంచుకొన్నపిదప అచ్యుతదేవరాయలు తాను లాగికొని యితరుల కిచ్చెను. ఇట్టి యుదాహరణ లనేకము లుండెను. అమరగ్రామములు అమర నాయకులు వంశపారంపర్యముగ ననుభవించెడివి కావు.

ఈ అమరనాయకులు రాజుగారికి సైన్యము నిచ్చుటయే గాక కొంతద్రవ్యమును ప్రతిసంవత్సర మిచ్చుచుండెడివారు. ఇవిగాక నూతనసంవత్సరాదినాడు రాజుగారికి గొప్పగొప్ప బహుమతులను, భోజనపదార్థముల నిచ్చు మామూలుండెడిది. క్రమప్రకారం యివ్వవలసిన చతురంగబలసైన్యమును ద్రవ్యమును మామూళ్లను అమరనాయకు లీయనియెడల రాయలవా రమరనాయకుల తప్పిదమునకు శిక్షించుటయు కలదు. రాయలవారి పట్టాభిషేకమయిన పిదప అమరనాయకుల

లెక్కలు పరిశీలించగా వారప్పటి కియ్యవలసిన మొత్తములు హెచ్చుగ నున్నందున నమరనాయకులు భయపడి రాయలవారికి బాకీమొత్తముల నిచ్చుట కంగీకరించి తమతప్పును క్షమించుమని ప్రార్థించుటయు రాయలవారు వారిని మందలించి క్షమించుటయు వారిపూర్వబాకీలక్రింద వారివద్దయేనుగులను గుఱ్ఱములను సైన్యమును రాయలవారికి నప్పగించుటయు వీనివలన రాయలవారు పెద్దసైన్యమును తయారు చేయుటయు జరిగియుండెను.

3. మాన్యగ్రామములు: రాయలవారు తమరాజ్యమున హిందూమతపోషణను బాగుగ జేసిరి. రాయలవారు తమకాలమున నిట్టిమాన్యములననేకములను సంస్థలకును ప్రత్యేకవ్యక్తులకు నిచ్చియుండిరి. అవి బ్రహ్మోదాయ దేవాదాయ, మఠపుర, సర్వమాన్యములునై యున్నవి.

బ్రహ్మోదాయమాన్యములు

బ్రాహ్మణుల కిచ్చినమాన్యములు బ్రహ్మోదాయమాన్యములు. ఇవియే అగ్రహారములనియు శ్రోత్రియమాన్యములనియు పిలువబడెడివి. ఈమాన్యములు వారి పాండిత్యప్రకర్షకుగాని వారి శిష్యులకు చదువుచెప్పుటకుగాని యీయఁబడెడివి.

దేవాదాయమాన్యములు

దేవాలయములయందు నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, బ్రహ్మోత్సవములు జరుపుట కీయఁబడిన మాన్యములు దేవాదాయమాన్యములు.

మఠపురమాన్యములు

శైవ, వైష్ణవ, మతముల ప్రచారమునకై యీయఁబడినమాన్యములు మఠపురమాన్యములు.

ఈమాన్యముల కన్నిటికి రాజులకు కొద్ది జోడిగాని శ్రోత్రియముగాని ప్రతిసంవత్సర మియ్యవలెను.

సర్వమాన్యమునకు జోడీగాని శ్రోత్రియముగాని యీయనక్కరలేదు.

ఇవిగాక కొత్తభూములను బాగుచేసి పాగుకై రహితుల కిచ్చుటవలన నాయా ప్రదేశములు కొత్తగ్రామములుగ నేర్పడెడివి. ఆగ్రామములోని భూములను తక్కువమొత్తాలకు నాగ్రామస్థుల కిచ్చుచుండెడివారు.

ఆదాయము

ఈభూములనుండి వచ్చెడి ఆదాయము, రెండు విధములు. (1) ధాన్యాదాయము. (2) సువర్ణాదాయము. ధాన్యాదాయమున పండినపంటలో రాజ్యమున కిచ్చుభాగము. కొన్ని పంటలలో ధాన్యభాగము నివ్వక వచ్చిన ఆదాయములో భాగమునకు బదులు దానిసరియైన ధరను బంగారునాణ్యములలో నిచ్చునట్టి ఆదాయము సువర్ణాదాయము.

దేశమునందలి భూములను కొలిచి లెక్కలు వ్రాసియుండెడివారని యిదివరలో వ్రాసియుంటిని. ఈ లెక్కలన్నియు కాటాకులమీద వ్రాసి గ్రామచావిడియం దుంచఁబడెడివి. ఈ లెక్కలలో భూమివిభాగములు వానియజమానులపేళ్లు వాని విస్తీర్ణము, గ్రామమునందు, పాగుచేయబడెడి ఆయకట్టు (గుడి

కట్టు. దేవబ్రాహ్మణుల కీయఁబడినభూములవివరములు రహితుల క్రిందనున్నభూముల మొత్తము, రహితు లీయవలసిన ఆదాయమొత్తములు మొదలయిన వివరములన్నియు నీకవిలె లెక్కలలో వ్రాయఁబడెడివి.

భూములలోని పంటలో భాగము ధాన్యమని గాని "దవన" మని గాని వాడెడువారు. "దవన" మనుపదము తెనుగుపదమేయైన నిప్పుడు మనదేశమునందు వాడఁబడుట లేదు గాని కన్నడదేశములో నిప్పటికిని వాడుకలో నున్నది. ధాన్యము నవధాన్యములకు వాడబడుచున్నది. దవనము మిరియములు దనియము మొదలయినవాటికి వాడబడెడిది.

బంగారునాణెములలో నీయఁబడు నాదాయము సువర్ణాదాయమని చెప్పియుంటిని. సువర్ణమనుపదము కన్నడపదమయిన "హొన్ను" అనుపదమునకు సంస్కృతభాషాంతరము. "హొన్ను" అనగ వరహాలో సగభాగము.

పన్నులు:—పన్నులనే సుంకములనియు వాడెడువారు. ఈపన్ను లనేకములు. 1 వ్యవసాయపుపన్నులు. 2 పుల్లరిపన్ను; అడవిపన్ను. 3 కృషిపన్ను. 4 వర్తకపుపన్ను. 5 సైన్యపుపన్ను; రక్షణపన్ను. 6 వృత్తిపన్ను. 7 సంఘపుపన్ను. 8 ఆస్తిపన్ను. 9 మతముపన్ను. 10 మాన్యగ్రామముపన్ను.

1. వ్యవసాయపన్నులు:—పల్లపు (నీరారంబ) పొలముల వలన కాడారంబ (మెట్టు) పొలములవలన వచ్చెడిరాబడి వ్యవసాయపుపన్ను. ఈపన్నులు కొన్ని ధాన్యరూపముగను మరికొన్ని సువర్ణరూపముగను వసూలు చేయఁబడెడివి. సామాన్యముగ నిలవయుండు పంటలమీఁద ధాన్యపుపన్ను

వసూలుచేయఁబడెడిది. తొందరలో పాడయిపోయెడు పంటల మీఁద సువర్ణాదాయము వసూలుచేయబడెడిది.

2. పుల్లరి:—అడవిపన్ను; దేశమునకు ముఖ్యాదాయము వ్యవసాయమువలననే రాబడినను అడవులనుండియు మంచి ఆదాయమే వచ్చుచుండెడిది. వ్యవసాయమునకుపశువులమిక్కిలి అవసరము. ఈపశువులను మేపుటకు మంచిగడ్డి అవసరము. ఈగడ్డి అడవులయందు బాగుగ దొరకును. ఈగడ్డిపైన వచ్చెడి పన్ను పుల్లరిపన్ను. గొఱ్ఱెలను మేపినందు కీయఁబడెడిపన్ను "అదతెరి" అడవిలోనుండి గృహోపయోగమునకు కట్టెలు వచ్చెడివి. దీని కీయఁబడెడిపన్ను "కొండగుత్త". ఈపన్నులన్నియు వేలము వేయబడి హెచ్చుపాటదారున కిజారా యీయఁబడెడివి.

3. పరిశ్రమలపన్ను:—ప్రతిగ్రామమునందు మగ్గములు పెట్టి నేత నేయుదురు. ఈమగ్గములపైన పన్ను విధించఁబడి వసూలుచేయఁబడెడిది. దీనినే మగ్గదరియని మగ్గరి యని పేరులతో వసూలుచేసెడివారు.

దూదిదిక్కు దీసెడివారిపై వేయఁబడుపన్ను పింజాని గారు లేక పింజసిద్దాయము. పింజఅనగా దూది.

కుమ్మరివాండ్రు కామ తయారుచేసినకుండల నమ్ముకొన్నందుకై వారివలన వసూలుచేయఁబడెడిపన్ను. "కుంబారితరిగె" వాండ్రు తయారుచేసిన కుండల కిచ్చెడిపన్ను "చక్రకానిక".

గానుగవాండ్రు గానుగగుత్త, బెల్లం తయారుచేయువారు ఆలేయసుంకము, ఉప్పుతయారుచేయువారు ఉప్పురసి

ద్దాయము, కల్లుగీయువారు యీడిగెసుంకము, కమ్మరవాండ్రు పెద్దకొలిమిపన్ను యిచ్చుచుండెడివారు.

4. వ్యాపారపన్నులు:— పెద్దవ్యాపారముచేయువారు వారి మూలధనముపైన పదునారవవంతు పన్ను నీయవలసి యుండెడిది. దీనినే "మూలవీస" మనియెడివారు. మూల ధనముపై వీసమునగా పదునారవవంతు. చిల్లరవ్యాపారస్తు లిచ్చెడిపన్ను "సిరుకుల" మనెడివారు. వీరివద్దనుండి లాభముపై పన్ను వసూలుచేయబడెడిది.

ఒక ప్రత్యేకస్థలములోగాని పేటలోగాని, గ్రామమున గాని విక్రయించెడి వస్తువులపైన వసూలుచేయబడిన సుంకము స్థలసుంకమనిగాని పేటసుంకమనిగాని చెప్పఁబడెడిది. ఈ ప్రకారముగ విక్రయింపఁబడిన జొన్న, ఉప్పు, పండ్లు, కూరలు, పెసలు, మినుములు, సెనగలు ఉలవలపైన సుంకము వసూలు చేయఁబడినట్లు కొండవీడుకు సంబంధించిన 1530-వ సంవత్సరపు కాగితములవలన తెలియవచ్చుచున్నది. ఈసుంకమే గ్రామము లలోజరిగెడు సంతలలో వసూలుచేయఁబడుచుండెడిది. ఈ సంతలవలన రాజ్యమునకు చాల ఆదాయము వచ్చుచున్నందున నీసంతలను ప్రోత్సహించుచున్న ట్లాకాలపు కాగితములవలన తెలియుచున్నది.

విక్రయవస్తువుల నొకచోటనుండి యింకొకచోటునకు దీసికొనిపోవునపుడు మార్గమధ్యమున వసూలుచేయబడెడిపన్ను "మార్గాదాయము" "ఉభయమార్గాదాయము."

ఒకరాజ్యమునుండి యింకొకరాజ్యమున కెగుమతిచేయ బడెడు ధాన్యములపైని రసవర్గములపైని సుంకము వసూలు చేయఁబడెడిది. ఇది మామూలాదాయము.

పట్టణములలో కొట్లలో సరుకులు నిలువచేసికొని వ్యాపారము చేసెడివారివద్దనుండి వసూలుచేసెడిపన్ను "మండి సుంకము".

ఇట్లె వ్యాపారమునందు ప్రతివస్తువుపైన పన్ను వసూలుచేయఁబడుచున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇన్నిపన్ను లతో వ్యాపార మెట్లు చేయఁబడుచుండెడిదో మనకు విశదముగ తెలిసికొనుటకు తగిన పావకాశములులేవు. మొత్తముమీద వ్యాపారము బాహాటముగ జరుగుచున్నట్లే యూహించతగి యున్నది.

5. సైన్యపుపన్ను రక్షణపన్ను:—దుర్గనాయకులు దేశ మునకు తమవద్దనున్న సైనికదళమువలన రక్షణ నిచ్చెదరు. వారిరక్షణకై గ్రామస్తులవద్దనుండి "మేర" లను వసూలుచేయు చుండెడువారు. దత్తమండలములలో వసూలుచేయబడిన మేరలను "దుర్గదన్నాయకనివర్తన" లని చెప్పినట్లు కొన్ని కైఫీయతులవలన తెలియుచున్నది. ఈ మేరల నరవదేశము నందు దన్నాయకరముగమై యనియు మైసూరురాజ్యమునందు దన్నాయకరప్యామ్యమనియు పిలిచెడివారు.

సైన్యసంరక్షణకై వసూలుచేయుబడెడిపన్నులు "దళ విలి" యనబడెడిది.

కోటలను మరమ్మతు చేయుటకు వసూలుచేయఁబడెడి పన్ను కోటైమగమై యని అరవదేశమున చెప్పఁబడెడిది.

నాడుతలవారిక యనెడిపన్ను నాడునందలి తలవారులకై వసూలుచేయఁబడెడిపన్ను. తలారులు గ్రామరక్షణకై నియోగింపఁబడెడివారు. వారిజీతముల క్రింద తలవారికపన్నును వసూలుచేసెడివారు.

6. వృత్తిపన్నులు:—ప్రతిజాతివారు పన్నుల నిచ్చుచుండెడివారు. చాకలివాండ్లు ఊరుచెరువునందలి నీటిని వాడినందుకు అగసారుపన్ను నిచ్చెడివారు. వీరు బంజరుభూముల నందుండెడి సున్నమును వాడుకొన్నందుకు పన్ను నీయవలసియుండెను కాని యీపన్ను కొంతకాలమైన పిదప తీసివేయబడెను.

కంసాలివారు తమవృత్తిపైన పన్నునిచ్చెడివారు. ఉరిశిక్ష ననుభవించవలసిన వారిని ఉరితీసెడి వారివద్దనుండి పన్ను వసూలుచేయబడెడిది. ఇది మిక్కిలి చిత్రమైనపన్ను. వానికి యిచ్చుటకుబదులు వానివద్దనుండి పన్నువసూలుచేయుట యాశ్చర్యజనకముగ నుండకపోదు. అయితే యురితీసెడివాండ్రు మాలకులస్థులు. వారుచేసెడిపని మిక్కిలి కష్టతరమైనపనియై యున్నది. అందువలన నీపనిని పూనుకొన్నవారికి మాలకులము 'వా' రొకరూకచొప్పున నిచ్చుచుండెడివారు. ఈప్రకారము వసూలుచేయఁబడినసొమ్ము హెచ్చు మొత్తమయ్యెడిది. ఆ మొత్తమునుండి రాజులు పన్నులు వసూలుచేసెడివారు. ఇది బహుచిత్రమైన పన్ననుటలో సందేహములేదు. ఈపన్ను వసూలుచేయుట యెట్లు సంభవించెనో యిపుడు మన మూహింపఁజాలము.

మాదిగవాండ్రు రాజ్యమునకు తమవంతు వృత్తిపన్ను చెల్లించవలసియుండెను. వీరు రహితులకు తోలుబొక్కెనలు, చెప్పులు, తాళ్లు తయారుచేసి యివ్వవలెను. ఇందుకు ప్రతిఫలముగ రహితులు ధాన్యము నిత్తురు. ఇట్లు రహితులనుండి సంపాదింపఁబడిన ధాన్యమునకు సుంకము చెల్లించవలసియుండెను.

బోయవారు అరణ్యవాసులు. వీరు అరణ్యములోని సరుకులు వాడుకున్నందుకు రాజ్యమునకు సుంకము కట్టవలసియుండెను. ఇదిగాక వీరు గొప్పవారి పల్లకీలు మోయుదురు. అందుకువారు వృత్తిపన్ను కట్టవలసియుండెను.

ఉద్యోగస్థులు, న్యాయాధికారులు, పన్నులనిచ్చెడివారు. బ్రాహ్మణులవద్దనుండి వారిపౌరోహిత్య, పాండిత్య సంపాదనలపై, పన్నులు వసూలుచేయఁబడెడివి. కాని వీని వివరములు మాత్రము మనకు తెలియుటలేదు.

7. సాంఘికపన్నులు:—సాంఘికపన్నులలో ముఖ్యమైనది పెండ్లిసుంకము. ఈసుంకము ప్రతివారిని బాధించునది. పెండ్లి చేసికొన్న పెండ్లికొడుకు పెండ్లికూతు రీయవలసిన సుంకము. కొన్ని సమయములలో పెండ్లికూతు రొకరూకయు పెండ్లికొడుకుమూఁడురూకల నిచ్చెడివారు. ఈసుంకము అష్టాదశవర్ణముల వారికిని సంబంధించినపన్ను. కరణకమ్మగొల్లల వద్దనుండి నూటొక్కమాడలు పెండ్లి సుంకము క్రింద వసూలుచేయఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ పెండ్లిసుంకముగాక పెండ్లిపందిలికి పన్ను పెండ్లియూరేగింపునకు పన్ను వసూలుచేయఁబడెడిది. ఈపన్నులబాధను తప్పించుకొనుటకై కొందఱువివా

మానములు మానివేసినట్లు శాసనములవలన తెలియుచున్నది. ఈ పెండ్లిసుంకమును గూర్చి యనేకులు తమ అయిష్టతను తెలియఁజేయుటయేగాక యీపన్నును వసూలు జేసినవారిని దూషించుటయు జరిగెను. ప్రథమమున నీసుంకమును రద్దుఁ జేయుటకు ప్రయత్నించినది 1507-వ సంవత్సరమున తిమ్మరసు చేతనై యున్నది. అప్పటికి వీరనరసింహరాయఁడు రాజ్యమేలు చుండెను. ఆకాలమున గుత్తిరాజ్యమునందుమాత్ర మీపన్ను రద్దుచేయఁబడెను. రాయలవారు రాజ్యాభిషిక్తులైన పిమ్మట తిమ్మరసుమంత్రి ఆదెప్పనాయఁడు గౌనికాతన్న మొదలయిన అధికారులు శ్రీవారితో నీసుంకమును రద్దుజేయుమనివిన్నవించిరి. రాయలవారును వారితో నేకీభవించుచు నీసుంకమును తన సామ్రాజ్యమున రద్దుజేసినట్లు శాసనమును ప్రకటించిరి. రాళ్ల మీఁద నీశాసనమును లిఖించి ప్రతిపట్టణమునందు బహిరంగస్థలమున ప్రచురణ జేయించిరి. ఈసుంకమును రాయలవారు రాజ్యముచేసినంతకాలము వసూలు జేసియుండలేదు. కాని రాయలవారి తరువాత అచ్యుతదేవరాయనికాలమున తిరిగి యీసుంకము వసూలుజేయ ప్రారంభింపఁబడెను.

సంఘములోని కొన్ని కులములలో ప్రభుత్వమువారు కులపెద్దల నేర్పరచి వారిని ఆయాకులములలో వివాదములను పరిష్కరించుటకు నేర్పాటు చేసియుండిరి. అట్టి కులపెద్ద లాకులములో వివాదముల పరిష్కరించి వారివలన తప్పులు, కానికలు, కప్పములు, మొదలయినవి పుచ్చుకొనుట కధికార మీయఁబడినది. ఈప్రకారము వారు వసూలుపరచుకొన్న

ధనమునుండి కొంతభాగమును ప్రభుత్వమువారు "సమయ సుంక" మను పేర వసూలుపఱచుకొనెడివారు.

8. ఆస్తిపన్ను:—ఇందు ముఖ్యమైనపన్ను ఇండ్లపన్ను. దీనినే యిల్లరి యనెడువారు. ఈపన్ను యిండ్లమీఁద, వసారాలమీఁద, దొడ్డిమీఁద వసూలుచేయఁబడుచుండెడిది. ఇండ్లకేగాక యితరఆస్తిపైనకూడ పన్ను వసూలుచేయఁబడెడిది. తోఁటలపైన వసూలుచేయఁబడెడిపన్ను "అడ్డకెరి" ఇట్లే ఆవుల వలన, యెద్దులవలన, దున్నపోతులవలన, పన్ను వసూలుచేయఁబడెడిది.

9. మతపన్నులు:-ఇందు ముఖ్యమైనది మహారాజప్రదానములు. ఈపన్ను గ్రామదేవతల యుత్సవసందర్భమున వసూలు చేయఁబడెడిది. ఈవసూలు జేసినసొమ్ముతో గ్రామదేవతయొక్క నిత్యనైవేద్యదీపారాధనలు జరుపుటయు నుత్సవములుగావించుటయు జరుగుచుండెడిది. గ్రామదేవతలే దేశమునందలి పాపములను తొలఁగఁజేయుననియు దేశమునందలి మహామారి, మసూచికము, కలరా మొదలయిన రోగములీదేవతల కోపము వలన నుద్భవించుననియు యట్టిదేశపాపమును రోగములను శమింపజేయుట ప్రభుత్వవిధులలో నొకటియనియు మూఢ నమ్మిక దేశమునందు కలదు. అట్టిపాపములను నివారణజేయుటకై యీమహారాజప్రదానములు వసూలుచేయఁబడి గ్రామదేవతలప్రీతికై యాదబ్బువెచ్చింపఁబడెడిది.

10. మాన్యగ్రామములు:—మాన్యములనుండి వసూలు చేయఁబడెడిపన్ను జోడి, కట్నంకానుక, కద్దాయము. శ్రోత్రియ బ్రాహ్మణులు, ఫకీర్లు యిచ్చునది కానుక. మాన్యములవలన

వసూలు చేయఁబడునది జోడి శ్రోత్రియము. చిన్నవారు పెద్దవారి కిచ్చునది కట్నం. బలవంతముగా తీసికొన్నది కద్దాయము.

పైన వ్రాయఁబడిన పన్నులుగాక అనేకమామూళ్లుండెడివి. ఈమామూళ్లు మతమునకు సంబంధించినవి కొన్ని సంబంధించనివి కొన్నియు నై యున్నవి.

మతసంబంధములైన మామూళ్లు

శైవులు గుడిపెద్దలయిన జంగములకిచ్చెడిది "గణాచారి తరి"యందురు. దీనినే మనతెనుగువారు వీరముష్టిపన్ను అనెడివారు. శైవమతములలో వీరముష్టివారు జంగమువారు నుండెడివారు.

శివునిగుళ్లలోనున్న తంబలఅర్చకులకు గణాచారు లిచ్చునది గణాచారిపన్ను.

ఇట్లె వైష్ణవదేవాలయములలో వైష్ణవులు తమజియ్యరు గారికిచ్చునది జియ్యరుతరి

గ్రామములో దేవతలకు అమ్మవార్లకు జరుపవలసిన జాతర్లకు వసూలుచేసెడిపన్ను జాత్రపన్ను. ఈపన్ను గ్రామస్తులందరును చెల్లించవలెను.

మతమునకు సంబంధించనిపన్నులు

విప్రవినోదులపన్ను; దొమ్మరపన్ను

విప్రవినోదిపన్ను; విప్రవినోదులనగా బ్రాహ్మణులకు వినోదమును కల్గించెడివారు. ఈవిప్రవినోదులు చమత్కారము చేత జీవించుచు సంవత్సరమునకొకమారు గ్రామసంచారము చేసి డబ్బునుసంపాదించెదరు. ఒకొక్కప్పుడు బ్రాహ్మణులకు జైనమతస్తులకు తగాదాలు వచ్చినపు డీవిప్రవినోదులు తమ చమత్కారక

దనముచేత బ్రాహ్మణులకు సహాయముగావించి వారుజయించినట్లు సహాయపడిరనియు అందువలన బ్రాహ్మణులు వర్షాశన మిచ్చుట కంగీకరించిరనియుఁ జెప్పుదురు. ఈకథ నిజానిజము లెట్లున్నను విప్రవినోదులు తమమామూళ్లను బ్రాహ్మణకుటుంబముల నుండియే వసూలుపఱచుకొనుచుండిరి.

దొమ్మరపన్ను: దొమ్మరులు కసరతుచేసియు కొంత ఆటను నేర్పుకొనియు జనుల కానందముకలుగఁజేసి గ్రామస్థులందరి వలన తమమామూళ్లను వసూలుచేయుదురు.

ఆదాయము:-వసూలు

ప్రభుత్వమునకు రావలసిన ఆదాయమంతయు నెట్లు వసూలుచేయఁబడుచుండెడి దనునంశమును గూర్చి తగినంత సమాచారము తెలియుటలేదు. భూములను మక్తాల కిచ్చురోజులలోననగా ప్రతిసంవత్సరము జూనునెలలో మంత్రులు భూములున్న గ్రామములకు వెళ్లుటయు నచట భూములను కౌలు కిచ్చునపుడు తమకు రావలసినమొత్తము నేర్పరచుకొని తిరిగి కోతలసమయమున తామే వెళ్లి తమకురావలసిన ధాన్యాదాయమును వసూలుచేసికొని వసూలుపఱచిన ఆదాయము నచటనే హెచ్చుధరలకు విక్రయించి ధాన్యాదాయమును ధనాదాయముగమార్చి ద్రవ్యమును తీసికొనివచ్చెడివారని కొందరు చెప్పుచున్నారు. కాని యిది సరియైనపద్ధతి యని తోచదు. ఈవిషయమునందలి వివరముల నానాటిచరిత్రకారులు విశదముగ వ్రాసియుండలేదుగాని న్యూనిసుచరిత్రకారుఁడు వ్రాయుటలో ప్రభుత్వమువా రీయాదాయమును వసూలుచేసి యిచ్చు హక్కును హెచ్చుపాటదారునకు వేలము వేసెడువా రనియు

వ్రాసియుండెను. ఇదియే సరిగ నుండవచ్చునని తోచుచున్నది. ఇట్టి వేలములలో సామాన్యముగ నమరనాయకులే తమపేర గాని తమసంబంధీకులపేరగాని వేలంపాట కొట్టివేయించుకొని రయితులను వత్తిడిచేసి కొంత హెచ్చుమొత్తములను వసూలు పరచుకొనెడివా రనియు తెలియవచ్చుచున్నది. ఇది నిజమైనను కావచ్చును. ఇందులో నమ్మ దగనిది లేదు. ద్రవ్యరూపముగ నిచ్చెడిపన్నులను వసూలుచేసెడివారిని సుంకరు లనియు సుంకరు వారనియు పిలిచెడివారు. భూములలోని పంటలు చెడిపోయి నపుడు ప్రభుత్వమువారు తగురీతిని విచారణగావించి పన్నులలో మొత్తమునుగాని కొంతభాగమునుగాని మినహాయింపు చేయు చుండెడివారు.

పన్నులు వసూలుచేసెడువారు రయితులను చాలవరకు బలవంతముచేసి వత్తిడిపెట్టి వారివ్వవలసినదానికన్నను వారివ్వ గల్గినదానికన్నను హెచ్చుమొత్తములను వసూలుచేసెడివా రని నూనిసున్ను పేయసున్ను చరిత్రకారులు వారివారి యుత్తర ములలో వ్రాసియుండిరి. కొన్ని రాతిశాసనములయందును నిట్లు వ్రాయుటవలన నీతప్పుడుప్రవర్తన జరుగుచుండె నని స్పష్టపడు చున్నది. 1512-వ సంవత్సరమున కొత్తచెరువుగ్రామమున దేవా దాయ బ్రాహ్మణాదాయ భూములనుండి వత్తిడిచేసి హెచ్చు మొత్తములను వసూలుపరిచినట్లు రాయలవారికి తెలియరాగా వారు స్వయముగ విచారించి హెచ్చుగ వసూలుచేయఁబడిన మొత్తములను తిరిగి యిప్పించిరనియు నొకశాసనమువలన తెలియుచున్నది. శ్రీముష్ణము గ్రామమున నిట్లే వత్తిడిచేసి డబ్బువసూలుచేసినందున నచటిజనము గ్రామమును వదలి వెళ్లి

పోయిరనియు నందుపైన 1513-వ సంవత్సరమున రాయలకొలు వులోని యధికారి చిన్నప్పనాయకుఁడనువాఁడు ఆగ్రామమునకు జని అచటివారలకు తగినరీతిని మాటలుచెప్పి వారిని సమాధాన పరిచి తక్కువరేట్లకు భూములను ముక్తాలకిచ్చి గ్రామస్థులనందరిని తిరిగి గ్రామమునకు రప్పించిరనియు శాసనమువలన తెలియనగు నంశములే. ఈవిషయములనన్నిటిని చక్కగ మనసునం దుంచు కొనియే కాఁబోలు తమగ్రంథమగు ఆముక్తమాల్యదయం దీక్రిందిపద్యమును రాయలవారు వ్రాసియుండిరి.

ప్రజ నఱసి చన్నఁ బిలువక తప్పుకుం గొలుచు
నమ్మియుండిండ్లింధనంబులకారొ నరెడి
కలని నక్కన యధికారిగ నన్నృపతికి
చేడువడుఁ గొన్న సమృద్ధి లేదు. (ఆము. 4 ఆ. 237.)

(ప్రజ నష్టపడిపోయినచో అట్టివానిని తిరిగి పిలువక వానిగృహములను అమ్మి వంటచెఱకుక్రింద నుపయోగించు నధికారిని యుద్ధమునందు నక్కక్రింద పోల్చిరి. అట్టివా రుండ కూడ దని అభిప్రాయము)

ప్రభుత్వమునం దమరనాయకులుకూడ నీరీతినే ప్రజ లను బాధించుచుండిరి. కొండవీడునం దమరనాయకుఁడుగ నుండెడి బాచమర సెట్లే రయితులను బాధించె నని తెలియు చున్నది. ఈబాచమరసును గూర్చి కొన్ని చాటుపద్యములు వ్రాసినట్లు అప్పకవీయమునందు మూఁడవ ఆశ్వాసమున నుదా హరింపఁబడెను.

ఆ. వె. గోలకొండఁదురక గోవులభక్షించు, కొండవీటిప్రజలసొమ్ముసెల్ల
బాచమరసుచేరి భక్షించుచున్నాఁడు, తురక మేలొ? బాచమరసు మేలొ,

అధికారులిట్లు బలవంతముగ రయితులవద్దనుండి వసూలు చేయుట కొన్ని శాసనములయందు వ్రాయఁబడియుండెను. కొప్పోలు, తిప్పలూరుగ్రామములలో రాయలు కట్నములను, సుంకరస్థావరములను, మినహాయించినను సుంకరవారు బలవంతముగ వసూలుచేసియుండిరి. నంద్యాలలోని వీరజియ్యరను అర్చకుఁడు కట్నములు, కానుకలు, మినహాయించినేగాని భూములను తీసికొని వ్యవసాయముజేయుట కంగీకరించలేదు. అధికారుల నడవడిని తెలియఁజేయఁగల శాసనము లనేకములు దేశమునందంతట నుండెను. రాయలకాలమున నీసంగతులను గూర్చి తెలిసినంతనే విచారణచేసి వానిని సర్ది జనులకు సమాధానముఁ జెప్పుచుండెడివారు.

రాజ్యాదాయము నెట్లు ఖర్చుపెట్టెడివారో తెలిసికొనుట కవకాశములు హెచ్చుగలేవు. గాని ఆముక్తమాల్యద నాల్గవ యాశ్వాసమునందలి యీ క్రిందిపద్యమువలన కొంత తెలియనగును.

మ. ప్ర:- ఉరవా భాగంబు భోగంబు భయము నొకపాలు గ్రసేనా
కనార్థం బిరువా ల్నిండారు బండారిలుబోర నొకపాలు

ఈపద్యమునుబట్టి వచ్చెడి ఆదాయములో నొక భాగము రాజుగారిఖర్చులకును ధర్మమునకును రెండుభాగములు సైనికబలమునకును నాల్గవభాగము భాండారమున నుంచుటకును ఖర్చుపెట్టవలసినదిగ వ్రాసియుండెను. రాజధర్మములను గూర్చి వ్రాయఁబడిన ప్రతిగ్రంథమునందు నీవిభాగమే వ్రాయఁబడియుండెను. నూన్యిసు, పేయసు చరిత్రకారులును నిట్లే వ్రాసియుండిరి. వచ్చెడియాదాయములో రెండువంతులు సైన్యపు

ఖర్చుల క్రిందననియు మూఁడవవంతులో రాజగారి స్వంత ఖర్చులకు బ్రాహ్మణులకు నితరుల కీయఁబడెడి ధర్మఖర్చులకు నని నూన్యిసుచరిత్రకారుఁడు వ్రాసియుండెను. తనకు పూర్వపు రాజ్యాధిపతులు దాఁచియుంచిన ద్రవ్యమును తాను ముట్టకయే దాఁచియుంచి రాయలు తన ఆదాయమున కొంతభాగమును ప్రత్యేకభాండారమునం దుంచెడివాఁడని పేయసు చరిత్రకారుఁడు వ్రాసియుండెను.

రాయలవారు రాజ్యాధికారము వహించినసమయమున రాజ్యముయొక్క ఆదాయము మొత్తము మీఁద పదికోట్ల నాణెములనియు నందులో యుద్ధసంబంధమైనఖర్చు నాల్గుకోట్లయెనుబదిలక్షలనాణెములనియు రాయవాచకమునందు వ్రాయఁబడియుండెను. రాష్ట్రాదాయములో యుద్ధసంబంధమైన ఖర్చుపోను మిగిలిన అయిదుకోట్లయిరవైలక్షల బంగారు నాణెములలో రాజుగారిస్వంతఖర్చులకును ధర్మములకును పోను మిగిలినమొత్తము భాండాగారమునం దుంచఁబడెడి దనియు కూడ వ్రాయఁబడియుండెను. రాయలవారు తాము రాజ్యముచేసినంత కాలము తమకు పూర్వులు నిలువఁజేసియున్న భాండాగారము నందలి ద్రవ్యమును ఖర్చుపెట్టియుండలేదు.

రాజ్యాదాయమును వృద్ధిగావించుటకు రాయలవారి కాలమున ననేకప్రయత్నములు చేయఁబడెను. రాజభాండారమునుండి ద్రవ్యమును రయితుల కప్పుగనిచ్చి క్రొత్తభూములను పాగుచేయించియుండిరి. అడవిభూములలోని చెట్లను నరికించి భూమిని వ్యవసాయమున కుపయుక్తముగనుండునట్లు చేయించి వాటిని పాగుచేయించిరి. చెడిపోయినచెరువులను

మరమ్మతుచేయించియు క్రొత్తచెరువులను త్రవ్వించియు క్రొత్త భూములను సాగుచేయించిరి. పరాయిదేశములతో వ్యాపారమును వృద్ధిచేసి దేశసౌభాగ్యమును వృద్ధిచేయించిరి.

దేశరక్షణ

విజయనగరరాజ్యమున ప్రతిగ్రామమునందలి జనులను ఆస్తినిరక్షించుటకు ప్రత్యేకముగ నేర్పాట్లుండెడివిగాని రాజ్యమునకంతకు కలసి చేయఁబడినయేర్పాట్లు కనుపించవు. ప్రతిగ్రామముయొక్క రక్షణార్థమై తలారి లేక తలయారి యని యొకరుండెడివారు. అతఁడే గ్రామకొత్వాలు. ఈతలారికి గ్రామవివాదములను పరిష్కరించు నధికారముండెడిది. అయితే విజయనగరరాజ్యమునమాత్ర మీయధికారము తలారికి తగ్గింపఁబడెను. గ్రామమును దొంగలబారినుండి రక్షించుటయే యీతలారికి ముఖ్యమైనవిధి. గ్రామమునందలి టక్కరులను అల్లరివాండ్రను కాపుదలచేయుట యింకొకవిధి. గ్రామములో చోరిపోయినసొమ్మునంతను తలారి వెదకి యజమానికి వప్పఁజెప్పవలయును. అట్లుచేయఁజాలనియెడల నాసొమ్ము నాతఁడే అచ్చుకోవలయును. ప్రభుత్వమునకువలయు కూలిపనివారల నీతలారియే యేర్పాటుచేయువలయును.

తలారికి జీతబత్తెములులేవు. గ్రామమునందు కొంత భూమి తలారికి మిరాసీహక్కుగ నీయఁబడెడిది. ఇదిగాక ప్రతిరయితును పండినపంటలో కొంతభాగము మేరగ నిచ్చుచుండెడివాఁడు. గ్రామస్థులందరు గ్రామమున కొంత ద్రవ్యమును ప్రోగుజేసి ప్రతిసంవత్సరము నీతలారి కిచ్చుచుండెడి వారు. దీనిని "తలవారికె" యని చెప్పెడివారు, ఇవిగాక వర్తకులవద్ద

నుండి, పెద్దరయితులవద్దనుండి, తలారులు కొన్ని మామూళ్లను వసూలు చేయుచుండెడివారు. దేవాదాయములనుండి ధర్మాదాయములనుండి నీతలారికి కొంత యీయఁబడుచుండెడిది. వివాహాదిసమయములలో కొన్ని మామూళ్లు వసూలుచేయబడెడివి.

కావలిగారు

ప్రతిగ్రామమునకున్నట్లే గ్రామసమూహమయిన స్థలమునకు కావలిగా రుండెడివారు. వీరు గ్రామతలారిపై యధికారులు. తలారులు గ్రామమునఁజేసెడిపనులను పరీక్షించి వారి మంచిచెడ్డల నాలోచించుటయు స్థలప్రదేశమునందలి రక్షణకు సంబంధించినపనులు నిర్వహించుటయు నీకావలివారి విధ్యుక్తధర్మములు. 1516-వ సంవత్సరమున రాయలవారు కూనపల్లి పెద్దనాయఁడనువారిని ముల్లెలసంతుకు కావలిగారుగ నేర్పరచి వానిని తలారులపై యధిపతినిఁజేసెనని శాసనమువలన తెలియుచున్నది. దీనినిబట్టి ప్రతినాడునకు నొకకావలిగా రుండిన ట్లూహింపనగును. ఈకావలిగారునే "మహానాయకాచారి" యని పిలుచుచుండెడివారు.

కావలిగార్లకును మాన్యములు మిరాసీహక్కు నిచ్చెడివారు. వీటిని కావలిమిరాసీ మాన్యము లందురు. వీరికిచ్చెడు యితరమేరలు కట్నములు వర్తనము లనేకము లుండెడివి.

దేశమున శాంతినెలకొల్పి జనులకు రక్షణభద్రతనేర్పాటుజేయుట వీరిముఖ్యధర్మము. తమస్థలమునకుగాని నాడునకుగాని లోబడియున్న గ్రామములన్నిటిని వీరు జాగ్రత్తచేయవలెను. వీరు జనులను చోరులనుండియు బందిపోటు

దారులనుండియు రక్షణచేయవలెను. గ్రామములోని వస్తుసామగ్రి పోయిన దని రాయలవారికి ఫిర్యాదువచ్చినచో వా రాగ్రామమునకు సంబంధించిన దన్నాయకుని పిల్పించి, పోయినవస్తుసామగ్రినిగాని పోయినవాని విలువనుగాని యిప్పించుటకు ప్రయత్నించెడివారని న్యూనిసుచరిత్రకారుఁడు వ్రాసియుండెను. దీనినిబట్టిచూడ కావలిగార్లకును తలారులకును దన్నాయకుఁ డధిపతియని తోఁచుచున్నది.

పాలెగారు

గ్రామములయొక్కయు స్థలములయొక్కయు నాడులయొక్కయు పరిసరప్రాంతముల నుండెడి అరణ్యములవలన కలిగెడి భయములనుండి రక్షించుటకై పాలెగార్ల నేర్పాటుచేసి వారికి రాయలవారు జాగీర్ల నిచ్చుచుండెడివారు. ఈపాలెగార్లకిచ్చిన గ్రామములలో వీరు చిన్నకోటలను కట్టుకొని చుట్టుపక్కలనున్న గ్రామములను రక్షణఁజేయుచుండెడివారు. ఈ గ్రామములనన్నిటిని రక్షించు బాధ్యత నీపాలెగార్లదై యున్నది. అసాధ్యములగు కారడవులనుండి భూపీడనముఁజేయు కిరాతుల నడుములో నుంచుట కాయడవులదగ్గర నున్న గ్రామములను శూరాగ్రేసరులకు జాగీరుగ నిచ్చుట మంచి దని రాయలవా రాముక్తమాల్యదయందు వ్రాసియుండిరి. అట్లే వారుధైర్యవంతులైనవారికి జాగీర్లనిచ్చి గ్రామములరక్షించుట కేర్పాటుచేసియుండిరి.

అక్కలరొక్రమసాయఁడను బందరుగ్రామకాపురస్తుఁ డొకఁడు బసవశంకరుఁడను బిరుదముపెట్టుకొని రాళ్ళమడుగుగ్రామమునకువచ్చి ఆగ్రామమునందలి బ్రాహ్మణులను బాధపెట్టు

చుండెను. అప్పు డాగ్రామములోని బ్రాహ్మణులెల్లరు గ్రామమునువదలి దగ్గరనేయుండియున్న రాయవరగ్రామమున నివసించుచుండిరి. ఇట్లుండ నొకానొకసమయమున రాయలవా రాగ్రామముద్వారా తిరుపతికి జనుచు రాళ్ళమడుగు గ్రామము దొంగలకాటపట్టై యున్నదని తెలిసికొని యక్కలరొక్రమసాయని బిల్వనంపి వాని నారాళ్ళమడుగుగ్రామమునకు కావలిగారుగ నియమించి రాళ్ళమడుగుగ్రామమును పరిసరప్రాంతములను దొంగలబారినుండి రక్షించుమని యాజ్ఞాపించియుండిరి. రొక్రమసాయుడును చేరువనున్న చెయ్యేరుగ్రామమున కోటగట్టుకొని ఆదేశమునంతను సంరక్షించుచుండెను.

ఇంకొకపుడు రాయలవారు మునిమడుగుగ్రామమునకుఁ బోయి యచటనుండి గుత్తిగ్రామమునకుఁ బోవయత్నించుచుండ నచటిజను లాత్రోవసరియైనదిగాదనియు దొంగలున్నారనియు నడవిజంతువులుకూడ బాధపెట్టుననియు రాయలవారితో విన్నవించిరి. అపుడు రాయలవా రచటి నరసింహస్వామి దేవాలయమును దర్శించి తనవద్దపనిలోనున్న కొలూరుబద్దారెడ్డియను వారి నాప్రాంతముల రక్షణకొరకై యేర్పాటుగావించి నాయాప్రాంతములనున్న యరణ్యములను త్రోవలను బాగుచేయింప నాజ్ఞాపించెను. అందుకు ప్రతిఫలముగ వారికి రెండుగ్రామములను జాగీరిచ్చి యిచ్చవచ్చినచోట కోటను నిర్మాణముచేసికొనుటకు రాయలవా రానతిచ్చిరి. బద్దారెడ్డియు రాయలవారికోరికను శిరసావహించి రాచర్లవద్ద కోటనుకట్టుకొని దేశమునంతను రక్షించుచుండెను. ఇట్లు జరుగుచురాగ కొంతకాలమున కీప్రాంతమంతయు తిరిగి దొంగల కాటపట్టాయెను.

తుపాకులచెన్నమనాయఁడను నొకమాల అచటిదొంగల రాయఁడు. ఈసంగతి రాయలవారికి తెలిసినంతనే చెన్నమనాయుని హతమార్పవలయు నని బద్దారెడ్డి కుమారుల కాజ్ఞ నొసఁగెను. బద్దారెడ్డి ముప్పురుపుత్రులు నీచెన్నమనాయని వెంటాడి, పోరాడి, వానిని, వానిపరివారమును సంహరించిరి. కాని యాపోరాటమునందు బద్దారెడ్డి యిరువురుకుమారులు చనిపోయిరి. చనిపోయిన బద్దారెడ్డికుమారుల జ్ఞాపకార్థమై రాచర్లవద్ద యొకదేవాలయము కట్టింపఁబడెను.

ఈవిధముగ నెన్ని ప్రయత్నములు చేసినను దొంగల నుండి జనులకు భయముపోలేదు.

నగరసంరక్షణ

నగరములు వివిధపాలెములుగ విభజింపఁబడి ప్రతిపాలెమునకు నొక్కొక్కతలారియు వాని క్రిఁద కొందరు పరిచారకులు నియోగింపఁబడిరి. వీరందఱు నగరమునందలి పాలెములను కాపలా చేయుచు రాత్రివేళలయందు పగటిపూటలయందు తిరుగుచుండెడివారు. కాము కాలాకాయ సమయమున జరుగుచుండెడి విశేషములను పైయధికారులకు తెలియఁజేయుచుండవలెను. ఈపైయధికారిని జంగమయ్య యని పిలిచెడువారు. ఈజంగమయ్య క్రింద సుమారు పండ్రెండువేలమంది తలార్లు కావలివారు పనిఁజేయుచుండెడివారు.

రాయలవారికాలమున రోడ్లమీఁదను బహిరంగస్థలములయందు నల్లరిచేసెడివారిని గట్టిగ శిక్షించునట్లు శాసించినందున, జనులు నిర్భయముగ నుండెడివారు. నగరికావలివారు తలార్లు తమతమపనులను చక్కఁగ నిర్వర్తించుచుండిరా లేదా

యని రాయలవారే స్వయముగ పరీక్షించుచుండిరి. రాయలవారప్పటప్పట ప్రచ్ఛన్నవేషమున తిరుగుచున్నందున తాబేదార్లందరు మిక్కిలి భయముతో తమపనిని చక్కఁబెట్టుచుండిరి. రాయలవారికాలమున నీనగరరక్షణ బహుచక్కగ జరుగుచుండెడిది.

అయితే యీవిధమైన కాపలావలన నగరమునందలి ప్రేమికులు రాత్రివేళల తమప్రేమికులవద్దకు వెళ్లుట బహుకష్టముగ నుండెడిది. అందువలన నిట్టివారు రాత్రివేళలయందు తలారులతో మంచిమాట గావించుకొనవలసివచ్చెడిది. ఇదిగాక దివాణములో రాత్రివేళ నగారా వాయించినపిదప వీథులయందు జనము తిరుగరా దని యొకశాసనముండెడిది. అందువలన ప్రేమికులకు మితిలేనికష్టము లుండెడివి. అందువలననే యొకకవి "నిరంకుశోపాఖ్యాన" మను గ్రంథమునం దీవిధమున వ్రాసియుండెను.

"ప్రొద్దుపోయిన దని తలారులకు వెఱచి
యొకవిధంబున నారాత్రి యుండఁ దలఁచె."

17. వర్తక వ్యాపారములు

రాయలవారికాలమున వర్తకము బహుచక్కగపోషింపఁబడెను. రాయలవారికాలమున వారి ఆదాయములో ముఖ్యభాగము రేవులవద్ద వసూలుచేయఁబడినదే. ప్రాక్పశ్చిమదేశముల నుండి యనేకవస్తువులు తెప్పింపఁబడెడివి. పాశ్చాత్యదేశము నుండి వచ్చెడివస్తువుల నిచటికి తీసికొనివచ్చెడి వారిలో ముఖ్యులు అరబిదేశీయులగు మూరులును పోర్చుగీసువారు నయియుండిరి.

అరబ్బులు: పోర్చుగీసువారు: వీరు ముఖ్యముగ నరేబియానుండియు పర్షియానుండియు గుఱ్ఱములను తెచ్చెడివారు. గుఱ్ఱము లాదేశమునందు చక్కఁగ పెంచఁబడెడివి. మహమ్మదీయులు హిందూదేశము నాక్రమించినపిదప యుద్ధములో గుఱ్ఱముల నెక్కువగ వాడుట మొదలుపెట్టిరి. ఆకారణమున గుఱ్ఱపువర్తకము వృద్ధికాఁజొచ్చెను. అయితే అరబ్బులు మహమ్మదీయులగుటచేత గుఱ్ఱములను వారు మహమ్మదీయులకే విక్రయించుచు హిందూరాజులకు విక్రయించుట తగ్గించిరి. ఇందువలన హిందూరాజులకు నరబ్బులకు కొంతవైర మేర్పడి చాల మందియరబ్బులను హిందూరాజులు చంపించిరి. రాయలవారు రాజ్యమునకు వచ్చుటకుపూర్వమే పోర్చుగీసువారు హిందూదేశమునకువచ్చుట తటస్థించెను. అందువలన రాయలవారు పోర్చుగీసువారిని ప్రోత్సహించి వారిద్వారా వచ్చినగుఱ్ఱముల నన్నిటిని తామే విక్రయించుకొనెడివారు. అట్లు విక్రయించుకొనుటవలన తమయశ్వదళమును హెచ్చుచేసికొనిరి. గుఱ్ఱములనుగాక యితరములైన యనేక వస్తువులను రాయలవారు తెప్పించుకొనుచుండెడివారు.

రేవుల్తావు. తురంగజంబులు మణిశ్రీఖండముక్తాదియున్
రావాణిజ్యము పెంచియేలఁగ నగున్.

అని ఆముక్తమాల్యదయందు రాయలవారు వ్రాసియుండిరి. గజములు హెచ్చుగ సింహళద్వీపమునుండి కొనితేఁబడెడివి.

రేవుపట్టణములు

రాయలవారు రాజ్యమునకు వచ్చునప్పటికే ముఖ్యముగ గోవారేవుపట్టణము మహమ్మదీయుల వశమైయుండి తరువాత వారివద్దనుండి పోర్చుగీసువారివశమైనది. రాయలవారికాలమున ముఖ్యముగ ప్రసిద్ధిలోనున్న రేవుపట్టణముల నీక్రింద వ్రాయుచున్నాను.

హొనవరు, భట్కలు, బాకనూరు, బ్రాకలూరు, మంగళూరు, కంబోల, క్విలను, కేయాలు, నాగపట్నం, మైలాపూరు, పులికటు.

పాశ్చాత్యదేశములనుండియే కాక హిందూదేశమునుండియు నొకచోటనుండి నింకొకచోటికి నవధాన్యములు, రసవర్గములు, మిరియాలు, ధనియాలు, ఇంగువ, పంచదార, నెయ్యి మొదలయిన వివిధరకములవస్తువులను తెప్పించుకొనుట పంపుట మూలముగ వర్తకవ్యాపారములు చక్కఁగ పోషింపఁబడుచుండెడివి.

వర్తకమార్గములు

వర్తకసరలికొఱకు మంచిబాటలు దేశమునం దంతటను వేయఁబడియుండెను. పశ్చిమసముద్రతీరమున నున్న భట్కలు నుండి విజయనగరమువరకు నుండుమార్గము, తూర్పుసముద్రమునసుండి యింకొకమార్గము, కాశీ రామేశ్వరములకుపోవుచు మార్గము, విజయనగరమునసుండి కాంచీపురమునకు పోవు మార్గము, బందరునుండి కోవిలకుంటవరకు కోవిలకుంటనుండి కంప్లివరకు పోయెడిమార్గము, అహోబిలమునుండి కంభంవరకు గుత్తినుండి మునిమడుగువరకు మార్గము ఆనాటిమార్గములలో

కొన్ని ముఖ్యమార్గములు. ఇవిగాక యింకననేకమార్గము లుండెడివిగాని సరియైన యామార్గము లనుటకు వీలులేదు.

ఆ కాలమున సరకుల నొకస్థలమునుండి యింకొక స్థలమునకు తీసికొనిపోవుటకు బండ్లుండెడివి కావు. మనుష్యులు మూటలను నెత్తిన కట్టుకొనిపోవుట, కావడిలో సరకులుపెట్టుకొని పోవుట, గుఱ్ఱములమీదగాని, ఎద్దులమీదగాని, గాడ్దెల మీదగాని, మూటలుకట్టి యిరుపార్శ్వముల వ్రేలాడవేసి తీసికొనిపోవుట మామూలై యుండెను. ఈమార్గములును సరియైనవి కానందునను త్రోవలో బాటసారులను, దొంగలుకొట్టుట మామూలుగా నున్నందునను బాటసారు లొక్కరొక్కరుగ పోకసమూహములుగఁ బోవుచుండిరి.

వర్తకులు తమసరకు లొకస్థలమునుండి యింకొకస్థలమునకు తీసికొనిపోవుటకు వీలయినంతసావకాశములు రాయలవారు కల్పించుచుండిరి. అచ్చటచ్చట సంతల నేర్పాటు చేసియు వర్తకులకు తమవస్తువుల విక్రయించుటకు సావకాశములను గల్గించి వారివర్తకమును ప్రోత్సహించుచుండిరి. ఇట్లేర్పాటు చేయబడినసంతలకు పురుషులు స్త్రీలు ఇతరగ్రామములనుండి వచ్చి వస్తువులను కొనెడివారు. దీనినే ఆముక్తమాల్యద యందు రాయలవారు "ఊరూర సంతసంతకుఁ దిరుగ బెద్దలింటఁ బంతరించిన విలుకువాటిగోడిగల" యని వర్ణించియుండిరి.

18. పరిశ్రమలు

దేశమునం దారోజులలో నిప్పటివలెనే ముఖ్యమైన పరిశ్రమ వ్యవసాయము. అందును వరిపంట ముఖ్యమైనది. రాజ్యమునందు తెల్లబియ్యమును తినెడివారు. నల్లబియ్య

మితరదేశములకు రవాణా చేయఁబడెడిది. బీదలు సామాన్యముగ సజ్జ, జొన్న పండించుకొని తినెడివారు.

చెఱకుపంట మంచివృద్ధిలో నుండెను. చెఱకునుండి బెల్లము, పంచదార, తయారుచేయుట ముఖ్యమైనపరిశ్రమలు.

నీటివసతిగల ప్రతిగ్రామమున మామిడిపండ్లు, పనసపండ్లు నారింజపండ్లు, అరటిపండ్లు, నిమ్మపండ్లు, కరిబూజపండ్లు, ద్రాక్షపండ్లు, పండించెడివారు.

అన్నివిధములైన కూరగాయలు సాదినములలో పండించెడివారు. తమలపాకులపంట కొన్నిగ్రామములయందు ముఖ్యమైనపంట. అరఁటియాకులలో మంచివ్యాపారము జరుగుచుండెడిది.

వాసనగలపుష్పములను అందును ముఖ్యముగ గులాబిపుష్పములను పెంచి వాడెడువారు. స్త్రీలు పూవులగుత్తులను తమతలలయందును పురుషులు పూదండలను తమతలలచుట్టును ధరించెడివారు. ద్రవ్యవంతు లీపుష్పములను తమపడకల మీఁద విరజల్లెడుసాదార మాకాలమున నుండెడిది.

దూది వడికి నూలుతయారుచేయుట నూలుతో బట్టలను నేయుట యింకొకపరిశ్రమ. సర్వసామాన్యముగ జనులు నూలువడకెడువారు. బట్టలను తయారుచేయునది జాండ్రవారు, సాలెవారు, పద్మసాలీలు నయియున్నారు. వీరు బట్టలునేయుటకు తొగటుమగ్గం తెల్లమగ్గమని రెండువిధముల మగ్గములుండెడివి తొగటుమగ్గముతో రంగుగుడ్డలను తయారుచేసెడివారు. వీరుగాక మాలవాండ్లు కూడ బట్టలను నేసెడివారు, "సగముసాలెనేత సగముమాలనేత" యని సామెతకూడ దీనిని

బట్టియే వచ్చియుండును. దక్షిణదేశమున కురుబలను గొల్లల కాపరులు మంచినూలుదుప్పట్లను తయారుచేసెడివారు. పట్టుబట్టలు బెంగుళూరు, గుత్తి, మొలకాయిత్తూరు, రాయదుర్గం, బళ్లారి గ్రామములయందు హెచ్చుగ తయారుచేయఁబడెడివి.

ఉప్పు

సముద్రతీరమునను సముద్రమునకు దూరముననున్న ప్రదేశములయందును కూడ ఉప్పును పండించెడివారు. ఈ ఉప్పు పంట యెక్కువమంది జనముచే తయారుచేయఁబడెడిది.

ఇనుము కూడ నీరాజ్యమున సమృద్ధిగ నుండెడిదనియు నిచటనుండి యితరదేశముల కెగుమతిచేయఁబడుచుండెడిదనియు తెలియవచ్చుచున్నది. ఇను మాకాలమున నీదేశమునకు కావలసిన దానికంటె హెచ్చుగనే దొరకుచుండెడిది.

వజ్రములు కర్నూలనంతపురంజిల్లాలలోను భూమినుండి తవ్వఁబడెడివి. వజ్రకరూరను గ్రామమున వజ్రములు దొరికెడివి. రాయలవారి రాజ్యమునకు వజ్రములవలన హెచ్చుసాదాయము వచ్చుచుండెడిది.

19. న్యాయపరిపాలన

రాయలవారి కాలమునకు పూర్వమే విద్యారణ్యుల వారు న్యాయపరిపాలననుగూర్చి పరాశరమాధవీయమను గ్రంథమును వ్రాసియుండిరి. ఈ పుస్తకమున వ్రాయఁబడిన యంశములనుబట్టియు, రాయలవారికాలపు శాసనములను బట్టియు నప్పటి న్యాయపరిపాలననుగురించిన కొన్ని వివరములు తెలిసికొనవగును.

న్యాయాధికారి-రాజు

ప్రాగ్దేశములయం దెల్లెడల దేశమునకు న్యాయపరిపాలనాధికారి రాజే అయియుండెను. రాజ్యాధిపతియే ప్రజలలోని తగువులను స్వయముగ తీర్మానము చేయవలెను. విశాలమైనరాజ్యమున స్వయముగ నీవిధిని రాజ్యాధిపతి నిర్వహించుట కష్టసాధ్యముగాన దేశమునందంతట తనబదులు న్యాయమును పరిపాలించుటకు న్యాయస్థానముల నేర్పాటుచేయవలసియుండెను. ఈన్యాయస్థానమునే "సభ" యనెడువారు. ఈసభలలో కొన్ని ముఖ్యమైనవి, మరికొన్ని అముఖ్యమైనవి యని రెండువిధములు. ముఖ్యములైన సభలు క్రమముగ న్యాయమును తీర్మానించుచుండెడివి. ముఖ్యములైనసభలలో కొన్ని "ప్రతిష్ఠిత" సభలు మరికొన్ని "అప్రతిష్ఠిత" సభలు. ప్రతిష్ఠిత సభలు కొన్నిస్థలములలో ఖాయముగ నుండెడివి. "అప్రతిష్ఠితసభ" లధికారి యెచట నున్న నచటనే న్యాయపరిపాలన జేసెడివి. ఈసభలలో రాజుగారే స్వయముగ న్యాయపరిపాలన జేసినచో నాసభ "శాస్త్రిత" సభ యని పిలువబడెడిది. అట్లుగాక రాజుగారికిబదు లింకొకరు న్యాయాధికారిగ నియమింపబడినచో నాసభ "ముద్రితసభ" యని పిలువబడెడిది. ఈభేదముల నీక్రింద చూపించుచున్నాను.



ఈసభలలో ముఖ్యమైనది రాజధాని యందుండు సభ. జనుల ఆస్తికి సంబంధించినవివాదములను (అనగా సివిల్) పరిష్కరించుటకును జనులను శిక్షించుట కర్హములైన వివాదములను (క్రిమినల్)తీర్మానించుటకు నధికారము లీసభకుండెడివి. ఈసభకు న్యాయాధికారి రాజు. వీరికి న్యాయపరిశీలనయందు సహాయముగనుండుట కొరకు ప్రాడ్వివాకుడు నిద్దరు సభ్యులు నుండెడివారు. ఈనల్గు రధికారులు కలసి న్యాయపరిపాలన చేసెడివారు. వీరుగాక నిరుపక్షములవారి యొక్కయు వారి వారి సాక్షుల యొక్కయు వాఙ్మూలములను వ్రాసికొనుట కొరకు లేఖకు డుండెడివాడు. వీరికి సహాయముగ నొకగణకు డుండెడివాడు. ఈగణకుడు కక్షిదారుల లెక్కలను తేల్చుచుండెడి వాడు. వీరికి తోడుగ కక్షిదారులను వారిసాక్షులను న్యాయ స్థానమునకు పిలుచుకొని వచ్చుటకు "సాధ్యపాలుడను నింకొక యధికారి యుండెడివాడు. న్యాయాధికారులు న్యాయస్థానమున న్యాయపరిపాలనము చేయునపుడు న్యాయస్థానమును నిశ్శబ్దముగ నుంచుటకును న్యాయాధికారియిచ్చిన తీర్పు నమలు జరుపుటకును నీసాధ్యపాలుని విధియైయుండెను.

రాజు

రాజుగారు న్యాయాధిపత్యమును వహించినపుడు వారే న్యాయపరిష్కారము చేయవలెను. ప్రాడ్వివాకులు సభ్యులును రాజుగారికి న్యాయ పరిష్కారమునందు సహాయులుగ నుండవలెను. రాజుగారు చేసిన తీర్పుపై తమసంతకమును ముద్రయు నుండవలెను. రాజుగా రితర విషయాసక్తులై నపుడు తమస్థానమున నింకొక ప్రతినిధి నేర్పాటు చేయుట కధి

కారముండెడిది. అట్టి ప్రతినిధికి రాజుగారి స్థానే తీర్పు నిచ్చుట కధికారముండును. న్యాయస్థానమున రాజుగా రాసీనుడగుట కొరకు ధర్మాసనముండెడిది. దానిని బట్టి న్యాయస్థానమును ధర్మాసన మని కూడ పిలిచెడివారు.

ప్రాడ్వివాకుడు

న్యాయపరిశీలనయందు రాజుగారికి సహాయుడుగ నుండి న్యాయమును కనుగొనుటకై సాక్ష్యములను విచారించుట కొప్రాడ్వివాకు డేర్పాటు చేయబడెను. ఏసందర్భములకు ధర్మసూత్రము లేరీతి నుపయోగించవలెనో, కక్షిదారుల వాదములబట్టి న్యాయ మెటున్నదో పరిశీలించి తమతమ ప్రత్యేక అభిప్రాయములను తెల్పుటకై యీప్రాడ్వివాకుడు, సభ్యు లేర్పాటు చేయబడిరి. ప్రాడ్వివాకునికిగాని సభ్యులకుగాని కక్షిదారుల వివాదములను తీర్మానించుట కధికారము లేదు.

కక్షిదారులు స్వయముగ రాజుగారికిగాని రాజుగారిచే నేర్పాటుచేయబడిన అధికారికిగాని తమవివాదముల గూర్చి విన్నవించవలెను. నష్టపడిన జనులు రాజుగారు దోవను పోవు నపుడు వారితో స్వయముగ చెప్పికొన్నట్లున్ను వారు చెప్పిన విషయముల నాలోచించి అప్పటికప్పుడే తీర్పు చెప్పుటకు తనవద్ద నున్న పెద్దమనుష్యుని ప్రతినిధిగ నేర్పరచి వివాదముల విచారించి పరిష్కరించెడువా రనియు న్యూనిసు చరిత్రకారుడు వ్రాసియుండెను.

నేరములు జరిగినపుడు రాజుగారు తమంతట తామే స్వయముగ విచారించెడు వారు. నేరము చేసెనని చెప్పబడిన మనిషిని పిలిపించి తక్షణమే విచారణ చేసెడివారు. సామాన్యముగ

నేరములను చేసినవారిని రాజుగారివద్దకు తలారి తీసికొనివచ్చి నేరమిర్వశావమును వివరించును.

ఆస్తిని గురించిన వివాదములలో కక్షిదారులు స్వయముగా రాజాలని యెడల వారి తరఫున పనిచేయుట కితరుల నియోగించుకొనవచ్చును. అట్టిప్రతినిధులు చేసిన పనులకును కక్షిదారులు బద్ధులగుదురు కాని నేరస్థు లిట్టితరులను నియోగించుటకు వీలులేదు. నేరస్థుడు తానుండి, తననిర్దోషిత్వమును తానే నిరూపించవలయును.

ప్రతిజ్ఞాపత్రము - ఉత్తరవాదము

ఆస్తికి సంబంధించిన వ్యాజ్యములలో వాది ప్రథమమున తనవాదనగల ప్రతిజ్ఞాపత్రమును దాఖలు చేయవలెను. ప్రతిజ్ఞా పత్రమునకు ప్రతివాది తనయుత్తరవాదమును దాఖలుచేయవలెను. ప్రతివాది తనయుత్తరవాదమును దాఖలు చేయుటకు వాయిదాకోరిన నిచ్చెడు మామూలు కలదు. కాని నేరస్థునికి మాత్రము తనయుత్తరవాదము తెలుపుకొనుటకు వాయిదా నిచ్చెడువారు గారు. మొదటివాయిదానాటికే నేరస్థుడు తనయుత్తరవాదముతో సిద్ధముగనుండవలెను. ప్రతిజ్ఞా పత్రము, ఉత్తరవాదము సిద్ధమయినవెంటనే న్యాయాధికారి సాక్ష్యమును విచారించును. సాక్ష్యము రెండువిధములు 1. మనుష్య మాత్రము. 2. దైవికము. మనుష్యమాత్రమైనసాక్ష్యముద్వివిధము. 1. వాగ్రూపకము. 2. దస్తావేజుసంబంధమైనది. మనుష్య మాత్రసాక్ష్యములేనప్పుడు దైవికసాక్ష్యముపై నాధారపడెడివారు. దైవికసాక్ష్యమన్న దేవునిపై భారముంచి యొక శపథము నంగీకరించుట. నిజమైన వాదములయందు దైవబల

ముందు నను నమ్మకమే శపథముల నంగీకరించుటకు గలకారణము. సాక్ష్యము పూర్తియైన పిమ్మట న్యాయాధికారి తన తీర్మానమును "జయపత్ర" మూలమున బహిరంగపరచును. ఈ "జయపత్ర"ము పైన న్యాయాధికారియు, ప్రాడ్వివాకుడు, సభ్యులు సంతకములు చేయుదురు.

శిక్షలు

నేరస్థులకు శిక్షలుమాత్రము బహుక్రూరముగ నుండెడివి. దొంగతనము చేసినవానికి చెయ్యిగాని కాలుగాని నరుకుట శిక్ష. హెచ్చువస్తువులు దొంగతనముచేసిన వారికి ఉరిశిక్షయు వేయబడెడిది. స్త్రీనిగాని కన్యనుగాని చెరిచిన నేరమున కురి శిక్షయే. ప్రభుత్వాధికారులు రాజద్రోహము చేసినచో నట్టి వారిని సజీవులుగనుండగనే తగులబెట్టుచువారు. ఒక్కొక్కప్పుడు కాలుచున్న కఱ్ఱనుగాని యినుపముక్కనుగాని పొట్టలోనికి పొడిచెడువారు. చంపిన నేరమున కురియేశిక్ష. రాజులు తమ కసినితీర్చుకొనుటకు నేరస్థుల నేనుగులవద్దకు నెగురవేసి చిత్రవధగావించెడు వారు. ఈ యేనుగులు తమవద్ద కెగుర వేయబడిన నేరస్థులను తొండములతో చీల్చి చంపివైచెడివి.

రాజుగారు దేశసంచారముపోయినపుడు గ్రామము లోని జనులు వారివద్దకు జని తమతమకష్టసుఖములను చెప్పుకొనెడి వారు. అప్పుడు రాజుగారు వారివారి వాదప్రతివాదముల విని తమతమ తీర్మానములను తెల్పి ప్రజల సంతోషపరిచెడు వారు. ఆసమయమున రాజసభ అప్రతిష్ఠిత సభయగును.

రాజధానిలో న్యాయపరిపాలన జరిగెడి పద్ధతిని గూర్చి యిదివరలో వ్రాసియుంటిమి. రాజ్యమునందు వివిధరాష్ట్రముల

యందును, సీమలయందును నీవిధముగనే న్యాయాధికారుల నేర్పాటుచేసి వారివలన న్యాయము పరిపాలింపబడెడిది. అచ్చటచ్చట నేర్పాటుచేయబడిన న్యాయసభల కచటి పెద్దయధికారు లాధిపత్యమును వహించి న్యాయమును నిర్వహించెడివారు. గ్రామసీమల యందలి న్యాయాధికారు లిచ్చిన తీర్పులను విమర్శించి వాటిని మార్పు చేయుటకుగాని రద్దుచేయుటకుగాని రాష్ట్ర న్యాయసభల కధికారముండెడిది. కానేరి సముద్రమునం దొక మల్లంరాజను వారు హానముద్దుండ మను గ్రామకరణీకమిరాసి తనకు గలదని యచటి ధర్మాసనమునందు దావాచేయగా నాతని దావాధర్మాసనముచే త్రోసి వేయబడెను. అందుపైన నీమల్లంరాజా గండికోట పరగణా కధిపతియైన నంద్యాల పెదనరసింహరాజాగారివద్ద నప్పీలు చేయగా నరసింహరాజాగారు ధర్మాసన మేర్పాటు గావించి రెండు పక్షముల వారిని విని మల్లంరాజాకే మిరాసీ హక్కు గల దని నిర్ధారణ చేసి "జయశేఖను" వ్రాయించియిచ్చిరి.

అమరనాయకులు:—అమరనాయకులకు గూడ న్యాయ పరిపాలన చేయుట కధికార మున్నట్లుండెను. బందిపోటు దోపిడి దొంగతనము జరిగిన పిదప నేరములవలన బాధచెందిన వా రీయమరనాయకులవద్ద చెప్పుకొనుటయు నమరనాయకులా దొంగలను పట్టించి విచారణ జరిపి శిక్షార్హులను శిక్షించుటయు జరుగుచుండె నని ఆముక్తమాల్యదలో నీపద్యభాగము వలన తెలియవగును.

తే. అనిన వంతికిఁ గోల్పోకఁ యతడు రెడ్డి
రాజుఁ గనునని

ఈపద్యమువలన దొంగకొట్టిన పిదప దెబ్బలుతిన్నవాడు గ్రామరెడ్డితో గాని రాజుతో గాని చెప్పునని భయపడి వానిని జంపుటకు ప్రయత్నించె నని వ్రాయబడియున్నది.

ఇట్లే దేవాదాయ ధర్మాదాయాధికారులు తమధర్మాదాయమునకు సంబంధించిన ప్రదేశములలో జరిగిన చిన్నచిన్న నేరములను తాము విచారించుటకును శిక్షార్హులను శిక్షించుటకు నధికారము గల్గియుండిరి.

సర్వసామాన్యముగ నెచ్చటి తగవుల నచటి పెద్దలు ధర్మాసనమును సమావేశపరచి తగురీతిని విచారించి పరిష్కరించెడి యాచారము కలదు. కొండజాతివారితగవులను కొండజాతివారును, వ్యాపారస్థుల తగవులను వ్యాపారస్థులును, కులతగవులను కులపెద్దలును గ్రామతగవులను గ్రామ పెద్దలును విచారించుట యుచితమని పరాశరుడు తనగ్రంథమునందు వ్రాసియుండెను. అట్లేజరుగుచుండెను. అట్లు వారిచే జేయబడిన తీర్మానములును న్యాయముగ నుండినట్లు తెలియవచ్చెడిని. ఈ న్యాయమును గూర్చివ్రాయుచు నొకకవి యొకచిత్రమైన విషయమును వ్రాసియుండెను.

ఒకానొక బ్రాహ్మణుడు తొండమండల గ్రామమునుండి వరంగలు ప్రాంతమునకు పోవుట తటస్థించెను. ఈబ్రాహ్మణు డచటికి బోయిన పిదప నచటికనతి దూరముననున్న యక్కలవాడ యను గ్రామమున నొక సౌందర్యవతియగు భోగస్త్రీ యుండ నామెతో నొకరాత్రి గడుపవలెనని కుతూహలుడై వేశ్యమాతతో నీవ్యవహారమును మాట్లాడి కరిపాకారము చేసికొనెను. ఆరాత్రికి వేశ్యమాత నాసౌందర్యవతి నీతనివద్దకు

పంపక తనవద్ద నున్న పరిచారికలలో నొకతెను పంపెను. ఆబ్రాహ్మణు డీసంగతిని గమనించక తనవద్దకు పంపబడిన పరిచారికతో రాత్రినంతను గడిపెను. తరువాత వేశ్యమాత చేసిన మోసమును తెలిసికొని సచటితలారివానితో నీమోసవిషయమై నివేదించెను. తలారు లావేశ్యమాతను బంధించి కామశాస్త్రవేత్తలగు పెద్దల పిలువనంపి వారి నీవ్యవహారమును పరిష్కరింప గోరిరి. కామశాస్త్రవేత్తలు ధర్మాసనముగ సమావేశమై కామశాస్త్రమునందు మంచి ప్రవీణతను సంపాదించి ప్రఖ్యాతి గాంచిన గోవిందశర్మ యనువా రటుబోవుచుండ వారిని రావించి వారి నీవిషయమున న్యాయమును తెల్పుమని కోరిరి. శర్మగారు కామశాస్త్రగ్రంథముల పరిశీలించి వేశ్యమాత గావించిన మోసమున కాపెకో జనములు ఘోరముగావించి తలబోడి చేయించుట న్యాయమైనను ధర్మాసనస్థులు కొంతదయ చూపవలయుననియు చెప్పిరి.

అప్పటి న్యాయాధికారులు న్యాయమును కనుగొనుటకై శక్తివంచన లేక ప్రయత్నించి నిజమును కనుగొని తీర్పులనిచ్చుచుండెడివారు. విచారణయంతయు శాస్త్రానుసారముగ జేయుచుండెడివారు. న్యాయ శాస్త్రమునకు విరుద్ధముకాకుండ నిజమును మాత్రమే గ్రహించి న్యాయనిర్వాహణము చేసెడివారు. మాటలకు విరుద్ధార్థములుకలుగజేసి అర్థభేదములనుబట్టి న్యాయవిరుద్ధము గావించెడువారుగారు. అందువలననే కక్షిదారులు ధర్మాసనముయొక్క తీర్పుతో సంతుష్టి జెందెడువారు గాని సామాన్యముగ నీతీర్పును రద్దుపరిపించుటకై యింకొక ధర్మాసనమునకు పోయెడివారుకారు. వ్యవహారములు చాలవరకు మధ్యవర్తులచే తీర్మానింపబడుచుండెడివి. కక్షిదారులు తమ

తము వ్యవహారపత్రికల నిచ్చిన పిదప మధ్యవర్తినేర్పాటు గావించుకొని వారియొక్క మధ్యవర్తిత్వము నంగీకరించెదమని ప్రతిజ్ఞా పత్రిక వ్రాసియిచ్చి మధ్యవర్తి తీర్పును శిరసావహించెదు వారు. వీరి మధ్యవర్తిత్వము నుల్లంఘించినను చేయదగిన కార్య మింకొకటి కనుపించదు. అట్లుచేసినట్లు కనుపించదు. ప్రజాభిప్రాయమున్ను అట్లుల్లంఘించుట కంగీకరించెడిదికాదు.

శాస్త్రసంబంధమైన విషయముల గూర్చి విమర్శింపవలసినపుడు ధర్మశాస్త్రమునం దారితేరిన బ్రాహ్మణులం హెచ్చుగానున్న ధర్మాసన మేర్పాటుజేయబడెడిది. మిరాశీలు మేరలను గూర్చి చర్చింప వలసినచో నావిషయమునందు ప్రవీణులైన వారితోకూడిన ధర్మాసన మేర్పాటుచేయబడెడిది. సామాన్యముగ నీవిషయములనన్నిటిని అగ్రహారము లందుండెడి మహాజనుల కప్పజెప్పెడివారు. గ్రామ మర్యాదలగూర్చి విమర్శించవలసినచో గ్రామపెద్ద లుండెడి ధర్మాసన మేర్పాటుచేయబడెడిది. ఇట్లేయేవిషయమును గూర్చి విమర్శింపవలసినప్పుడా విషయమునుగూర్చి బాగుగ తెలిసిన పెద్దమనుష్యులుగల ధర్మాసన మేర్పాటు చేయబడెడిది.

సాక్ష్య విచారణ

వ్యవహారపత్రములను ధర్మాసనమున కందజేసిన పిదప విచారణ జరుపబడును. సాక్ష్యవిచారణకు పూర్వము సాక్ష్యమిచ్చువారు ప్రమాణము చేయవలెను. ప్రమాణము చేయుటకు సాక్షులు దేవాలయమునకు పోయి అచటి చెరువులో స్నానముజేసి తడిగుడ్డలతో దేవుని ముఖము జూచుచు ప్రమాణముజేయవలెను. కొన్ని సమయములప్పుడు దేవునితీర్థమును

పుచ్చుకొని ప్రసాదమును చేతబట్టుకొని ప్రమాణముచేయవలెను. సాక్ష్య విచారణానంతరము ధర్మాసనమున తీర్పు చెప్పబడును. తీర్పును "జయపత్రిక" యని పిలిచెడివారు. ఈ జయపత్రికను గ్రామ మహాసభునకును గ్రామకరణమునకును పంపించెడివారు.

న్యాయనిర్వాహణమునందు ప్రత్యేకముగ న్యాయవాదులుండెడివారుకారు గాని ధర్మశాస్త్రములు మాత్ర ముపయోగింపబడెడివి. హెచ్చుగ యాజ్ఞవల్క్యస్మృతి యుపయోగింపబడెడిది. గ్రామములయందు ధర్మాసనములు దేవునిగుడిలోని మంటపములయందేర్పాటు చేయబడెడివి. ఒక్కొక్కప్పుడు గ్రామమున వేపచెట్టుక్రిందకట్టబడిన అరుగుపై ధర్మాసన మేర్పాటుగావించి న్యాయవిచారణ గావింపబడినట్లు చరిత్రవలన తెలియుచున్నది. దేవునియందు ప్రజలకు భక్తిమెండుగా నున్నందున దేవునిసముఖమున జను లబద్ధము చెప్ప రను నమ్మకవలన నీ ధర్మాసనము సామాన్యముగ దేవాలయమునందే యేర్పాటు చేయబడెడిది.

20. సైనికవిధానము MILITARY ORGANIZATION

విజయనగరాధీశులు, అందును ముఖ్యముగ కృష్ణదేవరాయలు, తమదేశమును తురుష్కులబారినుండి తప్పించి వారితో యుద్ధమున కెల్లప్పుడును సంసిద్ధులుగనుండి వారిని చెదరగొట్టుటకై తమపరిపాలన మేర్పాటుచేసియుండిరి. ఈ యేర్పాటునుసరించి దేశరక్షణకుగాను తగినకోటలను తగినంత సైన్యమును సిద్ధముగ నుంచి యుండిరి.

కోటలు:—ఆకాలమున రాజు లభేద్యము లైన కోటలను నిర్మాణముచేసియుండెడివారు చాలభాగముకోటలన్నియు మట్టితో నిర్మాణము చేయబడెడివి. ముఖ్యమైన కోటలను మాత్రము రాతితో కట్టించెడివారు. పూర్వసాంప్రదాయముల ననుసరించి కోటలు గిరిదుర్గ, స్థలదుర్గ, జలదుర్గ, వనదుర్గ యని నాల్గువిధముల నుండెడివి. ఇదిగాక గహ్వర, కర్దమ గ్రామకోస్తా దుర్గములని మరినాల్గువిధములైన కోట లున్నట్లు కొన్ని గ్రంథములయందు వ్రాయబడియుండెను. స్థలదుర్గములదగ్గరకు శత్రుసైన్యములు రాజాలకుండుటకై లోతైన కందకములను కోటచుట్టు త్రవ్వించెడువారు. సైనికులు కోటదగ్గరకు రాకుండుటకును, వచ్చెడివారిని దరిజేరనివ్వకుండుటకును, రాళ్లు, కత్తులు విసరుటకు కోటగోడలపై "పాశన" యంత్రము లమర్పబడియుండెడివి. కొన్ని ముఖ్యమైనకోటగోడలపైన తుపాకిమం దుపయోగించబడెడి "దంబోల" యను తుపాకినుంచెడివారు. ఇదిగాక కోటలను శత్రువులనుండిరక్షించుటకు మందుతో కాల్చబడెడు ఆకాశబాణములు, అర్ధచంద్రబాణములునే అప్పుడుసిద్ధముగనుంచబడెడివి. ఈకోటల సంరక్షణము నమ్మకమైనవారును విశ్వాసపాత్రులనగునమరనాయకులపై నుండెడిది.

సైన్యము; సైన్యవిభాగములు

అమరనాయకులు తమసొంతఖర్చుతో కొంతసైన్యమును రాజ్యావసరములకై యెల్లప్పుడును సిద్ధముగ నుంచవలెను. ఇది అమర లేక అమరనాయకులసైన్యము. ఈ అమరనాయకుల సైన్యము దాదాపు లక్షమందికాల్బలము మువ్వదియైదువేల అశ్వబలము. ఇదిగాక గజబలమునుకూడ కొంతసిద్ధముగ

నుంచవలెను. రాజుగారు తమ రాజ భాండారమునుండి ఖర్చు పెట్టి తయారుగనుంచెడి సైన్యము రెండవది. దీనినే కైజీతపు సైన్యమందురు. రాయలవారికి పూర్వ మిూ కైజీతపు సైన్యముండెడిది కాదు. ఈ కైజీతపు సైన్యము నేర్పాటు చేయుటకే రాయలవారు పట్టాభిషిక్తులైన పిదప ప్రయత్నము చేసి ఫలింప జేసిరి. కైజీతపు సైన్యమున కబ్బిలి తులువ మొరస జాతుల వారిని ప్రోత్సహించి చేర్చియుండిరి. ఈజాతులవారు యుద్ధమునందు మిక్కిలి నిపుణతగలవారు.

ఇరువదివేల గుఱ్ఱములును నూటయిరువది యేనుగ ఘట్టములున్ను రెండులక్షల కాల్బలమున్ను అమరనాయకుల సైన్యముయొక్క సంఖ్యయనియు, పండ్రెండువేల గుఱ్ఱములు అయిదువందల యేనుగులఘట్టములు లక్షకాల్బలమును కైజీతము యొక్కసంఖ్యయనియు రాయవాచకము నందు వ్రాయబడియుండెను. ఘట్ట మనగ పది యేనుగులు.

సైనికుల వస్త్రధారణము:—యుద్ధసమయమున సైనికులందరును తోలుతో తయారుచేయబడిన వస్త్రములను ధరించెడువారనియు నావస్త్రములను ధరించినపుడు వారిముఖము చేతులు పాదములు మాత్రము కనబడుచుండెడివనియు తెలియ వచ్చుచున్నది "చర్మాంత ప్రతికళ సంకృచ్ఛశరీరా" యనియు "సంవృశాస్య నవచరణా" యనియు నొకకవి వ్రాసియుండెను. అశ్వములను గజములను యుద్ధసమయమునందు ప్రత్యేకముగ నలంకరించినట్లు మనుచరిత్ర వలన స్పష్టమగుచున్నది. ఈవిషయమును గూర్చి యిదివరకే వ్రాసియుంటిని.

యుద్ధముచేయుపద్ధతి:—రాయలవారికాలమున సాంప్రదాయములకు హెచ్చు ప్రాముఖ్య మివ్వబడుచుండెడిది. శకునములను మహూర్తములను జాగ్రత్తగ కనిపెట్టుచుండెడివారు. రాయలవారి వెంట నెల్లప్పుడును శాకునికు లుండి శుభాశుభ శకునములగూర్చి చెప్పుచుండెడివారు. యుద్ధసన్నద్ధులగాక పూర్వము శకునములను మహూర్తములను చక్కగ గణించి పరీక్షించెడివారు. గొప్పకార్య మారంభింపక పూర్వము జనుల వాక్కు లెట్లుండెడివో కనుగొని వారు చెప్పుకొను "ఉపశ్రుతి" వలన జయాపజయముల నిర్ణయించుకొనెడువారు. ఈయుపశ్రుతి వలననే తమమనోనిశ్చయమును చేసికొనెడువారు. కళింగదేశము పై యుద్ధమునకు వెడలక పూర్వము తనమంత్రియగు నప్పాజిని రాజధానియం దుపశ్రుతి యెట్లున్నదో కనుగొనుటకై తెల్లవారుజామున పంపెను. అప్పాజివెళ్లుచు కొంత మంది చాకలవాండ్ల గృహములవద్ద.

కొండవీడు మనదేరా కొండపల్లి మనదేరా,
కాదని యెవ్వరు వాదుకువచ్చిన కటకము దాకా మనదేరా.

యను పదము పాడుచుండుట విని యీవచనము లుపశ్రుతిగ చేకొని తదనుసారముగ కళింగదేశప్రవేశమును గజపతి రాజున కపజయంబును నిశ్చయించుకొని రాయలవారితో సంప్రతించి తత్క్షణమే యుద్ధసన్నాహము గావించిరి.

యుద్ధసంబంధమగు విషయములన్నియు నొక ప్రత్యేక శాఖ క్రిందనున్నట్లు నాశాఖ "కందాచార" శాఖయని పిలువబడినట్లును శాసనముల వలన తెలియుచున్నది. ఈశాఖలో

సేనకుల కుద్యోగము లివ్వబడెను. ఈశాఖకు నాయకుడు ప్రాముఖ్యమైన యుద్యోగి. వీరియాధీనముననే నీశాఖయంతయు నిర్వహింపబడుచుండెడిది.

ఆకాలమున రాజులు సామాన్యముగ స్వయముగ యుద్ధము జేయు టాచారము కాదు. కాని కృష్ణదేవరాయలు మాత్రము ఉమ్మత్తూరుపై యుద్ధము ప్రారంభించినప్పటి నుండియు తాము స్వయముగనే యుద్ధమునకు వెళ్లుచుండెడి వారు. యుద్ధసన్నాహము ప్రారంభించినంతనే రాయలవారు రాజధానినగరమున విశాలబహిరంగ ప్రదేశమున వెలిగుడార ములు వేయించి ఆగుడారములందు తాము విడిది జేసెడువారు. ఆగుడారమునుండి తమనౌవలను, మన్నీలను, రాతులను, సైన్యాధికారులను, కరణములను, రాయసంవారిని, అవసరం వారిని మొదలుగాగల యధికారులనందరి నచటికి రావించి వార్లను తమతమ వద్దనున్న యుద్ధపరికరములతో, ఆయుధ ములతో, స్తోమములతో, ఆయత్తపాటులతో నగరికొక్క ప్రకారము ఏనుగులు, గుఱ్ఱములు, రాతులు, రాణువ, బంటు మొదలయిన చతురంగబలములతో యుద్ధమున కాయత్తముగు డని యానతిచ్చెడు వారు. అట్లానతిచ్చిన వెనుక వచ్చెడి వారిని సమకూర్చుకొనుచు మెల్లమెల్లగ పయనమై రోజు కామడ దూరము చని అచట నింకను రావలసినవారికై రెండుమూడు దినములుండి, అందరుసైనికులు చేరువరకు మెల్ల మెల్లన పోవుచుండెడివారు. రావలసిన వారందరు చేరిన వెంటనే సైన్యసమేతులై గమ్యస్థానమునకు తొందరగ పోయెడువారు. రాయలవారెల్లప్పుడు తమకై జీతగాండ్లతో

మధ్యనుండెడువారు. మిగిలిన సైన్యమంతయు నాల్గుభాగ ములుగ విభజింపఁబడి రాజుగారికి నాల్గువైపుల నాల్గుభాగ ములుగ సమరనాయకుల యాధిపత్యమున జనుచుండెడివారు. వీరు పయనమైపోవునపుడు యుద్ధముసేయుజనకంటెగాక యితర జనము హెచ్చుగ నుండెడిది. వీరివెంట సేనానాయకులు వారివెంట వారిభార్యలు వారిపిల్లలుకూడ నుండెడివారు. సైనికుల కవసరముగు తినుబండారములు, గుఱ్ఱములు, పశువులు వీటికవసరములగు ఉలవలు, గడ్డి మొదలయిన వస్తువులు-ఇది యది యన నేల? అవసరములగు నన్నివస్తువులు రాజుగారి వెంటనే వెళ్లుచుండెడివి. వీరందరివెంట భోగస్త్రీలుకూడ నుండెడివారు. వీ రెచట విడిసిన నచటనే పెద్దపట్టణముగనుండి రమ్యమైన బాటలు గృహములు తయారై యుండెడివి. రాజు గారు విడిసిన ప్రదేశమునుండి యింకొక ప్రదేశమునకు బయలుదేరునపుడు గంటమ్రోగింపఁబడి సమావేశమయిన జనులందరును వస్తుసమేతముగ పయనమై వెళ్లినపిదప విడిది పట్టణము తగులబెట్టఁబడెడిది.

ఇప్పటివలె నాకాలమున ప్రభుత్వమువారు సైనికులకు వలసినవస్తువుల నిచ్చెడువారు కారు. అయితే వారికి మాత్రము లోటెంతయు నుండెడిది కాదు. ప్రతిసైనికదళమున కవసరమైన వస్తువులను తెచ్చి విక్రయించుటకు వర్తకులును వచ్చెడివారు. ఈవర్తకు లంగళ్లుపెట్టి వస్తువులను విక్రయించుచుండెడివారు. బంగారు వెండి నగలు చీరెలు మొదలయిన వస్తువులన్నియు నాయంగళ్లయందు విక్రయింపఁబడుచుండెడివి.

శత్రురాజ్యపుసరిహద్దులను చేరినంతనే తమరాజ్యము నందలి కొండజాతులవారిని శత్రుస్థానములను నాశనము చేయుటకై వదలిపెట్టెడువారు. ఈకొండజాతులవారు యుద్ధభూమియందు చేయు సహాయము మెండుగ నుండెడిది. అందువలన నీకొండజాతులవారిని జాగ్రత్తతో నదుపునం దుంచెడివారు. రాయలవారు దిగ్విజయయాత్రకు బయనమై పోవునపుడు తనరాజ్యమునందు నివసించియున్న పదునెనిమిది కొండజాతుల సమూహములను పిలిపించి వారికి విందొసంగి తమకుముందుగ ముప్పదిమైళ్లదూరమున ప్రయాణముచేయుచు శత్రుసైన్యమును శత్రువులపాడామానులను, గొఱ్ఱెలను మేకలను గుఱ్ఱములను సంగ్రహించుటకై యేర్పాటు గావించెడివారు. ఒక్కొకప్పుడు శత్రుప్రదేశములను తగులబెట్టించుచుండిరి.

సామాన్యముగ నాకాలమున కోటలే ముఖ్యమైన రక్షణస్థానము లైనందున మున్ముందు కోటలనే ముట్టడించెడువారు. కోటలను ముట్టడించుటలో కోటగోడలను పగులగొట్టుట గోడలలో కంతలనుజేయుట ముఖ్యమైనసాధకములు. ఒక్కొక్కప్పుడు కోటగోడలపైకి ప్రాకి గోడలపై నెక్కుటయు కద్దు. కోటగోడలవరకు పోవుటకు కోటగోడల పక్కనున్న కందకములపై వంతెనలకట్టుటకు మంచిపనివాండ్రుండెడివారు. కోటతలుపులు పగులగొట్టుట కేనుగు లుపయోగింపఁబడెడివి.

పెద్దమైదానముల యందు యుద్ధము చేయవలసిన చోట హిందూసాంప్రదాయముల ననుసరించి యిరుపక్షములవారును ముఖాముఖి యెదురుగనుండి పోరాడుచుండెడివారు. అయితే రాయలవారు సైన్యమునంత నొకసారియే యుద్ధరంగమునకుఁ

బంపక సైన్యమును పలుభాగములుగ విభజించి ముందరనున్న రెండు మూడుభాగముల సైన్యమును మాత్రము ముందుపయోగించెడువారు. రాయచూరుయుద్ధమున నిట్లే చేయగా ముందుండి యుద్ధము చేయుచున్నవారు తురకసైనికు లుపయోగించిన తుపాకిగుండ్లధాటికి తట్టుకొనలేక పారిపోవసాగిరి. అప్పుడు పారిపోవుచున్న రాయలసైన్యమును తురకలయశ్వదళము వెంటాడెను. ఆసమయమున మిగిలియున్న తమ సైన్యమును రాయలవారు ప్రోత్సహించి వెంటబడి తరుముచు వచ్చుచున్న గుఱ్ఱపుదళమున కెదురుతిరిగి పోరాడి దానిని నాశనముచేసి యుద్ధమునందు విజయముగాంచిరి.

యుద్ధమున జయించిన ప్రదేశములయందు నమ్మకమైనట్టియు విశ్వాసపాత్రులైనట్టియు నధికారుల నుంచి అచటి ప్రజలకు తగునేర్పాటులు గావించుటకు తమయధికారులను రాయలవా రాజ్ఞాపించెడివారు. భయమువలన శత్రువులను లొంగదీసినను నయమువలన వారికి విశ్వాసముకలిగించి రాయలవారు వారిని పాలించెడివారు.

విజయనగరరాజ్యమున నౌకాదళమున్నందులకు రాయలవారు వహించిన బిరుదములే తార్కాణములు. గోవా పట్టణ మాకాలమున తురకల స్వాధీనమునందుండెను. గోవాను వశపరచుకొనుటకు పోర్చుగీసువారు ప్రయత్నించి నపుడు రాయలవారి నౌకాదళాధికారియగు "తిమోజా"యను వారు తమ నౌకాదళముతో పోర్చుగీసువారికి సహాయము గావించి గోవాపట్టణమును తురకలవద్దనుండి వశపరచుకొన్నట్లు తెలియుచున్నది.

21. రాయలవారు : మతము : మతవ్యాప్తి

విజయనగర రాజ్యస్థాపనకు పూర్వము దేశమునందంతటను మతవైషమ్యములు హెచ్చుగనుండెడివి. మహమ్మదీయరాజులు దేశమునందు రాజ్యస్థాపనము ప్రారంభించిన కాలమున హిందూమతవిధ్వంసనము చేయుటవలనను హిందూదేవాలయముల నాశనము చేయుటవలనను మతవైషమ్యములు పెరిగి వీరశైవమతవిజృంభణమును వీరవైష్ణవమత ప్రాముఖ్యమును దేశమునందు హెచ్చెను. మతసంఘర్షణల వలన దేశమునందు పోరాటములు హెచ్చి దేశమంతయు చీకాకైయుండెను. అద్వైతమతప్రతిష్ఠాపనాచార్యులగు మాధవాచార్య విద్యారణ్యులవారి యాధిపత్యమున విజయనగర రాజ్యస్థాపన జరిగియుండుటచేత నీరాజవంశజులయందు మత సామరస్యము హెచ్చుగ నుండెను. వీరు రాజ్యము చేసినంత కాలము, మతములన్నియు దేశమునందు పోరాటములు లేక వృద్ధిచెందుచుండెను.

కృష్ణదేవరాయలవారు వైష్ణవమతస్థులు. వీరు వ్రాసిన విష్ణుచిత్తీయగ్రంథమే వీరిమతమును ప్రకటించుచున్నది. వీరు వైష్ణవమతము ననుసరించిరని చెప్పుటచేత నితరమతముల ద్వేషించిరనిగాని, నిరసించిరనిగాని, అలక్ష్యము చేసిరనిగాని చెప్పుట కెంతమాత్రమును వీలులేదు. రాజ్యారూఢులైన కొద్దికాలమునకే హంపీనగరమువద్దనున్న విరూపాక్ష దేవాలయమును రాయలవారు బాగుచేయించిరి. వైష్ణవ దేవాలయములను శివాలయముల ననేకవిధములుగ బహూకరించిరి. తిరుపతి, కాంచీపురము, సింహాచలము, అహోబిలము,

తిరువణ్ణామలై, చిదంబరము, కాళహస్తి, శ్రీశైలము నందలి దేవాలయములను వృద్ధిచేసి ఆదేవాలయముల కనేక దానముల నిచ్చిరి. జైనమతస్థులు దేశమున సుఖముగ జీవించిరి. వీరశైవులు మతద్వేషమువలన శ్వేతాంబరజైనులను హింసించినపుడు రాయలవారు లింగాయతుల శిక్షించిరి.

రాయలవారి రాజ్యమున హిందూమతస్థులేగాక యితర మతస్థులును మిక్కిలి ప్రేమతో నాదరింపబడుచుండిరి. మహమ్మదీయులు, క్రైస్తవులు యూదులు రాయలరాజ్యమున సురక్షితముగనుండి తమతమమతముల ప్రచారము గావించుకొనుచుండిరి. పాశ్చాత్యదేశమునందు వ్యాప్తమైయున్న క్రైస్తవమతమునందును గొంత సత్యముండకపోదని తలంచినవారిలో రాయలవా రొక్కరు. మహమ్మదీయులను జయించియు వారి మతసంబంధములైన మసీదులతోగాని యితరమతైకవిషయములలోగానివారు ఏలాటి జోక్యమును కలుగజేసికొని యుండలేదు. అన్నిమతములవారిని తమసైన్యములో జేర్చుకొనుచుండిరి. సమస్తమతముల యొక్కయు సర్వాంశసత్యముల విమర్శించుచు వారి వారి తారతమ్యములంబట్టి యుచిత గౌరవ మొసగుచు సమస్తజనుల నేకదృష్టితో జూచుచుండెడివారు. బార్బోసా యనుచరిత్రకారు డీవిషయమును గూర్చి యిట్లు వ్రాసియుండెను.

మతసహనము

"తనరాజ్యమునకు వచ్చిన వారిని గూర్చి చికాకుపడక, వచ్చినవారు క్రైస్తవులా యూదులా మహమ్మదీయులా యని వితర్కించకయే. వారివారిమతస్వాతంత్ర్యముతో నిచ్చవచ్చి

నట్లు వ్యవహరించుటకును వచ్చినవారు వారికిచ్చవచ్చినపుడు తమదేశమునకు తాము వెళ్లుటకును స్వాతంత్ర్యమును రాజుగారిచ్చియుండిరి.

కృష్ణదేవరాయలకాలమున ప్రాముఖ్యముగ నుండినది వైష్ణవమత సాంప్రదాయమే. సాళువనరసింహరాయలు వైష్ణవ మతావలంబకులే. వారికి తిరుపతి వేంకటేశ్వరస్వామియందు భక్తి మెండు. అట్లే కృష్ణదేవరాయలకును తిరుపతి వేంకటేశ్వర స్వామియందు భక్తి అనిర్వచనీయము అపారమైనది. వీరు రాజ్యము చేసినకాలమున రాయలవారు సుమా రేడు మార్లు తిరుపతి వేంకటేశ్వరస్వామిని సందర్శించిన ట్లచటి శాసనములవలన కనుపట్టుచున్నది. వారి దిగ్విజయ యాత్రలను గూర్చినవివరములన్నియు చాల భాగము శాసనములను బట్టియే తెలిసియున్నది. వీరు శ్రీవేంకటేశ్వరస్వామి సందర్శనము చేసికొన్నసందర్భమును గూర్చి యిదివరలో వ్రాసియుంటిమి. గజపతిరాజుతో యుద్ధముచేసి గెల్చిన సందర్భముననే తిరుపతి వేంకటేశ్వరస్వామిని నాల్గుమారులు సందర్శించినట్లు కనబడుచున్నది. ప్రతిమారు నచటికి రాయలవారే గాక వారితో వారి భార్యలున్ను వారి అధికారులున్ను పురోహితులున్ను గూడ వెళ్లినట్లు తెలియవచ్చుచున్నది. అట్లు వెళ్లినపుడు స్వామివారి కనేక దానములు గ్రామదానములు, భూమిదానములు, ద్రవ్యదానములు బంగారు వెండి నవరత్న దానములు చేసియుండిరి. ఆసందర్భమున నొకమారు తమ యొక్కయు తమ ప్రియభార్యలగు తిరుమలాదేవి చిన్నాదేవుల యొక్కయు కంచు విగ్రహములను స్వామివారి గుడివాకిట

నుంచినట్లు తెలియుచున్నది. ఈ విగ్రహముల నెపు డచట పెట్టినదియు సరియైనకాలము మాత్రము తెలియుటలేదు. ఈ కంచువిగ్రహముల నిప్పటికి నచట చూడనగును. రాయల వారికి వేంకటేశ్వరస్వామి యందు గల అఖండభక్తివిశ్వాసములు వారిదానములే వేనోళ్ల చాటుచున్నవి. వీరి సకలదిగ్విజయములకు శ్రీవేంకటేశ్వరస్వామి వారి యాశీర్వచనమే కారణమై యుండెను.

వైష్ణవులు

రాయలవారికాలమున వైష్ణవులలో రెండుతెగల వారుండిరి. (1) రామానుజుల వారి యనుచరులగు శ్రీవైష్ణవులు. (2) మధ్వాచార్యుల యనుచరులగు మాధ్వులు. ఈ రెండు తెగలవారిలో కొద్దిపాటి భేదములుతప్ప హెచ్చుగ లేవు. మొత్తముమీద మధ్వమతముకన్న శ్రీవైష్ణవమతమే జనాకర్షణీయముగనుండెను. మధ్వమతస్థులు బ్రాహ్మణులలో తప్ప మరి యితర వర్ణములలో లేరు. రాయలవారి కాలమున వైష్ణవులలో చాల ప్రసిద్ధిచెందిన పండితు లుండెడివారు. వారి వలన మత ప్రచార మద్భుతముగ చేయబడుచుండెడిది. తాతాచార్యుల వారు కృష్ణదేవరాయలవారి మతగురువు. వీరిపాండిత్య మపారమైనది. శ్రీ వైష్ణవమతప్రచారము అహోబలమత యతులచేతకూడ హెచ్చుగ చేయబడుచుండెడిది. అహోబల మతస్థాపకులలో నొకరగు శఠకోపయతియే రాయలవారి ఆస్థానకవి యగు నలసాని పెద్దనకవీశ్వరుని గురువైనట్లు మను చరిత్రలో నీపద్యమువలన తెలియుచున్నది.

…లుకున్ మద్గురు విద్యా,నిలయుం గరుణాకటాక్ష నిబిడజ్యోత్స్నా,
దళితా శ్రితజనదురిత,చ్ఛలగాఢ ధ్వాంతసమితి శఠకోపయతిన్.

ఈ శఠకోపయతియే యాంధ్రదేశమున వైష్ణవమత ప్రచారముచేసినట్లు రాయలవారి ప్రఖ్యాతగ్రంథమగు నాముక్తమాల్యదయందు వ్రాయబడియున్నది.

మధ్వులు

ఆకాలమున కొందరు వైష్ణవవంశజు లీమత ప్రచారము వారి జీవితాశయముగ జేసికొని దేశమంతయు ప్రచారముచేసి మతాభిమానమును వృద్ధిచేసిరి. అట్టివారిలో ముఖ్యులు కందాడై వంశస్థులును పరవస్తువంశస్థులు నై యున్నారు.

మధ్వమతము వైష్ణవమంతవృద్ధిలో లేకున్నను మొత్తము మీద నలక్ష్యము చేయతగినదిగాదు. ఈ మతస్థులలో వ్యాస తీర్థులవారు పురందరదాసు మొదలయిన ప్రఖ్యాతపురుషు లుండిరి. వ్యాసులవా రీమతమునందు ప్రముఖులు. వీరు మొదట ముల్బాగల్మఠమున నుండి సాళువ నరసింహరాయల కాలమున వారిరాజధానియగు చంద్రగిరికి వచ్చియుండిరి. ఈవ్యాసులవారు కొంతకాలము తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి సాన్నిధ్యమున పూజారిగ నుండిరి. రాజధాని విజయ నగరమునందు స్థాపింపబడినపుడు వీరు నచటికి వచ్చియుండిరి. వీరికి కృష్ణదేవరాయలవారివద్ద హెచ్చుగ పలుకుబడి యుండెను. వ్యాసులవారు గొప్పవిద్వాంసులును వాగ్వా దమున మిక్కిలి నేర్పరులు మంచి నడవడికల్గినవారును నై యుండిరి. ఈ వ్యాసులవా రీమతమునుగూర్చి మిక్కిలి యభి మానముతో ప్రచారము చేయుచుండెడివారు. వీరివలన నీమత

మున హనుమంతునికి మంచి ప్రాముఖ్యత యొసంగబడెను. కృష్ణ దేవరాయలవారు మరణించిన తరువాతకూడ నీవ్యాసులవారు కొంతకాలము జీవించియుండిరి. కాని వారిప్రచారమువలన మధ్వమతావలంబనము వృద్ధిగాంచలేదు. కృష్ణదేవరాయల యనంతర మీమధ్వమతమునకు రాజపోషకత్వము తగ్గిపోయి నను వ్యాసతీర్థులవారి యుపదేశములయందలి యుత్కృష్టతను బట్టి యిప్పటికి నీ మతము బ్రాహ్మణులయందు ప్రకాశించుచునే యున్నది.

శైవమతములు - శంకరమతము

రాయలవారికాలమున వైష్ణవ శైవ జైన మతములు వృద్ధిగాంచెను. శైవమతములు బ్రాహ్మణాబ్రాహ్మణ విభేదము లతో నుండెడివి. శంకరాచార్యులవారిమతము బ్రాహ్మణ మతము. ఈమతమునకు ముఖ్యస్థలము శృంగేరి లేక శృంగ గిరి. ఈమతముయొక్క శాఖలు పుష్పగిరి విరూపాక్షము కుంభ కోణమునం దున్నవి. ఇచటి మఠాధిపతులు వేదాధ్యయనము చేసి అద్వైతవేదాంతమును లోకమున ప్రసరింపజేసిరి.

లింగాయతమతము

బ్రాహ్మణేతరశైవమతములు రెండువిధములు - లింగా యతు మతములు, తదితరములు. లింగాయతుమతములు తెనుగుకన్నడదేశములలో వృద్ధిగాంచినవి. అట్టివానిలోనివి శ్రీశైలము సంగమేశ్వరదేవాలయములు. ఈమతములలో వీర శైవ సంస్కారియగు బసవాచార్యునియుపదేశములు ప్రచా రము చేయబడెడివి. వీరి యుపదేశములన్నియు వారివారి

స్వభాషలలోనే చెప్పబడుచుండెడివి. లింగాయతులకు సంబంధింపని యితరమతములు అరవదేశమునందు తిరుప్పనందాళ్, ధర్మవరం, తిరువాది త్రురై గ్రామములయందుండెడివి. వారు పూజాక్రమమునందరవభాష నుపయోగించెడివారు.

వైష్ణవమతములు వడహాలై తెంగలైయను రెండు విధములు. వడహాలై వైష్ణవులు వేదప్రామాణ్యమును జూచెదరు. తెంగలై వైష్ణవులు ప్రబంధములను ప్రమాణము చేసికొని వాటికే ప్రాముఖ్యత నిచ్చెదరు. అహోబిలము తిరుపతి శ్రీరంగము మతములు వడహాలై మతములకు చెందినవి. మేల్కోట వానమామలై తెంగలై మతమునకు చెందినవి.

మధ్వమతములు వైదిక ధర్మసాంప్రదాయములు. వేదములు ఉపనిషత్తులు ధర్మశాస్త్రములు పురాణములు మధ్వమతములకు ప్రమాణములు. ఇట్టిమతములు ఉడిపి, ముల్బాగల్లు విజయనగరమునందు నుండెను.

జైనమతములు

జైనమతములు కృష్ణదేవరాయని కాలమున ప్రబలముగ నుండెడివి. వీటిముఖ్యస్థలము శ్రావణబెలగోల. ఈగ్రామము విజయనగరరాజ్యములోనిది. ఈమతముగాని మతముగాని జనామోదమును పొందియుండలేదు.

ఈ మతము లన్నిటియందును శాస్త్రజ్ఞానము అధ్యయనము హెచ్చుగ జరుగుచుండెను. ఈ మతములలో మత విషయికశాస్త్రములనే గాక సామాన్యవిద్యకూడ చెప్పబడుచుండెను. వైద్యశాస్త్రమునందుకూడ నచట విద్య చెప్పబడుచుండెను. ఈమతస్థులమతములతో సంబంధముకలిగించుకొనక

రాయలవారీమతములన్నిటిని సమానముగ నాదరించుచు సమానముగ పోషించుచుండిరి.

దేవాలయములు

రాయలవారిరాజ్యమున దేవాలయము లనేకములు బాగుగజేయబడుటయేగాక కొత్తవి కొన్ని నిర్మింపబడెను. ఈ దేవాలయములలోని యధిష్ఠానదేవతలకు మనలో రాజులకు వలెనే నవరత్నఖచితముగుకిరీటములు, భుజకీర్తులు నగలు నాణ్యములు పట్టువస్త్రములు విలువగల్గి మంచిపుష్టి నిచ్చు ఆహారములు పువ్వులు చందనము సువాసనగల నూనెలు సంగీతకచ్చేరిలు, భోగపుమేళములు మొదలగునవన్నియు నేర్పాటుగావింపబడెను. ఈ దేవాలయపోషణకొరకు నిత్యనైవేద్య దీపారాధనలకు భూదానములు గ్రామదానములు జేయబడెను. ప్రతిపండుగకు దేవునికి నుత్సవములు జరుపుట కేర్పాట్లుగావింపబడెను. దేవాలయముల కివ్వబడినగ్రామములను భూములను, వెండి బంగారు వస్తువాహనములను చక్కగ విచారించుటకు స్థానికుల నేర్పాటుచేసియుండిరి. రానురాను స్థానికుల సంఖ్య హెచ్చుకాగా వారిలో నొక్కరిని స్థానాచారిగగాని స్థానాపతిగగాని యేర్పాటు చేసియుండిరి. ఈ స్థానాచారి దేవాలయమునకు సర్వస్వతంత్రుడు గాకున్నను దేవాలయములకు సంబంధించిన వ్యవహారముల నన్నింటిని చక్కబెట్టుచుండెను. ఈస్థానాచార్యులు తమవిధులను జరుపుచుండిరా లేదా యని పరిశీలించుటకై సీమపారుపతిదారు ఉండెడివారు. వీరు రాజుగారిచే నియమింపబడిన యధికారి. దేవాలయపు లెక్కలను సక్రమముగనుంచుటకు కరణము లుండెడివారు. వారు లెక్కలం

వ్రాయుటకు దేవాలయమునందు ప్రత్యేకముగ చావిడి యేర్పాటు చేయబడెడిది. వీరుగాక దేవాలయమునందు ముఖ్యమైన అధికారి పారుపత్తిదారుడై యుండెను. దేవాలయమునకు సంబంధించిన ద్రవ్యమునంతను జాగ్రత్తచేసియుంచుటకు శ్రీభాండారము అను పేర నొక గది యుండెడిది. ఆగదియందు దేవాలయమునకుసంబంధించిన ద్రవ్యమును వస్తువాహనములునుంచబడెడివి. ఈ దేవాలయముల యందే కులవ్యవహారము లన్నియు పరిష్కరింపఁబడి ప్రజలకు నీతి బోధింపబడు చుండెడిది. రాయల కాలమున నీదేవాలయములు మతజీవనమునందు సంఘజీవన మందు ప్రాముఖ్యత వహించెను.

అమ్మవార్ల - జాతర

దేవాలయము లేగాక ప్రతిగ్రామమున నొక ప్రత్యేకమైన అమ్మవా రుండెడిది. అట్టి అమ్మవారికి ప్రతిసంవత్సరమును జాతరలు జరుపబడుచుండెడివి. ఈజాతర సమయములలో పెక్కు మేకలు, గొఱ్ఱెలు, దున్నలు బలి యివ్వబడు నాచారముండెను.

దుర్గాదేవి. విజయనగర రాజధానియందు దుర్గాదేవి ముఖ్యదేవత. దసరా వుత్సవములలో తొమ్మిది రోజు లిట్టిజాతరలు రాయలవారి సముఖముననే జరుగుచుండెడివి.

గ్రామములయం దీ జాతరలు జనులకు హెచ్చుసంచలనము గలిగించెడివి. గ్రామములందలి స్త్రీలు గోర్కెచ్చెదము రంటుకొని (నిశామిళిత) పసుపు కలిపిననీటియందు జలకమాడి నూతన వస్త్రములు ధరించి కన్నుగవల కాటుకదీర్చి సిందూర తిలకమును ముఖమున గుండ్రముగ దిద్ది, గొప్పూల విరులు గ్రుక్కి వేప చిగురుదండలను మెడలవైచి, చిన్నిచిన్ని సొమ్ములను ధరించి,

తమతమ ప్రాణప్రియులు వెంటరా, గ్రామమునందలి స్త్రీ లాపర్వదినములందు బయలుదేరి శక్తిభవనమునకై జాతర వీక్షించుటకు వెళ్లెడివారు. అచట మితిలేని మేకపోతుల నరుకుటయు, కల్లుద్రావుటయు జరుగుచుండెడిది. అచట విపరీతమైన ధ్వని చేయబడుచుండెడిది. ఆసమయమున నచటికి వచ్చిన స్త్రీలు తమతమ మొక్కుబడుల చెల్లించుటకు మొదలుపెట్టెదరు. ఒకతె సిడిమ్రానున వ్రేలాడును. ఎఱ్ఱకలువలుగల చెరువునందువలె నింకొకతె నిప్పుటేటవరించును. పందిరి నిప్పులగుండము నందింకొకతె ప్రవేశించును. (ఇంకొకతె అరటాకుమీద నృత్యము చేయును). ఇంకొకతె తనమూపునుండి పెరికిన మాంసమును బలియిచ్చును. ఇట్లు అచటికి వచ్చిన పూవుబోండ్లు తమ శక్తి కొలది భక్తి పూరితలై యాశక్తిని పూజింతురు. ఈపైన వ్రాయఁబడిన యంశములన్నియు రాయలవారి యాస్థానకవులలో నొకరగు తెనాలిరామకృష్ణకవి తన పాండురంగమాహాత్మ్యమున మూడవ ఆశ్వాసమునందు వివరించియుండెను. ఈవిషయమునుగూర్చి బార్బోసాయను చరిత్రకారు డీవిధముగ వ్రాసి యుండెను.

“ఈప్రాంతపు స్త్రీలకు విగ్రహారాధన యందుండెడి భక్తి వలన మిక్కిలి అద్భుతమైన పనులు నెరవేర్తురు:—“ఎవ్వరేని యొక కన్య తాను వరించిన యువకుని వివాహమాడ దలచిన, తన వివాహము జరిగినచో తనదేహము నా యువకుని కర్పింపక పూర్వ మాదేవతకు గొప్పముడుపు చెల్లించెదనని శపథము చేయును. ఆ గోరినయువకుడే తనభర్తగ సంభవించినచో నాతనికి తనదేహము నర్పింపకపూర్వ మాదేవతకు తన రక్తమును

సమర్పింపవలసి యున్నదని వానితో నివేదించి ఒక శుభ ముహూర్తమున నొకవాహనము దెప్పించి, బావినుండి నీరు లాగుటకు వీలయినయేతము వంటి యేతమును తెప్పించి దానిని తనవాహనము పై నిల్పి దానికి రెండు యినుపకొంకెముల వ్రేలాడగట్టి యుంచెదరు. ఆ పర్వదినమున నీకన్య స్వజనముతోను బంధుజనముతోను కూడుకొని వాద్యములు మ్రోగుచుండ పాటలు పాడుచుండ, నృత్యగాండ్లు నృత్యము చేయుచునుండ, కటి క్రిందిభాగమువరకు వస్త్రమును ధరించి బండి నెక్కును. అంత నేతముయొక్క కొంకెల రెంటి నామె కటిప్రదేశమున కిరుపార్శ్వములనున్న మాంసభాగమున గుచ్చి పైకి లాగుదురు. దేహమున కిరుపార్శ్వముల నుండి రక్తము ప్రవహించుచు క్రిందభాగము నంతను రక్తమయము చేయుచుండ నీకన్య గాలిలో వ్రేలాడుచుండును. ఈ వ్రేలాడుచున్నకన్య కత్తి నొకదానిని చేతబూని దాని నటునిటు విసరుచు మిక్కిలి సంతోషముతో నిమ్మకాయల తనభర్తపై విసరుచు, నెగుర చేయుచుండ బండి గుడివద్దకు తీసికొని పోబడును. అచట నీకన్యను దింపి ఆమెకు కలిగిన గాయములకు చేయదగిన చికిత్సను గావించి ఆకన్య నామెభర్త కప్పగింతురు. అనంతరము పెద్దపండుగ గావించి వచ్చిన వారికి తగిన మర్యాదలు చేసి వారివారి శక్త్యనుసారము విందు గావింతురు."

ఈవర్ణనను బట్టిచూడ నప్పటి వారిదుర్గాదేవి సమక్షమున నామె యందుగల భక్తివలన మిక్కిలి సాహసమైనట్టియు ఘోరమైనట్టియు కృత్యముల నాచరించి ఆశ్చర్యకరమైనట్టియు నద్భుతములైనట్టివిషయముల సాధింపవచ్చుననెడి మూఢనమ్మ

కముతో జనులుండెడివారనియూహింపనగును. ఈపైన వ్రాసిన యంశములను జదువుటకే దేహముకంపించుచుండ ప్రత్యక్షముగ జూచెడి వా రెట్లుండిరో యూహింపనశక్యముగదా!

తీర్థయాత్రలు

ఇప్పటివలెనే రాయలవారు రాజ్యముచేసెడి సమయమునను జనులు తీర్థయాత్రలు చేయుచుండెడివారు. మహమ్మదీయులుత్తరహిందూస్థాన మాక్రమించినప్పటి నుండియు నుత్తర హిందూస్థానమునందలి కాశీ ప్రయాగ మొదలయిన క్షేత్రములకు జనులు పోవుచునేయుండిరి. తీర్థయాత్రలు చేయుటకు రాయల రాజ్యమునందు పుణ్యక్షేత్రములు లేకపోలేదు. చిదంబరం, విరూపాక్షం, తిరుపతి, కంచి, శ్రీశైలము, తిరువణ్ణామలై, హరిహరం, అహోబిలం, సంగమేశ్వరం, శ్రీరంగం, కుంభకోణం, మహానంది, గోకర్ణం, రామేశ్వరం మొదలయిన పుణ్యక్షేత్రములు రాయలవారి రాజ్యమునందే యుండెను. ఈక్షేత్రములకు బోవుటయు సులభ సాధ్యముగ నుండియుండలేదు. దోవలు సరియైనవి లేవు. నదులు దాటుట కష్టతరముగ నుండెడిది. వెళ్లుటకు తగిన వాహనము లుండెడివికావు. కాలినడక బోవలసి యుండెను. ఈపైన పేర్కొన్నవి కొన్ని విష్ణుక్షేత్రములు మరికొన్ని శివక్షేత్రములు నయియున్నవి.

ప్రయాణసౌకర్యములు

జను లొకచోట నుండి యింకొకచోటికి బోవలెనన్న పల్లకీలు అందలములు గుఱ్ఱములు ఎద్దులు దున్నపోతు

లుపయోగింపబడెడివి. బండ్లు వ్యవసాయమున కుపయోగింపబడెడివి. గాని ప్రయాణములకై యుపయోగింపబడినట్లు కాన్పించదు. వీనికి ముఖ్యకారణము సరియైన మార్గములు లేకపోవుటయే. ఆందలములు పల్లకీలు దేశమునందలి రాజవంశజులు రాజ్యాధికారులు గొప్పధనికులు నుపయోగించెడివారు. ఆముక్తమాల్యదయందు విష్ణుచిత్తుడు శ్రీవిల్లుపుత్తూరునుండి మధురకుబోవుటకు "ఆనతిఁబడి శ్రీఖండా, రానన్నంబడము తనదు ప్రాతందలమున్, స్థానికు డొసంగి పనుపం, గా నాతఁ బడిన నమితికాంద్రు వహింపన్" వెళ్లినట్లు రెండవయాశ్వాసమున వ్రాయబడియుండెను.

సామాన్యులు గుఱ్ఱములమీద నెద్దులమీద బోవుచుండెడివారు. మిగతవారందరు నడకమీదనే ప్రయాణము చేయుచుండిరి. అందువలన దూరప్రయాణములు కష్టసాధ్యములుగ నుండెను. మరియు మనుష్యులు వెళ్లినపుడు, సామానులను తీసికొనివెళ్లుటకు గుఱ్ఱములుగాని యెద్దులుగాని యుపయోగించవలసియుండెను. తమ వస్తువులే గాక తినుబండారములను తీసికొని పోవలసి యుండెను. అందువలన సామానులన్నియు మూటలుకట్టి యెద్దులపైనను గుఱ్ఱములపైనను తీసికొనిపోవుచుండిరి. త్రోవ సరిగనున్నను లేకున్నను ఎండవేడిమి జనుల బాధించకుండునట్లు త్రోవ కిరుప్రక్కలను నీడనిచ్చు చెట్లతో నింపబడియుండెను. త్రోవ పొడుగున నీడనిచ్చుటకు మామిడిచెట్లు పనసచెట్లు రావిచెట్లు మఱ్ఱిచెట్లు పెంచబడెననియు రేపలమను గ్రామమువద్ద మాదువం

దల యెరవయి గుఱ్ఱములు నిలుచుటకు వీలుకల్గిన పెద్దవృక్షమును తాను చూచినట్లును పేయసను చరిత్రకారుడు వ్రాసియుండెను. ఈవృక్షములేగాక దారిలో నచటచట చెరువులున్ను త్రవ్వబడియుండెను. ఈచెరువుల వద్ద పెంచబడిన పెద్దవృక్షముల క్రింద బాటసారులు దిగి వంటచేసికొనిగాని దగ్గరగ్రామమున నున్న వంటపూటి యిండ్ల నుండి భోజనము తెప్పించుకొని గాని తినుచుండినట్లును తారకబ్రహ్మరాజ్యమను గ్రంథమునందలి రెండవ యాశ్వాసమున వ్రాయబడిన యీపద్యము వలన తెలియుచున్నది.

కల్లెడ నల్లన జనియెక, యిల్లాలికి తగిన విలువ లిచ్చి నయమునన్
తల్లీ నా ప్రియురాలికి, యుల్లం బలరగ జేయు మేగద మునివర
అయ్యా నిమునమునోనను, నయ్యాడు వెచ్చటకు దెత్తునవుడు నతడున్
నెయ్యమున మత్తికిందికి, నయ్యన గొనిరమ్మటంచు జనియెన్ శ్రీతిన్.

చలివేంద్రలు, సత్రములు

త్రోవకు మధ్యమధ్య సత్రములు చలివేంద్రలున్ను ఏర్పాటుచేయబడి వాటిపోషణార్థమై మాన్యములున్ను ఏర్పాటుచేయబడెను. ఈచలివేంద్రలయం దారోజులలో పెద్దపెద్దకుండలలో "గుప్పళించినకర్పూరంబుతోడి కురువేరు పరిమళంబులను జాజివిరులవలపును వట్టివేళ్ల వాసనలుం గల యుదకంబుల నుంచుటవలన బాటసారు లాకలశోదకంబుల గ్రోలి సేదదేరిపోవుచుండిరి.

దొంగలు దారిదోపిడివారు

తీర్థయాత్రలుచేయువారలకు త్రోవలో దొంగలభయము హెచ్చుగనుండెడిది. చండాలురు, బోయవారు నీ దొంగల

గుంపులలోఁ జేరి దారిమధ్యనుపోవుచున్న పాంథజనమును పెట్టెడి కష్టములు చెప్పనలవిగాకయుండెను. తారకబ్రహ్మరాజీయమను గ్రంథమున "తనమగడు పోయివీటఁగల మగవారినెల్ల గూర్చి కొని కొల్లగొళ్లకు దూరఁబుపోయినాడనియు" "తీర్థయాత్రాపరుల బ్రాహ్మణులఁదలలు పగులంజెరవాయిగొట్టి ముతుకలుగోయ కరవాతిం గండ్రగొడ్డలి" తీసికొని దొంగలుపోయియుండిరనియు వ్రాయబడియుండెను. దారిమధ్యమున దొంగలగుంపులచే నడ్డగింపబడినవారియొక్కయు, కొట్టబడినవారియొక్కయు దురవస్థలు ఆముక్తమాల్యదయందు చిత్రింపబడియుండెను.

సీ. తనశేదు నిలుకోయి పాతకులా రని దేవాయుధంబులు బూవువారు
పైఁడి కాసమఁ జెట్ల బడ వై చిదుద్దు పెట్లమపాఱుచు నెఱు లెల్ల చువారు
బరువుడించికటారి పరుఁజెంచి నిల్చి యుం దెందుకచ్చెద రని యెదురువారు
వస్త్రంబు గొండు దేవర యీయయిది చన్నఁబస్తని దయపుట్టబలుకువారు
తే. కలవి మామూక నిప్పింతుఁ దొలఁగు డొకటి
యాడుదాని జేనంటకుఁ డనుచుఁ జెడ్డ
తనము నభిమానమును దెంపు గనఁగఁ బలికి
నిలిపి దోపిచ్చువారునై తొలఁగిరపుడు
సీ. తొడుబింటివాడుసన్నోకబోకకయెదుర్చుదువాండ్రదొడిబడఁబదరిపాడిచి
పిసు గీక పెనఁగిన పెద్దనొంపక యెఱ్ఱఁ కాదించి చేఁగఅవానిసాఁచి
యాయితంజెచించియరిగెడువాఁ దేటునమిమాతిచన్న కాదవులటుడిగి
పాదుపుచే లేకయు పుట పుటయును వైన వానికోధింప నవ్వలికిఁ బనిచి
తే. పాదలఁ దూఱిన నీఁటెచాఁపున పెడల్పఁ
గట్టుబట్టలు కొని ప్రాఁతబట్ట దయను
గోఁచులకు నిచ్చి గనపరాలు నిగిడ్చి
చెప్పటట్టలు శోధించి సిగలు విప్పి.

దొంగలు హెచ్చుపెరిగి బాటసారుల అర్థంబుల నపహరించుచుండిరి. ఇట్టికష్టములు పెట్టినను నోర్చుకొని జనులు తీర్థయాత్ర లాకాలమున జేయుచుండిరి. అందువలననే కాబోలు దేశమునందు కాశీకిపోయినను కాటికిపోయిన నొకటె యనెడు సామెత వచ్చియుండెను.

సంఘము :— సంఘ జీవనము

హిందూసంఘమునం దీనాటికివలెనె కృష్ణరాయల నాటి కాలమునందును నాలుగువర్ణములవారు నుండిరి. హిందువులుగాక తురకలు, క్రైస్తవులు, యూదులు నుండిరి. గాని వారందరు వర్తకవ్యాపారములయందు నిమగ్నులై పట్టణముల యందు నివసించెడివారు. హిందూసంఘమున బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రు లను నాల్గువర్ణముల వా రుండెడివారు. వీరిలో ననేకములైన శాఖ లుండెడివి. వీరుగాక పంచములను నైదవజాతివా రుండెడివారు. ఈ పంచములు గ్రామమునకు కొద్దిదూరమున ప్రత్యేకముగ పల్లెయందుండెడివారు. ఈపంచములలో మాలలు మాదిగ లుండెడి వారు.

పాశ్చాత్యదేశమునుండి వచ్చిన చరిత్రకారు లీచాతుర్వర్గములలో నొకరగు బ్రాహ్మణులగూర్చి వింత అభిప్రాయములను వెలిబుచ్చియున్నారు. వీరి అభిప్రాయములు కేవలము సరియైనవి కావని చెప్పుటకు వీలులేదు. బ్రాహ్మణులు మతగురువు లనియు దేవాలయములందు మఠములయందు నుండెడి వారనియు మరికొందరు రాజులవద్ద పెద్ద అధికారపదవులలో నుండెడి వారనియు, తెలివిగల వారనియు లెక్కలు వ్రాయు

టలో మిక్కిలి సమర్థు లనియు వీరిలో చాలమంది తిండిపోతు లనియు వ్రాసియుండిరి. వారి వ్రాతలను బట్టి బ్రాహ్మణుల నారుభాగములుగ విభజింప నగును.

(1) మఠగురువులు (2) అగ్రహారికులు. (3) మఠస్థులు. (4) రాజకీయోద్యోగులు. (5) వర్తకులు. (6) తిండిపోతులు.

మఠగురువులు

మఠగురువులుగ నుండుట మర్యాదకరమైన వృత్తియే గాని దేవునిగుళ్లలో పూజారులుగ నుండుట మాత్రమా రోజులలో నిప్పటివలెనే మంచివృత్తిగ నెంచఁబడెడిదికాదు, శివాలయములోని నంబివాండ్రకును తంబళులకును సంఘమున నెక్కువ మర్యాదలేదు. తంబళులు శూద్రులుగకూడ నెంచఁబడెడివారు. రామానుజాచార్యుని యుపదేశానంతరము మాత్రము వైష్ణవదేవాలయముల లోని పూజారివారెల్లరును శ్రీవైష్ణవబ్రాహ్మణు లుండెడివారు. వారికి సంఘమునందు మర్యాద యీయఁబడుచునే యుండెడిది. వారిలో ననేకులు మంచి విద్యావంతులు.

అగ్రహారికులు

అగ్రహారికులు సామాన్యముగ వేదాధ్యయనముచేసి మంచిపాండిత్యమును సంపాదించినవారు. వీరివిద్యకొఱకే వీరికి అగ్రహారములు మాన్యములు రాజులచే నీయఁబడినవి. వీరందరు గ్రామములో మిక్కిలి మర్యాదస్థులుగను న్యాయాధిపతులుగ నుండిరి. గ్రామమునందు బీదవారికి వీరు మంచి అండగ నుండెడువారు. వీరందరు నిత్యనైమిత్తిక కర్మల

ననుష్ఠించుచు దేవపూజయం దాసక్తిగలిగి దేవునికై నైవేద్యము గావించి వారిభుక్తమును భుక్తిగొనుచుండెడివారు. వీరినిగూర్చి పాండురంగమాహాత్మ్యములో తెనాలిరామకృష్ణకవి యిట్లు వ్రాసియున్నాఁడు.

సీ. కీలారమున నుండి పాలింటి కేతేర బహుధాన్యములు చేలఁ బండి యొరగ
పెడపెడ పెండ్లిండ్లు పడుగులు వోడమఁ గ్రతువు లై యరిఁచుచు నరు లలరఁ
బరిచారికాకోటి పనిపాటు పాటింప జుట్టంపు సందడి చెట్టుకొనఁగ
గ్రామ మెంతయు నిజప్రార్థనంబున మననత్యనిష్ఠ దన్ను సాఁకఁగోర
నిత్యనైమిత్తికములు నిర్నిద్రబుద్ధి, నాచరించుచు హరిభుక్తమాత్మ భార్య
భక్తినిడ భుక్తిగొనుచున్కి ముక్తిగాని, నిదురకంటిదిరాతికంటిదియుగాదు.

మఱియు.

“నరసాహారము తింటఁ బెట్టి బహుశిష్యశ్రేణికిఁ బెట్టి శా
స్త్ర రహస్యస్థితిఁ జెప్ప నధ్యయనసంధ్యావశ్యకత్యంబులన్.

వీరు నిమగ్నులై యుందురని మాదయ్యగారి మల్లన రాజశేఖరచరిత్రమున వ్రాసెను. న్యాయనిర్వహణమునందు వీరిని రాజులు విశేషముగ నుపయోగించుచుండెడివారు. ఇట్టి బ్రాహ్మణమహాజనులు ధర్మాసనులుగఁ జేరి రాజ్యాధికారమును బొంది కక్షిదారులమధ్య తీర్పులను దిద్దుచుండిరి.

మఠస్థులు

మఠములుండెడివిగాని అవి చాలవఱకు వీరశైవమఠములై యుండెను. ఇందు బ్రాహ్మణులేగాక యితరజాతివారును నుండిరి. ఇవిగాక యితరమఠములును నుండెడివి. మఠమునం దుండెడివారిలో హెచ్చుసంఖ్య బ్రాహ్మణులదే. మఠములలోని

మతస్థులు విద్యాబోధము విద్యాప్రచారము చేయుచుండెడి వారు' మఠమునందు నివాసముగ నుండెడి బ్రాహ్మణులసంఖ్య బహుంతక్కువ యనియు చెప్పనగును.

రాజ్యాధికారులు

బ్రాహ్మణులలో హెచ్చుమంది రాజకీయోద్యోగములలోఁ జేరియుండిరి. వీరు రాజ్యనిర్వహణమునందును లెక్కలు వ్రాయుటయందును, నారితేరినవారు. ఈ బ్రాహ్మణులీయుద్యోగవ్యవహారములయందు ప్రత్యేకముగ నియోగింపఁబడుటవలన వీరిని నియోగులందురు.

"నియోగ్యునకై కొంత యియ్యదనందురనీతికార్యములెల్ల సాగదుగాన
వారికా లెక్కలు వ్రాసిన మాత్రాన శూద్రులుగారు భూసురులుగాని'

వీరంత శ్రోత్రియులుగారు. మతవిషయికములయందాసక్తిగలవారును కారు. వీరిలో చాలమంది మంత్రులుగను, సైన్యాధికారులుగను,రాజ్యాధిపతులుగనుండెడివారు. ఆనాఁడు గొప్పగ పరిగణింపఁబడినవారిలో సాళువతిమ్మరసు కొండమరసు, అయ్యపరసు, నరసింగనాయకుఁడు, చంద్రగిరిసోమరసు, దేమరసు, ముఖ్యులు. వారు చాల మర్యాదగలవారు, తెలివిగలవారు, కష్టపడిపనిచేయువారునైయుండిరి.

వ్యాపారస్థులు

బ్రాహ్మణులలో కొందరు వ్యాపారులుగ నుండిరని చరిత్రకారులగు వేయసున్యూనిసులు వ్రాసియుండిరి. గాని అందులకు తగినకారణము లెందును కనుపింపవు. బ్రాహ్మణులలో కొందఱు వర్తకముచేసినను చేసియుండవచ్చునుగాని

అట్టివారు ప్రాముఖ్యమును వహించియుండక పోవచ్చును. అదియునుగాక వారిసంఖ్యయు తక్కువగ నుండియుండె ననియు మన మూహింపవచ్చును.

తిండిపోతులు

బ్రాహ్మణులలో చాలమంది బీదవారు తిండిపోతులై యుండిరి. పప్పుభోజనమునకు పదిమైళ్లైనను వెళ్లుదురనుసామెత యట్టివారి వలననే వచ్చియుఁడవచ్చును. వీరిలో చాలమంది నీచులుండి రనుటలో సందేహము లేదు. ఆక్లే న్యూనిసు చరిత్రకారుఁడును వ్రాసియుండెను రాయలవారును వీరినిఁ గూర్చి వ్రాయుచు వీరి నీచచేష్టలు వివరించియుండిరి.

సీ. బహిరంగ ద్విజానకల్పపుఁ బాఱితిం బిడి కసిఁడికై తా వానిబంతి కుడిచి
కలసి కలిక్వరోధుఁలతోడ బుణ్యాహముల బిత్తాయులకునై మొత్తులాడి
కని రవి గ్రహజప స్నానాదికములెల్ల దొరలవాకిండ్లకే దొడ్డ యిచ్చి
పచ్చిత్తిలోఁభత్తె చచ్చాల మెట్టందికొనఁ దానయూరెల్లఁ గుత్తవట్టి
ధర్మపోటులఁదిని లేనిలఁబుల మైత్రి కంటిపిత్రు శేషము భుజించియుదియు పెడల
నక్కవాడల నరకహుల్ల మెక్కి మీద బీనిశేఖర బంకతులా త్రివ్యయముగొని.

ఇట్లొనఁగూర్చి కైక్యవశ నిచ్చి, చనన్నతిపుచ్చి, చాకము
ల్వెట్టుచు బడ్డిలెక్కలు వెట్టుచు, ధారణవానికై కొదల
పెట్టుచు, వాడు లేఁగి మతిపెట్టుదుఁ బెట్ట ననంగ మిట్టుఁగూ
పెట్టుచు, నిట్టుపోరఁ గనిపెట్టుచు నొక్కరుఁ డుండి పెండియున్.

ద్రవ్యపరులై హీనజాతులతో భోజనముగావింతురనియు, పూజానంతరము తమకివ్వఁబడినబియ్యము వగైరా వస్తువుల పంచుకొనుటలో భాగములకై తగవులాడుదు

రనియు, దొడ్డిసుంకావనలకై పోయి గంటల పరిమితి లేకయే కాచుకొనియుందురనియు, ద్రవ్యాశచే యే నీచపు పనికైన నొడఁబడుదురనియు పై పద్యమునందలి ముఖ్యాంశమై యున్నది. బ్రాహ్మణులలో నీదవా రిట్లు చేసియుందు రనుటలో నాశ్చర్య మేమియును లేదు. దీనినిఁబట్టి జూడ నీ బ్రాహ్మణులలో నిప్పటికి నీవిషయములందు మార్పేమియు లే దని మనము తెలిసికొనగలము.

ఈ పై చెప్పినభాగములలో నేభాగమునకుఁ జెందినను బ్రాహ్మణులందరు నిరాడంబరులు. వారికట్టులోగాని భోజనము నందుగాని నిరాడంబరత్వమే కనుపించును. వీరందరు శాకాహారులు. భోజనమునందు పప్పులు, పెరుగు నెయ్యి పాలు బాగుగ వాడెడివారు. అప్పటికి నిప్పటికి భోజనమునందు వారిలో నేమాత్రము మార్పుగనుపింపదు. వీరందరు సామాన్యముగ నేకపత్నీవ్రతులే. అనేకభార్యాత్వము బ్రాహ్మణులకు శాస్త్ర దూష్యము గాకున్నను వీరిలో నిద్దరుభార్యలను వివాహమాడిన వారిసంఖ్య తక్కువగ నుండెను. ఇద్దరికన్న హెచ్చు భార్యలను జేసికొన్న వారిసంఖ్య అరుదనియే చెప్పవచ్చును.

క్షత్రియులు

వీరందరు సామాన్యముగ రాజ్యముచేసెడివారియొక్క గాని చేసినవారియొక్కగాని వంశీయులై యుండిరి. వీరిలో సూర్యవంశజులు, చంద్రవంశజులు, నుండిరి. చోళరాజ్యవంశజులు, గజపతిరాజులు, మాదిరాజువారు మొదలైనవారు సూర్యవంశపురాజులు. సంగమ, సాళువ, తులువ, అరవీడు,

పాండ్యరాజులు చంద్రవంశపురాజులు. ఆకాలమున నగ్నికుల క్షత్రియు లున్నట్లు కనుపించదు.

వైశ్యులు

వైశ్యులకు వ్యవసాయము పశురక్షణ వ్యాపారము వారి కనుశ్రుతముగ వచ్చుచున్న వృత్తులని చెప్పుదురుకాని వ్యవసాయమునందుగాని పశురక్షణయందుగాని వారికి హెచ్చు సంబంధ మున్నట్లు గనబడదు. వారికి వర్తకమే కులవృత్తి. ఎన్ని ప్రబంధములను జూచినను వీరికిఁ జెప్పఁబడిన వృత్తి వర్తకమే. దక్షిణాదిని సరియైన వైశ్యకులపువా రుండినట్లు కనుపించదు. తెనుఁగు, కన్నడదేశములలోని కోమట్లు వైశ్యజాతికి జెందిన వారనుట నిర్వివాదాంశము. అయితే అరవదేశమునందలి చెట్టికోమట్లు తామున్న వైశ్యకులజులమే యని కొంతకాలము వాదించుచువచ్చిరి. ఈ రెండుతెగలవారికిని నీవిషయమై వాగ్వాదముమీఱి పెద్దతగవు సంభవించెను. అప్పుడు రాయలవారొకమధ్యవర్తి నేర్పాటుజేసి వీరివాదములలోని యంశములను చర్చించి నిర్ణయముఁ జేయించిరి. వైశ్యులవృత్తి వర్తకమే యైనను వర్తకముచేసెడువారు లింగాయతులలోను, మహామ్మదీయులలోను కూడ నుండిరి. వీరిలో లింగాయతులు మంచి వ్యాపారస్థులు.

శూద్రులు

వీరిలో ననేకశాఖ లుండెడివి. వారిముఖ్యవృత్తి వ్యవసాయము. వీరే మనహిందూజాతికి వెన్నెముక. దేశసౌభాగ్యము వీరిపైనే ఆధారపడి యుండెడిది. వీరిలో చాలమంది సైన్యమునం దుండెడివారు. ఇట్లు సైన్యమే తమవృత్తిగఁ జేసికొన్న

వారు కమ్మవారు వెలమవారు నయియున్నారు. వారివృత్తి నిజముగ సైన్యాధికారమేగాని వ్యవసాయము కాదు. వీరుగాక బలిజలుకూడ సైన్యవృత్తినే అవలంబించెడువారు. ఈమూడు శాఖలనుండియే రాయలవా రమరనాయకుల నేర్పాటు చేసియుండిరి.

వీరేగాక శూద్రవర్ణమున ననేకులుండెడివారు. గొల్లలు కురుబలు, చాకలివారు, మంగలివాండ్రు. దొమ్మరులు మొదలయినవా రందరు శూద్రులే. వీరిలో వీరికి వివాహములుగాని పంక్తిభోజనములుగాని లేవు. అరవదేశమున నీశూద్రులలో ఎడమచేతివారు కుడిచేతివారని రెండు కక్షలవా రుండిరి. వీరిమధ్య నెప్పుడు కక్షలు పోరాటములు హెచ్చుగ నుండెడివి. అధికారు లప్పటప్పట వీరితగవులను తీర్పుటకు మధ్యవర్తుల నేర్పాటుచేయుచుండెడివారు.

చండాలురు - పంచములు

వీరు పంచమజాతివారు. వీరిలో మాలలు మాదిగలు నుండిరి. మాలలే పెరియాలు, వారే హోలియాలు. మాలవారు దక్షిణహిందూస్థానమున వ్యవసాయపు కూలీలు. వీరికి నూలు వడకుట బట్టనేయుట ముఖ్యపరిశ్రమములు. వీరిని రాజవృత్తులలోనికి రానీయనందున వీరిలో చాలమంది జనము గుమిగూడి దొంగతనము బందిపోటు మొదలయిన దుర్వృత్తులలోనికి దిగెడువారు. మాదిగలకు చెప్పులుకుట్టుటయే ముఖ్యవృత్తి. వ్యవసాయదారుల కవసరమగు పనిముట్లన్నియు వీరు చేసియిచ్చెదరు. నూలువడుకుటయు వీరివృత్తులలో నొకటి.

సాంఘికజీవనము

సాంఘికజీవనముయొక్క యంత్యమాశయము భాగ్యభోగములుకలిగి సుఖముగ జీవించుట యని చెప్పనొప్పును. అందువలన పాశ్చాత్యజీవనమువలెనైహికజీవన మని తలప నవసరము లేదు. జనుల కాముష్మికజీవనమునందును ఎక్కువ యాసక్తియుండెను. ఆనాటి ప్రబలమైనమతము వైష్ణవమతమైనందున ఐహికాముష్మికములకు పరస్పరసంబంధము హెచ్చుగ నుండి పరసౌఖ్యములతోపాటు నిహసౌఖ్యములందుగూడ జనులు హెచ్చుగ నాసక్తి కల్గి యుండెడివారు. భోగము లష్టభాగములుగ మనపూర్వశాస్త్రజ్ఞులు తెల్పియుండిరి. అవి నివాసము, వస్త్రధారణము, అలంకరణము, సుగంధద్రవ్యములు, పుష్పములు, తాంబూలము, శయనము, స్త్రీ, వీటితోపాటు స్నానము, భోజనము, పానీయములుకూడ భోగసంబంధములే యైయున్నవి.

నివాసము

ఆనాటి నివాసయోగ్యములైన గృహములఁగూర్చి మనకు పోర్చుగీసుచరిత్రకారులు వ్రాసియుండిరి. రాతితో కట్టబడినమిద్దెలు గొప్పవారిగృహములు. అట్టియిండ్లకు నలుప్రక్కల విశాలమైనవసారాలు లోపల విశాలమైనసావారాలు నుండెడివి. ప్రతియింటికి గోపుర మొకటి యుండెడిది. ఇండ్లన్నియు స్తంభములపైన కట్టబడెడివి. గొప్పవారియిండ్లకు కేళీసౌధము, కేళిడోలిక, కేళీవనశ్రేణులు నుండెడివి. ఇంటి స్తంభములు, గోడలు, అనేకచిత్రములతో చిత్రింపఁబడెడివి. ఇంటిస్తంభములను తొలిచి చిత్రించెడువారు. గోడలమీద

బొమ్మలు వ్రాయఁబడెడివి. ఇంటితలుపులుకూడ చిత్రచిత్రములైనబొమ్మలతో నిండియుండెడివి. పూర్వచరిత్రలలోని ప్రసిద్ధపురుషులచరిత్రలు చిత్రింపఁబడెడివి. శ్రీరామునికథలు, నలదమయంతులకథలు, రాధామాధవవిహారములు, శివపార్వతీవివాహసందర్భములు, సముద్రమథనము మొదలయిన పురాణగాథలు గోడలమీఁద చిత్రించెడివారు. ఇట్టిచిత్రములలో కొన్నిటి నిప్పటికిని హంపీలోనున్న చైత్యములయందు చూడనగును. రాజులజనానాలలో పరాయిదేశస్థులస్థితిగతులు తెలియునట్లు వారివారినిత్యజీవితములలోని యంశములను గోడలపై వ్రాసిరి. పడకగదులలో రతీమదనులు, రంభాకుబేరులు, ఊర్వశీపురూరవులు, మేనకాకౌశికులు, గోపికాముకుందులు, తారాశశాంకులు, మొదలయినకాముకీకాములు నడచినగతు లింటిగోడలచిత్రించియుండిరి.

రాయలవారు నివసించెడిసౌధమునుగూర్చి వర్ణించుట సాధ్యముకాదుగాని వారిసౌధమునకు చుట్టు పెద్దయెత్తైన గోడలున్నట్లును గోడలలోపల చక్కనిపెద్దతోట యేర్పాటు చేయఁబడి వాటి కిరుప్రక్కల రమ్యమైనడాబాలు కట్టఁబడినట్లును డాబాలో రాయలవద్ద నుండెడిపెద్దయుద్యోగులు నివసించెడివారనియు నచట గడియగడియకును, యామయామమునకును గంటలు మ్రోగించఁబడెడివనియు మాత్రము తెలియవచ్చుచున్నది. ఇచటి డాబాలకు గోపురములుండి యొకయింటినుండి వేఱొకయింటికిపోవుటకు ద్వారము లుండెడివి. రాజుగారినిఁ జూడవచ్చినవారు విశ్రమించుటకై మొగసాలలును పెద్దసావిడియు నుండెడిది. ఈసావిడితలుపు తెఱచి

లోనికిఁబోయినచో రాజుగారు సభచేసెడి యింకొకసావిడి కట్టఁబడినది. అచ్చటనుంటి లోపలకుఁబోయినచో రాయలస్త్రీలుండెడి జనానా కట్టఁబడినది. ఈగృహములుగాక చిత్రశాల, నాట్యశాల, మజ్జనశాల, భోజనశాల, అర్చనగృహము, దంతపుచావడి, జలయంత్రము, మొదలయిన యనేకశాల లుండినట్లు పుస్తకములయందు వివరింపఁబడియుండెను.

సామాన్యజనులు మట్టిమిద్దెలలోగాని పెంకుటిండ్లలోగాని నివసించెడివారు. బీదవారు తాటియాకు గుడిసెలలో నివసించెడువారు.

2 వస్త్రధారణము

ఆకాలమున జనులు సామాన్యముగ క్రిందధోవతి, నడుముపైనచొక్కా తలపైనటోపిని ధరించెడువారు. దీనినే శ్రీనాథకవి వ్రాయుచు,

కుల్లా యుట్టితి కోక జుట్టితి జరీకూర్పాసముఁ దొడ్గితిన్.

అని వ్రాసియుండెను. ప్రతివారికి కాలికిచెప్పులుండెడివి. మీఁద నుత్తరీయ ముండెడిది. సామాన్యజనులు నూలువస్త్రములు వాడిన ద్రవ్యవంతులు పట్టుపీతాంబరములు, రాయలవారు విలువగల్గిన పట్టుధోవతులు బంగారపు తీగెలతో నలంకరింపఁబడిన దుస్తులను వాడెడివారు.

బ్రాహ్మణులు మాత్రము నీరుకావిరంగు ధోవతియు నుత్తరీయమును వాడుచుండిరి. వీరిలో పండితు లుత్తరీయములకుబదులు శాలువలు వాడుచుండెడి వారు, కేవల వ్యవసాయ దారులు మొలగుడ్డ తప్ప నితరము వాడెడివారు కారు.

వీరిలో గొప్పవారు యింటవడికిన నూలుతో నేసిన వస్త్రములను వాడుచుండెడి వారు. గొల్లలకాపులు మొలగుడ్డయు కప్పుకొనుట కొక కంబళియు వాడుచుండిరి సాలెవారు అగసాలెలు పట్టుసాలెవారు తెల్లనితుండుపులంగట్టి వాటికి చల్లతైలంబుల వాసనల బూసెడువారు, బోయవాండ్రు మొలకొకకాసికోక మాత్రముచుట్టి బిగించెడివారు. మాలవాండ్రు నీలపురంగు కాసెకోకను ధరియించి నెత్తిన నొక తువ్వాలుగుడ్డను చుట్టెడివారు.

స్త్రీలు తెల్లని సన్నని పట్టువస్త్రములనుగాని నూలువస్త్రములను గాని కట్టుకొని రవికలను తొడిగెడువారు. రాజుల జనానాలయందు నూలువిగాని పట్టువిగాని పావడాలుకట్టి పైటకొక "వోణి" వేసికొని రవికె నొకదానిని బిగుతుగ తొడిగెడువారు. సామాన్యస్త్రీలు కాళ్లవఱకు రమ్యములైన పూవులతో నద్దకము చేయబడిన చీరెలను కట్టెడువారు.

"కట్టిరి చిరుతచాకపు క్రొంబుట్టముల్"

ఆనాటిజనులకు రంగువస్త్రములు ధరించుటలో నపేక్ష యెక్కువగ నుండెడిది. టీకవారు అంచులువేయబడిన చీరెలు, సామాన్యులు నూలుజరీచీరెలు, గొప్పవారు, జరిపట్టుచీరెలు కట్టుచుండిరి. నాజూకుగలవారు సన్ననిబట్టలు మోటవారు ముతకబట్టలు కట్టుచుండిరి.

అలంకారములు

ఆడుమగభేదము లేకయే జనసామాన్యమా కాలమున ననేక భూషణములను ధరించుచుండెను. మెడకుగొలుసు, చేతికి మురుగులు, కాలికి కడియములు, చెవుల కంటుపోగులు, జనులందరిచేత వాడబడెడివి. మగవారు నడుమును పట్టాలతో

బిగించుచుండిరి. స్త్రీలు ప్రత్యేకముగ ముక్కుపోగులు, కమ్మలు వడ్డాణము మొదలగు స్త్రీలయాభరణములు వాడుచుండెడివారు. ఆకాలమున మగవారు ధరించెడు వస్తువులలో గండపెండేర మొకటి. మొట్టమొదట నీపెండేరమును రాజులు ప్రసిద్ధపురుషులకు బహూకరించెడువారు. రాయలవారు అల్లసాని పెద్దన మహాకవీశ్వరునికి

"ఎదురైన కవిగండపెండేరమున కీవె తగుదని తానపాదమునఁదొడిగె"

రానురాను పెండేరము ప్రతివారు నుపయోగించెడువారు. అయితే దీని నొక్కచేతికి మోచేతికి పైన నుంచుకొనెడువారు.

సుగంధద్రవ్యములు

సుగంధద్రవ్యములయందు జనుల కెల్లకాలములందు ప్రీతి యెక్కువ యని చెప్పనక్కరలేదు. ఆకాలమునను జనుల కా సుగంధద్రవ్యముల యందు ప్రీతి మెండుగనుండెను. భాగ్యవంతులు వీటిని విరివిగ వాడుచుండెడివారు. కర్పూరము కస్తూరి, సంకుమదము, గంధమున మిళితము జేసి దేహమునకు పూసికొనుట సామాన్యముగ జరుగుచుండెడిది. అగరుసాంబ్రాణి ధూపమునకై యుపయోగింపబడెడివి. కుంకుమ కస్తూరి స్త్రీలచే సామాన్యముగ నుపయోగింపబడెడివి. పన్నీరును తోలుసంచులలో బోసి యింటినిండ చల్లెడువారు. మృగమదము జవ్వాది మొదలయిన సువాసనద్రవ్యములను దేహమున కలపుకొనెడువారు. ఇంటివాకిళ్లయందు చందనమునీటితో కలయంపి చల్లెడువారు.

పుష్పములు

అనేకవిధములైన సువాసనగలపుష్పములను తోటలు పెంచి వాటిని తెప్పించి హారములుగఁగట్టి స్త్రీపురుషులనియు చిన్నపెద్దలనియు భేదములేక ప్రతివారు నుపయోగించుచుండిరి. కమలము, గులాబి, మల్లె, జాజి, విరజాజి, చంపకము, కేతకి, మొగలి మొదలయినపూవులచెట్లను విరివిగ పెంచుచుండెడివారు. ఈపుష్పములను స్త్రీలు పురుషులు తమతలల జుత్తునందు ముడుచుకొనెడివారు. ద్వారములకు పూలమాలలు వ్రేలాడవేయువారు. పురమున నీపుష్పములు విరివిగ స్త్రీలచే విక్రయింపఁబడెడివి.

తాంబూలము

తాంబూలమును సేవించనివా రాకాలమున లేరనియే చెప్పవచ్చును. వక్క తమలపాకు సున్నము ప్రతివారు నుపయోగించెడువారు. డబ్బుగలవారు లవంగము, యాలకులు, జాపత్రి, జాజికాయ నుపయోగించెడివారు. ఇంటికి వచ్చినవారి కెల్లరకు నీతాంబూలము నిచ్చుట సామాన్య మర్యాదయైయుండెను. తాంబూలము జీర్ణకోశమును సరియగు స్థితిలో నుంచును. అబ్దుల్‌రజాకను చరిత్రకారుఁడు దీనినిఁగూర్చి వ్రాయుచు తాంబూల మాఁకలిసాపఁగలదనియు జీర్ణకోశము నభివృద్ధిఁజేయుననియు, నోటికి సువాసనకలిగించుననియు, పంటిని గట్టిపఱచుననియు వ్రాసియుండెను. తాంబూల మిచ్చుట మర్యాదసూచకము రాజులు తాంబూలదానమిచ్చుట మిక్కిలి గౌరవచిహ్నము.

శయనము

ఉయ్యెలలు పడక కుపయోగింపఁబడెడివి. అయితే ఈయుయ్యెలలు గొప్పవారుమాత్రమే నుపయోగించెడివారు. ఉయ్యెలలకు బంగారుగొలుసులుగాని వెండిగొలుసులుగాని యుండెడివి. జనానాలోని స్త్రీలీయుయ్యెలలో నూగుచు నిద్రించుచుండెడివారు. తోఁటలలో చెట్ల కుయ్యెలమంచములు వ్రేలాడగట్టబడి కాముకీకాముకులచే నుపయోగింపఁబడుచుండెడివి.

ఉయ్యెలమంచములుగాక సామాన్యమంచములుకూడ నుండెడివి. రాయలవా రుపయోగించెడిమంచము వసుచరిత్రమున భట్టుమూర్తిచే నీక్రిందిపద్యమున వర్ణింపఁబడిన మంచమునుఁబోలియుండు నని మన మూహింపవచ్చును.

"మొలక మెఱుంగు కెంపు మొనముక్కు కిరీటిపచ్చరా
చిలుకతకోళ్లతోఁ జిలికి చంద్రిక కన్నియపట్టుకట్టితో
తొలఁక పసిండి వ్రాలతెలితో మెఱుఁగారు పువుమేలుకట్టుతోఁ
జెలువలు చిందుముత్తియపు చప్పరమంచము పై మహోన్నతిన్.

ఈమంచపుకోళ్లు వెండి, బంగారు లేక దంతముతో వారివారి శక్తినిఁబట్టి చేయించుకొనఁబడెడివి. రాయలమంచమునకు నవరత్నములుకూడ నుండినట్లు చరిత్రకారులు వ్రాసియున్నారు. యుద్ధమునకుగాని మరియితరమైన పనికిగాని పరాయిగ్రామము వెళ్లుట తటస్థించినచో మంచముగ తయారుచేయుటకు తగిన యినుపముక్కలను పెట్టెలలో పెట్టి తీసికొనివెళ్లి అప్పటికప్పుడా ముక్కలను బిగించి మంచము తయారుచేసెడివారు.

ఈ మంచములపైన "పలు తెఱంగుల పట్టుతలగడబిల్లలు ముత్యంబు కుంకుమపువ్వుపఱుపులు" వేయఁబడెడివి. ఇట్టిపాన్పులుగాక కామకేళీకాముకులకు చిగురుపాన్పులు పూఁబాన్పులు హంసతూలికాతల్పము లుండెడివి. ఈ మంచములకు దోమతెఱలు కట్టుటకు కూడ నేర్పాట్లుండెడివి. చలికాలమునందు మంచముల క్రింద నిప్పుకుంపట్లు పెట్టుకొనెడివారు.

ఈపైన వివరించిన రీతిగ రాజులు వారిమంత్రులు పెద్ద అధికారులు ననుభవించెడివారు. సామాన్యు లింత విలువగల్గిన వస్తువులు కాకున్న నీపోలికగల తక్కువవిలువగల వస్తువులను వాడుచుండెడివారు. కేవల బీదలు శ్రీనాథకవి వ్రాసినట్లు నులకమంచపుగుక్కితో కాలముగడిపెడువారు.

స్నానము

హిందువులకు స్నానముచేయుట ముఖ్యవిధులలో నొకటి. బ్రాహ్మణులు దినమునకు రెండుమూఁడుమారులు స్నానము జేసినను తదితరజాతివారు దినమున కొకసారియైనను దేశస్థితి ననుసరించి స్నానముఁ జేసెడివారు. వీలునుబట్టి వేడినీళ్లనుగాని చలినీళ్లనుగాని స్నానముచేయుదురు. వారమున కొకసారియైనను తలఁటుకొనుట లేక యభ్యంగస్నానము జేయుదురు. రాయలవారు ప్రతిదినము భోజనమునకు పూర్వ మభ్యంగస్నానముఁ జేయుచుండినట్లు చరిత్రకారులు వ్రాసియుండిరి. సామాన్యజనులందరు తలంటుకొని నూనెజిడ్డు పోవుటకు పాడినలుగు పెట్టుకొని యింట వేడినీటియందు గాని చన్నీళ్లయందుగాని లేక కాలువలయందుగాని స్నానముచేసెడివారు. ఈ అభ్యంగస్నానము సామాన్యజనులందరు నలవాటు

పడియున్నందున, వారిపాకార్యార్థము అంగళ్లుండిన ట్లాముక్తమాల్యదలో వ్రాయబడిన నీక్రిందిపద్యభాగమువలన తెలియ నగును.

"కూర్చంబు గొరిగించుకొని యుష్ణతోయంపు,
టంగడిఁ దలఁగడుగాడు కడవు.

రాజులు వారిగొప్పయధికారులు కొలనులలో జలక్రీడలు సల్పెడివారు. పురుషులు స్త్రీలు కలిసి జలక్రీడలు సల్పుదురు. ఇట్లు జరుపుటకు పూర్వము స్త్రీలు తమ

"తొడవులటు పెట్టి వలిపావడలుగట్టి శృంగములు పట్టినీరాడ"

జేరుదురు మరియు నా జలక్రీడలలో

"చిగురంజెమ్మనఁ గ్రోవిలో నొకతె రాజీవాననం బెంచి పై"

నిగుడించెననియు

"బంగరుకొమ్ముపూని యొక ప్రౌఢ రయంబున నీరు"

చల్లెననియు కవులు వ్రాసియుండిరి. ఈరీతిగ జలక్రీడలు సల్పి నీటియందు దాగుడుమూతల నాడి మిక్కిలి డస్సినవారై స్త్రీపురుషులు గృహోన్ముఖు లయ్యెడివారు.

భోజనము

గొప్పవారికి బీదవారికి నుపయోగించెడు ఆహారపదార్థము బియ్యము. ఇందులో తెల్లబియ్యము గొప్పవారు నల్లబియ్యము బీదవారు వాడుకొనెడివారు. తెల్లబియ్యములో రాజనాలుధాన్యము రాజులువాడెడివారు. కొరకలు గోధుమ లుపయోగించుకొనెడివారు. రెడ్లు వ్యవసాయదారులు చోళం,

అరిగెలు, రాగి, భోజనము చేసెడువారు. కంది, పెసర మినప, శెనగ పప్పులు జనమంతయు నుపయోగించెడివారు.

మాంసభక్షకులు గొఱ్ఱెమాంసము, పందిమాంసము, పావురాళ్లు, కుందేళ్లు, లేళ్లు, అనేకవిధములైన పక్షులను, భక్షించెడువారు. మామిడిపిందెలతో కూడిన మత్స్యాన్నమును రాయలవారు భుజించెడువారు. బజారునందు పిచ్చుకలు ఎలుకలు, పిల్లులు, తొండలు, బల్లులు, కూడ విక్రయింపఁబడుచుండెడివి. వీటినికూడ తినియుందురేమో? వెనుకటిదినము తయారుచేయఁబడిన "హయ్యంగవీనము" హెచ్చుగనుపయోగించెడువారని రాయలవారే వ్రాసియుండిరి. ఆకాలమున మిరపకాయ లునటలేనట్లు కనుపించుచున్నది. మిరియములనే యుపయోగించెడువారు. మామిడిపండ్లు, పనసలు, ద్రాక్ష, దోస, అరఁటి వగైరా పండ్ల నుపయోగించెడివారు.

పానీయములు

సామాన్యజనులకు నీరు, మజ్జిగతో కల్పిననీరు, బెల్లము గాని చక్కెరగాని కల్పినపానకము, ముఖ్యములైనపానీయములు. చెఱకురస మింకొకసామాన్యపానీయము. కొబ్బరినీళ్లతో కలిపినచెఱకురస మెండకాలమున విక్రయించబడెడిది. కొబ్బరికాయలలోనినీరు చల్లగనుండుటకు తోటలలో నిసుక తిన్నెలక్రింద చెట్లనీడలనుంచెడివారు. ఈపానీయములన్నియు సమస్తజనులకు లభ్యమగునవి.

గొప్పవారైన స్త్రీపురుషులు హెచ్చుగ మద్యపానము చేయుచుండెడివారు. వీరుపయోగించెడిమద్యము నారికేళము నుండితయారుచేయఁబడిన పానీయము. సామాన్యజనులు పాన

శాలలకుఁబోయి పానీయము సేవించిన గొప్పవారు రహస్యముగ తెప్పించుకొని తమయింటనే వాడుచుండెడివారు. గొప్పవారు భోజనసమయమున మాంసముతో తయారుఁజేయబడిన మంచి యుపదంశనంబులతో మద్యపాత్రముల నుంచెడువారు. పుష్పాసవము, తాలమధు, ఐక్షవము, మదిరారస, ద్రాక్షాసవము మొదలయినవి సామాన్యముగ నుపయోగింపఁబడెడి మధుపానీయములు. ఈపానీయములు సేవించువారు రాత్రులయందు

"మండలాకృతిఁగూర్చుండి మంచి దనుచు
గుక్కగుక్కకు తలలూచుకొనుచు కొసరి
కొసరి కండించి చూపుచు నవ్వియవ్వి,
త్రావఁ దొడఁగిరి యుల్లాసరసములోడ."

స్త్రీలు విచ్చలవిడిగ మధుసేవనము చేసెడివారని సమకాలికుఁడగు నొకకవివ్రాయుచు వారిస్థితి నిట్లు వర్ణించి యుండెను. కొందరుస్త్రీలు ధరపై బడువరకు త్రాగెడువారు. మరికొందరర్థోక్తులు బలుకుదురు. కొందరు పకపకనవ్వువారు. కొందరు చిరుబూతులాడువారు. మరికొందరు పారావతంబులబోలి సిగ్గరుగక కులుకువారు. మరికొందరు మొలకోకలూడఁగ దివుచువారు. ఇట్లంతయు లోలోన జనానాలలో జరుగుచుండుటవలన లోకసామాన్యమునకు తెలియకుండెడిది.

స్త్రీలు

ఆరోజులలో సామాన్యస్త్రీలనుగురించి మనకు హెచ్చుగ తెలియుటలేదు. గొప్పవారిజనానాలలో నుండువారియొక్కయు, కులాసాగా తిరిగెడుస్త్రీలను గురించియు మాత్రము కవులు వ్రాసియుండిరి. మొత్తముమీద స్త్రీలాకాలమున మగవారి

కాటపాత్రలుగనుండిన ట్లూహించవలసియున్నది. వీరికివ్రాయను చదువను తెలిసియుండెడిది. చాలమంది సంగీతము నాట్యము నేర్చియుండెడివారు. నాట్యముచేయుటకు నాట్యశాలలుండెడివి. గొప్పవారిస్త్రీలందరు జనానాలలో నుండెడివారు. వారు ఇచ్చవచ్చినట్లు బయట తిరిగెడువారు కారు. రజస్వలయగుటకు పూర్వమె పిల్లలకువివాహములు జరుగుచుండెడివి. పిల్లలకిష్టమైన వరుని కిచ్చివివాహముచేయు నాచారములేదు. అందువలన

"కలకాల మొక్కగతిబూ, సలతో దారంబుమాడ్కి సతిమదిలోనన్
మెలగడుపురుషులు గలుగుట, తొలిజన్మము నోముఫలము తోయజనేత్రా."

భార్యకు

"పతిప్రాణసదృశబంధువు, పతి దైవం బేడుగడ."

పిల్లలవివాహ మతివైభవముతో జరుపబడెడిది. సామాన్యముగ పిల్లయొక్క తల్లిదండ్రులయిండ్లలోనే వివాహములు జరుగుచుండెడివి. బ్రాహ్మణులలో పిల్లవానితండ్రులనుండి పిల్ల బంధువులకరణము లివ్వవలసియుండెడిది. బ్రాహ్మణేతరులలో పిల్లతల్లిదండ్రులు పిల్లవానిబంధువులకు తగినబహుమానములు చేయవలసియుండెను. మొత్తముమీద

"పతికిమారుమాటాడక పలుమారు సేద్యక, యలుగక మిగులగయ్యాళిగాక
తను దిట్టికొనక కాతాళించి గొణగక, మచ్చిలించక పాపమునకు జొరక."

కాపురముచేయుభార్య దొరికెనేని పురుషుం డదృష్టవంతుం డని యెంచవచ్చును.

"పతికొట్టిన పతిదిట్టిన, బతినిర్దయుడగుచు నెట్టిపాటుం బరచినన్,
మతివన్యభావ్యమొందరు, పతులే దేవతలు పతులప్రాణసదృశులున్."

ఈస్థితిలో నాడువారిని కట్టుదిట్టము చేసినందున వారు సతీధర్మము నాచరించుచుండెడివారు. ధర్మపత్నీత్వమును వెలిబుచ్చుటకై స్త్రీలు భర్తలతో తమప్రాణములనువదలి వారితో నిర్భయముగ చితిపై నెక్కి సహగమనముచేసెడివారు. భర్తతో సహగమనము చేయ నిష్టపడనిభార్యలను బంధువులు మోసము చేసి చితిపై బలవంతముగ తగులబెట్టుటయు నాకాలమున జరుగుచుండెడిది.

భోగస్త్రీలు

భోగస్త్రీలు ప్రత్యేకవర్గముగ జీవించెడువారు. వీరి వృత్తియు నాకాలమున మర్యాదగలవృత్తిగనే యెంచబడెడిది. ఆనాడువ్రాయబడిన ప్రబంధములలో వీరినిగూర్చి మర్యాదతో వ్రాయుటయేగాక సంఘజీవనమున వీరికి హెచ్చు ప్రాముఖ్యత నిచ్చినట్లుకూడ వ్రాసియుండిరి. ఈజాతిలోనిపిల్లలకు చక్కగ చదువుచెప్పించి సంగీతమును నాట్యమును నేర్పించెడువారు. వారు సంస్కృతమునందును దేశభాషయందును విద్యనభ్యసించెడువారు. ఆపడుచుపిల్లలకు కలనాద, పరవాదిని వీణె మొదలయినగానయంత్రములతో పాడుట నేర్పించెడువారు. ఈకులములోనిపిల్లలకు చక్కదనమే ముఖ్యము కాదు. సాహిత్యసంగీతములు, చమత్కారముతో మాట్లాడుట, వచ్చినవారిని వచ్చినట్లు తమవలలో వేసికొనుట కవసరమగు విద్యలన్నియు నేర్చియుండవలెను. సాహిత్యము పనికిరానిచో సరససంగీతము చేత ప్రీతిగల్గింప నేర్చియుండవలెను. సంగీతవైఖరి సమ్మతించనిచో వీణయందు నేర్పరితనము జూపవలెను. వీణ వెగటుగ దోచినపుడు పొగటాలయాట నేర్చియుండవలెను. పొగటాలపై

వేడ్క లేనపుడు వింతమాటలు చెప్పవలయును. అందువలన సాజాతియందలి స్త్రీలు "చదువ నాడంగ"

చతురలుగా నుండవలయును. "వీణవాయింప" జాణగ నుండవలయును. జూదమాడంగ జాణగనుండవలయును. పల్కంగ మిక్కిలి ప్రౌఢగనుండవలయు. వారివారిచాతుర్యము వలన వచ్చినవారిని సంతుష్టిపఱచి తమ ప్రతిభను ప్రఖ్యాతము చేయవలెను.

భోగస్త్రీలపిల్లలకు రజస్వలలయినంతనే "కన్నెరికము" చేయించవలెను. కన్నెరికముగునంతవరకు వారిని వృత్తిలోనికి దించకూడదు. సామాన్యముగ నీకన్నెరికమును పెట్టుటకెవరో కలంతుబడిగల్గిన పెద్దమనిషి సిద్ధముగ నుండెడువాఁడు. దీనికగు ఖర్చంతయు నాతఁడే భరించును. ఈకన్నెరికమున్న వివాహము వంటిదే. కన్నెరికము పెట్టినంతమాత్రమున నీకన్య ఆపెద్దమనిషికి స్వాధీనురాలు కాదు. ఈవృత్తికిని పెక్కుహక్కులును బాధ్యతలు నుండెడివి.

వీరిలో కొందరు దేవతాగృహముల కంకితము చేయఁబడెడివారు. అట్టివారు ప్రతిదినము దేవునియెదుట నృత్యముఁ జేయవలెను. ఇట్లంకితము చేయఁబడినవారికి దేవదాసీ మాన్యము లుండెడివి. దేవదాసీమాన్యములను వీరు తరతరముల ననుభవించవచ్చును.

రాజధానియందు నివసించెడి దేవదాసీలు ప్రతిశని వారము రాజుగారు పూజచేసెడి దేవునిగృహమున నృత్యము చేయు నాచారముకలదు. మహర్నవమి యుత్సవసమయమున

తనరాజ్యమునందున్న భోగస్త్రీలందరు రాజభవనమునకువచ్చి దసరాయుత్సవములలో పాల్గొనవలసియుండెను.

భోగస్త్రీలలో ననేకులు మిక్కిలి ద్రవ్యవంతులు. ఈవృత్తియందు జనుల కా కాలమున మంచిమర్యాద యుండెడిది. గొప్పవారు, పెద్దయుద్యోగస్థులు, నీభోగస్త్రీలకై కాంక్షించుచుండెడివారు. రాజులు రాజోద్యోగియులు భోగస్త్రీలయిండ్లకు తమంతటతామే పోయెడువారు. రాజాంతఃపురమునకు బోవుట కీభోగస్త్రీలకు హక్కుగలదు. పెద్దయుద్ధములు జరుగునపుడు రాజులవెంట భోగస్త్రీలు వెళ్లెడివారు. రాజగుడారము నందు రాజోద్యోగియులగుడారములందు నీభోగస్త్రీ లుండెడి వారు. యుద్ధసమయమున గుడారములువేయునపుడు వేశ్యా వాటికలు తయారుచేయబడెడివి. కొందరు వేశ్యల కాయుద్ధ సమయమున రాజకోశమునుండి జీతములుకూడ నిచ్చెడి యాచారము కలదు. భోగస్త్రీల సముఖమున సైనికులు మిక్కిలి యుత్సాహముతో యుద్ధముచేసెడివారు.

ప్రతివేశ్యయింట నొకవేశ్యమాత యుండుట సాంప్రదాయమైయున్నది. వేశ్యలు తమకై వచ్చెడివారిచే మోసగింపఁ బడకుండుటకు నీవేశ్యమాతలు కనిపెట్టియుండెడివారు. కాని వేశ్యమాతల దుర్నయము లింతింత యని చెప్పుటకు వీలులేదు. వీరిని తిట్టనివిటుఁడుగాని కవిగాని లేఁడనియే చెప్పవచ్చును.

విద్య

ప్రభుత్వము విద్యకై హెచ్చుగ ఖర్చుపెట్టినట్లు కనబడదు. మఠములలో మఠాధిపతులు శిష్యకోటికి విద్య చెప్పిం

చెడివారు. కాని అచట చెప్పఁబడెడి విద్య ముఖ్యముగ మతవిషయైకవిద్య. ఇదిగాక రాయలవారు బహూకరించిన యగ్రహారములలోని బ్రాహ్మణబాలుర కగ్రహారీకులు విద్యఁ జెప్పించెడివారు. వారివద్ద జదువుకొనువారు హెచ్చుమంది బ్రాహ్మణులే అయియుండిరి. వీరుగాక బ్రాహ్మణేతరులుకూడ జదువుచుండెడివారేగాని వారిసంఖ్య బహుస్వల్పము. అగ్రహారములు దానమిచ్చునపుడే దానపత్రికలయందు విద్యగఱపుటయు నొకవిధిగ విధించఁబడెడిది. ఈయగ్రహారీకులవద్ద విద్యనేర్చుకొనుశిష్యకోటి కుచితముగ భోజనమును నేర్పాటుగావించి విద్యనేర్పుచుండెడివారు.

"సరసాహారము లింటఁ బెట్టి బహుశిష్యశ్రేణికిన్ దెల్పఁగా,
స్వరహస్యస్థితిచెప్పు నధ్యయనసంధ్యల్ హవ్యకవ్యంబులన్."

వైష్ణవగురువులు బ్రాహ్మణేతరుల కనేకులకు సంస్కృత విద్య చెప్పినట్లును వారిచే సంస్కృతకావ్యములవ్రాయించినట్లును కనబడుచున్నది.

గురువులవద్ద జదువుకొన్న శిష్యులకు వేదములు శాస్త్రములు పురాణములు ఇతిహాసములు కావ్యములు నాటకములు నేర్పుచుండెడివారు. ఇవిగాక ఆయుర్వేదముకూడ నేర్పెడువారు. గురువులవద్ద శిక్షనభ్యసించినవా రనేకులు వారివారి ప్రతిభనుబట్టి రాజసన్మానమును పొందెడివారు. మరికొందరు తమతమగ్రామములలో నివాసమునుండి తమజీవయాత్రను గడుపుచుండెడివారు. ఇట్లు గురువులవద్ద విద్యనభ్యసించినవారు గ్రంథకర్తలై నాటకములనువ్రాసి ప్రఖ్యాతి వహించినవా రుండిరి.

సర్వసామాన్యముగ, తల్లిదండ్రులు తమపిల్లలకు విద్య నేర్పించి వారికి ప్రభుత్వోద్యోగములకు పనికివచ్చెడిగణిత విద్యను నేర్పెడువారు. అట్లు విద్యనేర్చినవారు ప్రభుత్వోద్యోగములలో కరణములుగ బ్రవేశించి రాయసములుగను అవసారికలుగను మరికొందరు దుర్గాధిపతులుగ నుండెడివారు.

వినోదములు

ఆకాలమున నాటకములు మెండుగ నుండెడివి. ఆనాటి వాఙ్మయమునం దీనాటక ప్రదర్శనములు, నర్తకీనర్తకులవిషయములు, పాత్రధారులచరిత్రలు విశేషముగనుండెడివి. 1514-వ సంవత్సరపు శాసనమునందు "కాయికొండనాటక" ప్రదర్శనములో ప్రఖ్యాతిగణించిన "నత్తువనాగయ్య" యను వేషధారిపే రుదహరింపఁబడినది. ఆశాసనమునందే పోతవరగ్రామ కాపరస్థుఁడగు నత్తువతిమ్మయకుమార్తె వేషధారిగనుండి ప్రఖ్యాతివడసినట్లు వ్రాయఁబడియుండెను. ప్రభావతీ ప్రద్యుమ్న ప్రబంధమునందు నాటక ప్రశంస హెచ్చుగ వ్రాయఁబడియుండెను. మనుచరిత్రమునందును వసుచరిత్రమునందును నాటకశాలలు గుర్తింపఁబడియుండెను.

ఆకాలమున సంస్కృతనాటక ప్రదర్శనము లుండెడివి. కాని యీనాటకములు పండితజనమునకేగాని పామరుల కంతగ రుచించెడివి కావు. రాయలవారు వ్రాసిన జాంబవతీకళ్యాణము నాటకము పలుమారు ప్రదర్శింపఁబడుచుండెను.

దేశభాషలలో యక్షగానములు చూపఁబడెడివి. ఈయక్షగానములు సంగీతప్రధానమైనవి. గాత్రపాటతోపాటు వీణె మృదంగము కూడ నుపయోగింపఁబడెడివి. ఈయక్షగానమున

"తాయికొండనాటకము" "గంగావతరణ"మను నాటకములు ప్రదర్శింపబడెడివి. ఈయక్షగానములు సామాన్యముగ భోగము వాండ్రచే నూరూర ప్రదర్శింపబడెడివి. వీరిలో పదిమంది కలిసి మేళముగ నేర్పడి యూరూరుతిరుగుచుండెడివారు. వీరిలో నటకులు, గాయకులు, నర్తకులుకూడ నుండెడివారు. ఉత్సవసమయములలోగాని జాతరలసమయములలోగాని యీనాటకములు ప్రదర్శింపఁబడెడివి. వీరినాటకశాలకు తెర ముందుండెడిది. తెరలోనుండి ప్రదర్శకులు బయటకు వచ్చి నాటకములాడెడివారు, కొండలు, నదులు, అడవులు, మృగములను ప్రదర్శించునపుడు స్వభావసిద్ధముగను, సహజముగను నుండునట్లు ప్రదర్శించెడివారు. వేషకులు వారు ప్రదర్శించు వేషమునకు తగినదుస్తులను, అలంకారములను, భూషణములను ధరించెడువారు. నగలు చెక్కతో తయారుచేసి బంగారమువలె కనుపడఁటకు రంగువేసికొనెడివారు.

వాద్యముల శ్రుతితో, స్త్రీలుపాడెడుపాటలతో ప్రదర్శనములు ప్రారంభింపబడెడివి. ఈపాట పూర్తియగునంతనె సూత్రధారుఁడు వచ్చి రానున్నకథనుగూర్చియు నటకులనుగూర్చియు నాంది ప్రేక్షకులకు వినిపించెడివారు. అటుపిమ్మట ప్రదర్శకు లొకరివెనుక నొకరువచ్చి వారివారిపాత్రలను బహురమ్యముగ ప్రదర్శించెడివారు.

ఈ మేళములలో ప్రసిద్ధిచెందిన మేళములను రాయలవారు తమసభకు రప్పించి తమజనానావద్ద తమయొక్కయు తమవద్దనున్న యధికారులయొక్కయు సముఖమున ప్రదర్శింపించెడివారు. వీరి ప్రదర్శనాకౌశలము వీరితోనే నశించినట్లు

కనుపించుచున్నది. ఈ ప్రదర్శకులలో ప్రసిద్ధనటీనటులపేర్లు మన కానాటిసాహిత్యమువలన తెలియుచున్నవి. వెండిలినాగి బుచ్చిగాడు సత్తువనాగయ్యయు నాటి ప్రఖ్యాతనటీనటులై యున్నట్లు మన కీ ప్రబంధములవలన తెలియుచున్నది.

పైనచెప్పిన యక్షగానప్రదర్శనములుగాక తోలుబొమ్మలాట లానాడు ప్రబలియుండెడివి. ఈబొమ్మలాటలు రాత్రులయందు పెద్దమైదానములందు తాత్కాలికముగ నేర్పాటుచేసిన పందిరికింద నాడబడెడివి. పందిరికిముందు తెరకట్టబడియుండును. మిగిలిన మూఁడువైపులు తడికలతో మూసివేయఁబడియుండును. దీపపువెల్తురు నాతెరమీదకు ప్రదర్శించి వెనుకనుండి తోలుబొమ్మలనీడల నాతెరమీద కనఁబడునట్లుచేసి బొమ్మలనాడించి లోపలనుండి పాటలుపాడియు సంభాషణములు చేసియు జనుల సంతోషపెట్టుచుండెడివారు. సంభాషణచేసెడువాడు ప్రసంగి. సంగీతముపాడెడువాడు సాధకుడు. ఈప్రదర్శనములు తెల్లవారువరకును జరుగుచుండెడివి.

దొమ్మరులు విప్రవినోదులు జనులకు కొంతకాలక్షేపము గల్గించుచుండెడివారు. వీరు ప్రతిసంవత్సరము ప్రతిగ్రామమునకుపోయి తమతమవిద్యలను ప్రజలకు ప్రదర్శించి వారివలన వార్షికములు పొందెడివారు. దొమ్మరవాండ్రాటలలో కాడుపైనడచుట మిక్కిలి వినోదమును ఆశ్చర్యమును కలిగించెడివి. ఇందు గొప్పచతురత చూపించెడివారు. వీరిలో ప్రసిద్ధులు రాయలవారిసముఖమునగూడ తమచతురతను నైపుణ్యమును ప్రదర్శించి వారిచే మర్యాదలు పొందెడివారు.

సామాన్యజనులకు కోడిపందెములలో నుత్సాహము మెండుగ నుండెను. కానికట్టి కత్తివాల్చి కోళ్లుపోరాడుచున్నప్పుడు పైపందెములు పెట్టి జనులు చూచి సంతోషించెడివారు. ఈపందెము నగరములయందుకన్న గ్రామములందు హెచ్చుగ నుండెను.

గుఱ్ఱములపై నెక్కి రాత్రివేళల సిపాయిగణమువలె కన బడుబంతులను పెద్దకఱ్ఱలతో కొట్టి "పోలో" యనునాటను బోలియుండెడి ఆటను రాజు లాడుచుండెడువారు. ఈ ఆట తురకసైనికు లాడుచుండెడివారు. వారివద్దనుండి నేర్చుకొని కృష్ణదేవరాయలవారికాలమున వారిసైనికులు సైన్యాధికారు లీయాట నాడుచుండెడివారు.

జంతువులను వేటాడుటలో నాకాలమున రాజులకు రాజవంశమువారికి ప్రభుత్వ ఉద్యోగులలో ముఖ్యులకు మిక్కిలి యుత్సాహముండెడిది.

గొప్పవారు చదరంగము పావులతో జూదమాడుట మొదలయిన ఆటలలో శ్రద్ధవహించెడువారు. రాయలవారు చదరంగ మాడుటలో ప్రసిద్ధనైపుణ్యమును గలిగియుండెను. ఆకాలమున మిక్కిలి చతురతతో నాడెడు కొడ్డుచర్లతిమ్మన్న గారితో రాయలవా రీయాటనాడి ఓడిపోయెడువారు. ఈచదరంగమున "చిన్నతమ్మన్న అనే ఆయన కవీశ్వరదిగ్దంతి అనిపించుకొని కృష్ణరాయలవారియొద్దకు బోయి చదరంగమాడుతూ ఉండేవాడున్ను, ఆటగెలిస్తే వెయ్యార్లు పందెంవేసి గెలుస్తూ ఉండేవాడున్ను అప్పుడు కృష్ణదేవమహారాయలు చాలా

సంతోషించి కొప్పోలుగ్రామం సర్వాగ్రహారంగా ధార వోసి"యిచ్చెను.

22. రాయలవారు: సాహిత్యము

దక్షిణహిందూదేశమునందు పదునాఱవశతాబ్దము సాహిత్యమునందు మిక్కిలి ప్రఖ్యాతిఁగాంచినది. రాయలవారురాజ్యము చేసినకాలమున దేశభాషయందు సాహిత్యమునకు హెచ్చుగ ప్రోత్సాహముగలిగెను. రాయలవారు గొప్పకవి, గాయకుఁడు, విద్యావంతుఁడు, వేదాంతియై యుండి, తనచుట్టు గొప్పకవులను, గాయకులను, విద్యావంతులను, వేదాంతులను రాబట్టెను. వారిని మర్యాదచేసి వారికై చాలద్రవ్యమును వెచ్చించి వారితో వాదములు చర్చలు సాగించెను. విద్వత్సభల నేర్పాటుచేసి తన పాండిత్యమును ప్రదర్శించి, ఇతరపండితుల పాండిత్యమునకు వారిని బహూకరించెను. ఈపండితులను, గాయకులను, తాను గ్రామాంతరములకు వెళ్లినపుడు యుద్ధములకుఁబోయినపుడు తనవెంటతీసికొని వెళ్లుచుండెను. అన్నిభాషలయందలి సాహిత్యములయందు తనకు ప్రీతియుండినను తెనుగుభాషయందు మిక్కిలి ప్రీతినిఁ జూపించెను. తెనుఁగుభాషయందు పరిషత్తు నేర్పాటుచేసి అష్టదిగ్గజముల రాబట్టి తానే పరిషత్సభాధిపత్యము వహించియుండెను. పండితులు, కవులు, గాయకులు, తీర్థప్రజవలె రాయలవారివద్దకు వచ్చుచుండెడివారు.

సంస్కృతము

సంస్కృతభాషయందు ప్రాచీనకవులలో కృష్ణరాయలే ప్రథమకవి. వీరు సంస్కృతభాషలో "మదాలసచరిత్ర" "సత్య

వధూప్రీణనము" "సకలకథాసారసంగ్రహము" "జ్ఞానచింతామణి" "రసమంజరి" యను గ్రంథములను వ్రాసియున్నట్లుగా ఆముక్తమాల్యదలో చెప్పిరి. గాని యీపుస్తకము లిప్పుడు దొరకుటలేదు. వీరు వ్రాసిన "జాంబవతీకల్యాణము" అనునాటకముయొక్క వ్రాతప్రతి యిప్పుడున్నట్లు తెలియుచున్నది.

రాయలవారి కాలమున కొండవీడు వాస్తవ్యుఁడు లోలలక్ష్మీధరుఁడను వైదికవిద్వాంసుఁడు రాయలసభలోనుండి "సరస్వతీవిలాస"మను నొకగ్రంథమును వ్రాసియుండెను. లోలలక్ష్మీధరుఁడు రాయలసభకు రాకపూర్వము గజపతిరాజువద్దనుండెను.

గజపతిరాజువద్దనుండి లక్ష్మీనారాయణ యను నింకొక సంగీతబ్రాహ్మణుఁడు వచ్చియుండెను. వీరిని రాయలవారు తమ అంతఃపురములోని స్త్రీలకు సంగీతము నేర్పింప నియమించియుండిరి. ఈసంగీతవిద్వాంసుఁడైన లక్ష్మీనారాయణ "సంగీతసూర్యోదయ"మను గ్రంథమును వ్రాసియుండెను. రాయలవారు మధ్వగురువైన రాఘవేంద్రునిపూర్వీకులలో నొకరగు కృష్ణునివద్ద సంగీతవిద్యను నేర్చుకొనిరి.

సాళువతిమ్మరసు, వారి మేనల్లుఁడు నాదెండ్ల గోపమంత్రియు గొప్పసంస్కృతపండితులై యుండిరి. వీరిలో మంత్రి తిమ్మరసు అగస్త్యనిబాలభారతమునకు వ్యాఖ్యానమును గోపమంత్రి ప్రబోధచంద్రోదయ మను నాటకమునకు వ్యాఖ్యానమును వ్రాసియుండిరి. గోపమంత్రి గ్రంథకర్తయేగాక ప్రసిద్ధకవులను గౌరవించుచుండెడివారు. తాను కొండవీడులో నధికారమున నుండునపుడు మాదయ్యగారిమల్లన్నను, సుప్రసిద్ధ తెనాలిరామకృష్ణకవిని దగ్గఱకు రావించి మిక్కిలి గౌరవించెను.

మతగురువులును రాయలసభకు వచ్చి రాయలసభలో చర్చలుగావించి కీర్తిఁబొందెడివారు. మతసంస్కర్తయగు వల్లభాచార్యుఁడు జైనమతస్థుఁడైన అభినవవాది విద్యానందుఁడు నిట్టి చర్చలలో పాల్గొని రాయలసభలోని పండితుల నోడించిరి. రాయలకాలములో చైతన్యుఁడుకూడ వచ్చినట్లు తెలియవచ్చుచున్నది. రాయలవారికాలమున వ్యాసతీర్థులవారు మతమును గూర్చియు తర్కశాస్త్రమునుగూర్చియు న్యాయశాస్త్రమును గూర్చియు "తర్కతాండవన్యాయామృతము" "సుధ" "మందారమంజరి" "మధ్వతాత్పర్యచంద్రిక" యను గ్రంథములను వ్రాసెను.

అరవము:—రాయలవారి పండితసన్మానము దేశమంతటను వ్యాపింపగ, పరదేశమునుండి యనేకపండితులు, కవులు, రాయలసభలను దర్శించుచుండిరి. అట్లు వచ్చినవారిలో వెల్లాలకవి హరిదాసుఁ డొకఁడు. ఈహరిదాసు శైవవైష్ణవ మతముల ప్రాముఖ్యతనుగూర్చి "యిరుసమయవిలక్క" మను గ్రంథమును వ్రాసియుండెను. రాయలవారీహరిదాసునకు బహుమానముల నిచ్చియుండెను. కుమారసరస్వతియను నింకొక కవి రాయలసభకు వచ్చియుండెను. ఈకుమారసరస్వతి రాయలవారి కళింగదేశదండయాత్రనుగూర్చియు గజపతిరాజు కుమార్తెను వివాహముచేసికొనుటను గూర్చియు వ్రాసియుండెను. తిరువారూరు వాస్తవ్యుఁడగు నొకజైనమతస్థుఁడైన మంటల పురందర్ జ్ఞానప్రకాశరనువారు "మంజారప్ప" "తత్త్వప్రకాశ"మను రెండుగ్రంథములను వ్రాసి రాయలవారి ప్రోత్సాహమును బొందిరి. మొత్తముమీద రాయలవారి యభిమానము

అరవదేశముపైన అరవవాఙ్మయముపైనను హెచ్చుగ ప్రసరించినట్లు కనుపించదు. రాజుల యాదరణము లేకున్నను దేశమునందు స్థాపింపఁబడిన మఠములయాధిపత్యమును అరవవాఙ్మయమును రాయలవారి కాలమున చాలనభివృద్ధికి వచ్చియుండెను.

కన్నడము:—కన్నడదేశమునను వాఙ్మయ మీకాలమున నభివృద్ధిఁజెందెను. రాయలవారివద్ద నీకాలమున ననేక కన్నడకవులుండిరి. కాని వారికవిత్వ మంత ప్రసిద్ధికి వచ్చియుండలేదు. రాయలవారికన్న వారికన్నడఅధికారులు కన్నడ భాషను చాల ప్రోత్సహించిరి. కన్నడకవులలో బ్రాహ్మణులు వైష్ణవులు వీరశైవులు జైనులు నుండిరి.

రాయలయాజ్ఞానుసారము "తిమ్మణ్ణ" యను కన్నడకవి మహాభారతమును పూర్తిగావించెను. ప్రథమమున నీభారతమును కుమారవ్యాసులవారు ప్రారంభించిరి. తిమ్మణ్ణకవిత్వము వ్యాసులకవిత్వముతో పోల్చుటకు వీలులేదు. ఈపుస్తకమును కన్నడులలో ననేకులు పఠించుచుందురు.

చాటువిట్ఠలనాథుఁడను నింకొకకవి రాయలకాలమునందుండెను. ఈతఁడు భాగవతగ్రంథమును కన్నడభాషలో రచించెను.

మధ్వగురువగు వ్యాసతీర్థులవారు రాయలకాలపువారే యైయుండిరి. వీరు దైవభక్తిపూరితములగు విష్ణుసంకీర్తనములను పద్యరూపకముగ ననేకములను వ్రాసియుండిరి. ఈపద్యములే ప్రజానీకమునకు మిక్కిలి యుపయోగకరముగ నుండుటయేగాక వైష్ణవమత మీపద్యరూపమున దేశమునందంతటను ప్రచారము చేయబడినది.

జైనులలో "మంగరస" యనుకవి రాయలకాలమునందుండెడివారు. ఈకవి "జయనృప" యనుగ్రంథమును చక్కని సూలభశైలిలో వ్రాసియుండెను. అనుభవవాది విద్యానంద యను నింకొకజైనకవి రాయలకు సమకాలికుఁడై యుండెను. వీరిపాండిత్యమును కవిత్వమును మిక్కిలి శ్లాఘించి రాయలవారీకవికి రత్నాభిషేకముఁ గావించిరి. ఈకవి గెరిసొప్పగ్రామవాసి. "కావ్యసార" మను అలంకారశాస్త్రమును వ్రాసియుండెను. "సాల్వ" యను నింకొకకవి భారతమును కన్నడభాషయందు రచించెను. ఈభారతము కుమారవ్యాసుని భారతమంత జనాకర్షణీయము గాకున్నను గొప్పగ్రంథములలో నొకటి యని చెప్పనగును.

వీరశైవకవులలో గుబ్బిమల్లనార్యుఁడు ప్రథమకవి యని చెప్పనగును. ఈకవివ్రాసినగ్రంథములలో "వీరశైవామృతము" "శివభక్తపురాణ" మనుగ్రంథములు ముఖ్యముగ చెప్పుకొనదగినవి. ఈగ్రంథములు తమవీరశైవమతప్రచారమునకు హెచ్చుగ నుపయోగపడెడివి. "నంజుండ" యను నింకొకకవి కంప్లిదేశపురాజగు కుమారరామునిచరిత్రమును వ్రాసియుండెను. ఈగ్రంథము చరిత్రాత్మకమైనగ్రంథము. ఈగ్రంథమునందలి చరిత్ర యిప్పటికి ముఖ్యముగ గమనింపఁదగినది. "లింగమంత్రి" "వీరభద్రరాజు" పేరుచెప్పఁదగిన యితర వీరశైవకవులు.

తెనుగు:— తెనుగుభాషయం దీకాలమున క్రొత్త యుగము ప్రారంభమైనదనియే చెప్పనగును. ఇంతవరకు తెనుగు భాషయందు గొప్పకవులు ప్రతిభశాలు రుండిరిగాని వారందరు సంస్కృతగ్రంథములను భాషాంతరీకరించియుండిరి. ఈరాయల వారికాలమున స్వతంత్రకవనము ప్రారంభింపఁబడెను. వీరిలో ముఖ్యుఁడగు అల్లసాని పెద్దన పూర్వగ్రంథములలోని కథను మాత్రము మాతృకగ గైకొని దానినే స్వకపోలకల్పనలతో పెంచి పెద్దదానినిగఁజేసి విశేషచాతుర్యమును జూపి ప్రబంధములను వ్రాయ ప్రారంభించెను. ఆకారణమువలననే యితనికి ఆంధ్రకవితాపితామహుఁడని బిరుద మీయఁబడెను. ఈ కావ్యము లెట్లు రచింపవలెనో ప్రతాపరుద్రీయ మను లక్షణ గ్రంథమున నీవిధముగ వ్రాయఁబడియుండెను.

గీ. ఇంకఁ గావ్యప్రభేదంబు లేర్పరింతు, నరుస నష్టాదశవిశిష్టవర్ణనములఁ
గలుగఁజెలఁగు మహాకావ్యతిలకమునకు, నెలమిఁదన్నామధేయంబు లెట్టివనిన.
క. పురసింధుఋతుద్వినశశి, సరసీవనమధురతిప్రసంగవిరహముల్
పరిణయ తనయోదయ నయ, విరచనయాత్రాజిదౌత్యవిభువర్ణనముల్.
గీ. ఇందులోఁ గొన్ని కడరైన నెంచిచూడ, నదియునవని మహాకావ్యమనఁగఁ బరఁగు
మరియు క్షుద్రప్రబంధనిర్మాణమర్మ, లక్షణము లేర్పరించెద లలితఫణితి.

ప్రబంధమునకు పైఁజెప్పినరీతిని స్వకపోలకల్పనలతో పదు నెనిమిదివిషయములనుగూర్చి వివరించి వ్రాయుటయేగాక కొందరుకవులు నీపదునెనిమిదివిషయములలో ప్రతివిషయ మునందును మరికొన్నిభాగములను జేర్చి వారివారిబుద్ధిచాతు ర్యముచేతను వైశద్యముచేతను నాయా వర్ణనలలో నింకను విశేషించి గ్రంథమును జేర్చిరి. పురవర్ణనఁజేయవలసివచ్చినప్పుడు

పురములోని కోటలు, భవనములను వర్ణించుటయేగాక బ్రహ్మ క్షత్రాదివర్ణచతుష్టయమును, చతురంగబలంబులను పుష్పలావి కాది స్త్రీవర్ణసాంకాదికములను జేర్చి పెంచిచెప్ప మొదలిడిరి. ఇట్టి కవనమే పెద్దనకు తరువాతివారందరు నవలంబించి యొక రిని మించి యింకొకరు తమబుద్ధిచాతుర్యమును లోకమునకు వెల్లడించిరి. ఇట్లు చేయుచురాగా కొంతకాలమున కీవర్ణన లన్నియు శృంగారాదిరసముల విజృంభింపఁజేయుటకై హె చ్చుగ నుపయోగింపఁబడుచు వచ్చెను.

శ్రీకృష్ణదేవరాయలు

రాయలవారు మహారాజై ప్రసిద్ధిఁజెందుటయే గాక తాను గొప్పకవీశ్వరుఁడై విద్వత్కవుల నాదరించి పండితసభల నేర్పాటుగావించి తా నాసభ కధ్యక్షపదవి నలంకరించి పండితు లను, కవులను, గాయకులను నుచితరీతిని సన్మానించెను. సంస్కృత మున భోజరాజువలె నీరాజు తెనుగుభాష నాదరించి పోషించి వృద్ధిఁజెందించి కవులను సన్మానించి వారిచేత పెక్కుగ్రంథములు వ్రాయించి తానును రచించి ఆంధ్రభోజుఁ డని ప్రఖ్యాతిఁ గాంచెను.

రాయలవారు సంస్కృతభాషయం దనేకగ్రంథములను రచియించినట్లు విష్ణుచిత్తీయ మను నామాంతరముగల ఆముక్త మాల్యదయందు వ్రాయఁబడిన నీక్రింది పద్యమువలన తెలియ వచ్చుచున్నది.

సీ. సలికితుత్పత్తిశోభాజాతి పెంపెక్క రసికులౌ నన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధిగాఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు

శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చి సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘుచ్చటలవిచ్చుగరచించితినా సూక్తినైపుణీజ్ఞానచింతామణికృతి
మరియు రసమంజరీముఖ్య మధురకావ్య
రచన మెప్పించుకొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందునొక్క
కృతివినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ.

ఈపద్యమునందు చెప్పినట్లు వ్రాయఁబడినగ్రంథము లిప్పు డెచటను గానరావు.

రాయలవారు సంస్కృతాంధ్రభాషలు రెండింటియందు నసాధారణమైన పాండిత్యము గల్గియుండి రనుట నిస్సందేహమై యున్నది. ఈరాజకవి ఆంధ్రభాషయం దాముక్తమాల్యద యను ప్రౌఢకావ్యమును రచించెను. ఈగ్రంథరచనను గూర్చి యనేకకథలు పుట్టినవి. ఈగ్రంథమును రాయలవారు వ్రాయ లేదనియు తన ఆస్థానకవులలో పెద్దయగు పెద్దనకవిచే వ్రాయఁబడిన దనియు గ్రంథకర్తృత్వము మర్యాదపూర్వకముగ కృష్ణరాయని కారోపింపఁబడినదనియు వాదించెడువా రనేకులుండిరి. ఈకథ యెంతమాత్రము విశ్వసింపఁదగినది కాదు. ఈగ్రంథము లోని శైలియు పెద్దనకృతమనుచరిత్రలోని శైలిని పరీక్షించి చూచిన యీకథ సరియైనదిగాదనియు విశ్వసింపఁదగినది కాద నియు స్పష్టపడఁగలదు. ఈ కారణ మొక్కటియే లోకములోని వాదుక లబద్ధము లని నిరూపించఁగలదు. ఆముక్తమాల్యద యందును మనుచత్రమునందు నొకే పద్యములు కొన్నిచోట్ల కనుపించుచున్నందున నీవాదన దేశమునందు హెచ్చుగ వ్యాపించియుండు నని తోఁచుచున్నది. అట్టిపద్యములు కథా విశేషమునందుగాక ప్రథమమునందే యుండియుండుటను

బట్టియు, అట్టిపద్యములు కథకు సంబంధించినవి కాకుండుట చేతను నీవాదనను సమర్థించఁదగినవి కావు. అవి యెట్లున్నను ఆరా శ్వాసముల ప్రౌఢకావ్యమునందు కొలదిపద్యము లుండినంత మాత్రముచేతనే గ్రంథమంతయు రాయలచే వ్రాయఁబడలేద నియు మనుచరిత్రకర్తయగు పెద్దనచే వ్రాయఁబడినదనియు చెప్పుట మిక్కిలి సాహసమని తోఁచుచున్నది. రాయలవారు గొప్పకవీశ్వరుఁడని పారిజాతాపహరణగ్రంథకర్తయగు నంది తిమ్మన "కవితాప్రావీణ్యఫణీశ! కృష్ణరాయమహీశా" యని సంబోధించియుండెను. ఈగ్రంథమునందలి కవిత్వము మిక్కిలి గంభీరముగనున్నది. రాయలవారు "కళింగదేశవిజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్నివాసరము లుండి శ్రీకాకుళ నికేతనుండగు నాంధ్రమధుమథను సేవింపఁబోయి హరివాస రోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్రి చతుర్థయామమున" నా దేవుఁడు స్వప్నమున శ్రీవేంకటేశ్వరుని కంకితముగ నొక గ్రంథమును చేయుమనఁగా; రాయలవారు విష్ణుచిత్తీయమను గ్రంథమును రచించినట్లు తెలియవచ్చుచున్నది. దీనినిఁబట్టిచూడ నీపుస్తకము దాదాపు 1515-వ సంవత్సరమున వ్రాయుట ప్రారంభింపఁబడి యుండవచ్చును. ఈగ్రంథమున వ్రాయఁబడిన కొన్నివిషయములనుబట్టి 1520-వ సంవత్సరానంతరమున నీ గ్రంథము పూర్తిఁజేయబడినట్లు తోఁచుచున్నది. కవిత్వము మిక్కిలి ప్రౌఢమై కటువుగను, మృదుమధుర పదగుంభితమై విల సిల్లుచున్నది.

రాయలు విద్వత్సభ నేర్పాటుచేసె ననియు, దానికి అధ్యక్షపదవి నధిష్ఠించెననియుఁ జెప్పుదురు. ఈరా జెల్లప్పుడు

పండితజనగోష్ఠినుండి విద్యావినోదములు సలుపుచుండెను. ఆ విద్యత్సభయందు "అల్లసాని పెద్దన, నందితిమ్మన, అయ్యలరాజు రామభద్రుఁడు, మాదయ్యగారి మల్లన, ధూర్జటికవి, పింగళి సూరన, తెనాలిరామకృష్ణకవి, రామరాజభూషణుఁడు" అను నెనమండుగురు ప్రసిద్ధకవులు అష్టదిగ్గజములుగ నుండి రనియు లోకమున ప్రబలమైన వాడుక గలదు. వీరందరిలో మొదటివారైదుగురుకవులు రాయలకాలమున వారియాస్థానమునం దష్టదిగ్గజములలో నైదుదిగ్గజములుగ నుండినట్లు గ్రంథనిదర్శనము కనుపించుచున్నవిగాని చివరి ముగ్గురు కవీశ్వరులును రాయలకాలమునందుండిరో లేదో యని సందేహింపవలసివచ్చుచున్నది.

పైనిజెప్పినవారిలో అలసాని పెద్దనయు నందితిమ్మనయు తాము రచించిన మనుచరిత్ర పారిజాతాపహరణ మను గ్రంథములను రాయలవారి కంకితముఁ జేసియుండిరి, అయ్యలరాజు రామభద్రుఁడు రాయలవారి కాలమున తరుణవయస్కుఁడై యుండెను. రాయ లితనిని సకలకథాసారము గ్రంథమును వ్రాసి తమకంకితముఁ జేయుమని కోరినట్లును, రామభద్రుఁడును రాయలవారి యాజ్ఞానుసారముగ నా గ్రంథమును వ్రాయుట కారంభించినట్లును గ్రంథము పూర్తిచేసి ముగించక పూర్వమే రాయలవారు మరణించినట్లును తనగ్రంథమున వ్రాసికొని యుండెను.

రాజశేఖరచరిత్రమును వ్రాసిన మాదయ్యగారిమల్లన రాయలకాలముననుండి వారిదిగ్విజయయాత్రలగూర్చియు వారి కీర్తినిగూర్చియు వర్ణించినట్లు కుమారధూర్జటి వ్రాసిన నీక్రింది పద్యములవలన తెలియుచున్నది.

గీ. సరససాహిత్యరచన విస్ఫురణ మెఱయ
సారమధురోక్తి మాదయగారి మల్ల
నార్యుఁ డల్లసాని పెద్దార్యవరుఁడు
ముక్కుతిమ్మన మొదలైనముఖ్యకవులు.

క. వినిపించి రపుడు వారికిఁ
గనకాంబరభూషణములు ఘనత నొసఁగియా
జనవరుఁ డప్పాజిఁ గనుం
గొని యిట్లని పలికె నపుడు కుతుకం బలరన్.

కృష్ణరాయవిజయమును వ్రాసిన కుమారధూర్జటి పెదతాత కాళహస్తిమాహాత్మ్యమునురచించినధూర్జటికవి రాయల యాస్థానమందున్న ట్లీక్రిందిపద్యముచేత తెలియవచ్చును.

చ. స్తుతిమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గెనో
యతులితమాధురీమహిమ ? నాఁమను నీపెదతాతచాలఁగ
న్నుతిగనెఁ గృష్ణరాయలమనోజ్ఞసభ న్వినుమీవునట్లు మ
త్కృతబహుమానవైఖరులఁ గీర్తివహింపుము ధాత్రిలోపలన్.

తాళ్లపాక చిన్నన్నయను నింకొకకవీశ్వరుఁ డీరాయల వారియాస్థానమునందుండినట్లు కొండవీటిచరిత్రములో నీక్రింది వాక్యములవలనఁ దెలియుచున్నది.

'వినుకొండసీమలో మిన్నకల్లుతాళ్లపాకచిన్నయ్యగారికి గ్రహారమిచ్చెను'

ఈపైనఁజెప్పఁబడిన నైదుగురుకవులుగాక అష్టదిగ్గజములలోనివారని వాడుకగఁ జెప్పఁబడెడి పింగళిసూరన, రామరాజభూషణుఁడు, తెనాలిరామకృష్ణకవి, యనునీముగ్గురు కవీశ్వరులును, రాయలకాలములోనివా రని చెప్పుటకు తగిన యాధారములు గాన్పింపవు.

ఈపైన జెప్పఁబడిన కవులేగాక రాయలకు సమకాలికు లగుకవు లనేకు లుండిరి. వారిలో ముఖ్యులపేర్ల నీక్రింద నుదాహరించుచున్నాను.

1. నంబపాల నృసింహకవి.	2. కంసాలి భద్రయ్య.
3. కమ్మర వెల్ల.	4. వెన్నెలగంటి సూరన్న.
5. చెల్లంకి తాతంభొట్లు.	6. కోట శివరామయ్య.
7. పిడపర్తి సోమనాథుఁడు.	8. పిడపర్తి బసవకవి.

అ ల సా ని పె ద్ద న

అలసాని పెద్దన, రాయలయాస్థానకవులలో ప్రముఖుఁడు అష్టదిగ్గజములలోనివాఁడు. ఈతఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి పేరు చొక్కనామాత్యుఁడు. ఈతని స్వగ్రామము బళ్లారిజిల్లాలోని దోరాలగ్రామము.

నందవరీక బ్రాహ్మణులు నియోగిబ్రాహ్మణులుగారనియు స్వచ్ఛమైన వైదికసంప్రదాయమునకు సంబంధించి శ్వేతాంబ యనుపేర లోకపరశక్తిని పూజించెడువారనియు లోకప్రతీతి కలదు. వీరిలో పదునాల్గు ముఖ్యమైనవంశీయులు కాశీయందలి మణికర్ణికాఘట్టమున నివసించుచు నచటనుండి బయలుదేరి కర్నూలుజిల్లాలోని నందవరగ్రామమునకు నందుడనురాజు రాజ్యముచేయుచుండినకాలమున వచ్చిరనియు చెప్పుదురు. ఇందలి నిజానిజము లారయవలసియున్నది.

ఈతనికి సంస్కృతాంధ్రభాషలయం దసమానపాండిత్యము గలదు. ఇతనికాలమువరకు పూర్వపుకవులు స్వతంత్ర కావ్యములను వ్రాసియుండలేదు. నన్నయ తిక్కనాది పూర్వ కవులందరు సంస్కృతకవులు వ్రాసిన గ్రంథములను మాతృక

గైకొని వాటిని తెనుగుభాషలోనికి భాషాంతరీకరించి యుండిరే గాని తాము స్వంతముగ వ్రాసియుండలేదు. ఈకవి మార్కండేయపురాణముననుండి కథనుతీసికొని పెంచి తనస్వకపోలకల్పనలతో ప్రప్రథమమున మనుచరిత్ర మను ప్రబంధరూపకమైన గ్రంథమును రచియించి క్రొత్తమార్గమును జూపినకవి. ఆంధ్ర కవిత్వమున నిట్టిప్రబంధకవనము ప్రారంభించినందున నీతనికి ఆంధ్రకవితాపితామహుఁడను బిరుదము కల్గినది. ఈతని తరువాత కవులందరు నీవిధమైన ప్రబంధముల రచియించుచువచ్చిరి.

ఈతఁడు స్వారోచిషమనుచరిత్రమునే గాక హరికథాసార మను నింకొక గ్రంథమునుకూడ రచించియుండెను. అంతే యీపుస్తక మిపుడు లేదు. కొన్నికొన్ని లాక్షణిక గ్రంథములలో నీహరికథాసారమునుండి పద్యము లుదాహరింపఁబడినవి.

ఈకవి స్వతంత్రుఁడై యుండెను. తనకవిత్వమునందు తురకపదముల నిచ్చవచ్చినరీతి నుపయోగించెను. ఇట్లు అన్యభాషాపదములను తెనుగుగ్రంథముల నుపయోగించిన ప్రథమకవి యీయలసాని పెద్దన కవియే. కొన్నిపద్యములయందు తురకభాషావాక్యములే వాడబడియుండెను.

మ. సమరక్షోణిని కృష్ణరాయల భుజాకాతాని చేఁబడ్డ దు
ర్దమదోర్దండపుళిందకోటి యవనవ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునం గాంచి కాబానవాలో హరిహరంగా ఖూబు ఖోడాకికే
తమకీ బాయిలు బాయిజే మలికియం దుక్కంటికిం బోవుచున్.

రాయలవారి పరిషత్సభకు వచ్చిన పండితులపరీక్షించి వారునిర్ణయించిన ప్రకారము కవులకు మర్యాద గావించుచుండి రనియు తెలియవచ్చుచున్నది.

రాయలవారు పెద్దన నుద్దేశించి తనపేరిట నొకకృతి రచియింపుమని కోరుచువచ్చినంతలో పెద్దన కాలయాపనముఁ జేయుచుండ నొకనాఁడు రాయలవారు పెద్దనను కృతిరచింపుమని బలవంతపెట్టెను అప్పుడు పెద్దన యీ క్రిందిపద్యమును జెప్పెనట.

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన మూయలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తము
ల్దొరకినగాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే.

అందుపై రాయలవారు పెద్దన కోరినప్రకార మొకదివ్య భవనమును గోటాగ్రహారము నిచ్చి

"కృతిరచింపుము మాకు శిరీషకుసుమపేశల సుధా
మయోక్తులఁ బెద్దనార్య."

యని కోరియుండెను. అందుపైన పెద్దన మనుచరిత్రమును రచియించి రాయలవారికి కృతినిచ్చెను.

ఈ గ్రంథము మృదుశైలిలో సలక్షణముగను మధురముగను వ్రాయఁబడెను. ఇందు కొన్నిసందర్భములు సంస్కృతజటిలములు. మరికొన్నితావు లచ్చతెనుగున నున్నవి. ఈకవి కీడగువాఁ డితఁడేగాని మరియొక్కరుఁడు లేఁడు. అందువలననే "పెద్దనవలెఁ గృతిసెప్పిన పెద్దనవలె" ననునార్యోక్తి బుట్టినది. ఈవిషయమునే రాయలవారీ క్రిందిపద్యమునఁ జెప్పియుండిరి.

క. హితుఁడవు చతురవచోనిధి, వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వాంధ్రకవితా, పితామహుఁడ వెవ్వఁడు పేర్కొన నీకున్.

ఈతనికవిత్వమునందలి పదవాక్యజటిలత్వమును బట్టి "యల్లసాని వానియల్లిక బిగియును" అను ప్రసిద్ధివచ్చినది.

ఒకానొకసమయమున రాయలు కవిగండపెండేరమును బంగారుపళ్లెమునసుంచి సంస్కృతాంధ్రములందు సమానముగ కవిత్వముఁ జెప్పఁగలవారీపెండేరమును ధరింపనర్హులని పలికినపుడు సకలకవీశ్వరుల యెదుట సభాస్థలి నిలిచి యీ క్రింది యుత్పలమాలికను పెద్దనార్యుఁడు జదువఁగ రాయలవారు మెచ్చి కవిగండపెండేరమును కవిపాదమున తామే స్వయముగఁ దొడిగిరి.

ఉ. పూఁత మెఱుంగులుం బసరుపూఁత బెడంగులుఁ జూపునట్టి వా
కైతలు జగ్గునిగ్గు లనఁగావలెఁ గమ్మనఁ గమ్మనన్ వలెన్
రాతిరియున్ బవల్ మఱపురానిహొయల్ చెలియారజంపు ని
ద్రాతరిఁ బుల్కరించెను దారసిలన్ వలె లోఁదలంచినన్
బాతిగఁ గైకొనన్ వలెను బైదలిగుత్తుకలోనిపల్లటీ
కూఁతలవ న్వలెన్ సొగసుఁ గోర్కులు రావలె సోఁకించినన్
చేతికిఁ జెందిఁ గౌఁగిటను జేర్చనఁ గన్నియ చిన్నిపొన్నిమే
ల్పూఁతల చన్నుదోయివలె మచ్చటగావలెఁ బట్టిచూచినన్
దాతొడనున్న మిన్నలమికారపు ముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెర దొండపండువలె వాచవిగావలెఁ బంటనూదినన్
గాతలఁ దమ్మిచూలిదొరకై నసపుంజవరాలి పిల్లపు
న్నె తెలియబ్బురంపు జిగినిబ్బరపుబ్బుకబ్బుగబ్బపాం
బూతలమన్నకాయ నరిపోఁడిమి కిన్నరమెట్లబంతి సం
గాతపుసన్నబంతి బయకారపుఁ గన్నడగౌళపంతు కా
సాతతతానతానలపసం బిపుటారెకుగోటుమీటుబల్
మ్రోఁతలనుంబలెన్ హరువు మెల్లనగావలె నచ్చతెన్గు రీ
తిగ సంస్కృతంబు పచరించినపట్టున భారతీవధూ
టీ కమనీయగర్భనికటీ భవదానన సర్వసాహితీ

ఘాతికపాటకత్రకరభారతభారతసమత్ప్రభా
శిత నగాత్మజాగిరిశశేఖర శీతమయూఖరేఖికా
పాతసుధాప్రపూర బహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మ లయసంగతి చుంచువిపంచికామృదం
గాతత తేహిత త్తహితహాధిత దంధణు ధాణు దిందిమి
వ్రాతనయానుకూలపద వారిత హావ్యహా హారికింకిణీ
నూతనఘల్లులాచరణ నూపురఝుళఝుళీమరందసం
ఘాతవినోద్ధునీ చకచకద్వికచోత్పలసారసంగ్రహా
యాతవమారగంధవహ హారిసుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జల్లనఁ జల్లవలెన్న నోహర
ద్యోతక గోస్తనీఫల మధుద్రవగోఘృతపాయసప్రపా
రాతిరసప్రసారరుచిర ప్రతిమంబుగ సారె సారెకున్.

ఈకవి కగ్రహారముగ నీయఁబడిన కోటకగ్రామమునకు తనగురువైన శఠకోపయతిపేర "శఠకోపపుర మని" పేరువెట్టి తాను వైష్ణవమతమును స్వీకరించి యీగ్రామమును శ్రీవైష్ణవుల కగ్రహారముగ నిచ్చెను.

అలసాని పెద్దన రాయలసమకాలికుఁడే యైనను వారు మరణించినపిదప కొంతకాలము జీవించియుండి షుమారు 1535-వ సంవత్సరమున మరణించిన ట్లూహించవలసియున్నది. రాయలవారు మరణించినపిదప జీవించియున్న పెద్దనకవీంద్రుఁడు రాయలవారు తనకుగావించిన సపర్యలను స్మరించుచు నీక్రిందిపద్యమును వ్రాసి

సీ. ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి
    కేలూత యొసగి యెక్కించుకొనియె

మనుచరిత్రం బందుకొనువేళ
    పురమేఁగ పల్లకి తనకేలఁ బట్టియెత్తె
బిరుదైన కవిగండపెండేరమున
    కీవె తగుదని తానె పాదమునఁ దొడిగె
గోకటగ్రామాద్యనేకాగ్రహారము
    లడిగినసీమలయందు నిచ్చె.
ఆంధ్రకవితాపితామహ! యల్లసాని, పెద్దనకవీంద్ర యనినన్ను బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక, బ్రతికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.

తాను వారితో మరణించక జీవించియుండి కష్టముల ననుభవించుచున్నందున విలపించియుండెను.

నందితిమ్మన

రాయలవారి అష్టదిగ్గజములలో నందితిమ్మన యొక ప్రఖ్యాతకవిపుంగవుఁడు. ఈతఁడు కౌశికగోత్రవిఖ్యాతుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. ఆర్వేలనియోగిపవిత్రకులమునకుఁ జెందినవాఁడు. నరసింహామాత్యునకును దిమ్మాంబకును దనయుఁడు. సకలవిద్యావివేకచతురుఁడు. మలయమారుతకవికి మేనల్లుఁడు. కృష్ణరాయక్షితీశుని కరుణచేత చతురంతయానాగ్రహార సన్మానమును పొందిన ప్రౌఢకవి. అఘోరశివగురునిశిష్యుఁడు. శైవోపాసకుఁడు. శ్రీరుద్రమాహేశ్వరలబ్ధసారసారస్వతాభినంది. కవిత్వప్రౌఢిమయు, విజ్ఞానసంపత్తియుఁగలకవి. పారిజాతాపహరణకావ్యకర్త. తనగ్రంథమును కృష్ణరాయక్షితీశున కంకితముఁ జేసెను. ఈకావ్యమును రాయలవారికిఁ గృతినిచ్చిన సందర్భమునుగూర్చి యొకకథను జెప్పుదురు.

రాయలవా రొకనాటిరాత్రి పండితసభనుండి శయ్యాగృహమున కర్ధరాత్రి దాటినపిదప వెళ్లెననియు, నిశీధసమ

యము దాఁటినందున రాయలవారు వెళ్లునప్పటికి భార్య యగు తిరుమలాంబాదేవి నిద్రించుచుండె ననియు, రాయలవారాపెకు నిద్రాభంగముఁ జేయుట కిచ్చగింపక ప్రక్కనున్న శయ్యపై శయనించెననియు, అప్రమత్తురాలై నిదురించుచున్న తిరుమలాదేవి పాదము రాయలవారి దేహమునకు తగిలె ననియు, అందులకు రాయలవారు కోపోద్రిక్తులై "భార్యా దండః పృథక్ఛయ్యా" యను నార్యోక్తిని బట్టి నింకొకభవనమునకుఁ జని యచటనే శయనించెననియు, నీసంగతి తెలిసికొని రాణియైన తిరుమలాదేవి చింతాక్రాంతురాలై యుండ, నందితిమ్మకవి యామెవద్దకువచ్చి యీసంగతిని తెలిసికొని రాయలవారి కోపమును శాంతిపఱచుటకై పారిజాతాపహరణ మను కావ్యమును వ్రాసి నారదమహాముని పారిజాతకుసుమమును తెచ్చి శ్రీకృష్ణుని కిచ్చిన సందర్భమున జరిగినకథకు పాత్రా జలికిఁ గల్గినకోపమును శమించుటకు శ్రీకృష్ణుఁడు ప్రయత్నించిన సందర్భమును గూర్చి యీవిధమున ముద్దులుగులుకు పలుకులతో నీక్రిందిపద్యములను జెప్పెను.

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరమ్ముఁ దీర్ప నా
ప్పాటను బాటుగామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతిచేలి మణి పంక్తికి పన్నియ వెట్టె నాజగ
న్నాటకసూత్రధారి యదునందనుఁ డర్థిలి మ్రొక్కి మ్రొక్కి యన్.

మ. జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధుకన్నతండ్రి శిరము చోద్వామపాదంబునన్
దొలఁగం దోచె లతాంగి యట్లయగు నాథుల్నేరముల్సేయఁ జే
రలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారముల్నేర్తురే.

క. కోపనపదహతిఁగుమారా, గోపాలుఁడుగాంచి మెయిగగుర్పొడవఁగను
ద్దీపిత మన్మథరాజ్య, ప్రాపకుఁడై పలికెఁ గూర్మి బయలువడంగన్.

చ. ననుభవదీయదాసుని మనంబున నెయ్యపుఁ గిన్కఁబూని తా
చిన యది నాకు మన్ననయె చెల్వగు నీపదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము తాఁకిన నొచ్చునందు నే
యనియెద నల్కమానవుగదా! యిఁకనైన నరాళకుంతలా.

వ్రాసి గ్రంథమును తొందరగాఁ బూర్తిఁజేసిననియు అంతట తనగ్రంథమును రాజుగారికి సభలో జదివి వినిపించెననియు, నీభాగముఁ జదువునపుడు రాయలవారికి తనస్వవిషయము జ్ఞప్తికివచ్చి కృష్ణునంతటి వానికే యిట్టియవస్థ తటస్థింప తన కేమిలెక్కయని తలంచి, తా నట్టి సమయమున నడచినవిధము తయు విరసముగఁ గాన్పింప తనలో తనను నిందించుకొనుచు బుద్ధితెచ్చుకొని నారాత్రి యంతఃపురమునకు జని భార్యా సమేతుఁడై సుఖంబున నుండె ననియుఁ జెప్పుదురు. ఈకథ యందలి చమత్కారమును కవియొక్క సమయస్ఫూర్తిత్వమును మన మాస్వాదించి హర్షించవలయునే కాని కథ యొక్క నిజానిజము లారయుటకు తగినంత యాధారములు కాన్పింపవు.

ఈపారిజాతాపహరణగ్రంథమునే గాక వాణీవిలాసమను వేఱొకగ్రంథమును త్రిస్థలీదండకమును నీకవిరచించియుండెను.

ఈతఁడు తనకవిత్వమునందలి పదలాలిత్యమునకు ప్రసిద్ధుఁడు గావుననే తిమ్మనకవి కవననైపుణ్యమును గూర్చి తెనాలి రామకృష్ణకవి పల్కుచు "ముక్కుతిమ్మనార్యు ముద్దుపల్కు" అని వర్ణించి యుండెను. ఇంకొకకవి తిమ్మనార్యుని కవిత్వమునుఁ గూర్చి వ్రాయుచు

క. లోకమునంగల కవులకు, నీకవనపుఠీవి యబ్బునే కూపవట
ద్భేకములకు గగనధునీ, శీకరములు చెమ్మ! నందిసింగయతిమ్మా.

యని వ్రాసి యుండిరి.

నందితిమ్మన ముక్కు పొడవుగనున్నందున వీరికి ముక్కుతిమ్మనయను పౌరుషనామ ముండె నని కొంద రందురు.

అయ్యలరాజు రామభద్రుఁడు

ఈ రామభద్రకవియు రాయలయాస్థానమున నుండి అష్టదిగ్గజములలో నొకరుగ నుండె నని పేరేగాని యాతని కాలమంతయు రాయలవారి కాలమున కనంతరమే గడపఁబడినట్లు కనబడుచున్నది.

ఈకవి తాను రచియించిన రామాభ్యుదయము అను గ్రంథమునకు చివరభాగమున వ్రాసికొన్న గద్యమును బట్టి తా నయ్యలరాజవంశజుఁడననియు తిప్పయమనీషి పర్వతాభిదానపౌత్రుఁడననియు అక్కయాచార్యపుత్రుఁడననియు వ్రాసికొనెను. వీరి వంశనామ మయ్యలరాజువారనుటవలన నియోగులనియే చెప్పవలసియున్నది. ఈతఁడు కడపజిల్లాలోని ఒంటిమిట్ట గ్రామవాస్తవ్యుఁడు. ముమ్మిడి వరదాచార్యులను నొక రామానుజమతసిద్ధాంత మర్మజ్ఞుని శిష్యుఁడు. వైష్ణవమతాభిమాని. ఈతఁడు తన గ్రంథములలో నెచ్చటను తన గోత్రనామములఁ జెప్పియుండ కున్నను యాతని తరువాతి వారిలో నొకరును హంసవింశతి గ్రంథమును తెలుగున వ్రాసిన కవి "మాయయ్యల రాజువంశజుల నాదికవీంద్రులఁ బ్రస్తుతించెదన్." అని వ్రాసియున్నందున వారిగోత్రము నీరామభద్రుని

గోత్రము నొకటియే యనియు నది కౌండిన్యసగోత్ర మనియు మనము తెలిసికొనదగినది.

పైనచెప్పిన ఆశ్వాసాంతగద్యమున "శ్రీమదొంటిమిట్ట రఘువీరశతకనిర్మాణకర్తృ జగదేకఖ్యాతి ధుర్య" యని వ్రాసికొన్నందున "రఘువీరశతకము" లేక వీరరాఘవశతకమును వ్రాసియుండె ననియు మనము తెలిసికొనవలయును.

ఈకవి మిక్కిలి బీదవాఁడును సంతానవంతుఁడునై యున్నందున నీతని "పిల్లలరామభద్రయ్య" యని పిలిచెడివారు. ఒంటిమెట్టగ్రామమున నుండునపుడు జీవనోపాధి జరుగనందున మిత్రులసలహావలన విజయనగర రాజ్యమును చేరి యచట చలికి తానును తనపిల్లలును బాధపడుచుండిరనియు నాసమయముననే రామరాజభూషణు శిష్యులు కొంద రచటఁ జేరి తమగురువుగారి యాజ్ఞానుసారముగ నొకపద్యమును వ్రాయఁ బ్రయత్నించుచుండిరనియు నీరామభద్రుఁడు వారి దరిఁజేరి వారివలన కప్పుకొనుటకై బట్టలను సంపాదించి వారు వ్రాయవలెనని ప్రయత్నించుచున్న పద్యమును తాను వ్రాసి వారికిచ్చెననియు నాపద్యము శిష్యులు తమగురువుగారికివ్వగా వా రాపద్యమునందలి పదశయ్యావిశేషములచే తన శిష్యబాలురు వ్రాసినదికాదని గ్రహించి వారివలన నీపద్యమును రచించినది రామభద్రుఁడని తెలిసికొని వారివద్దకుఁ జని వారిని తగురీతిని మర్యాదగావించి రాయలదర్శనముఁ జేయించెననియుఁ జెప్పుదురు. ఈకథయొక్క నిజానిజము లారయుటకు వీలులేదు. రామరాజభూషణుఁడు రాయలవారికాలమున నున్నవాఁడగునా కాదా యనునంశమే వివాదాస్పదమైన యంశము.

వారు రాయలు రసికాలికుఁడు కాదనియే చెప్పవలసివచ్చినఁ దీకథ నిజమని చెప్పుట కెంతమాత్రమును వీలుండదు. ఎట్లైన నేమి యీరామభద్రకవి రాయల యాస్థానమును జేరె ననుట నిర్వివాదాంశమే యై యున్నది. ఈతఁడు రాయలవారివద్ద నున్నకాలమున రాయలవారిచే "సకలకథాసారసంగ్రహ" మను గ్రంథమును తెనుఁగున వ్రాయుటకై ప్రేరేపింపఁబడి వ్రాయ ప్రారంభించి గ్రంథము పూర్తిగాక పూర్వమే రాయలవారు మరణించినందున వారికంకితముఁ జేయఁజాలక గ్రంథముయొక్క యవతారికయందు మాత్రము తాను రాయలకాలమున వారిచే నీగ్రంథమును వ్రాయ ప్రేరేపింపబడితినని వ్రాసియుండెను.

రాయలమరణానంతరమున నీకవి బీదతనముచే బాధపడుచు నందందుతిరిగితిరిగి చాటుపద్యములను జెప్పి తనజీవనము గడపుకొనుచు చివరకు కృష్ణరాయలయల్లుఁడగు రామరాజునకు మేనల్లుఁడైన గొబ్బూరి నరసరాజువద్దఁ జేరి తాను వ్రాసిన "రామాభ్యుదయ" గ్రంథమును నారాజున కంకితము చేసెను.

ఈకవి వ్రాసినగ్రంథములలో ముఖ్యమైనది రామాభ్యుదయము. ఈతనిది ప్రౌఢకవిత్వమై మృదుమధురముగ నుండును. పదగుంభనమునందును, పదలాలిత్యమునందును, పెద్దప్రఖ్యాతిగాంచిన కవుల కీతఁడు వెనుకఁబడఁడు. ఈతఁడు వ్రాసిన చాటుధారపద్యములను ఇప్పుడు కనబడుటలేదు. గుత్తియప్పలరాజుపైన నీకవి చెప్పిన చాటుపద్యమునుమాత్ర మిాక్రిందఁ బొందుపఱచడమైనది.

క. రాజమనోజా! విద్యాభోజా! దీనార్థకల్పభూజా! రిపుసం
ఝూజా! వైభవవిజితబిడౌజా! రవితేజ! గుత్తియప్పలరాజా.

మాదయ్యగారిమల్లన

ఈతఁడు రాయలయాస్థానకవులలో నొకఁడై అష్టదిగ్గజములలో నొక్కఁడుగ నుండెను. ఈతఁడు శివభక్తుఁడును లింగధారియునై యుండెను. బొంబాయిరాష్ట్రములలోని బీజపూరు జిల్లా కళ్యాణదేశపురాజగు బిజ్జలరాయనివద్ద మంత్రిగనుండిన బసవయనువా రీలింగధారిశాఖను స్థాపించియుండిరి. ఈలింగధారులు తమమెడలో లింగమును ధరించెదరు. బిజ్జలరాయఁడు రాజ్యముచేయుకాలమున బ్రాహ్మణులలో చాలమంది నీలింగధారిశాఖలోనికి చేరియుండిరి. ఈబసవయనువారు ప్రముఖుఁడై మహాజనులలో నొకరని బిజ్జలరాయని కాలమున మనగోలి యనుగ్రామమున దొరకినశాసనమునుబట్టి తెలియుచున్నది. ఇంతకుపూర్వము దాదాపు సుమారు నూరుసంవత్సరముల క్రింద జీవించియుండిన ప్రౌఢకవి మల్లననుండి వేరుచేయుట కితని తండ్రి పేరుతోఁ జేర్చి మాదయ్యగారిమల్లన యని నీతనిని పిలుచుచుండెడివారు. ఈతనివంశమునుగురించిగాని చరిత్రను గురించిగాని మనకు హెచ్చుగ వివరములు తెలియవు. ఈతఁడు రాజశేఖరచరిత్రమను పుస్తకమును రచించెను. ఈగ్రంథమును తన యౌవనారంభదశయందే రచించెనని ప్రతీతి కలదు. ఈకవి రాయలు మరణించిన పిదపకూడ కొంతకాలము జీవించియుండెను. ఈతఁడు రచించినగ్రంథమును మంత్రి తిమ్మరసుయొక్క అల్లుఁడైన నాదిండ్ల అప్పయ్య కంకితము చేసియుండెను. ఈతని కవిత్వము సరళమై లలితపదభూయిష్ఠమైనది. చక్కని లోకోక్తులతోను జాతీయపదములతో నీతనికవిత్వమునిండియుండెను. ఈతని నివాసము గుంటూరుజిల్లాలోని కొండవీడుగ్రామము.

౪. చెప్పుమనఁ గవితరచనల్
చిప్పిల జెప్పుదు! బళి బళి! యనఁ జేరా
యెప్పుడు చెప్పక యుండుచె
యొప్పుకొనుమీ! సుకవి యెంత యుచితజ్ఞుఁడో కో.

యని ప్రతిజ్ఞ చేసి యట్లే కవిత్వముఁ జెప్పెనని యందురు.

— ధూర్జటి కవి —

ఈకవియు రాయలఅష్టదిగ్గజములలో నొకఁడై యుండెను. ఈతఁడు పాకనాటి ఆరువేలనియోగి బ్రాహ్మణుఁడు. భారద్వాజ గోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. కాళహస్తి పురనివాసి. శివభక్తుఁడు. ఈతఁడు కాళహస్తిమాహాత్మ్య మను నొక గ్రంథ రాజమును రచించెను. ఈతనికవిత్వము మృదుమధురపదలాలిత్యమై హృదయరంజకముగ నుండును. ఈతని కవిత్వమునందలి యతులితమాధురీమహిమను జూచి రాయలవారు నిండుసభలో తన యాస్థానకవులమధ్య

చ. స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో
యతులితమాధురీమహిమ

యనుపద్యము నిచ్చి సభ్యులను పూరింపఁ గోరినట్లును, వారిలో నొక రీపద్యము

హా తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహారి సం
తతమధురాధరోదిత సుధారసధారల గ్రోలుటంజుమీ.

యని పూరించినట్లును వాడుక కలదు. ఈపద్యమువలన ధూర్జటికవి కవిత్వము మిక్కిలి మధురముగ నుండెననుట నిర్వివాదాంశమై యున్నది. ఈపద్యము పూరింపఁబడినవిధము నుఁబట్టి ధూర్జటికవి సంతతవేశ్యాలోలుఁడనియు రసికాగ్ర

గణ్యుఁడనియు వేశ్యాంగనల మధురమైన అధరపానము గ్రోలుచుండెడి వాఁడనియు మనము తెలిసికొన వలసియున్నది. ఇందలి నిజానిజములు మన మూహింపఁజాలము కాని గొప్ప కవులందఱి కిట్టిదోషముల నారోపించుట మనదేశమునకేగాక యుత్తర దేశములయందును వాడుకయైనట్టు గనబడుచున్నది. ఈకవి నిక్కముగ వేశ్యాలోలుఁడైనను గాకున్నను ఇతని కవిత్వమునందు హెచ్చుమాధుర్య మున్నదనుట నిస్సందేహమైన విషయము. ఈకవి మనుమఁడగు కుమారధూర్జటి కృష్ణరాయ విజయమును వ్రాసి రాయలచరిత్రలోని కొన్ని ముఖ్యాంశములను చిరస్థాయిగ నుండినట్లు చేసెను.

— తాళ్లపాక చిన్నన్న —

ఈకవియు రాయలకాలమున నున్నకవులలో నొకఁడై యుండెను. ఈతఁ డాస్థానకవులలో నొకఁడో కాఁడో యను సంశయముఁగూర్చి చెప్పుటకు తగిన యాధారములు లేవు. ఈకవి అష్టమహిషీకళ్యాణమను ద్విపదకావ్యమును రచించెను. ఈతనికవిత్వములోని కొన్ని తునకలు లక్షణగ్రంథములయిన అప్పకవీయమునందును రంగరాట్ఛందమునందు నుదాహరింపఁబడెను. ఈతనిని గూర్చిగాని యీతఁడు రచించిన యితరపుస్తకములనుగూర్చిగాని వివరములు తెలియవు. కొండవీటిచరిత్రములోని రాయలదానములఁగూర్చి వ్రాయఁబడిన క్రిందవాక్యముల వలన నీచిన్నన్న రాయలవారి కాలములోనివాఁడని ధ్రువపడుచున్నది.

"వినుకొండసీమలో మిన్నకల్లు తాళ్లపాక చిన్నయ్యగారికి అగ్రహార మిచ్చెను".

"అద్దంకి సీమలో వలపర్ల అను గ్రామమును కాళ్లపాక చిన్నయ్యగారి కిచ్చెను."

సంకుసాల నరసింహకవి

ఈకవి ప్రౌఢకవి. ఈకవియు రాయలకాలములోని వాఁడై యున్నాఁడు. కాని ఆస్థానకవులలో నుండెనా యను సందేహము కలుగుచున్నది. ఈకవియొక్క వంశచరిత్రముగాని తండ్రితాతలపేర్లు గాని తెలియుటలేదు. తాను వ్రాసిన "కవికర్ణరసాయన" మను మహాకావ్యమున సాశ్వాసప్రారంభమునఁగాని ఆశ్వాసాంతగద్యమునఁగాని స్వప్రజ్ఞాప్రకటనమునుగాని వంశవర్ణనముగాని చేసికొనక ఆశ్వాసప్రారంభమున

క. గురువరభట్టపరాశర, చరణసరోరుహనమలసన్నావకుఁడన్,
నరసింహనామధేయుఁడ, పరిమితసత్కృతిరసామృతకహేతువనన్.

అనియు, ఆశ్వాసాంతగద్యమున

"శ్రీమద్భట్టపరాశరదేశికేంద్రచరణసరసిజ
సేవకోపసేవకనరసింహనామధేయప్రణీతంబు"

అనియు వ్రాసికొని యుండెను. ఇట్లు తనప్రజ్ఞావిశేషములఁగూర్చిగాని వంశానుక్రమణమునుగూర్చిగాని వ్రాసికొనని ప్రౌఢకవు లరుదు. అంతమాత్రమున నీతఁడు ప్రజ్ఞావిశేషములేనివాఁడనిగాని ప్రతిభాశాలిగాఁడనిగాని యూహించుటకు వీలులేదు.

ఈతఁడు వైష్ణవులైన భట్టపరాశరాచార్యుల శిష్యుఁడై వైష్ణవమతాభిమానియై యుండెను. ఈకవి యేకులమునకుఁ జెందినవాఁడని చెప్పుటకు తగిన యాధారములు గనుపింపవు. లోకమునందు మాత్ర మాతఁడు నియోగిస్మార్తబ్రాహ్మణుఁడను ప్రతీతి గలదు.

ఈతఁడు కవికర్ణరసాయన మను నామాంతరముగల మాంధాతృచరిత్రమును రచించెను. కవికర్ణరసాయనమను గ్రంథము ప్రౌఢకావ్యములలో మేటి యని చెప్పఁదగిన కావ్యము. అలసాని పెద్దనవ్రాసిన మనుచరిత్రగ్రంథమునకు వెనుకబడునదిగాదు. ఈగ్రంథమును వ్రాసి నరసింహరాయల కంకితముచేయువలయునని అలసాని పెద్దనతో సలహాపడినట్లును పెద్దన యాగ్రంథము నామూలాగ్రముగఁ జదివి రాజువద్ద తనకుఁగలసన్మానము, పలుకుబడి, యాగ్రంథమునుఁ జూచిన వెనుక తగ్గునని యసూయాపరవశుఁడై నరసింహకవికి రాజదర్శనము గావింపక నాటంకములు కలుగఁజేసెననియు నరసింహకవి విసువుచెంది తనగ్రంథమునందలి పద్యభాగముల విడివిడిగ విక్రయించెననియు కొన్నిపద్యములను రాజుగారికుమార్తె కొనెననియు, కొంతకాలమునకు నరసింహకవి యాశావిరహితుఁడై రాజధానివదలి శ్రీరంగపురక్షేత్రమునకుఁ జని యచటి రంగనాయకస్వామి కంకితముఁ జేసెననియుఁ జెప్పుదురు. ఇందలి నిజానిజములను మనము కనుగొనుట కష్టసాధ్యమై యున్నది. అంతటి పండితుఁడును ప్రసిద్ధకవియునైన పెద్దన కసూయజనించునా యనెడి ప్రశ్న కుత్తరమిచ్చుట సులభసాధ్యముకాదు. వచ్చినవచ్చియుండవచ్చును. మానవస్వభావమును గుర్తెరుంగుట కెవరికి శక్యము? ఇది యెట్లున్నను నరసింహకవిమాత్రము విసువుచెంది తనపుస్తకమును దేవుని కంకితము చేసియుండెననుట కాధారములు లేకపోలేదు. తనగ్రంథమున ప్రప్రథమమున రాజదూషణఁ గావించి "ప్రభుదురాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు" నని వ్రాసి నరకృతిఁ జేయరాదనియు

దేవుని కంకితము చేయవలెననియు నీక్రిందిపద్యమును వ్రాసియుండెను.

గీ. నరసుతాంకితములయ్యె నేసరసకృతులు దూష్యములగుచు నరకోద్వ్రత్తరుగ మట్ల
హరిసుతాంకితములయ్యె నే సరసకృతియు, కారమాత్రంబు గతిప్రాదయింగ
మంబు.

తనయభిప్రాయానుసారంబుగ తన కవికర్ణరసాయనమును గ్రంథమును "ప్రభుదురాత్మున" కంకితముఁగావింపక "భద్రగుణనిధి" యగు శ్రీరంగవిభుని కంకితము చేసెను. దీనినిఁబట్టి చూడ నీకవి తనగ్రంథమును ప్రథమమున రాయల కంకితము చేయ నెంచెననియు తరువాత నేకారణముననో విముఖుఁడై యట్లు చేయక రాజు పేరు తెలియనీయక రాజులనందరిని కలిపి దూషించి, చివరకు "జ్ఞానప్రౌఢమహోజసాధికవచస్సంస్తూయమానుండు లక్ష్మీనాథుండు" తన "అల్పవాక్యరచన"కు స్వీకర్త కాకుండునా యనుసంశయమును పోగొట్టుకొని శ్రీరంగనాయకుని కృతికర్తగా నిశ్చయించుకొనెను. ఈకవి స్వప్రజ్ఞాప్రకటనము నీక్రిందివిధముగఁ జేసికొనియుండెను.

గీ. అతివిటుఁడు కాకపోవు నేయసద్వీయ, కావ్యశృంగారవర్ణనాకర్ణనమున
విటుఁడు అతికాకపోవు నే వెసమదీయ, కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున.

ఇట్లు వ్రాయుట అతిశయోక్తిగావచ్చురుగాని స్వాతిశయమునుట కెంతమాత్రమును వీలులేదు. ఇట్లే ప్రతికవియు తనను గూర్చి వ్రాసికొనుట సాంప్రదాయానుసారమై యుండియున్నది. ఈకవి కవిత్వమునందు మహాకావ్యమున కవసరమగు అష్టాదశవర్ణనలేగాక ననేకవిశేషవర్ణనాంశములు తనబుద్ధి వైశద్యము చేతను లోకానుభవము చేతను జేర్చియుండెను. ఈ కవి తనకావ్యమున వ్రాసికొన్నట్టే గ్రంథమున "అపూర్వరచనా చాతుర్యంబు" కానఁబడుచున్నది.

పైనవ్రాయఁబడిన కవులందరును రాయలయాస్థానము నందున్న ప్రఖ్యాతకవులు. కొందరష్టదిగ్గజములలోనివారై అష్టదిగ్గజములలోనివారని లోకమునందు వాడుకగఁ జెప్పఁబడిన మిగిలిన మువ్వురుకవులు నగుపింగళిసూరనార్యుఁడు, తెనాలి రామకృష్ణకవి రామరాజభూషణుఁడు నిజముగ రాయలవారి కాలమునందున్నవారుగాని అష్టదిగ్గజములలోని వారుగాని కారు. వా రాకాలమునందున్నవారని చెప్పుటకు తగిననిదర్శనములుగాని ఆధారములుగాని యొత్తుగఁ గాన్పింపవు. అంతే గాక వీరుమువ్వురును రాయలవారు మరణించినపిదప మున్నూరు ముప్పది నలువది సంవత్సరముల తరువాతివారని చెప్పుటకు వారువ్రాసినగ్రంథములే రుజువు చేయుచున్నవి.

పింగళిసూరన

పింగళిసూరన కృష్ణాజిల్లాలోని పింగళి యను నొక గ్రామమునుండి దక్షిణదేశమునకుఁబోయి కందనూరుమండలములోని ఆకుపీడు నంద్యాలసంస్థానములలో నున్నట్లు కన్పట్టుచున్నది. ఈతఁడు కళాపూర్ణోదయము, రాఘవపాండవీయము, ప్రభావతీప్రద్యుమ్నమును మూఁడు గ్రంథములను వ్రాసినగ్రంథకర్త. ఇందు కళాపూర్ణోదయము నంద్యాలసంస్థానాధిపతియైన కృష్ణరాజున కంకితము చేయఁబడెను. ఈకృష్ణరాజు సదాశివరాయల సమకాలికుఁడై యుండెను. దీనినిబట్టి పింగళిసూరనకవి 1560-వ సంవత్సరము ప్రాంతమున నుండెనని నిర్ణయింపఁబడినది. కాన నీతఁడు రాయలకాలపువాఁడుగాఁడని స్పష్టముగఁ జెప్పవచ్చును. ఇట్లే యితర నిదర్శనములునుగలవు. ఈసూరన తాను ప్రథమమున రచించిన రాఘవపాండవీయము

నందుఁగాని కళాపూర్ణోదయమునందుఁగాని తనవంశచరిత్రను గూర్చి చెప్పుకొనియుండక చివరకువ్రాసిన ప్రభావతీప్రద్యుమ్నమునందు చెప్పుకొనియుండెను. ఈ ప్రభావతీప్రద్యుమ్నము గ్రంథమును తనతండ్రియైన అమరన్న కంకితము చేసెను. తనతండ్రియందు తనకుఁగల ప్రేమాతిశయమువలనను, తాను గయకుఁ జని తనతండ్రికి శ్రాద్ధమువిడవనందున తనఋణమును తీర్చుకొనలేకపోవుటవలన తనతండ్రి పేరు చిరస్థాయిగనుండునట్లు చేయుటకును తా నాగ్రంథము నంకితము చేసినట్లు తానే వ్రాసియుండెను. తెనుగున ద్వ్యర్థికావ్యములు వ్రాయుటకు ప్రారంభించిన ప్రథమకవి పింగళిసూరనయే. ఈతఁడు ద్వ్యర్థికావ్యము లెట్లుండవలెనో తనరాఘవపాండవీయమున సూచించియుండెను. మరియు నీరాఘవపాండవీయము నిద్దరికంకితము చేసియుండెను. ప్రథమమున విరూపాక్షేశ్వరుని కంకితము చేసి తరువాత అకువీటి పెదవెంకట్రాయని కంకితము చేసెను.

తెనాలిరామకృష్ణకవి

తెనాలిరామకృష్ణకవి గుంటూరు జిల్లా తెనాలి గ్రామ కాపురస్థుఁడు. ఈతఁ డప్పయ్యదీక్షితులవారికిని తిరుమలతాతాచార్యులవారికిని సమకాలికుఁడు. వీరందరును విజయనగర రాజ్యము విచ్ఛిన్నమైన పిమ్మట వెంకటపతిరాజు చంద్రగిరి పట్టణమును రాజధానిగ నేర్పరచుకొని రాజ్యము చేయునప్పుడుండినవారగుటచే రాయలవారి కాలముననుండినవారు కారని స్పష్టపడుచున్నది. ఈకవి పాండురంగమాహాత్మ్యమను గ్రంథమును వ్రాసియుండెను. ఈతని కవిత్వము మిక్కిలి మధురముగ నుండును. ఈతఁడు వికటకవి.

రామరాజభూషణుఁడు

రామరాజభూషణుఁడు వసుచరిత్ర మను శృంగారరస ప్రబంధమును రచియించిన గొప్పకవి. ఈతఁడు బట్టుపల్లె యను గ్రామవాసి. ఈబట్టుపల్లె బళ్ళారిజిల్లాలోనిదని కొందరును కడప జిల్లాలోనిదని మరికొందరును చెప్పుదురు ఈకవి తన ప్రబంధమును రాయనియల్లుఁడగు రామరాజున కంకితము చేసియున్నందున రాయనికాలమున లేఁడని యూహింపఁబడుచున్నది. అట్లుగాక వారికాలమున నుండియున్నను అష్టదిగ్గజములలోని వారుగ నుండ వీలులేదు. రాయలవారియాస్థానకవి యని చెప్పు పుక్కిటిపురాణము లనేకము లున్నవి కాని వాటికి తగిన యాధారము లేవియు గనుపింపవు.

ఈకవిపేరు భట్టుమూర్తి యనియు రామరాజభూషణుఁ డనునది పౌరుషనామ మనియు నందురు. రామరాజు కాలమున కవిభూషణుఁడుగ నున్నందున రామరాజభూషణుఁడని పిలువఁబడినట్లు చెప్పుదురు. మరికొందరు వ్యాఖ్యాతలు మూర్తికవి వేరనియు రామరాజభూషణుఁడు వేరనియు మూర్తికవి నరసభూపాలీయమను గ్రంథమును రచించెననియు రామరాజభూషణుఁడు వసుచరిత్రము హరిశ్చంద్రనలోపాఖ్యానమను ద్వ్యర్థికావ్యమును వ్రాసియుండెననియుఁ జెప్పుదురు. పైఁజెప్పినగ్రంథములలోని ఆశ్వాసాంతగద్యములనుబట్టియు నీయిర్వురుకవులను వేరువేరువారనియే చెప్పవలెను.

రామరాజభూషణుఁడు వ్రాసినగ్రంథములలో మొదటిది వసుచరిత్రము. ఈగ్రంథముతో సరిరాదగిన శ్లేషకావ్యము మరొకటి లేదని చెప్పుట సాహసము కాజాలదు. ఈగ్రంథము

నందలి పదములకూర్పు, శబ్దార్థాలంకారములు, రసభావాదులు మిక్కిలి యోగ్యములై సుందరములై మనస్సున కాహ్లాదకరములునై యున్నవి. వీరువ్రాసిన హరిశ్చంద్రనలోపాఖ్యానము శ్లేషకావ్యము పింగళిసూరనకవిచే వ్రాయఁబడిన రాఘవపాండవీయమునకు గల ప్రశస్తి యీగ్రంథమునకు లేదు.

23. కృష్ణదేవరాయలకాలపు నాఁటి యితరకవులు

కంసాలి భద్రయ్య

ఈకవియు రాయనియాస్థానమునందుండిన యష్టదిగ్గజములలో నొకరని ప్రతీతికలదు. ఈతఁడు కంసాలికులమువాఁడు. ఈకవి సరసజనమనోరంజనమను కావ్యమును రచియించెనని చెప్పుదురు. కాని గ్రంథముమాత్ర మిప్పుడు లేదు. బ్రౌనుదొర యీ క్రిందిపద్యము భద్రయ్యవ్రాసిన సరసజనమనోరంజనములోనిదని తనఛందస్సునం దుదాహరించియుండెను.

ఉ. ఎన్నడు చేరిచెక్కు గొరుకు లీచెలికన్నులు కాటుకమ్ముల
న్నన్న కురుల్ పిఱుందు బటువై పటువైఖరి గైకొనెంగదే
యెన్న గదమ్మ పిన్న యొనమొల్కలు నేఁడివె ముద్దులాడిలేఁ
జన్నులు గొప్పలై పయిటనందున దాఁగుడుమూఁతలాడెడున్.

ఈపద్యములోని "మొల్క" యనుపదము నాక్షేపించిరనియు అందుకు "మొలకకు" "మొల్క" యంచు సరికొండ నృసింహకవివాదగా మొలకకు మొల్కయంచు భద్రయకుల్క దోసమా యని కొందరుకవులు సమర్థించిరనియుఁ జెప్పుదురు. "మొల్క"యని వాడినకవి రుద్రయ్య యని అప్పకవీయములో వ్రాయఁబడియున్నది.

కుమ్మర మొల్ల

కావ్యములను వ్రాసిన స్త్రీలలో నెల్ల నీమెయే ప్రాచీనురాలు. ఈమె రామాయణమును తెనుఁగున రచియించెను ఈమె తనవంశమునుగూర్చి యెచటను జెప్పుకొనకుండుటచే నీమెవంశమును గూర్చి చెప్పుటకు అవకాశములు లేవు. పేరునుబట్టి యీమె కుమ్మరకులస్థురాలని తెలియనగును. "గోపవరపు శ్రీకంఠమల్లేశ్వరునివరముచేత" తాను "కవిత్వము చెప్పంగ నేర్చితాను" అని వ్రాసికొన్నందున గోపవరకాపురస్థురాలని తెలియనగును. ఈగోపవరము నెల్లూరిజిల్లాలోనిదై యున్నది. ఈమె తన కావ్యమునందు కవిస్తుతిలో శ్రీనాథుని పేర్కొనుటవలనను అల్లసాని పెద్దన్న పేరు చెప్పకుండుటవలనను పదునేనవశతాబ్దాంతమునకు తరువాత పదునారవశతాబ్దము మొదటిపాదమున నుండియుండవచ్చునని తోచుచున్నది. రాయనికాలమున నున్నట్లు కొన్నికథలు కలవు. ఈమెకవిత్వము మృదువుగను మధురముగను రసవంతముగను నుండును.

వెన్నెలకంటి సూరన

ఈకవియు రాయనికాలమున నున్నవాఁడనియే చెప్పనగును. ఈతఁడు హరితసగోత్రుఁడు. ఆంధ్రభాషయందు కావ్యరచనాభినయనవిశారదః ప్రబంధకర్త వెన్నెలకంటి సూరనార్యునిమనుమఁడు. అమరమంత్రి సత్పుత్రుఁడు. నియోగి బ్రాహ్మణుఁడు. విష్ణుపురాణగ్రంథకర్త. ఈగ్రంథము పంటకాపుకులజుఁడు కొండవీటిరెడ్డి వంశజుఁడునైన రాఘవరెడ్డి కంకితము చేయఁబడినది. ఈరాఘవరెడ్డి చిన్నసంస్థానమునకు రాజుగ నుండెను. ఈకవి కవిత్వము మధురరసభూయిష్ఠమైనది. ఈ

యింటిపేరుగల వారిలోఁ జెక్కంద్రు కవు లున్నట్లు వాడుక. "కవిత పుట్టిల్లు చెన్నలకంటియిల్లు" యని పద్యములు పుట్టెను.

వెల్లంకి తాతంభొట్లు

తాను ఎఱ్ఱరు గర్భజనితుండ ననియు అబ్బధరణి సూనుఁడ ననియు కాలవతగోత్రుఁడ ననియు సన్నుతసాహిత్య చక్రవర్తి ననియు తా రచించిన "కవిచింతామణి" యనులక్షణ గ్రంథమున వ్రాసికొనెను. ఈకవి రాయల రాజ్యారంభకాలమున నుండియుండెను. ఈతఁడు వైదిక బ్రాహ్మణుఁడు. ఈతని కవిత్వము సరళసరసమైనదనియే చెప్పవచ్చును.

కోట శివరామయ్య

ఈతఁడు రాయనికాలమున నున్న ధూర్జటికవియొక్క శిష్యుఁడు. ఈతఁడు నాల్గవజాతికిఁ జెందినవాఁడు. కాశిక గోత్రుఁడు. బాపనయ్య కుమారుఁడు. కాళహస్తి గ్రామ నివాసుఁడు. ఈతఁడు "సానందోపాఖ్యాన" మను గ్రంథమును రచియించెను. కవిత్వము మధుర మైనదిగనే యుండును.

పిడపర్తి సోమనాథుఁడు

ఈతఁడు శైవబ్రాహ్మణుఁడు. బసవాచార్యునిపుత్రుఁడు. "బసవపురాణము"ను తెనుఁగున నేడాశ్వాసములుగల గ్రంథముగ రచించెను. ఈకవియు పదునారవశతాబ్దారంభమున కృష్ణదేవరాయని కాలమున నుండెను. ఈబసవపురాణమునందు బసవేశ్వరునిమహిమ లనేకములు చెప్పఁబడియున్నవి. ఇతఁడు ప్రభు లింగలీల అను ద్విపద గ్రంథమును రచియించెను.

పిడపర్తి బసవకవి

ఈకవి సోమనాథుని తమ్ముని కుమారుఁడు. సోమనాథుని కాలముననే యున్నవాఁడు కన్నడములో చామరసు రచించిన

ప్రభులింగలీల యను కృతి నీతఁడు పద్యకావ్యముగ వ్రాసెను. బసవేశ్వరునిగురువైన యల్లమప్రభుఁడను జంగమదేవరయొక్క కథ చెప్పబడినది. ఈకవికవిత్వము మధురముగనే యుండును.

24. రాయలు-రాష్ట్రభాష

రాయల పూర్వులు కెల్లరు కర్ణాటకులు. ఈతఁడును కర్ణాటుఁడే. రాయ లాంధ్రుఁడని గట్టిగ నిరూపించి చెప్పుటకు వీలులేదు. తాను కన్నడరాయఁడనని తానే ఆముక్తమాల్యదయందు వ్రాసికొనియున్నాఁడు. రాయలకు స్వప్నమున ఆంధ్రవిష్ణువు గాన్పించి తనను కృతినీయు మని కోరినపుడు "నేను దెలుఁగురాయఁడన్ కన్నడరాయ" యని సంబోధించెను. కాన నీభాషా కారతమ్యతను గట్టిగ చెలిబుచ్చుటలో కర్ణాటకుఁడనియే తెలిసికొనవలసివచ్చుచున్నది. అట్లయ్యును తెనుగుభాషనే ఆముక్తమాల్యదను వ్రాయుమని ఆంధ్రవిష్ణువు కోరియుండెను. రాయలు నందు కంగీకరించుచు తాను కర్ణాటకుఁడయ్యును తెనుగుభాషనే గ్రంథమువ్రాయుటకు గల కారణములను తరువాత పద్యమున నిరూపించియుండెను.

ఆ. తెలుఁగదేల యన్న ? దేశంబు తెలుఁగేను, తెలుఁగువల్లభుండఁ దెలుఁగొకండ
యెల్లనృపులు గొలువ నెఱుఁగవే బాసాడి, దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

తాను తెనుగుభాషలో నాముక్తమాల్యదను రచించుటకుఁగల నాల్గుకారణములు చెప్పి వాటినన్నిటి నీపై పద్యమునం దిమిడ్చియున్నాఁడు. "తెలుగదేలయన్న దేశంబుతెలుగేను" ఇది మొదటికారణము. తెలుగుదేశమున నింకొకభాషలో వ్రాయుట సరికాదు. "ఏను దెలుఁగువల్లభుండ" ఇది రెండవకారణము. నేను కర్ణాటకుఁడనయ్యు తెనుగుదేశమునకు విభుఁడను. నేను

రాజ్యము చేయు దేశము తెనుగు దేశము. "తెలుఁ గొకండ యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి" ఇది మూఁడవ కారణము. రాజులందఱు చేరినపుడు సంభాషణమంతయు నీభాష యందే జరిగెడిది. రాజులందరు కూడినపుడు నొకరితో నింకొకరు మాట్లాడుభాష తెనుగుభాష యనియే యీపద్యము నందు స్పష్టీకరించి వ్రాయఁబడియున్నది. "దేశభాషలయందు దెలుగు లెస్స" యిది నాల్గవకారణము. అందువలన రాయల వారు ఆముక్తమాల్యద యను గ్రంథమును తెనుగుభాష యందే వ్రాయుట కంగీకరించి తెనుగుభాషయందు తనకుఁగల గౌరవమును, పాండిత్యమును తెనుగుభాషయొక్క ఔన్నత్యమును వెల్లడిచేసెను.

ఈపై పద్యమునందలి మూఁడవకారణముగఁ జెప్పఁబడిన యభిప్రాయము మిక్కిలి ముఖ్యమైన యభిప్రాయము. దీనిని బట్టియే యాకాలమున రాజసభలలో మాట్లాడుభాష యేది యైనది నిర్ధారణఁ జేయుటకు సహకారియైయున్నది.

"తెలుఁగొకండ, యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి" నలుగురురాజులుఁ గలిసి కొలువునందుండగా నచట మాట్లాడుభాష తెనుగుభాషయై యున్నది. అనఁగా రాజుల సభలో వ్యవహారసంబంధములను మాట్లాడు భాష తెనుగు భాష యనియే గ్రహించవలసియున్నది. అదియే రాష్ట్రభాష. దీనినిఁబట్టిజూడ నాకాలమున రాష్ట్రభాష తెనుగుభాషయై యుండె ననుటకు సందియము లేదు.

చెన్నపురి: 'చంద్రికా' ప్రెస్సున ముద్రితము.—1960